

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI



ఆదివారం | 9-3-2025 | పేజీలు: 14 + 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 323 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, ఫాల్గుణమాసం, శుక్లపక్షం, తిథి: దశమి ఉ.7.46 తదుపరి ఏకాదశి; నక్షత్రం: పునర్వసు రా.11.55 తదుపరి పుష్యమి; వర్జ్యం: ఉ.11.41-1.19; అమృతఘడియలు: రా.9.28-11.06; దుర్ముహూర్తం: సా.4.45-5.32; రాహుకాలం సా.4.30-6.00; సూర్యోదయం: 6.31; సూర్యాస్తమయం: 6.20 | హైదరాబాద్ సిటీ

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

మహిళలకు రైస్ మిల్లులు

వడ్ల నిల్వకు గోదాములు కూడా

మహిళా స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో మండలానికి ఒకటి చొప్పున నిర్మాణం

మిల్లింగ్ చేసి ఎఫ్‌సీఐకిచ్చే బాధ్యత సంఘాలకే

ధాన్యం బొక్కుతున్న పందికొక్కులకు జవాబిదే..

వెయ్యి ఆర్టీసీ బస్సులకు మహిళలే యజమానులు

వెయ్యి మెగావాట్ల సోలార్ విద్యుదుత్పత్తీ వారికే

చంద్ర గ్రహణం తొలగి ఆడబిడ్డలకు స్వేచ్ఛ.. వెలుగు

టన్నెల్ కూలినా.. పంట ఎండినా బీఆర్ఎస్ నేతల పైశాచిక ఆనందం.. దానితో ఎవరూ బాగుపడలే

పరేడ్‌గ్రౌండ్‌లో భారీగా నిర్వహించిన మహిళా దినోత్సవ కార్యక్రమంలో సీఎం రేవంత్

ఇందిరా మహిళా శక్తి మిషన్ పాలసీ ఆవిష్కరణ

మహిళా సంఘాలకు రూ.22,794 కోట్ల చెక్కు




పరేడ్ గ్రౌండ్‌లో జరిగిన భారీ బహిరంగ సభలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి; హాజరైన మహిళలు

హైదరాబాద్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): రాబోయే రోజుల్లో ప్రతి మండల కేంద్రంలో మహిళా స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో రైస్ మిల్లులు, గోదాములు ఏర్పాటు చేసే బాధ్యతను తాను తీసుకుంటానని సీఎం రేవంత్ చెప్పారు. ఐకేపీ కేంద్రాల ద్వారా కొనుగోలు చేస్తున్న వడ్లను రాబోయే రోజుల్లో వారే నిల్వ చేసుకునేలా స్థలాలు ఇచ్చి, గోదాములు కట్టిస్తామని తెలిపారు. అలాగే, ఆ వడ్లను మిల్లింగ్ చేసి రాష్ట్ర ప్రభుత్వానికి, ఎఫ్‌సీఐకి సరఫరా చేసే బాధ్యతను మహిళా సంఘాలకే అప్పగిస్తామని వెల్లడించారు. ఇందుకు మండలానికో రైస్ మిల్లును నిర్మించి మహిళా సంఘాలకు ఇస్తామని తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మంత్రి సీతక్క

మిగతా 2వ పేజీలో...

11 వేల కోట్లతో 55 గురుకులాలు.. నిధుల మంజూరు

ఎంపీలంతా ఏకం కావాలి

రాష్ట్ర సమస్యలపై రాజకీయాలకతీతంగా పోరాడాలి

అవసరమైతే పార్లమెంట్‌లో వాయిదా తీర్మానం: భట్టి

13 అఖిలపక్ష భేటీకి హాజరుకాని బీజేపీ, బీఆర్ఎస్ ఎంపీలు.. సీఎం, కేంద్ర మంత్రులూ గైర్హాజరు

తెలంగాణలో ఎన్డీయే కూటమి?

తెలంగాణలో ఉపాధ్యాయులు, పట్టభద్రుల నియోజకవర్గాలు రెండింటినీ బీజేపీ గెలుచుకోవడం ద్వారా మూడు ప్రధాన రాజకీయ పార్టీలలో తనదే పైచేయి అని రుజువు చేసుకుంది. కాంగ్రెస్ బలహీనపడుతోందన్న అభిప్రాయానికి బలం చేకూరుతోంది. ఇదే ధోరణి కొనసాగితే వచ్చే ఎన్నికల నాటికి కాంగ్రెస్ పరిస్థితి ఏమిటన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

ఏపీతో పోల్చితే తెలంగాణలో బీజేపీ మొదటి నుంచి కొంత బలంగానే ఉంది. ఎన్డీయేను పటిష్ఠం చేయాలని మోదీ భావిస్తున్నందున వచ్చే ఎన్నికల నాటికి తెలంగాణలో కూడా ఎన్డీయే ప్రయోగం అమలు చేస్తారా? అన్న ప్రశ్న కొన్ని రోజులుగా వినిపిస్తోంది.



కొత్త పలుకు!

ఏపీలో తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమిగా ఏర్పడి ఘన విజయం సాధించాయి. టీడీపీకి సొంతంగా మెజారిటీ సమకూరినప్పటికీ ఎన్డీయే కూటమిగానే ముందుకెళుతున్నాయి. ఇదే ప్రయోగాన్ని తెలంగాణలో కూడా అమలు చేస్తే... అన్న చర్చ ఇప్పుడు ఆ మూడు పార్టీలలో నడుస్తోంది. టీడీపీ సొంతంగా పోటీ చేస్తే ఒక్క సీటు కూడా గెలుచుకోకపోవచ్చునుగానీ, ప్రధాన పార్టీతో జతకట్టి పోటీ చేస్తే ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేయగలదు.

ఈ నేపథ్యంలోనే తెలంగాణలో కూడా పోటీ చేస్తామన్న అభిప్రాయాన్ని చంద్రబాబు ఈ మధ్య వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణలో ఎన్డీయే కూటమి రూపుదిద్దుకోబోతున్నదని పసిగట్టడం వల్లనే కేసీఆర్ ఇటీవల మాట్లాడుతూ, 'తెలంగాణలో చంద్రబాబు రాజకీయం చేయాలనుకుంటే సహించేది లేదు' అని వ్యాఖ్యానించారు.

4

ఎన్డీయే కూటమి ఏర్పడితే తెలుగుదేశం, బీజేపీలలో చేరడానికి బీఆర్ఎస్‌కు చెందిన పలువురు నాయకులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఇందులో ఎమ్మెల్యేలు కూడా ఉన్నారు. తెలంగాణలో ఎన్డీయే కూటమి ఏర్పడితే ప్రధానంగా నష్టపోయేది కేసీఆర్ మాత్రమే.

ఈ పరిణామాలను గమనిస్తున్న కేసీఆర్ 'ఇక లాభం లేదు - జనంలోకి వెళ్లాలి' అని నిర్ణయించుకున్నారు. ఇక మీదట అసెంబ్లీకి హాజరవుతానని ఆయన తాజాగా ప్రకటించారు. ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలతో బీజేపీ ప్రస్తుతానికి మంచి ఊపు మీద ఉంది. కేసీఆర్ మాత్రమే కాదు.. రేవంత్ కూడా మేల్కొనాల్సిన అవసరం ఉంది. కాంగ్రెస్ అధిష్ఠానం ఇప్పటికైనా మేల్కొని, రాష్ట్ర నాయకత్వాన్ని పటిష్ఠం చేసే దిశగా చర్యలు తీసుకోని పక్షంలో పరిస్థితి చేయి దాటిపోయే ప్రమాదం లేకపోలేదు. స్థానిక సంస్థల ఎన్నికలకు గడువు ముగిసినప్పటికీ ఎన్నికలు జరిపించడానికి కాంగ్రెస్ సాహసించలేక పోతున్నదన్నది వాస్తవం.

ఆర్ఆర్ఆర్‌కు మోదీ భూమి పూజ!

11 క్యాబినెట్ ఆమోదానికి రంగం సిద్ధమవుతోంది

భూసేకరణకు నిధుల్లేవన్నా.. గడ్కరీకి చెప్పి ఒప్పించాను

వచ్చే ఏడాది ఏప్రిల్ నుంచి రైల్వే కోచ్ ఫ్యాక్టరీలో ఉత్పత్తి

కాంగ్రెస్ విఫల గ్యారంటీలను మాపై రుద్దడమేంటి?

తెలంగాణ బాస్ బీజేపీ.. కాంగ్రెస్, బీఆర్ఎస్ ఉప పార్టీలు

మహిళా దినోత్సవం రోజున అఖిలపక్ష సమావేశమా?

ముందస్తు కార్యక్రమాల వల్లే మేం వెళ్లలేదు: కిషన్‌రెడ్డి





12

ఎవరు చాంపియన్స్?

భారత్-న్యూజిలాండ్ ఫైనల్ నేడే

కోహ్లీ, రోహిత్‌పైనే అందరి దృష్టి

దుబాయ్‌లో 'సీటీ' తుది సమరం

ఛాతీలో నొప్పి.. కాలువలోకి కారు

తండ్రి, ఇద్దరు చిన్నారుల మృతి

ప్రాణాలతో బయటపడ్డ తల్లి


వరంగల్ జిల్లాలో ఘోర దుర్ఘటన

కారు నడుపుతున్న తండ్రి ప్రవీణ్‌కుమార్‌కు ఛాతీలో నొప్పి 3

ఆస్పత్రికి వెళ్లడానికి యత్నిస్తుండగా ఎస్సారెస్పీ కాలువలో పడ్డ కారు



కుమారుడి మృతదేహాన్ని హత్తుకొని రోదిస్తున్న కృష్ణవేణి



కోడి మాంసం మరియు గ్రుడ్ల గురించి మీరు తెలుసుకోవలసిన

వాస్తవాలు

వాస్తవాలను చదవండి

ఆ తర్వాత మీ స్వంత నిర్ణయం తీసుకోండి

- పూర్తిగా ఉడికించిన కోడి మాంసం లేదా గ్రుడ్లు తినటం ద్వారా బర్డ్ ఫ్లూ వైరస్ (H5N1) ఎప్పటికీ మానవులకు సంక్రమించదు.
- భారతీయ ఆహార పదార్థాలు వండే విధానంలో 70°C డిగ్రీలు ఆపై ఉష్ణోగ్రతలో ఉడికించబడుతోంది, తద్వారా బర్డ్ ఫ్లూ వైరస్ నశిస్తుంది.
- WHO/OIE ప్రకారం బర్డ్ ఫ్లూ వ్యాధి ప్రబలిన సందర్భంలో కోడి మాంసం మరియు గ్రుడ్లను పూర్తిగా ఉడికించడం, శుచి, శుభ్రతలు పాటించిన యడల వాటిని నిరభ్యంతరంగా తినవచ్చు.
- పచ్చి గ్రుడ్లను, ఉడికీఉడకని కోడి మాంసాన్ని తినకండి.

భారతీయ వంటకపు విధానంలో నమోదయ్యే ఉష్ణోగ్రతలు

ఫ్రైయింగ్	:	150°C మరియు ఆపైన
బాయిల్డ్ ఎగ్	:	100°C
ఆమ్లెట్	:	150°C
బేకింగ్	:	130°C మరియు ఆపైన
తందూర్	:	240°C మరియు ఆపైన
కర్రీ	:	140°C మరియు ఆపైన

ప్రజా శ్రేయస్సు దృష్ట్యా జారీచేసినవారు:
పశుసంవర్థక శాఖ, తెలంగాణ ప్రభుత్వం, హైదరాబాద్-28
Space Courtesy by:
తెలంగాణ పౌల్ట్రీ బ్రీడర్స్ అసోసియేషన్

ఎల్ఐసి పాలసీదారులకు గమనిక

మీ రివార్డులు

పొందేందుకు సమయం ఆసన్నమైంది

కేవలం అప్‌డేట్ చేయండి

మీ బ్యాంక్ వివరాలు



మీ పాలసీ డబ్బులు మీ కోసం ఎదురుచూస్తుండొచ్చు

2 సరళతరమైన చర్యలతో మీ పాలసీ డబ్బు క్లెయిమ్ చేసుకోండి

» మీ బ్యాంక్ వివరాలు అప్‌డేట్ చేయండి » మీ కెవైసి సమర్పించండి

LIC/P1/2024-25/51/Tel

మా వాట్సాప్ నం. 8976862090 'Hi' చెప్పండి | డౌన్‌లోడ్ చేసుకోండి ఎల్ఐసి మొబైల్ యాప్ LIC digital | సందర్శించండి: licindia.in | కాల్ సెంటర్ సర్వీసు (022) 6827 6827

మమ్మల్ని ఫాలో అవ్వండి: LIC India Forever | IRDAI Regn No.: 512

వివరాల కొరకు, మీ ఏజెంట్‌ని/సమీపంలో ఉన్న ఎల్ఐసి బ్రాంచిని సంప్రదించండి లేదా 56767474కి మీ నగరం పేరు ఎస్ఎంఎస్ చేయండి

*ఆన్‌లైన్‌లో కూడా చేయవచ్చు, షరతులు వర్తిస్తాయి

LIC
లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా
LIFE INSURANCE CORPORATION OF INDIA
ప్రతి క్షణం మీకు తోడుగా

వ్యవసాయ మార్కెట్లలో ఇసుక నిల్వలు

- రాష్ట్రవ్యాప్తంగా సామాన్యులకు అందుబాటులో ఉంచండి
- ఆదాయ వనరుల సమీకరణ సబ్‌కమిటీ భేటీలో భట్టి

హైదరాబాద్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సామాన్యులకు ఇసుకను అందుబాటులోకి తేవాలని, అన్ని వ్యవసాయ మార్కెట్లలో ఇసుక స్టాక్ యార్డులను ఏర్పాటు చేయాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. శనివారం ప్రజాభవన్‌లో ఆదాయ వనరుల సమీకరణ మంత్రివర్గ ఉపసంఘం సమావేశం జరిగింది. మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, జూపల్లి కృష్ణారావు తదితరులు ఇందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ.. హైదరాబాద్ నగరవాసులకు ఇసుకను అందుబాటులోకి తీసుకురావాలన్న ఉద్దేశంతో ఇటీవల రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ.. ఔటర్ రింగు రోడ్డుకు సమీపంలో ఇసుక స్టాక్ యార్డులను ఏర్పాటు చేసిందని గుర్తు చేశారు. అదే పద్ధతిలో రాష్ట్రంలోని వ్యవసాయ మార్కెట్లలోనూ స్టాక్ యార్డులను ఏర్పాటు చేస్తే.. సామాన్యులకు అందుబాటులోకి వస్తుందన్నారు. దీనిపై గనులు, భూగర్భ వనరుల శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఇసుకకు సంబంధించి ఐటీడీఏలతో త్వరగా ఒప్పందం చేసుకోవాలన్నారు. ఆదాయం ఆర్జించే శాఖల్లో లీకేజీలను అరికట్టాలని, ప్రభుత్వం నిర్దేశించిన రాబడి లక్ష్యాలను సాధించాలని చెప్పారు. గనుల శాఖ ద్వారా ఆదాయాన్ని పెంచే మార్గాలను ఆలోచించాలన్నారు.

నిజాం కళాశాలకు న్యాక్ ఏ గ్రేడ్ సర్టిఫికెట్

బర్కత్‌పుర, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): ప్రతిష్ఠాత్మకమైన నిజాం కళాశాలకు నేషనల్ అసెస్‌మెంట్ అక్రిడేషన్ కౌన్సిల్ (న్యాక్) ఏ గ్రేడ్ సర్టిఫికెట్ జారీ చేసింది. దశాబ్ద కాలం తర్వాత నిజాం కళాశాలకు ఏ గ్రేడ్ సర్టిఫికెట్ రావడం ఇదే తొలిసారి అని ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఏ.వి.రాజశేఖర్ వెల్లడించారు. తమ కళాశాలకు చెందిన అధ్యాపకులు, ఉద్యోగులు, విద్యార్థుల సమష్టి కృషి ఫలితంగానే ఈ ఏ గ్రేడ్ సర్టిఫికెట్ సాధించామని తెలిపారు. ఈ సందర్భంగా న్యాక్ ఏ గ్రేడ్ సర్టిఫికెట్ సాధించినందుకు ఓయూ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ఎం.కుమార్.. నిజాం కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఏ.వి.రాజశేఖర్‌ను సత్కరించి అభినందించారు.

కేసీఆర్ అసెంబ్లీకొస్తే అనేక సమస్యలకు పరిష్కారం: చామల

- బీజేపీవి శిఖండి రాజకీయాలు: చనగాని

హైదరాబాద్, మార్చి8 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం కేసీఆర్ అసెంబ్లీకి ఎప్పుడొస్తారోనని తాము కూడా ఆసక్తితో ఎదురు చూస్తున్నట్టు కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి అన్నారు. ఆయన అసెంబ్లీకి వస్తే అనేక సమస్యలకు పరిష్కారమవుతాయని వ్యాఖ్యానించారు. అసెంబ్లీకి వచ్చి కాంగ్రెస్‌ను ఎండగడతానంటూ కేసీఆర్ చేసిన వ్యాఖ్యలపై ఆయన స్పందించారు. రాష్ట్రానికి రూ.7 లక్షల కోట్లు అప్పు చేసింది మీరే కాబట్టి ముందు ఎందుకు చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. 'కేసీఆర్.. కాంట్రాక్టర్లకు బిల్లులు పెండింగ్ పెట్టిందెవరు..? పదేళ్ల మీ దౌర్భాగ్య పాలన ఫలితమే కాదా..? మీ తప్పులు మాఫీ చేసే అక్షయ పాత్ర ప్రభుత్వం వద్ద లేదు. లోక్‌సభ ఎన్నికల్లో మీకు సున్నా సీట్లొస్తే.. ఎమ్మెల్సీ ఎన్నికల్లో అసలు అభ్యర్థినే నిలబెట్టలేదు' అని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో బీజేపీ నేతలు శిఖండి రాజకీయాలు చేస్తున్నారని టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ దుయ్యబట్టారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలవగానే ఆ పార్టీ నేతలు అధికారంలోకి వస్తామంటూ పగటి కలలు కంటున్నారని ఎద్దేవా చేశారు.

బీజేపీ - బీఆర్‌ఎస్‌ల రాజకీయ డ్రామాలు

- మోదీ దర్శకత్వంలో బీఆర్‌ఎస్: అద్దంకి దయాకర్

హైదరాబాద్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో బీజేపీ - బీఆర్‌ఎస్ పార్టీల రాజకీయ డ్రామాలను ప్రజలు గమనిస్తున్నారని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అద్దంకి దయాకర్ విమర్శించారు. ప్రజా సమస్యలపై అఖిలపక్షం పెట్టాలని బీజేపీ, బీఆర్‌ఎస్‌లు డిమాండ్ చేశాయని.. అయితే డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్ని పార్టీల ఎంపీలతో సమావేశం ఏర్పాటు చేస్తే బీజేపీ, బీఆర్‌ఎస్‌లు ఎందుకు హాజరుకాలేదని ఆయన ప్రశ్నించారు. కేంద్రం నుంచి రావలసిన పెండింగ్ ప్రాజెక్టుల విషయమై ఎంపీల సమావేశం ఏర్పాటు చేస్తే బీజేపీ-బీఆర్‌ఎస్ ఎంపీలెవరూ హాజరుకాలేదని మండిపడ్డారు. మోదీ దర్శకత్వంలో నడిచే స్థాయికి బీఆర్‌ఎస్ దిగజారిపోయిందని విమర్శించారు. తెలంగాణలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశవ్యాప్తంగా చర్చకు రావడంతో బీఆర్‌ఎస్‌కు, బీజేపీకి మింగుడు పడటం లేదన్నారు.

40 డిగ్రీలకు చేరుకున్న ఉష్ణోగ్రతలు!

- మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్‌లో 39.8 డిగ్రీలు

రాష్ట్రంలో భానుడు భగ్గుమంటున్నాడు. గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. శనివారం 12 జిల్లాల్లో 39 డిగ్రీలకుపైగా గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్‌లో 39.8 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదైనట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. జగిత్యాల, గద్వాల, పెద్దపల్లి, మంచిర్యాల, నిర్మల్, ఖమ్మం, మంచిర్యాల, రంగారెడ్డి, భూపాలపల్లి, భద్రాద్రి కొత్తగూడేం, ఆసిఫాబాద్ జిల్లాల్లో 39 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అన్ని జిల్లాల్లోనూ 37 డిగ్రీలకు పైగానే ఎండ తీవ్రత కనిపించింది. వచ్చే 2రోజులు ఎండ తీవ్రత అలాగే ఉంటుందని హెచ్చరించింది. ఒకటి రెండు జిల్లాలు మినహా మిగిలిన అన్నింటికి ఎల్లో అలర్ట్ జారీ చేసింది.

జాతీయ లోక్ అదాలత్‌లో రాష్ట్రం రికార్డు

- ఒకే రోజు రూ.911 కోట్ల పరిహారం పంపిణీ
- 14,18,637 కేసులు పరిష్కారం

రాష్ట్ర వ్యాప్తంగా శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌కు కక్షిదారుల నుంచి భారీ స్పందన వచ్చింది. ఒకేరోజు 14,18,637 కేసులను పరిష్కరించారు. లబ్ధిదారులకు రూ.911 కోట్ల పరిహారం చెల్లింపులకు ఉత్తర్వులు జారీ చేశారు. హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్‌పాల్ మార్గదర్శకాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహించారు. వీటిని జస్టిస్ అభినంద్‌కుమార్ షావిలీ పర్యవేక్షించారు.

కార్మికులకు కనీస వేతనాలను పెంచాల్సిందే

- ఆ మేరకు గెజిట్ విడుదల చేయండి
- నాలుగు వారాల్లో అమలుకాకపోతే అధికార్లు వ్యక్తిగతంగా హాజరుకావాలి
- రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశాలు

హైదరాబాద్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): కార్మికుల కనీస వేతనాలను పెంచాల్సిందేనని హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వానికి స్పష్టంచేసింది. కనీస వేతనాల సవరణ ఉత్తర్వులతో గెజిట్ విడుదల చేయాలని ఆదేశాలు జారీ చేసింది. కనీస వేతనాలను సవరించాలని పేర్కొంటూ 2023లో తాము జారీచేసిన ఉత్తర్వులను నాలుగు వారాల్లో అమలు చేయకపోతే సంబంధిత అధికారులు ప్రత్యక్షంగా హాజరై వివరణ ఇవ్వాల్సి ఉంటుందని హెచ్చరించింది. చట్టప్రకారం ఐదేళ్లకోసారి కనీస వేతనాలను సవరిస్తూ గెజిట్ విడుదల చేయాల్సి ఉండగా 2007 నుంచి ఇప్పటివరకు సవరించలేదని రీజినల్ ట్రేడ్ యూనియన్ కౌన్సిల్ 2023లో హైకోర్టులో పిల్ దాఖలు చేసింది. పిటిషనర్ తరఫున న్యాయవాది చిక్కుడు ప్రభాకర్ అప్పట్లో వాదిస్తూ.. దేశంలో ద్రవ్యోల్బణం విపరీతంగా పెరిగిపోతున్నప్పటికీ సంఘటిత, అసంఘటిత రంగ కార్మికుల కనీస వేతనాలు పెరగడం లేదని పేర్కొన్నారు. ఈ వాదనతో ఏకీభవించిన ధర్మాసనం.. కనీస వేతనాలు సవరించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, కార్మికశాఖ ముఖ్యకార్యదర్శి, కార్మిక శాఖ కమిషనర్, ప్రింటింగ్ అండ్ స్టేషనరీ కమిషనర్‌లకు ఉత్తర్వులు జారీచేసింది. అప్పట్లో ప్రభుత్వానికి ఇచ్చిన ఆరు వారాల గడువు ముగిసినా ఉత్తర్వులు అమలు కాకపోవడంతో పిటిషన్ కోర్టు ధిక్కరణ వ్యాజ్యం దాఖలు చేశారు. శనివారం ఈ పిటిషన్‌పై తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజాయ్‌పాల్, జస్టిస్ శ్రవణ్ కుమార్ ధర్మాసనం విచారణ చేపట్టింది. తాము గతంలో ఇచ్చిన ఆదేశాల ప్రకారం నాలుగువారాల్లో కనీస వేతనాలను సవరిస్తూ గెజిట్ విడుదల చేయాలని, లేనిపక్షంలో అధికారులంతా ప్రత్యక్షంగా హాజరుకావాల్సి ఉంటుందని ధర్మాసనం స్పష్టంచేసింది. తదుపరి విచారణ ఏప్రిల్ 11కు వాయిదాపడింది.



సికింద్రాబాద్ పరేడ్‌గ్రౌండ్‌లో జరిగిన మహిళా దినోత్సవ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, కొండా సురేఖ, ఉత్తమ్ కుమార్ రెడ్డి, సీతక్క, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తదితరులు

మహిళలకు రైస్ మిల్లులు

(మొదటిపేజీ తరువాయి)

అధ్యక్షతన సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో లక్ష మంది మహిళలతో శనివారం నిర్వహించిన ఇందిరా మహిళా శక్తి సమావేశంలో ఆయన 'ఇందిరా మహిళా శక్తి మిషన్-2025' పాలసీని ఆవిష్కరించారు. 2,82,552 మహిళా సంఘాలకు రూ.22,794 కోట్ల చెక్కును అందజేశారు. మహిళలకు 31 పెట్రోల్ బంకులు, 128 సోలార్ ప్లాంట్స్ అందించారు. మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులకు లోన్ బీమా, ప్రమాద బీమా పథకాల కింద రూ.44.80 కోట్ల చెక్కును అందజేశారు. మహిళా సంఘాల ఆధ్వర్యంలో టీజీఎస్‌ఆర్టీసీలో నడిపే 20 బస్సులను జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా.. 'కోటి మందిని కోటీశ్వరులను చేద్దామా!?' అంటూ మహిళలతో నినాదాలు చేయించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ.. "ఐకేపీ కేంద్రాల నుంచి వడ్లు తీసుకుంటున్న కొందరు విల్లర్లు పంది కొక్కుల్లా వాటిని కాజేస్తున్నారు. వాటిని తిరిగి ఇవ్వడం లేదు. లెక్కలూ చెప్పడం లేదు. ఆ దొంగలను వదలం. వారికి బుద్ధి చెబుతాం. అదే సమయంలో, రైస్ మిల్లులు, గోదాములు నిర్మించేలా మహిళా సంఘాలను ప్రోత్సహిస్తాం. ప్రభుత్వమే స్థలం ఇవ్వడంతోపాటు వాటి నిర్మాణాలకు అవసరమైన రుణాలూ ఇప్పిస్తుంది. తద్వారా దొంగలకు గుణపాఠం చెప్పినట్లు అవుతుంది. ఒక అన్నగా ఇది నా బాధ్యత" అని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలోని రెసిడెన్షియల్ పాఠశాలలు, కాలేజీల్లో విద్యార్థులకు పౌష్టికాహారం మహిళా సంఘాల నుంచి సరఫరా చేయాలని నిర్ణయించామని చెబుతూ.. అందుకు ఓ విధానాన్ని రూపొందించే బాధ్యతను సీఎస్‌కు, సెర్ప్ సీఈవోకు అప్పగించారు.

పైశాచిక బీఆర్‌ఎస్ నేతలు

"ఎస్ఎల్‌బీసీలో టన్నెల్ కూలి మనుషులు చనిపోతే బీఆర్‌ఎస్ నాయకులు పైశాచిక ఆనందం పొందుతున్నారు. రోడ్డు ప్రమాదంలో ఎవరైనా చనిపోయినా.. కాలేజీ కూలినా.. పంట ఎండినా.. రేవంత్‌ను తిట్టవచ్చంటూ నన్ను తిట్టడంలో పైశాచిక ఆనందం పొందుతున్నారు. వాళ్లు ఎందుకంత పైశాచిక ఆనందం పొందుతున్నారు. పైశాచిక ఆనందంతో ఎవరూ బాగుపడిన దాఖలాల్లేవు. అది రాష్ట్రానికి మంచిది కాదు" అంటూ సీఎం రేవంత్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచిందని, పదేళ్లు రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ నాయకులు ఏడుపులు మాని.. రాష్ట్ర భవిష్యత్తుకు అవసరమైన సూచనలు, సలహాలు ఇవ్వాలని సూచించారు. అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. "రాష్ట్రానికి పదేళ్ల చంద్ర గ్రహణం పట్టింది. మహిళా శక్తి ముందు చంద్ర గ్రహణం అంతరించిపోయింది. ఇవాళ రాష్ట్రంలో ఆడబిడ్డలు స్వేచ్ఛను, సమానత్వాన్ని, ఆత్మగౌరవాన్ని చూస్తున్నారు. చంద్ర గ్రహణం తొలగి.. ఇవాళ రాష్ట్రంలో అక్క చెల్లెమ్మలు వెలుగులు చూస్తున్నారు. బీఆర్‌ఎస్ పదేళ్ల పాలన చూశారు. అప్పట్లో మహిళల పట్ల పాలకులు వివక్ష చూపారు. ఆనాడు సీఎంగా ఉన్న చంద్రశేఖర్ రావు తన మొదటి ఐదేళ్లలో ఆడబిడ్డను మంత్రివర్గంలోకి కూడా తీసుకోలేదు. కమీషన్లకు కక్కుర్తి పడి విద్యార్థులకు యూనిఫాంలు కుట్టించే పనిని కార్పొరేట్ కంపెనీలకు అప్పగించారు. ఇప్పుడు మా 15 నెలల పాలన చూస్తున్నారు. ఇందిరమ్మ ప్రభుత్వం వచ్చాక మహిళా సంఘాలను ఏకీకృతం చేస్తున్నాం. ఆర్థికంగా బలోపేతం చేస్తున్నాం. అందులో భాగంగానే ఆడబిడ్డలకు పాఠశాలల నిర్వహణ బాధ్యతలను అప్పగించాం. 1.30 కోట్ల జతల విద్యార్థుల యూనిఫాంలను కూడా మహిళా సంఘాల ద్వారానే కుట్టిస్తున్నాం. గతంలో రూ.25గా ఉన్న కుట్టుకూలిని రూ.75కు పెంచాం" అని వివరించారు. ఇందిరమ్మ పాలనలో కొండా సురేఖ, సీతక్క మంత్రులుగా పని చేస్తున్నారని, మరెంతో మందికి సముచిత స్థానం కల్పించామని రేవంత్ వ్యాఖ్యానించారు. ఇందిరమ్మ శక్తి.. ఎన్టీఆర్ యుక్తి స్ఫూర్తిగా తీసుకుని ఆడబిడ్డల అభివృద్ధికి పని చేస్తానని సంకల్పం చెప్పుకొన్నారు. మహిళా సంఘాలను బలోపేతం చేస్తేనే రాష్ట్రం ఆర్థికంగా పురోగమిస్తుందని, కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేసినప్పుడే రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ 1 ట్రిలియన్ డాలర్లకు చేరుతుందని స్పష్టం చేశారు.



పరేడ్‌గ్రౌండ్ బయట బస్సులను ప్రారంభిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి



సభకు హాజరైన మహిళలు

ఆర్టీసీ బస్సులకు మహిళలే యజమానులు

కేసీఆర్ బంధువులు, పెట్టుబడిదారులకే పరిమితమైన ఆర్టీసీ బస్సుల లీజులను మహిళలకు అప్పగించామని, రవాణా శాఖ ద్వారా 1000 విద్యుత్తు బస్సులను మహిళలు తిప్పేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. తొలి విడతలో 150 బస్సులను ఆడబిడ్డలకు అప్పగిస్తున్నామని, ఆర్టీసీ బస్సులకు మహిళలనే యజమానులను చేస్తున్నామని వివరించారు. "అదానీ, అంబానీలు మాత్రమే నిర్వహించే సోలార్ విద్యుత్తు ప్లాంట్లను మహిళా సంఘాల చెంతకు చేర్చాం. ఆయా సంఘాలు వెయ్యి మెగావాట్ల సోలార్ ప్లాంట్లను నిర్వహించడమే కాకుండా అవి ఉత్పత్తి చేసే విద్యుత్తును విద్యుత్తు శాఖకు అమ్మేలా చేశాం. సోలార్ విద్యుత్తు ఒప్పందాలు చేసుకున్నామంటే ఆడబిడ్డలపై మాకు ఉన్న నమ్మకమే కారణం" అని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలోని స్వయం సహాయక మహిళా సంఘాల్లో 65 లక్షల మంది సభ్యులు ఉన్నారని, కోటి మందిని కోటీశ్వరులను చేయాలంటే సంఘాల్లోని సభ్యుల సంఖ్యను పెంచాలని సూచించానని రేవంత్ చెప్పారు. అందుకు నిబంధనలు అడ్డు వస్తుంటే.. వాటిని కూడా సవరించామని, 15 నుంచి 65 ఏళ్ల వరకు ఉన్న వారిని సభ్యులుగా చేర్పించాలని ఆదేశాలు ఇచ్చామని తెలిపారు. కార్పొరేట్ కార్యాలయాల తరహాలో ప్రతి జిల్లా కేంద్రంలో ఇందిరా మహిళా శక్తి భవనాలు ఉండాలని 25 కోట్ల చొప్పున జిల్లాలకు నిధులు ఇచ్చామన్నారు.

రేవంతన్నగా బాధ్యత తీసుకుంటున్నా..

"మొదటి తరంలో ఇందిరా గాంధీని 'అమ్మా' అని పిలుచుకున్నారు. రెండో తరంలో ఎన్టీఆర్‌ను 'అన్నా' అని అన్నారు. ఇవాళ నన్ను 'రేవంతన్న' అని మీరంతా పిలుస్తున్నారు. నన్ను కుటుంబ సభ్యుడిగా భావిస్తున్నారు. అన్న అంటే ఆ కుటుంబాల బాధ్యత తీసుకోవడమే. ఇది పేగు బంధానికి అతీతమైనది. అందుకే, కుటుంబ సభ్యుడిగా ఆడబిడ్డలకు అండగా ఉంటాను. ఇవాళ ముఖ్యమంత్రిగా ఉన్నానంటే అది ఆడబిడ్డల ఆశీర్వాదమే" అని రేవంత్ అన్నారు. శిల్పారామం వద్ద కార్పొరేట్ కంపెనీలతో పోటీ పడేలా 150 దుకాణాలను మహిళలకు అందించామని, మహిళా సంఘాలు వారి ఉత్పత్తులను అంతర్జాతీయంగా పోటీ పడి విక్రయించాలని కోరారు. భవిష్యత్తులో సంఘాల నుంచి చేతి వృత్తుల ద్వారా వచ్చే ఉత్పత్తులకు పన్ను మినహాయింపు కూడా ఇస్తామన్నారు.

మహిళల ప్రగతి కోసం రేవంత్ సర్కారు కృషి: సీతక్క

అభద్రతాభావం నుంచి ఆత్మవిశ్వాసం వరకు, ఆర్థిక కష్టాల నుంచి సంపద సృష్టించే స్థాయికి, వివక్షత నుంచి వికాసం దిశగా.. మహిళల ఆర్థిక, సామాజిక ప్రగతికి రేవంత్‌రెడ్డి సర్కారు కృషి చేస్తోందని మంత్రి సీతక్క పేర్కొన్నారు. ఇందిరా మహిళాశక్తి మిషన్-2025 ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ.. ఎస్‌హెచ్‌జీ మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు 20కిపైగా వ్యాపారాలను ముందుకు తెచ్చామన్నారు. మహిళలు లక్షాధికారుల నుంచి కోటీశ్వరులుగా ఎదగాలన్న సంకల్పంతో ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. పథకాలను ప్రతి మహిళా సక్రమంగా వినియోగించుకోవాలన్నారు. ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించడమేకాకుండా ఆర్టీసీ అద్దె బస్సులకు ఆడబిడ్డలు యజమానులయ్యారని తెలిపారు. 600 బస్సులకు యజమానులను చేసేందుకు వచ్చిన ఆర్టీసీ శాఖకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

బీఆర్‌ఎస్ పాలకులు పందికొక్కుల్లా తిన్నారు

- ఏ రోజూ ఆడబిడ్డలను పట్టించుకోలేదు
- పరేడ్ గ్రౌండ్ మహిళా శక్తి సభలో భట్టి

హైదరాబాద్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): పదేళ్ల పాలనలో రాష్ట్ర ఆదాయం, చేసిన రూ.7 లక్షల కోట్ల అప్పుల సొమ్మును బీఆర్‌ఎస్ పాలకులు పందికొక్కుల్లా తిన్నారు తప్ప.. ఏ రోజూ మహిళా అభ్యున్నతి, డ్వాక్రా సంఘాల అభివృద్ధి గురించి పట్టించుకోలేదని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ధ్వజమెత్తారు. ఇందిరా మహిళా శక్తి సభలో ఆయన మాట్లాడారు. 2004 నుంచి 2014 వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేసిందని చెప్పారు. వడ్డీ లేని రుణాలు ఇచ్చి కంటికి రెప్పలా కాపాడుకున్నామని, ఉమ్మడి రాష్ట్రంలో ప్రారంభించిన ఇందిరా క్రాంతి పథకాన్ని(ఐకేపీ) గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని విమర్శించారు. స్వయం సహాయక సంఘాల గురించి మాట్లాడటానికి అసెంబ్లీలో ప్రతిపక్ష పార్టీ నాయకులకు సమయం ఇవ్వకుండా నియంతృత్వంగా వ్యవహరించారని మండిపడ్డారు. మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునేలా ఈ ఏడాది రూ.20 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు ఇవ్వాలని తాము నిర్ణయిస్తే.. ఇది సాధ్యమేనా..? అంటూ హేళన చేశారని అన్నారు. పదేళ్లలో రాష్ట్ర ఆదాయం, అప్పుల సొమ్మును పందికొక్కుల్లా తిన్నారు తప్ప.. మహిళా సంఘాలకు కనీసం రూ.10 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు ఇవ్వలేదన్నారు. తాము రూ.20 వేల కోట్ల రుణాలిస్తామని చెప్పి.. రూ.21 వేల కోట్లు ఇచ్చి చూపించామని తెలిపారు. ఈ రుణాలను వ్యాపారంలో పెట్టడానికి మార్గం చూపామని చెప్పారు. మహిళా స్వయం సహాయక సంఘాలను సోలార్ విద్యుత్ ఉత్పత్తిలో భాగస్వాములను చేయాలన్న ఉద్దేశంతో 1,000 మెగావాట్లకు ఎంవోయూలు చేయించామని భట్టి పేర్కొన్నారు.



సమీక్షలో పాల్గొన్న తుమ్మల, గుత్తా, కోమటిరెడ్డి

ఎకరం కూడా ఎండొద్దు

- సాగునీటి సమస్య రాకూడదు: తుమ్మల
- ఉమ్మడి నల్లగొండ జిల్లా సమీక్ష పాల్గొన్న మండలి చైర్మన్‌గుత్తా,మంత్రి కోమటిరెడ్డి

నల్లగొండ, మార్చి 8 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): యాసంగి సీజన్‌లో ఎకరం పంట కూడా ఎండటానికి వీలు లేదని, ఇరిగేషన్, వ్యవసాయాధికారులు సంయుక్తంగా క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. నల్లగొండ జిల్లా కేంద్రంలో శనివారం ఉమ్మడి నల్లగొండ జిల్లా వేసవి కార్యాచరణ ప్రణాళికపై సమీక్షా సమావేశం జరిగింది. శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, రోడ్లు, భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యేలు, కలెక్టర్లు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. ఇరిగేషన్ ఇంజనీర్లు నిత్యం ప్రాజెక్టులపై పర్యవేక్షణ చేయాలని, క్షేత్రస్థాయిలో కాల్వలపై పర్యటించాలన్నారు. అందుబాటులో ఉన్న సాగునీరు రైతులకు అందించడానికి పటిష్ఠమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. వేసవి ముగిసేంత వరకు అవసరమైన తాగునీరు మిషన్‌భగీరథ పథకం ద్వారా అందించేందుకు ఇబ్బంది లేదని, సరఫరా ఇబ్బందులు లేకుండా ఈఎన్‌సీ స్థాయిలో దృష్టి సారించాలన్నారు. మండలి చైర్మన్ సుఖేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రాజెక్టుల కాల్వలపై వందలాది మోటార్లు ఏర్పాటు చేయడంతో దిగువ ఆయకట్టుకు నీరందడం లేదని, వీటిని క్రమబద్ధీకరించాల్సి ఉందన్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. ఇరిగేషన్, విద్యుత్, తాగునీటి సమస్యలు రాకుండా అధికారులు వేసవి ముగిసేంత వరకు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు.

రాజకీయాల్లోనూ పోటీ పడాలి

- లోక్‌సభ, అసెంబ్లీల్లో 33 శాతం సీట్లు
- మహిళలకు ఇచ్చే పరిస్థితి వస్తుంది
- వ్యాపారాల్లోనూ ప్రోత్సహిస్తున్నాం
- ఆక్స్‌ఫర్డ్, స్టాన్‌ఫోర్డ్‌లతో పోటీ పడాలి
- విద్యార్థినులకు సీఎం రేవంత్ పిలుపు
- ఐలమ్మ వర్సిటీ భవనాలకు శంకుస్థాపన

హైదరాబాద్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): "మీరంతా రాజకీయాల్లో పోటీ పడాలి. రాబోయే రోజుల్లో లోక్‌సభ, అసెంబ్లీల్లోనూ మహిళలకు 33 శాతం సీట్లు ఇచ్చే పరిస్థితి వస్తుంది. అందుకే, మహిళలు నాయకత్వ లక్షణాలు పెంపొందించుకుని చట్టసభల్లో అడుగుపెట్టాలి" అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యార్థినులకు పిలుపునిచ్చారు. మహిళలకు రాజకీయాల్లో రిజర్వేషన్లు ఉండాలని రాజీవ్ గాంధీ ఆకాంక్షించారని, అందుకే, స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు తీసుకొచ్చారని గుర్తు చేశారు. హైదరాబాద్ కోఠిలోని చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం నూతన భవనాలకు శనివారం ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం మాట్లాడుతూ.. వర్సిటీ అభివృద్ధి పనుల కోసం రూ.500 కోట్లు కేటాయించామన్నారు. "మీ అందరికీ నాదో విజ్ఞప్తి. అంతర్జాతీయ స్థాయిలో ఆక్స్‌ఫర్డ్, స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీలతో మీరు పోటీపడాలి. డాక్టర్లు, ఇంజినీర్లు, ఐపీఎస్, ఐఏఎస్‌లుగా రాణించి రాజీవ్ కలల్ని నిజం చేయాలి" అని సూచించారు. రాష్ట్రంలో మహిళలకు ఐఏఎస్, ఐపీఎస్‌లుగా అవకాశం వస్తే తమ నైపుణ్యాన్ని ప్రదర్శిస్తూ చిత్తశుద్ధితో ఆదర్శంగా నిలుస్తున్నారని చెప్పారు. మహిళలు వ్యాపార రంగంలో రాణించడానికి ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని చెప్పారు. రెండున్నరేళ్లలో వర్సిటీలో నిర్మాణాలు పూర్తి కావాలని, నిధులకు ఇబ్బంది లేకుండా చూసుకునే బాధ్యత తనదని తెలిపారు. కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ పాల్గొన్నారు.



ఐలమ్మ వర్సిటీ భవనాలకు శంకుస్థాపన చేస్తున్న సీఎం రేవంత్

బడుల్లో ఏఐ టెక్నాలజీతో నైపుణ్యాభివృద్ధి శిక్షణ

ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు


హైదరాబాద్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): కృత్రిమ మేధస్సు (ఏఐ) సాయంతో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇవ్వనున్నట్లు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా తమ బోధనా సామర్థ్యాలను మరింత పెంచుకునేందుకు ప్రభుత్వ ఉపాధ్యాయులను ప్రోత్సహిస్తామన్నారు. శనివారం సచివాలయంలో తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్ దిల్ రాజు ఆధ్వర్యంలో కోణం ఫౌండేషన్ నిర్వాహకులు సందీప్ కుమార్ మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. అన్ని రంగాల్లో ఎమర్జింగ్ టెక్నాలజీలను సమర్థవంతంగా వినియోగించుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్య(పీపీపీ) విధానంలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా 'ఏఐ సిటీ'ని ఏర్పాటు చేయనున్నామని, ఇక్కడే అంతర్జాతీయ ప్రమాణాలతో ఏఐ యూనివర్సిటీని కూడా ప్రారంభించబోతున్నామని తెలిపారు. నల్గొండ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఏఐ సాయంతో ఉచితంగా నైపుణ్యాభివృద్ధిలో శిక్షణ ఇస్తున్న ఫౌండేషన్ సేవలను అభినందించారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు ఈ ఫౌండేషన్ సేవలను విస్తరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.



ఫౌండేషన్ నైపుణ్య శిక్షణ వివరాల కరపత్రం విడుదల చేస్తున్న మంత్రి శ్రీధర్ బాబు, దిల్‌రాజు, సందీప్ కుమార్ తదితరులు

లోకం తీరు

కాంగ్రెస్‌లో ఉంటూ బీజేపీకి పని చేసే వాళ్లని ఫిల్టర్ చేయండి: రాహుల్



ఆర్టీసీ ప్రైవేటీకరణ ఆరోపణల్లో వాస్తవం లేదు

ఉద్యోగ, కార్మిక సంఘం

హైదరాబాద్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(ఆర్టీసీ)ను ప్రైవేటు పరం చేస్తున్నారన్న ఆరోపణల్లో వాస్తవం లేదని స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటి వరకు అద్దె బస్సు, విద్యుత్ బస్సుల గురించి కూడా ఎక్కడా ఒక్క ఒప్పందం చేసుకోలేదన్నారు. 2019లో 40 బస్సులు, 2023-24లో గత ప్రభుత్వం హైదరాబాద్‌లో 500 విద్యుత్ బస్సులకు, 500 బస్సులు గ్రామీణ ప్రాంతాల్లో తిప్పేందుకు ఒప్పందం చేసుకుందన్నారు. ఆ వెయ్యి బస్సుల్లో ఇప్పటి వరకు 400 బస్సులు వచ్చాయని, మరో 600 బస్సులు రావాల్సి ఉందని వివరించారు. కేంద్ర ప్రభుత్వం కాంట్రాక్ట్ పద్ధతిలో విద్యుత్ బస్సులు తీసుకున్న కార్పొరేట్ సంస్థలకే రాయితీలు ఇస్తుందన్నారు. ఆర్టీసీలు నేరుగా విద్యుత్ బస్సులు తీసుకుంటే ఎలాంటి రాయితీలు ఇవ్వదని వెల్లడించారు. వాస్తవానికి కేంద్ర ప్రభుత్వమే ఆర్టీసీని నిర్వీర్యం చేసేందుకు కుట్ర చేస్తోందని ఆరోపించారు. విజయవాడ - హైదరాబాద్ మధ్య నడుస్తున్న విద్యుత్ బస్సులకు పూర్తి పన్ను రాయితీకి అనుమతి ఇచ్చిన కేంద్రం ఆర్టీసీ బస్సులకు మాత్రం 7 శాతం కట్టాలని చెప్పడమే అందుకు నిదర్శనమని రాజిరెడ్డి పేర్కొన్నారు.

తెలంగాణ ప్రభుత్వము
రెవెన్యూ (భూసేకరణ) విభాగము
ఫారం-VI
(ప్రాథమిక నోటిఫికేషన్)

(భూసేకరణ పునరుపాధి, పునరావాస కల్పనలో పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టం 2013, కేంద్ర చట్టం 30/2013) యొక్క సెక్షన్ 11(1) మరియు రూల్ 19 సబ్ రూల్ (1)ను అనుసరించి

కలెక్టర్ ఫైల్ నం: ఇ1/3816/2022 తేది: 19.02.2025
ప్రత్యేక ఉప కలెక్టర్ ఫైల్ నం. బి/37/2024తేది: 11.02.2025
గెజిట్ నెం: 13/2025 తేది: 19.02.2025

తెలంగాణ ప్రభుత్వము/జిల్లా కలెక్టర్, సిద్దిపేట గారి ఆదేశానుసారం ఈ దిగువ జాబితాలో పేర్కొనబడిన సిద్దిపేట జిల్లా, నంగునూర్ మండలములోని నంగునూర్ గ్రామములో విస్తీర్ణం ఎ. 6.24 గుంటల భూమి ప్రజా ప్రయోజనము నిమిత్తము అనగా కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో భాగంగా రంగనాయక సాగర్ రిజర్వాయర్ RMC యొక్క LD6-RM3 డిస్ట్రిబ్యూటరీ మైనర్ కాలువ నిర్మాణం కొరకు ఈ దిగువ చూపిన భూమి అవసరం అయి ఉన్నదని భావించి నందున భూసేకరణ పునరుపాధి పునరావాస కల్పనలో పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టం 2013 లోని సెక్షన్ 11(1) అనుసరించి ఈ ప్రకటన జారీ చేయనైనది. ప్రభుత్వ ఉత్తర్వుల సంఖ్య 35 తేది: 30.06.2017 ద్వారా నీటి పారుదల మరియు కమాండ్‌ఏరియా డెవలప్‌మెంట్ శాఖ వారు 10-ఎ అనుసరించి సోషల్ ఇంపాక్ట్ అసెస్మెంట్ (ప్రజాభిప్రాయ సేకరణ) మరియు ఆహార భద్రతను మినహాయింపు ఇవ్వనైనది.
కావున సిద్దిపేట జిల్లా నంగునూర్ మండలములోని నంగునూర్ గ్రామములో విస్తీర్ణం ఎ. 6.24 గుంటలు గల భూమి యొక్క వివరములు ఈ క్రింద చూపిన వారికి భూసేకరణ పనులు ప్రారంభ నిమిత్తం, ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేయనైనది.

షెడ్యూల్

గ్రామము: నంగునూర్ మండలం:నంగునూర్ జిల్లా: సిద్దిపేట

క్ర.సం.	సర్వే నెం.	[illegible]	[illegible]	[illegible]	భూమి పట్టాదారు/అనుభవదారు/ఆసక్తిదారు పేరు మరియు చిరునామా	పరిహద్దులు				[illegible]
						ఉత్తరం	పడమర	తూర్పు	దక్షిణం	
1	2	3	4	5	6	7	8	9	10	11
1	1132/అ	పట్టా	మెట్ట	0.22	పల్లెపురెడ్డి విజయలక్ష్మి భర్త నరసింహ రెడ్డి(ప)(అ)	1133	1135	VB Muq [illegible]	1131	వేప(3)
2	1132/అ	పట్టా	మెట్ట	1.04	పర్వాల వెంకటరెడ్డి తండ్రి సాయి రెడ్డి (ప)(అ) పర్వాల వాసుదేవరెడ్డి తండ్రి సాయిరెడ్డి(అ) పర్వాల విష్ణు తండ్రి సాయిరెడ్డి(అ)	1133	1135	VB Muq [illegible]	1131	(పొత్తుల భూమి) మామిడి (85) వేప(10), [illegible](30)
మొత్తం విస్తీర్ణం: 1.26										
3	1130/ఇ	పట్టా	మెట్ట	0.10	పల్లెపురెడ్డి నరసింహ రెడ్డి తండ్రి చిన్న మల్లారెడ్డి (అ)(ప)	1132	1058	1130	1125	
4	1130/ ఈ/1	పట్టా	మెట్ట	0.24	గుంటి లలితదేవి భర్త బుద్రయ్య (ప)(అ)	1132	1058	1130	1125	మామిడి(42) వేప(10) పైప్‌లైన్(1)
మొత్తం విస్తీర్ణం: 0.34										
5	1058/ అ/1	పట్టా	మెట్ట	0.27	పల్లెపురెడ్డి స్వప్న భర్త రజనీకర రెడ్డి (ప)(అ)	1138	1129	1130	1137	మామిడి(51) వేప(5) [illegible]
మొత్తం విస్తీర్ణం: 0.27										
6	1138/ ఈ/1/1/1	పట్టా	మెట్ట	0.10	జీడిపల్లి వేణుగోపాలరెడ్డి తండ్రి హనుమంతరెడ్డి(ప) జీడిపల్లి లక్ష్మి భర్త హన్మంతరెడ్డి (అ)	1139	1135	1058	1057	[illegible] (50) వేప(1)
7	1138/ అ/3	పట్టా	మెట్ట	0.05	గుండెబోయిన రాంచంద్రం తండ్రి ఓజయ్య (అ) (ప)	1139	1135	1058	1057	తుమ్మ(1)
8	1138/ అ/2	పట్టా	మెట్ట	0.05	గుండెబోయిన కనుకయ్య తండ్రి ఓజయ్య (అ) (ప)	1139	1135	1058	1057	[illegible](1)
9	1138/అ	పట్టా	మెట్ట	0.04 1/2	గుండెబోయిన బాలవ్వ భర్త బాలయ్య (అ) (ప)	1139	1135	1058	1057	–
11	1138/ ఈ/1/1/[illegible]	పట్టా	మెట్ట	0.06	1) పుల్లగుర్ల శ్రీనివాస్ రెడ్డి తండ్రి కిష్టా రెడ్డి 2) జీడిపల్లి లక్ష్మి భర్త హన్మంత రెడ్డి(అ)	1139	1135	1058	1057	పైప్‌లైన్(1)
మొత్తం విస్తీర్ణం: 0.32										
12	1137/ఉ	పట్టా	మెట్ట	0.07 1/2	జీడిపల్లి వేణుగోపాలరెడ్డి తండ్రి హన్మంత రెడ్డి(ప) జీడిపల్లి లక్ష్మి భర్త హన్మంత రెడ్డి(అ)	1138	1056	1138	1057	పైప్‌లైన్(1)
13	1137/ఎ	పట్టా	మెట్ట	0.34 1/2	జీడిపల్లి సురేందర్ రెడ్డి తండ్రి వెంకట్ రెడ్డి (అ) (ప)	1138	1056	1136	1057	మామిడి(82) [illegible](35) [illegible]
14	1137/అ	పట్టా	మెట్ట	0.18 1/2	జీడిపల్లి కనకలక్ష్మి భర్త [illegible] రెడ్డి (అ) (ప)	1138	1056	1138	1057	
15	1137/ ఏ/1	పట్టా	మెట్ట	0.06 1/2	జీడిపల్లి రాం రెడ్డి తండ్రి రాఘవ రెడ్డి (అ) (ప)	1138	1056	1138	1057	
మొత్తం విస్తీర్ణం: 1.27										
16	1179/ ఇ/5; 1179/ ఇ/1; 1179/ ఇ/2; 1179/ ఇ/4	పట్టా	మెట్ట	0.02	మల్యాల లక్ష్మయ్య రాజ వీరయ్య (అ) (ప); పెద్ది శ్రీనివాస్‌రెడ్డి తండ్రి లక్ష్మారెడ్డి (అ) (ప); మల్యాల మనదీప్ తండ్రి వెంకటేష్ (ప) మల్యాల ఈశ్వరయ్య (అ); ఐరుకుల అంజనేయులు తండ్రి రాఘవులు (అ)(ప)	1180	1180	1138	1137	[illegible]
17	1179	పట్టా	మెట్ట	[illegible]	1)పూశోత్తం మల్లేశంగౌడ్ తండ్రి బాలయ్య గౌడ్(ప) ... [illegible] ... 30) మంగ రామచందర్ రావు తండ్రి రాధ కిషన్‌రావు (ప) 31) [illegible] 32) నక్కిర్తి కనకయ్య తండ్రి వీరయ్య (ప) 33) నక్కిర్తి ఎల్లయ్య తండ్రి ఎల్లయ్య(ప) [illegible](అ)	1180	1180	1138	1137	[illegible]
18	1179/ ఈ/1/1/ 1/1/1	పట్టా	మెట్ట	0.06 1/4	ఐప్పీసు వర్ధిరాములు తండ్రి పోచయ్య(అ)(ప)	1180	1180	1138	1137	గోరింట(3) వేప(2) [illegible](6)
19	1179/ ఈ/2/2	పట్టా	మెట్ట	0.05 1/4	అప్పీసు అంజనేయులు తండ్రి రాజయ్య (ప) అప్పీసు రాజయ్య(అ)	1180	1180	1138	1137	
20	1179/ ఉ/1/1	పట్టా	మెట్ట	0.08 1/4	లక్ష్మపల్లి ఇందిర భర్త రాములు (అ) (ప)	1180	1180	1138	1137	
21	1179	పట్టా	మెట్ట	0.08	1)పూశోత్తం మల్లేశంగౌడ్ తండ్రి బాలయ్య గౌడ్(ప) 2) [illegible] రామస్వామి(ప) 3) [illegible] తండ్రి మల్లయ్య (ప) 4) నక్కిర్ల పర్శరాములు తండ్రి ఎల్లయ్య (ప) 5) నక్కిర్ల రాజమల్లు తండ్రి ఎల్లయ్య (ప) 6) జీడిపల్లి ఉదయశ్రీ భర్త సురేందర్‌రెడ్డి (ప) 7) నక్కిర్తి బాలయ్య తండ్రి కొమురయ్య (ప) 8) మల్యాల రాజు తండ్రి లక్ష్మయ్య (ప) 9) నక్కిర్తి సోమయ్య తండ్రి కొమురయ్య (ప) 10) జీడిపల్లి సురేందర్‌రెడ్డి తండ్రి వెంకటరెడ్డి (ప) 11) [illegible] తండ్రి మహబూబ్ అలీ(ప) 12) ముహమ్మద్ [illegible] తండ్రి మహబూబ్ అలీ(ప) 13) పెద్ది శ్రీనివాస్‌రెడ్డి తండ్రి లక్ష్మారెడ్డి(ప) ... [illegible]	1180	1180	1138	1137	[illegible]
22	1179	పట్టా	మెట్ట	[illegible]	[illegible]	1180	1180	1138	1137	[illegible]
మొత్తం విస్తీర్ణం: 6.38										
మొత్తం విస్తీర్ణం: 6.24										

భూమి యొక్క ప్లాన్ మరియు వివరములు జిల్లా కలెక్టర్, మరియు ప్రత్యేక ఉప కలెక్టర్, భూ సేకరణ విభాగము-3 సిద్దిపేట వారి కార్యాలయములో ఉంచనైనది. సంబంధిత వ్యక్తులు ఏదైనా పని దినములలో కార్యాలయ పని వేళలలో తనిఖీ చేసుకోవచ్చును. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం / జిల్లా కలెక్టర్ సిద్దిపేట గారు ప్రత్యేక ఉప కలెక్టర్, భూ సేకరణ విభాగము-3, సిద్దిపేట గారిని మరియు వారి సిబ్బంది ఇట్టి భూ సేకరణకు సంబంధించి సెక్షన్-12 ప్రకారం పై తెలిపిన భూములలో యేదేని ప్రదేశములో ప్రవేశించి సర్వే జరిపి భూ కమతాన్ని కొలిచే అధికార, భూమిని త్రవ్వడానికి లేదా భూ స్వరూపం తెలుపు బోర్ వేయడానికి మరియు అవసరమైన ఇతర చర్యలు చేపట్టడానికి అనుమతించనైనది.

సెక్షన్ 11(4) ప్రకారం భూ సేకరణకు ప్రతిపాదించిన భూమి విషయములో జిల్లా కలెక్టర్, సిద్దిపేట గారి అనుమతి లేకుండా ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేసిన తేదీ నుండి ఆ నోటిఫికేషన్‌లో ఉదహరింప బడిన భూములకు సంబంధించి ఎవరు ఎటువంటి కొనుగోలు / అమ్మకాలు / తాకట్టుకు సంబంధించిన చర్యలు చేపట్ట రాదు.

ఇట్టి ప్రాథమిక నోటిఫికేషన్ జారీ అనంతరం పైన చూపిన భూమిలో ఎలాంటి సంబంధం ఉన్న వ్యక్తులను భూ సేకరణ పై సెక్షన్ 15 (1) ప్రకారం అభ్యంతరములు ఉన్నచో, ఇట్టి నోటిఫికేషన్ జారీ చేసిన (60) దినములో భూసేకరణ అధికారి ముందు వారి అభ్యంతరములు వ్రాత పూర్వకంగా తెలియపర్చును.

సం/-	సం/-	సం/-	సం/-
తహశీల్దార్ నంగునూర్ మండలము	ప్రత్యేక ఉప కలెక్టర్ (భూసేకరణ) కాళేశ్వరం ప్రాజెక్ట్ యూనిట్-1 సిద్దిపేట జిల్లా	అదనపు కలెక్టర్, సిద్దిపేట	జిల్లా కలెక్టర్, సిద్దిపేట

DIPR RO.NO:746/LA-PP/ADVT/PUBLICATION/2024-25

ఛాతీలో నొప్పి.. కాలువలోకి కారు

తండ్రి, ఇద్దరు చిన్నారుల మృతి. ప్రాణాలతో బయటపడ్డ తల్లి.. వరంగల్ జిల్లాలో ఘోర దుర్ఘటన



భార్య, ఇద్దరు చిన్నారులతో ప్రవీణ్‌కుమార్ (ఫైల్)

పర్వతగిరి/నెల్లికుదురు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): వరుస సెలవుల్లో స్వగ్రామంలో ఆనందంగా గడుపుదామని బయలుదేరిన ఆ కుటుంబాన్ని మృత్యువు కబళించింది. డ్రైవింగ్ చేస్తుండగా ఛాతీనొప్పి రావడంతో.. కుటుంబ యజమాని ఆస్పత్రికి వెళ్దామని మలుపుతుండగా.. కారు కాలువలో పడడంతో.. ఆ కుటుంబంలో ముగ్గురిని నీళ్లు మింగేశాయి. వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం కొంకపాక శివారులో.. సంగెం మండలం తీగరాజుపల్లి సమీపంలో ఈ దారుణం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం మేచరాజుపల్లి గ్రామానికి చెందిన సోమారపు ప్రవీణ్‌కుమార్(37) హనుమకొండలో ఎల్ఐసీ డెవలప్‌మెంట్ అధికారిగా పనిచేస్తున్నారు. శని, ఆదివారాలు సెలవు కావడంతో స్వగ్రామంలో తన తల్లిదండ్రులతో ఆనందంగా గడుపుదామనుకున్నారు. శనివారం ఉదయం తన భార్య కృష్ణవేణి, కుమార్తె చైత్ర సాయి(4), కుమారుడు ఆర్యవర్ధన్(2)తో కలిసి కారు(టీఎస్03-ఎఫ్‌బీ8881)లో బయలుదేరారు. వారి కారు సంగెం మండలం తీగరాజుపల్లి దాటగానే.. ఛాతీలో నొప్పిగా ఉందంటూ ప్రవీణ్ ఆందోళనచెందారు. వైద్యం కోసం వరంగల్ వెళ్దామనే ఉద్దేశంతో కారును వెనక్కి తిప్పారు. ఈ క్రమంలో కారు అదుపుతప్పి.. పక్కనే ఉన్న ఎస్సారెస్పీ కాలువలోకి దూసుకుపోయింది. పరిస్థితిని గమనిస్తూ.. అప్రమత్తమైన కృష్ణవేణి తన ఒడిలో కూర్చున్న కుమారుడిని కారు కిటికీలోంచి బయటకు విసిరి, తాను కూడా కిందకు దూకారు. అప్పటికే కారు కాలువలోకి దూసుకెళ్లింది. నీటి ఉధృతికి కృష్ణవేణి కొట్టుకుపోగా.. స్థానికులు తాడు సాయంతో కాపాడారు. కుమారుడు ఆర్యవర్ధన్‌ను రక్షించేందుకు యత్నించగా.. అప్పటికే నీళ్లు మింగడంతో.. ఊపిరాడక అతడు చనిపోయాడు. కారుతోపాటు నీటిలో మునిగిపోయిన ప్రవీణ్‌కుమార్, చైత్రసాయి కూడా దుర్మరణంపాలయ్యారు. సంఘటనాస్థలిని మామునూరు ఏసీపీ తిరుపతి సందర్శించారు. అంబులెన్స్, అగ్నిమాపకశాఖ, ఎక్స్‌కవేటర్లను రప్పించి.. సహాయక చర్యలను చేపట్టారు. నీటి ఉధృతి కారణంగా.. అడుగులో కారు ఎక్కడుందో గుర్తించడం సాధ్యం కాలేదని పోలీసులు తెలిపారు. వెంటనే నీటిపారుదల శాఖ అధికారులతో మాట్లాడి..అటుగా నీటి ప్రవాహాన్ని తగ్గించేలా గేట్లు మూయించారు. నీటి ప్రవాహం తగ్గాక.. ప్రమాదస్థలి నుంచి సుమారు 200 మీటర్ల దూరంలో కారును గుర్తించారు. అగ్నిమాపకశాఖ అధికారులు, సిబ్బంది ఐదు గంటల పాటు శ్రమించి, పొక్లెయినర్, క్రేన్ సాయంతో కారును, అందులోని ప్రవీణ్, చైత్రసాయి మృతదేహాలను వెలికి తీశారు. ముగ్గురి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. కాగా, ఐదుగంటల పాటు.. ప్రవీణ్, చైత్ర మృతదేహాలు లభ్యమయ్యేవరకు అంబులెన్స్‌లో ఉన్న కృష్ణవేణి తన ఒళ్లో ఆర్యవర్ధన్ మృతదేహాన్ని పెట్టుకుని, "కన్నా.. లే.."అంటూ రోదించడం అక్కడి వారిని కంటతడి పెట్టించింది. ఓ వైపు ఆర్యవర్ధన్‌లో కదలికలు లేకపోవడం.. తన భర్త, కూతురి జాడ కనిపించకపోవడంతో.. ఆమె రోదన మిన్నంటింది.

నాలుగేళ్ల క్రితం నలుగురి మృతి

నాలుగేళ్ల క్రితం ఇదే ప్రాంతంలో రోడ్డు ప్రమాదం జరిగి, నలుగురు ప్రాణాలు కోల్పోయారు. అప్పుడు కూడా మృతులు కారులో ప్రయాణిస్తుండడం గమనార్హం.! ఈప్రాంతంలో స్పీడ్ బ్రేకర్లు, హెచ్చరిక బోర్డులు లేకపోవడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రంగన్న మృతదేహానికి

రీపోస్టుమార్టం

మృతుడి ఇంటి వద్ద క్లూస్ టీం తనిఖీలు

వివేకా హత్య కేసు సాక్షి రంగన్న మరణంపై సిట్

కడప/పులివెందుల, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో ప్రత్యక్ష సాక్షి రంగన్న మృతదేహానికి శనివారం రీపోస్టుమార్టం నిర్వహించారు. ఉదయం పులివెందులలోని భాకరాపురం శ్మశాన వాటికలో మృతదేహాన్ని వెలికితీసి తిరుపతి నుంచి వచ్చిన ఫోరెన్సిక్ నిపుణులు, కడప రిమ్స్ మెడికల్ కళాశాల వైద్య నిపుణుల ఆధ్వర్యంలో 3-4 గంటల పాటు శవపరీక్ష చేశారు. శరీరంపై ఎక్కడైనా గాయాలున్నాయా అనే అంశాన్ని పరిశీలించారు మృతదేహం నుంచి తలవెంట్రుకలు, కాలి, చేతి గోళ్లు, మరికొన్ని అవయవాలను సేకరించి, ప్రత్యేక బాక్స్‌లో ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపారు. రంగన్న భార్య సుశీల, కుమారుడి అనుమతితోనే శవపరీక్ష నిర్వహించారు. రంగన్న కడప రిమ్స్‌లో చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందిన విషయం తెలిసిందే. రంగన్న భార్య సుశీల ఫిర్యాదు మేరకు పులివెందుల అర్బన్ పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసుగా నమోదు చేశారు. కాగా, రంగన్న మృతిపై విచారణకు కడప ఎస్పీ అశోక్ కుమార్ ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేశారు.

వరుస మరణాలు

- వివేకా హత్య కేసులో అనుమానితుడైన శ్రీనివాసుల రెడ్డి 2019 సెప్టెంబరు 29న ఆత్మహత్య చేసుకున్నాడు.
- జగన్ మామ ఈసీ గంగిరెడ్డి 2020 అక్టోబరు 3న అనారోగ్యంతో చనిపోయారు.
- ఈ కేసులో మరో కీలకసాక్షి గంగాధర్‌రెడ్డి 2022 జూన్ 9న తన ఇంట్లో నిద్రలోనే మృతిచెందారు.
- ఇక వైఎస్ అభిషేక్‌రెడ్డి ఈ ఏడాది జనవరి 10న మృతిచెందారు.
- జగన్ డ్రైవర్ నారాయణయాదవ్ 2019 డిసెంబరు 6న అనారోగ్యంతో మృతిచెందారు. వివేకా హత్యకు గురైనప్పుడు జగన్ దంపతులు హైదరాబాదు నుంచి పులివెందులకు కారులో వచ్చారు. అప్పుడు ఈయనే డ్రైవరు. జగన్ సీఎం అయిన ఆర్నెళ్లకే ఇతను చనిపోవడం గమనార్హం.
- ఇక వాచ్‌మన్ రంగన్న ఈ నెల 5న మృతిచెందారు.

● ఫాల్కన్ కుంభకోణం..

అమర్‌దీప్ విమానం సీజ్

- దూకుడు పెంచిన ఈడీ
- దుబాయ్ నుంచి శంషాబాద్‌కు విమానం
- కొల్లగొట్టిన స్కామ్ డబ్బులోంచి.. 14 కోట్లతో విమానం కొనుగోలు
- దుబాయ్‌లోనే సూత్రధారి అమర్‌దీప్



అధికారులు సీజ్ చేసిన అమర్‌దీప్ విమానం

హైదరాబాద్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): పెట్టిన పెట్టుబడికి తక్కువ సమయంలో ఎక్కువ లాభం అంటూ.. సుమారు రూ.850 కోట్ల మేర కుచ్చుటోపీ పెట్టిన ఫాల్కన్ ఇన్వాయిస్ కుంభకోణం కేసులో.. ప్రధాన నిందితుడు అమర్‌దీప్ ప్రైవేట్ జెట్ విమానాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) సీజ్ చేసింది. ఈ స్కామ్‌లో కొల్లగొట్టిన డబ్బులోంచి రూ.14 కోట్లు వెచ్చించిన అమర్‌దీప్ 8 సీట్ల బిజినెస్ జెట్(ఎన్935హెచ్ హాకర్ 800ఏ) విమానాన్ని కొనుగోలు చేసినట్లు ఈడీ అధికారులు గుర్తించారు. ప్రధాన నిందితుడు దుబాయ్‌లోనే ఉండగా.. విమానాన్ని నాటకీయ ఫక్కీలో హైదరాబాద్‌కు పంపారు. శుక్రవారం అర్ధరాత్రి కొందరు వ్యక్తులతో ఈ విమానం హైదరాబాద్‌కు బయలుదేరగా.. పైలట్ శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ఎమర్జెన్సీ ల్యాండింగ్‌కు అనుమతి కోరారు. విమానంలో ఉన్న ఓ వ్యక్తికి మెడికల్ ఎమర్జెన్సీ ఉందని సమాచారం అందించారు. ఈ సమాచారంతో.. రన్‌వే వద్ద సిద్ధంగా ఉన్న వైద్య బృందం.. విమానం ల్యాండ్ అవ్వగానే అందులోని ప్రయాణికులను పరీక్షించి.. ఎవరికీ మెడికల్ ఎమర్జెన్సీ లేదని నిర్ధారించింది. దీంతో.. అప్రమత్తమైన ఎయిర్‌పోర్ట్ ఇంటెలిజెన్స్ వర్గాలు.. ఆ విమానం అమర్‌దీప్‌దని గుర్తించాయి. ఆ వెంటనే ఇంటెలిజెన్స్ బ్యూరో(ఐబీ), కస్టమ్స్, డీఆర్ఐ, ఈడీ విభాగాలు రంగంలోకి దిగాయి. ఈడీ అధికారులు శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకుని, ఆ విమానాన్ని సీజ్ చేశారు. కాగా.. ఈ స్కామ్‌లో ఇప్పటి వరకు ముగ్గురు వ్యక్తులను సైబరాబాద్ పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే.! ప్రధాన నిందితులు-- ఫాల్కన్ ఇన్వాయిస్ చైర్మన్ అమర్‌దీప్(ఆర్మీ మాజీ అధికారి కుమారుడు), చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్(సీవోవో) ఆర్యన్‌సింగ్, సీఈవో యోగీందర్ సింగ్ దుబాయ్‌కి పారిపోయారు. వీరి కోసం పోలీసులు లుక్‌ఔట్ నోటీసులు జారీ చేశారు. ఈ ముఠా తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు వస్తాయంటూ మోసాలకు పాల్పడ్డ విషయం తెలిసిందే.! రూ.25 వేల నుంచి రూ.9 లక్షల వరకు డిపాజిట్లు చేస్తే.. నెలకు 11% నుంచి 22% వరకు వడ్డీ వస్తుందని అమర్‌దీప్, ఇతర నిందితులు అమాయకులను ఆకట్టుకున్నారు. చైన్‌స్కీమ్(ఎంఎల్‌ఎం) మాదిరిగా కొత్త డిపాజిటర్లను చేర్పిస్తే.. 4% చొప్పున అదనపు కమీషన్ వస్తుందని ఆశ చూపారు. ఎన్నారైలు, వైద్యులు, క్రెడిట్‌కార్డులు ఉన్న మధ్యతరగతి ప్రజలు.. ఇలా మొత్తం 6,979 మంది రూ.1,700 కోట్ల మేర పెట్టుబడులు పెట్టారు. అందులో రూ.850 కోట్లను ఫాల్కన్ నిందితులు తిరిగి చెల్లించగా.. మరో రూ.850 కోట్లను కొల్లగొట్టారు.

లింక్‌డిన్‌లో అమర్‌దీప్ సందేశాలు

"కేసులను వెనక్కి తీసుకుంటే.. డిపాజిటర్లు చెల్లించిన మొత్తాన్ని తిరిగి ఇచ్చేస్తాను" అంటూ దుబాయ్‌లో ఉన్న అమర్‌దీప్ లింక్‌డిన్‌లో పోస్టు చేశారు. తాను ఎక్కడికీ పారిపోలేదని పేర్కొన్నారు. అయితే.. పోలీసులు మాత్రం ముగ్గురు ప్రధాన నిందితులపై లుక్‌ఔట్ నోటీసులు జారీ చేశామని చెబుతున్నారు. ఇక్కడ వసూలు చేసిన మొత్తాన్ని 22 షెల్ కంపెనీల ద్వారా దుబాయ్, సింగపూర్, మలేసియాకు తరలించారని వివరించారు. మనీల్యాండరింగ్ కోణంలో ఈడీ అధికారులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

అంతుచిక్కని వ్యాధితో 10 వేల కోళ్లు మృతి

- చిన్నశంకరంపేట మండలంలో ఘటన



గవ్వపల్లిలోని కోళ్లఫాంలో మృతి చెందిన కోళ్లు

చిన్నశంకరంపేట, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : మెదక్ జిల్లా చిన్నశంకరంపేట మండలంలోని గ్రామాల్లో శనివారం 10 వేల కోళ్లు అంతుచిక్కని వ్యాధితో మృతి చెందాయి. గవ్వపల్లి, జంగరాయి గ్రామాల్లోని కోళ్ల ఫాంలలో కళ్ల ఎదుటే వ్యాధికి గురైన కోళ్లు మృతి చెందడంతో ఫాంల యజమానులు కన్నీటి పర్యంతమయ్యారు. వైరస్ సోకడంతో వారం రోజుల నుంచి భారీ సంఖ్యలో కోళ్లు మృతి చెందుతున్నాయని వాటి పోషణదారులు సంగెం జనార్ధన్, ఆరె యాదగిరి, మినిపూరి భూపాల్‌రెడ్డి వాపోయారు. మెదక్ జిల్లాలో బర్డ్‌ఫ్లూ వ్యాధితో కోళ్లు మృతి చెందిన విషయం తెలిసిందే. కాగా మృతి చెందిన కోళ్లను భూమిలో పూడ్చేశారు. రూ.లక్షల్లో నష్టం వాటిల్లిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని వారు కోరారు.

చెరువుల సుందరీకరణపై

వివరాలు ఇవ్వండి

- హైడ్రా కమిషనర్‌కు మాధవరం లేఖ

కూకట్‌పల్లి, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): చెరువులు, కుంటల అభివృద్ధి, సుందరీకరణ పనులపై పూర్తి వివరాలు ఇవ్వాలని హైడ్రా అధికారులను కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కోరారు. ఈ మేరకు శనివారం హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు లేఖ రాశారు. నివాసం ఉంటున్న ఇళ్ల జోలికి వెళ్లబోమని హైడ్రా అధికారులు ప్రకటించడం హర్షణీయమని ఎమ్మెల్యే అన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గ పరిధిలోని ముళ్లకత్వ, కామునిచెరువు, మైసమ్మ చెరువు, సున్నం చెరువు, రంగధాముని చెరువు(ఐడీఎల్) నల్లచెరువు, ఖాజాకుంట, బోయినపల్లి చెరువుల అభివృద్ధి కోసం చర్యలు తీసుకోవాలని గతంలోనే అధికారులను కోరామన్నారు.

తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ
హైదరాబాద్
నం.TGSDC/Mrktg/Short e-Tender/V-25/2024-25 **సంక్షిప్త ఇ-టెండరు ప్రకటన** తేది: 27.02.2025
వానాకాలం-2025 కాలానికి తెలంగాణ రాష్ట్రంలో సరఫరా కొరకు అవసర ప్రాతిపదికన తాజాగా పండించిన గ్రీన్ మాన్యూర్ T/L విత్తనం అనగా జైంచ, సన్ హెంప్ మరియు పిల్లిపెసర యొక్క సరఫరా కొరకు TGSDC వారు సంక్షిప్త ఇ-టెండరు కోరుతున్నారు. సంక్షిప్త ఇ-టెండరు ప్రక్రియలో పాల్గొనుటకు అర్హత గల పంపిణీదారులను ఆహ్వానించడమైనది. సవివర స్పెసిఫికేషన్ల షెడ్యూల్, నియమ నిబంధనలు వెబ్‌సైట్ https://tgsdcl.telangana.gov.inలో లభించును. బిడ్లు https://tender.telangana.gov.in దర్శింగలరు, సంప్రదించగలరు:7337445545/7337445548/6309389690/9912756216, 9121107840/040-23236088. బిడ్డింగ్‌కు ఆఖరి తేది మరియు సమయం: 17.03.2025న మ. 03.00 గం.లకు.
DIPR RO.No 10902-PP/CL/ADVT/1/2024-25 తేది.05.03.2025 సం/-మేనేజింగ్ డైరెక్టర్

KENDRIYA VIDYALAYA BOLARUM
WALK IN INTERVIEW
* Walk in Interview will be conducted for appointment of teachers on contractual basis for KV Bolarum & KV AFS Hakimpet for the year 2025-26
* **Venue:** Kendriya Vidyalaya, Bolarum, Allenby Lines, JJ Nagar, Yapral, Secunderabad- 87
* Dates of Interview: **12th & 13th March 2025**
* For more details visit website: https://bolarum.kvs.ac.in & https://hakimpet.kvs.ac.in
Sd/-
PRINCIPAL KV BOLARUM

KENDRIYA VIDYALAYA
TIRUMALAGIRI SECUNDERABAD- 500015
WALK- IN INTERVIEW

Date	Post
12.03.2025	Post Graduate Teacher (English/Hindi/History/ Geography /Economics/ Commerce /Biology/ Physics/ Chemistry/Maths) Trained Graduate Teacher (English/ Hindi/ Sanskrit/ Science/ Maths/Social Studies Primary Teacher
13.03.2025	Post Graduate Teacher (Computer Sc.)/Computer Instructor/ Sports Coach/Craft Teacher/Music Teacher/Dance Teacher/ Yoga Teacher/ Educational Councellor/Special Educator/Doctor/Nuse

Time 9:00 AM to 02.00 PM.
Please visit website for details: https://trimulghery.kvs.ac.in/
Sd/- K CHANDRASEKHAR
PRINCIPAL

THE SINGARENI COLLIERIES COMPANY LIMITED
(A Government Company)
KOTHAGUDEM COLLIERIES, BHADRADRI KOTHAGUDEM DIST, TELANGANA.
EMPLOYMENT NOTIFICATION No. 01/2025
S.C.C.L invites online applications from eligible persons for engagement on Consolidated Payment to the following Posts on Contract basis.

S.No	Name of the Post	No. of vacancies
1	CHIEF SECURITY OFFICER	01
2	CHIEF OF MEDICAL SERVICES	01

For details i.e., Experience, Age, Qualifications required for the Posts and payment & period of Contract etc., please visit our SCCL website **https://www.scclmines.com**, Click on **"Careers"** link available on Home page. The eligible candidates can apply ONLINE from **12:00 Noon of 10.03.2025 to 05:00PM on 24.03.2025.**
Note : *The earlier Notification issued vide 04/2024 for the post of Chief Security Officer has been cancelled.*
Sd/-
PR/2025/ADVT/PER/RC/21 **Chairman & Managing Director**
DIPR R.O.No.11082-PP/CL/ADVT/1/2024-25, Dt: 07.03.2025

KALAKSHETRA FOUNDATION
(An Autonomous Body under Ministry of Culture, Government of India)
Thiruvanmiyur, Chennai - 600 041.
DIPLOMA COURSES ADMISSION
RUKMINI DEVI COLLEGE OF FINE ARTS invites online application for admission into Four year Full time **Diploma courses** in
BHARATANATYAM
CARNATIC MUSIC (Vocal /Instruments)
VISUAL ARTS (Drawing, Painting, Sculptures etc.)
For Further details visit our website:
www.kalakshetra.in→College→ Online Application
Director

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ఆర్కే RK



కొత్తపలుకు


తెలంగాణలో ఎన్డీయే కూటమి?

అధ్యాపకులు, పట్టభద్రుల నియోజక వర్గాలకు ఉభయ తెలుగు రాష్ట్రాలలో జరిగిన ఎన్నికల్లో ఓటర్లు అధికార, ప్రతిపక్షాలకు తమదైన రీతిలో సంకేతాలు ఇచ్చారు. తెలంగాణలో ఓటర్ల తీర్పు ప్రతిపక్షానికి బలం చేకూర్చగా... ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం ప్రతిపక్షం తన పద్ధతులు మార్చుకోని పక్షంలో మనుగడే కష్టమన్న హెచ్చరికలు జారీ చేశారు. తెలంగాణలో అధ్యాపకులు, పట్టభద్రుల నియోజకవర్గాలు రెండింటినీ భారతీయ జనతా పార్టీ గెలుచుకోవడం ద్వారా మూడు ప్రధాన రాజకీయ పార్టీలలో తనదే పైచేయి అని రుజువు చేసుకుంది. ప్రధాన ప్రతిపక్షమైన భారత రాష్ట్ర సమితి ఈ ఎన్నికల్లో పోటీకి దూరంగా ఉండటంతో ప్రధాన పోటీ కాంగ్రెస్, బీజేపీ మధ్యనే జరిగింది. అధికార కాంగ్రెస్ పార్టీ పట్టభద్రుల నియోజకవర్గం లోనే అధికారికంగా పోటీచేసింది. గత ఎన్నికల్లో గెలుచుకున్న ఈ స్థానాన్ని ఇప్పుడు కోల్పోవడం ఆ పార్టీకి దెబ్బ అనే చెప్పుకోవచ్చు. ఒకప్పుడు ఉత్తర తెలంగాణ భారత రాష్ట్ర సమితికి ఆయువుపట్టుగా ఉండేది. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఉత్తర తెలంగాణలో బీఆర్ఎస్ పరాభవాన్ని మూటగట్టుకోగా బీజేపీ బలపడింది. ఇప్పుడు ఈ ఎన్నికల్లో ఆ పార్టీ తన స్థానాన్ని మరింత పటిష్ఠం చేసుకుంది. తెలంగాణ ఉద్యమానికి అండగా ఉండిన ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో అధ్యాపకుల నియోజక వర్గంలో కూడా బీజేపీ పాగా వేసింది. భారత రాష్ట్ర సమితి ఎన్నికలకు దూరంగా ఉండటం బీజేపీకి కలిసొచ్చింది. ముక్కోణపు పోటీ జరిగి ఉంటే పరిస్థితి ఎలా ఉండేదో చెప్పలేంగానీ, బీజేపీ తెలంగాణలో విస్తరిస్తోందన్న అభిప్రాయం ఈ ఎన్నికల ఫలితాలతో ధ్రువపడింది. అదే సమయంలో కాంగ్రెస్ బలహీనపడుతోందన్న అభిప్రాయానికి బలం చేకూరుతోంది. ఇదే ధోరణి కొనసాగితే వచ్చే సార్వత్రిక ఎన్నికల నాటికి కాంగ్రెస్ పరిస్థితి ఏమిటన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఎన్నికలు ఎప్పుడు జరిగినా ప్రజలు తనకు బ్రహ్మరథం పట్టడానికి సిద్ధంగా ఉన్నారని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ శుక్రవారం నాడు చెప్పుకొన్నారు. అదే నిజమైతే పట్టభద్రుల నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ మద్దతు పొందిన బీఎస్పీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ ఓడిపోకూడదు. ఆయన మూడో స్థానానికే పరిమితమయ్యారు. దీంతో ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న భారత రాష్ట్ర సమితి స్థానాన్ని భారతీయ జనతా పార్టీ ఆక్రమించబోతున్నదా? అన్న సందేహం సహజంగానే ఏర్పడుతుంది. ఆంధ్రప్రదేశ్‌తో పోల్చితే తెలంగాణలో బీజేపీ మొదటి నుంచి కొంత బలంగానే ఉంది. ఇటీవలి కాలంలో ఆ పార్టీ శాసనసభలో కూడా బలం పెంచుకుంది. దీంతో వచ్చే ఎన్నికల నాటికి రాజకీయ సమీకరణాలు ఎలా ఉండబోతున్నాయనేది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

> జగన్ అధికారంలో ఉన్నంత కాలం ఎన్ని అరాచకాలు జరిగినా సీపీఎం పెదవి విప్పలేదు. అటు ఆంధ్రప్రదేశ్‌లోనే కాకుండా ఇటు తెలంగాణలో కూడా ఆ పార్టీ పోకడలను ప్రజలు హర్షించలేదు. దీంతో తెలుగునాట సీపీఎం తన ఉనికిని కోల్పోయే పరిస్థితి ఏర్పడింది. దీని ప్రభావం తాజాగా జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో స్పష్టమైంది. గుంటూరు, కృష్ణా జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గాల నుంచి పోటీ చేసి ఓడిపోయిన లక్ష్మణరావుకు ప్రజల్లో కొంత విశ్వసనీయత ఉన్నప్పటికీ ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న సీపీఎం విశ్వసనీయత కోల్పోయినందున భారీ తేడాతో ఓడిపోయారు. ఆయనకు వైసీపీ పరోక్షంగా మద్దతు ఇవ్వడం శాపంగా మారిందన్న అభిప్రాయమూ ఉంది. రాష్ట్ర స్థాయిలోనే కాదు, జాతీయ స్థాయిలో కూడా సీపీఎం నాయకత్వం తీసుకుంటున్న అసంబద్ధ నిర్ణయాల వల్ల ఆ పార్టీ ఇప్పుడు కేరళకు మాత్రమే పరిమితమై ఒక ప్రాంతీయ పార్టీగా కుదించుకుపోయింది.

తెలంగాణలో నేతల సన్నాహాలు!

జాతీయ స్థాయిలో ఎన్డీయేను పటిష్ఠం చేయాలని ప్రధాని నరేంద్ర మోదీ భావిస్తున్నందున వచ్చే ఎన్నికల నాటికి తెలంగాణలో కూడా ఎన్డీయే ప్రయోగం అమలు చేస్తారా? అన్న ప్రశ్న కొన్ని రోజులుగా వినిపిస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమిగా ఏర్పడి ఘన విజయం సాధించాయి. తెలుగుదేశం పార్టీకి సొంతంగా మెజారిటీ సమకూరినప్పటికీ ఎన్డీయే కూటమిగానే ముందుకెళుతున్నాయి. ఇదే ప్రయోగాన్ని తెలంగాణలో కూడా అమలు చేస్తే... అన్న చర్చ ఇప్పుడు ఆ మూడు పార్టీలలో నడుస్తోంది. తెలంగాణలో బీజేపీ సంస్థాగతంగా బలంగా ఉండగా, తెలుగుదేశం పార్టీ ఓట్ల పరంగా అంతో ఇంతో బలంగా ఉంది. జనసేనకు కూడా తెలంగాణలో కొన్ని ఓట్లు ఉన్నాయి. గత శాసనసభ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ఎన్నికలకు దూరంగా ఉండటంతో అది కాంగ్రెస్ పార్టీకి కలిసొచ్చింది. తెలుగుదేశం పార్టీ సొంతంగా పోటీ చేస్తే ఒక్క సీటు కూడా గెలుచుకోకపోవచ్చునుగానీ, ప్రధాన పార్టీతో జతకట్టి పోటీ చేస్తే ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేయగలదు. ఈ నేపథ్యంలో తెలంగాణలో మాత్రం ఎన్డీయే కూటమి ఎందుకు ఏర్పడకూడదు? అన్న ప్రశ్న ఇటీవలి కాలంలో వినపడుతోంది. గతంలో కలిసి పోటీ చేద్దామని తెలుగుదేశం అధినేత చంద్రబాబు ప్రతిపాదించగా బీజేపీ రాష్ట్ర నాయకుల సూచన మేరకు ఆ పార్టీ అగ్రనేతలు తిరస్కరించారు. దీంతో బీజేపీ ఒంటరిగానే పోటీ చేసింది. గత ఎన్నికల్లో జనసేనతో కలసి పోటీ చేసినా పెద్దగా ఉపయోగపడలేదు. దీంతో తెలుగుదేశం పార్టీకి ఉన్న ఓటర్ల ప్రాధాన్యతను బీజేపీ నాయకులు కూడా గుర్తించారు. ఈ నేపథ్యంలోనే తెలంగాణలో కూడా పోటీ చేస్తామన్న అభిప్రాయాన్ని చంద్రబాబు ఈ మధ్య వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణలో ఎన్డీయే కూటమి రూపుదిద్దుకోబోతున్నదని పసిగట్టడం వల్లనే మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఇటీవల మాట్లాడుతూ, "తెలంగాణలో చంద్రబాబు రాజకీయం చేయాలనుకుంటే సహించేది లేదు" అని వ్యాఖ్యానించారు. ఆయన చంద్రబాబును కేవలం సెంటిమెంటు కోసమే వ్యతిరేకించడం లేదు. ఎన్డీయే కూటమి ఏర్పడితే తెలుగుదేశం, బీజేపీలలో చేరడానికి బీఆర్ఎస్‌కు చెందిన పలువురు నాయకులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఇందులో ఎమ్మెల్యేలు కూడా ఉన్నారు. వచ్చే ఎన్నికల నాటికి ఎన్డీయే కూటమి ఏర్పడుతుందని, ఆ కారణంగానే తాను తెలుగుదేశం పార్టీలో చేరే ఆలోచన చేస్తున్నానని కొంతకాలం క్రితం బీఆర్ఎస్‌కు చెందిన ఎమ్మెల్యే ఒకరు నాతో చెప్పారు. అప్పట్లో ఆయన చెప్పిన మాటలు టూ ఎర్లీగా అనిపించాయిగానీ, ఇప్పుడు పరిస్థితులు వేగంగానే మారుతున్నాయి. బీజేపీ అగ్ర నాయకత్వం ఆలోచనలు కూడా మారాయంటున్నారు. తెలంగాణలో ఎన్డీయే కూటమి ఏర్పడితే ప్రధానంగా నష్టపోయేది కేసీఆర్ మాత్రమే. అందుకే ఆయన చంద్రబాబుకు తెలంగాణలో ఏం పని అని మళ్లీ ప్రశ్నించడం మొదలు పెట్టారు. ఇక్కడ ఇంకో విషయం కూడా చెప్పుకోవాలి! బీజేపీతో కలసి వచ్చే ఎన్నికల్లో పోటీ చేయడానికి సిద్ధంగా ఉన్నామని బీఆర్ఎస్ నుంచి సంకేతాలు వెళ్లినా... బీజేపీ అగ్ర నాయకత్వం పట్టించుకోలేదు. తెలంగాణలో కేసీఆర్ శకం ముగిసిపోవాలని ఆ పార్టీ కోరుకుంటోంది. తెలుగుదేశం, జనసేనను కలుపుకొన్నా తామే పెద్దన్న పాత్రను పోషించవచ్చునని బీజేపీ నాయకులు కూడా భావిస్తున్నారు. ఈ పరిణామాలను గమనిస్తున్న కేసీఆర్ 'ఇక లాభం లేదు – జనంలోకి వెళ్లాలి' అని నిర్ణయించుకున్నారు. ఇక మీదట శాసనసభకు కూడా హాజరవుతానని ఆయన తాజాగా ప్రకటించారు. తెలంగాణలో ఎన్నికలకు ఇంకా మూడున్నరేళ్ల వ్యవధి ఉంది. ఈ మూడున్నరేళ్లలో ఏదైనా జరగవచ్చు.



రేవంత్‌కూ హెచ్చరిక...

ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలతో బీజేపీ ప్రస్తుతానికి మంచి ఊపు మీద ఉంది. ఇప్పుడు తెలంగాణలో కూడా ఎన్డీయేకు పురుడు పోయాలన్న ఆలోచన ఊపందుకుంటున్నందున కేసీఆర్ మాత్రమే కాదు– ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా మేల్కొనాల్సిన అవసరం ఉంది. కాంగ్రెస్ పార్టీలో ప్రస్తుతం ఎవరికి వారే యమునా తీరే అన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వపరమైన, విధానపరమైన విషయాలను కూడా ముఖ్యమంత్రికంటే ముందుగా మంత్రులు, ఇతరులు ప్రకటిస్తున్నారు. దీంతో ప్రభుత్వ రథసారథి ఎవరన్న ప్రశ్న సహజంగానే తలెత్తుతోంది. ఈ కారణంగా కాంగ్రెస్ పార్టీ బలహీనపడుతోందన్న అభిప్రాయం బలపడుతోంది. కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం ఇప్పటికైనా మేల్కొని, రాష్ట్ర నాయకత్వాన్ని పటిష్ఠం చేసే దిశగా చర్యలు తీసుకోని పక్షంలో పరిస్థితి చేయి దాటిపోయే ప్రమాదం లేకపోలేదు. స్థానిక సంస్థల ఎన్నికలకు గడువు ముగిసినప్పటికీ ఎన్నికలు జరిపించడానికి కాంగ్రెస్ పార్టీ సాహసించలేక పోతున్నదన్నది వాస్తవం. ఈ నేపథ్యంలో తెలంగాణలో ఎన్డీయే కూటమి రూపుదిద్దుకుంటే రాజకీయ సమీకరణాలు వేగంగా మారే అవకాశం ఉంది. ఇప్పుడు తనతో ఉన్న ఎమ్మెల్యేలు కూటమి వైపు చూడకుండా రేవంత్‌రెడ్డి ఎంతవరకు కట్టడి చేస్తారో తెలియదు. మరోవైపు గత ఎన్నికల తర్వాత కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలలో కొందరు పునరాలోచనలో పడ్డారు. ఈ పరిణామం కాంగ్రెస్ పార్టీకి ఇబ్బందికరంగా పరిణమించింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ విషమ పరీక్షను ఎదుర్కొని ప్రభుత్వాన్ని, పార్టీని ఎలా కాపాడుకుంటారో వేచి చూడాలి.

> తెలంగాణలో బీజేపీ సంస్థాగతంగా బలంగా ఉండగా, తెలుగుదేశం పార్టీ ఓట్ల పరంగా అంతో ఇంతో బలంగా ఉంది. జనసేనకు కూడా తెలంగాణలో కొన్ని ఓట్లు ఉన్నాయి. గత శాసనసభ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ఎన్నికలకు దూరంగా ఉండటంతో అది కాంగ్రెస్ పార్టీకి కలిసొచ్చింది. ఈ నేపథ్యంలో తెలంగాణలో మాత్రం ఎన్డీయే కూటమి ఎందుకు ఏర్పడకూడదు? అన్న ప్రశ్న ఇటీవలి కాలంలో వినపడుతోంది. తెలంగాణలో ఎన్డీయే కూటమి ఏర్పడితే ప్రధానంగా నష్టపోయేది కేసీఆర్ మాత్రమే. అందుకే ఆయన చంద్రబాబుకు తెలంగాణలో ఏం పని అని మళ్లీ ప్రశ్నించడం మొదలు పెట్టారు. ఇక్కడ ఇంకో విషయం కూడా చెప్పుకోవాలి! బీజేపీతో కలసి వచ్చే ఎన్నికల్లో పోటీ చేయడానికి సిద్ధంగా ఉన్నామని బీఆర్ఎస్ నుంచి సంకేతాలు వెళ్లినా... బీజేపీ అగ్ర నాయకత్వం పట్టించుకోలేదు. తెలంగాణలో కేసీఆర్ శకం ముగిసిపోవాలని ఆ పార్టీ కోరుకుంటోంది. తెలుగుదేశం, జనసేనను కలుపుకొన్నా తామే పెద్దన్న పాత్రను పోషించవచ్చునని బీజేపీ నాయకులు కూడా భావిస్తున్నారు.

ఏపీలో కూటమి కళ...

ఆంధ్రప్రదేశ్ విషయానికి వస్తే, ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలతో అధికార ఎన్డీయే కూటమికి వెయ్యి ఏనుగుల బలం చేకూరింది. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఎనిమిది నెలలకు జరిగిన ఎన్నికల్లో పట్టభద్రుల నియోజకవర్గాలు రెండింటిలోనూ తెలుగుదేశం పార్టీ పోటీకి పెట్టిన అభ్యర్థులకు 65 శాతం ఓట్లు రావడం విశేషం. ఈ ఎన్నికల్లో ప్రధాన ప్రతిపక్షమైన వైసీపీ పోటీ చేయకపోయినా, సీపీఎంతో సంబంధాలున్న అభ్యర్థులను పరోక్షంగా బలపరిచింది. వైసీపీ స్వయంగా పోటీ చేసినా ఫలితాల్లో తేడా ఉండేది కాదు. మహా అయితే కూటమికి లభించిన ఓట్ల శాతం కొంత తగ్గేదేమో! అయితే, రాష్ట్ర ప్రజల మూడ్‌ను గమనించి అందుకు అనుగుణంగా తమను తాము సంస్కరించుకొనే బదులు మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆత్మవంచన చేసుకుంటూ ఆనందం పొందడం ఆశ్చర్యంగా ఉంది. ఎన్నికల ఫలితాలు వెల్లడవుతున్న సమయంలో వైసీపీ నాయకులు చేసిన ప్రకటనలు, జగన్ రోత మీడియాలో చేసిన ప్రచారమే ఇందుకు నిదర్శనం. ఉత్తరాంధ్రలో అధ్యాపకుల నియోజకవర్గంలో పోటీలో ఉన్న ఇద్దరు అభ్యర్థులలో ఎవరికి మద్దతు ప్రకటించాలో తేల్చుకోలేకపోయిన కూటమి, ఆ ఇద్దరిలో ఎవరో ఒకరికి మొదటి ప్రాధాన్య ఓటు వేసి రెండో అభ్యర్థికి ద్వితీయ ప్రాధాన్య ఓటు వేయాలని సూచించింది. సీపీఎంకు అనుబంధంగా ఉండే యూటీఎఫ్ తరఫున పోటీచేసిన మరో అభ్యర్థిని వైసీపీ పరోక్షంగా బలపరిచింది. ఈ నేపథ్యంలో కూటమి మద్దతు పొందిన గాదె శ్రీనివాసులు నాయుడు, వర్మ మధ్యనే పోటీ జరిగింది. శ్రీనివాసులు నాయుడు విజేతగా నిలవగా, వర్మ ద్వితీయ స్థానంలో నిలిచారు. అయినప్పటికీ, 'కూటమికి ఓటమి' అని రోత మీడియా ప్రచారం చేయడం ద్వారా ఆత్మవంచన చేసుకుంది. మరోవైపు ఉభయ గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాల్లోని రెండు పట్టభద్రుల నియోజక వర్గాల్లో తెలుగుదేశం పార్టీ తరఫున అధికారికంగా పోటీచేసిన అభ్యర్థులు ఇరువురూ భారీ మెజారిటీతో గెలిచినా రోత మీడియా విస్మరించింది. తెలుగుదేశం అభ్యర్థులు విజయం సాధించారని చెప్పడం ఇష్టం లేక ఫలానా వారు గెలిచారని వారి పేర్లు మాత్రమే ప్రసారం చేశారు. ఇంతకంటే ఆత్మవంచన ఇంకొకటి ఉంటుందా? మీడియా దాచినంత మాత్రాన ఫలితాలు తారుమారవుతాయా? ప్రజల తీర్పు మారిపోతుందా?

> అధ్యాపకులు, పట్టభద్రుల నియోజక వర్గాలకు ఉభయ తెలుగు రాష్ట్రాలలో జరిగిన ఎన్నికల్లో ఓటర్లు అధికార, ప్రతిపక్షాలకు తమదైన రీతిలో సంకేతాలు ఇచ్చారు. తెలంగాణలో ఓటర్ల తీర్పు ప్రతిపక్షానికి బలం చేకూర్చగా... ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం ప్రతిపక్షం తన పద్ధతులు మార్చుకోని పక్షంలో మనుగడే కష్టమన్న హెచ్చరికలు జారీ చేశారు.

అల్ప బుద్ధులు బయటపడతాయి అంతే! క్షేత్ర స్థాయి పరిస్థితులను సమీక్షించుకొని దిద్దుబాటు చర్యలు తీసుకోవడానికి రాజకీయ పార్టీలు ఎన్నికల ఫలితాలను దిక్సూచిగా భావిస్తాయి. కానీ, వైసీపీ రూటే సెపరేటు! మాకు చూపు ఎలాగూ లేదు– అవతలి వాడికి కూడా ఒక కన్ను పోయింది అని ఆనందించినట్టుగా ఉత్తరాంధ్ర ఫలితాన్ని వక్రీకరించి ఆనందం పొందింది. సీన్ కట్ చేస్తే ఉత్తరాంధ్ర నుంచి నెగ్గిన గాదె శ్రీనివాసులు నాయుడు తన గెలుపు ప్రకటన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబును కలుసుకొని తాను కూటమి అభ్యర్థినేనని చెప్పుకొన్నారు. ఈ సన్నివేశం చూసిన తర్వాత వైసీపీ నాయకులుగానీ, జగన్ రోత మీడియాగానీ ముఖం ఎక్కడ పెట్టుకుందో తెలియదు. సొంత మీడియా ఏర్పాటు చేసుకున్నంత మాత్రాన, కూలి మీడియాను పెంచి పోషించినంత మాత్రాన ప్రజాభిప్రాయం మారదు అని మరోమారు రుజువైంది.

కామ్రేడ్ల కష్టాలు!

ఈ సందర్భంగా సీపీఎం గురించి కూడా చర్చించుకోవలసి ఉంది. జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి రాకముందు, వచ్చిన తర్వాత, ఇప్పుడు ఓడిపోయిన తర్వాత కూడా సీపీఎం ఆయనతో పరోక్షంగా చేతులు కలుపుతూనే ఉంది. జగన్ రెడ్డి వంటి వారితో చేతులు కలపడం వల్ల గతంలో ఆ పార్టీకి ఉండిన విశ్వసనీయతను ఇప్పుడు పూర్తిగా కోల్పోయింది. ఉభయ కమ్యూనిస్టు పార్టీలలో సీపీఎం అంటే అంతో ఇంతో నిక్కచ్చిగా, నిజాయితీగా ఉంటుందన్న అభిప్రాయం ఒకప్పుడు ఉండేది. ఇప్పుడు జగన్‌రెడ్డితో చేతులు కలపడానికి సీపీఐ ససేమిరా అంటూ ఉండగా, సీపీఎం మాత్రం ఎప్పటికప్పుడు ఉత్సాహం ప్రదర్శిస్తూ వచ్చింది. సీపీఐ కలసి రానందున, వైసీపీతో నేరుగా పొత్తు పెట్టుకోలేక పోయినందున సీపీఎం రహస్య అవగాహనతో నడిచింది. జగన్ అధికారంలో ఉన్నంత కాలం ఎన్ని అరాచకాలు జరిగినా సీపీఎం పెదవి విప్పలేదు. అటు ఆంధ్రప్రదేశ్‌లోనే కాకుండా ఇటు తెలంగాణలో కూడా ఆ పార్టీ పోకడలను ప్రజలు హర్షించలేదు. దీంతో తెలుగునాట సీపీఎం తన ఉనికిని కోల్పోయే పరిస్థితి ఏర్పడింది. దీని ప్రభావం తాజాగా జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో స్పష్టమైంది. గుంటూరు, కృష్ణా జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గాల నుంచి పోటీ చేసి ఓడిపోయిన లక్ష్మణరావుకు ప్రజల్లో కొంత విశ్వసనీయత ఉన్నప్పటికీ ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న సీపీఎం విశ్వసనీయత కోల్పోయినందున భారీ తేడాతో ఓడిపోయారు. ఆయనకు వైసీపీ పరోక్షంగా మద్దతు ఇవ్వడం శాపంగా మారిందన్న అభిప్రాయమూ ఉంది. రాష్ట్ర స్థాయిలోనే కాదు, జాతీయ స్థాయిలో కూడా సీపీఎం నాయకత్వం తీసుకుంటున్న అసంబద్ధ నిర్ణయాల వల్ల ఆ పార్టీ ఇప్పుడు కేరళకు మాత్రమే పరిమితమై ఒక ప్రాంతీయ పార్టీగా కుదించుకుపోయింది. కేరళలో కూడా ముఖ్యమంత్రి పినరయ్ విజయన్ లేకపోతే ఆ పార్టీ పరిస్థితి ఏమిటో కూడా తెలియదు. తెలుగునాట సీపీఎంకు ఒకప్పుడు బలమైన నాయకులు ఉండేవారు. ప్రజల్లో వారికి విశ్వసనీయత ఉండేది. కానీ, ప్రస్తుత దుస్థితికి ప్రస్తుత నాయకులే ప్రధాన కారణం. నీవు ఎలాంటి వాడివో నీ చుట్టూ ఉండే స్నేహితులను బట్టి చెప్పవచ్చునని అంటారు. ఇప్పుడు జగన్‌రెడ్డితో రహస్య ప్రేమాయణం సాగిస్తున్నందున ఆ ప్రభావం సీపీఎం పైన పడింది. ఉత్తరాంధ్రలో ఉపాధ్యాయుల నియోజకవర్గం నుంచి పోటీ చేసిన యూటీఎఫ్ అభ్యర్థి గట్టి పోటీ కూడా ఇవ్వలేకపోయారంటేనే ఆ పార్టీ పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. కృష్ణా, గుంటూరు జిల్లాల్లో లక్ష్మణరావు వంటి వ్యక్తి కూడా పరాభవాన్ని మూటగట్టుకోవాల్సి వచ్చింది.

జగన్ ఇప్పుడేమంటారో..

సీపీఎం సంగతి అలా ఉంచి, జగన్మోహన్‌రెడ్డి విషయానికి వద్దాం! ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాల తర్వాత కూడా వాస్తవాలను గుర్తించడానికి ఆయన సిద్ధంగా లేరని స్పష్టమవుతోంది. నిన్నటి దాకా ఈవీఎంల ద్వారా మోసం చేశారని అన్నారు. ఇప్పుడు బ్యాలెట్ ద్వారా జరిగిన ఎన్నికల్లో కూటమి తన మెజారిటీని పెంచుకుంది. ఇప్పుడేమి చెబుతారు? ఈ ఎన్నికల ఫలితాలతో ఆంధ్రప్రదేశ్‌లో ఎన్డీయే కూటమి బలంగా ఉందని రుజువైంది. కొన్ని విషయాల్లో తెలుగు తమ్ముళ్లు ఆవేశపడుతున్నప్పటికీ దాని ప్రభావం ప్రజల్లో లేదని ఈ ఎన్నికలతో స్పష్టమైంది. పట్టభద్రుల స్థానాలకు జరిగిన ఎన్నికల్లో తెలుగుదేశం అభ్యర్థులకు ఓటు ఎందుకు వేయాలి? అని కొంత మంది తెలుగు తమ్ముళ్లు సోషల్ మీడియాలో పోస్టులు పెట్టినా ఓటర్లు పట్టించుకోలేదు. తెలుగుదేశం పార్టీకి 65 శాతం ఓట్లు లభించడమే ఇందుకు నిదర్శనం. ఈ నేపథ్యంలో జగన్‌రెడ్డి క్షేత్ర స్థాయిలో పరిస్థితిని సమీక్షించుకొని తదనుగుణంగా వ్యూహాలు రూపొందించుకోకుండా ప్రభుత్వంపై ప్రజలు తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారని, ఎన్నికలు ఎప్పుడు జరిగినా తానే ముఖ్యమంత్రిని అవుతానని తన చుట్టూ ఉన్నవాళ్లు చెబుతున్న మాటలను నమ్ముతూ ఊహాలోకాల్లో విహరిస్తున్నారు. ప్రతిపక్ష హోదా ఇస్తే తప్ప శాసనసభలో అడుగుపెట్టనని మంకుపట్టు పట్టారు. 1994లో ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి ప్రతిపక్ష హోదా లభించకపోయినా ఆ పార్టీ శాసనసభాపక్షం నాయకుడుగా పి.జనార్దన్‌రెడ్డి అలుపెరుగని పోరాటం చేశారు. నాటి ఆయన పోరాట ఫలితం కూడా 2004లో రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రి అవడానికి ఉపయోగపడింది. ఉమ్మడి రాష్ట్రంలో శాసనసభలో మంచి వక్తలుగా రాణించిన వెంకయ్యనాయుడు, జైపాల్‌రెడ్డి, ఓంకార్, గౌతు లచ్చన్న వంటి వారు ప్రధాన ప్రతిపక్ష నాయకులుగా హోదా పొందినవారు కారు. అంతెందుకు, అవమానాలు తప్పవని తెలిసినా 2019 తర్వాత చంద్రబాబు నాయుడు శాసనసభలో పోరాటం చేయలేదా? తనను తాను వీరుడుగా శూరుడుగా చెప్పుకొనే జగన్‌రెడ్డి శాసనసభను ఎదుర్కోవడానికి ఎందుకు వెనుకాడుతున్నారో తెలియదు. సింగడు అద్దంకి వెళ్లనూ వెళ్లాడు, రానూ వచ్చాడు అన్నట్టుగా గవర్నర్ ప్రసంగం రోజు మాత్రం కొద్ది నిమిషాల పాటు సభకు హాజరై ఆ తర్వాత ముఖం చాటేశారు. తెలంగాణలో తనకు గురుతుల్యుడైన కేసీఆర్ కూడా ఇప్పుడు శాసనసభకు హాజరు కావాలని నిర్ణయించుకున్నారు. ప్రభుత్వాలను నిలదీయడానికి ప్రతిపక్షంలో ఉన్న వారికి శాసనసభను మించిన వేదిక మరొకటి ఉండదు. తానెవరికీ తలవొంచనని చెప్పుకోవాలనే దుగ్ధ జగన్మోహన్‌రెడ్డిలో అధికంగా ఉంది. అందుకే శాసనసభకు వెళ్లి చంద్రబాబు ముఖం చూడ్డం ఆయన నామోషీగా భావిస్తున్నారేమో తెలియదు. నాయకులు ఎవరైనా తమ ఓటమికి కారణాలను గుర్తించి తనను తాను సంస్కరించుకున్నానని ప్రజలకు నమ్మకం కలిగించగలిగినప్పుడే భవిష్యత్తు ఉంటుంది. చంద్రబాబు కూడా 2019లో ఓడిపోయాక తాను మారతానని ప్రకటించి కార్యకర్తల్లో భరోసా నింపే ప్రయత్నం చేశారు. అసలు తాను ఓడిపోయానని కూడా అంగీకరించడానికి సిద్ధంగా లేని జగన్‌రెడ్డి తనను తాను సంస్కరించుకొనే ప్రయత్నం చేస్తారని ఆశించడం కూడా అత్యాశే అవుతుంది. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌పై ఆయన అనవసరంగా నోరు పారేసుకుంటున్నారు. తాజాగా విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ, పవన్ కల్యాణ్ కార్పొరేటర్‌కు ఎక్కువ–ఎమ్మెల్యేకు తక్కువ అని కించపరిచారు. ఇప్పుడు ఆయనను అవమానించడం అవసరమా? అంటే జగన్‌కు ఎవరు చెప్పాలి? ఒక్కోసారి మన కళ్లే మనల్ని మోసం చేస్తాయని అంటారు. జగన్‌రెడ్డి కూడా తన చుట్టూ ఉన్న వాళ్లు తనకు నిజం చెబుతున్నారా? లేదా? తాను కళ్లు చెవులుగా భావించే రోత మీడియా తనను సరైన మార్గంలో నడిపిస్తున్నదా? లేక తప్పుదారి పట్టిస్తున్నదా? అన్నది స్థిమితంగా ఆలోచించుకోవడం మంచిది. పవన్ కల్యాణ్‌ను అవమానించడం అంటే కూటమి ఐక్యతను పటిష్ఠం చేయడమే అన్న చిన్న లాజిక్‌ను కూడా జగన్‌రెడ్డి విస్మరిస్తే ఎలా? నేను ఇంద్రుడిని, చంద్రుడిని అని జగన్‌రెడ్డి భావిస్తారు. ఆయన చుట్టూ ఉండే వాళ్లు కూడా, 'అన్నా నువ్వు పులివి, సింహానివి' అని రెచ్చగొడతారు. అలాంటి వారికి నిజాలు కనిపించవు. మంచి మాటలు చెవికెక్కవు. ప్రస్తుతానికి జగన్‌రెడ్డి పరిస్థితి గాల్లో దీపంలా ఉంది. ఆ దీపం ఎంత కాలం వెలుగుతుందో వేచి చూద్దాం!

> కాంగ్రెస్ పార్టీలో ప్రస్తుతం ఎవరికి వారే యమునా తీరే అన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వపరమైన, విధానపరమైన విషయాలను కూడా ముఖ్యమంత్రికంటే ముందుగా మంత్రులు, ఇతరులు ప్రకటిస్తున్నారు. దీంతో ప్రభుత్వ రథసారథి ఎవరన్న ప్రశ్న సహజంగానే తలెత్తుతోంది. ఈ కారణంగా కాంగ్రెస్ పార్టీ బలహీనపడుతోందన్న అభిప్రాయం బలపడుతోంది. ఇప్పుడు తనతో ఉన్న ఎమ్మెల్యేలు కూటమి వైపు చూడకుండా రేవంత్‌రెడ్డి ఎంతవరకు కట్టడి చేస్తారో తెలియదు. మరోవైపు గత ఎన్నికల తర్వాత కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలలో కొందరు పునరాలోచనలో పడ్డారు. ఈ పరిణామం కాంగ్రెస్ పార్టీకి ఇబ్బందికరంగా పరిణమించింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ విషమ పరీక్షను ఎదుర్కొని ప్రభుత్వాన్ని, పార్టీని ఎలా కాపాడుకుంటారో?

యూట్యూబ్‌లో 'కొత్త పలుకు' కోసం QR Code scan చేయండి

సమాఖ్య పాలనకు పునర్విభజన సవాళ్లు

> ఒకవైపు అధికరణలు 81, 82 ప్రకారం నియోజకవర్గాల పునర్విభజన, ఆయా రాష్ట్రాల సీట్ల సంఖ్య పునర్ నిర్ధారణకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉండడమూ, మరోవైపు జనాభా ప్రాతిపదికన పునర్విభజన, పునర్ నిర్ధారణకు దక్షిణాది రాష్ట్రాలు ససేమిరా అనడం కొనసాగిన పక్షంలో కేంద్రం, దక్షిణాది రాష్ట్రాల మధ్య విభేదాలు తీవ్రమవుతాయి. వాటి పర్యవసానాలు మన సమాఖ్య వ్యవస్థకు చాలా ప్రమాదకరంగా పరిణమిస్తాయి. ఈ సమస్యను సామరస్యపూర్వకంగా పరిష్కరించుకోగల విజ్ఞతా వివేకాలు మనకు ఉన్నాయా?



లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన, 1977లో రాజ్యాంగానికి 42వ సవరణ జరిగిన నాటి నుంచి, రాష్ట్రాల మెడపై ఒక కత్తిలా వేలాడుతోంది. రాజ్యాంగ అధికరణలు 81, 82 తేటతెల్లమైన భాషలో సుబోధకంగా ఉన్నాయి: 'ఒక పౌరుడు, ఒక ఓటు' అనే సూత్రాన్ని అవి చేర్చుకున్నాయి. లోక్‌సభ సభ్యుల సంఖ్య వివిధ రాష్ట్రాల నుంచి ప్రత్యక్ష ఎన్నిక విధానం ద్వారా ఎన్నికయ్యే సభ్యులు 530కి మించకూడదని, కేంద్ర పాలిత ప్రాంతాలు ఎన్నుకునే వారి సంఖ్య 20కి మించకూడదనే పరిమితులను రాజ్యాంగ అధికరణ నిర్దేశించింది. లోక్‌సభలో ప్రస్తుతం రాష్ట్రాల నుంచి ఎన్నికైన ప్రతినిధులు 530 మంది, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి ఎన్నికైనవారు 13 మంది ఉన్నారు. అధికరణ 81లోని నిబంధన 2(ఎ) ఇలా ఉంది: 'ప్రతి రాష్ట్రం నుండి లోక్‌సభకు ఎంతమంది ఎన్నిక కావాలనే విషయం ఆ రాష్ట్ర జనాభాపై ఆధారపడి ఉంటుంది. జనాభాకు, లోక్‌సభ సభ్యుల సంఖ్యకు గల నిష్పత్తి సాధ్యమైనంతవరకు అన్ని రాష్ట్రాలకు ఒకే విధంగా ఉండాలి'. ఈ అధికరణానికి సంబంధించి 'జనాభా' అంటే ఆఖరుసారిగా జనాభా లెక్కలు జరిగి, అధికారికంగా ప్రకటించబడిన జనాభా అని అర్థం.

అధికరణ 81 ప్రకారం ప్రతి జనాభా గణన అనంతరం ఒక రాష్ట్రానికి కేటాయించే సీట్ల సంఖ్యను పునర్ నిర్ధారించవలసి ఉన్నది. అయితే ఈ ప్రక్రియకు 2026 సంవత్సరం దాకా విరామం పాటించాలి. ఈ కారణంగా వివిధ రాష్ట్రాలకు కేటాయించిన సీట్ల సంఖ్యను 1971 జనాభా గణన ననుసరించి నిర్ధారించిన రీతిలో స్తంభింపచేశారు. ఇది 'ఒక పౌరుడు, ఒక ఓటు' అనే సూత్రాన్ని ఉల్లంఘించడమే.

'ఒక పౌరుడు, ఒక ఓటు' అనేది ప్రజాస్వామ్య మౌలిక సూత్రం అనడంలో సందేహం లేదు. అయితే 1776లోనే అమెరికన్లు గ్రహించినట్లుగా అది సమాఖ్య సూత్రానికి విరుద్ధమైనది. ఈ వైరుధ్యానికి వారు ఒక పరిష్కారాన్ని కనుగొన్నారు. అది గత 250 సంవత్సరాలుగా వారికి బాగా ప్రయోజనకరంగా ఉన్నది.

వారు నిర్దిష్ట కాల వ్యవధుల్లో మొత్తం 50 రాష్ట్రాల్లో ప్రతి రాష్ట్రానికి కాంగ్రెస్ దిగువ సభ ప్రతినిధుల సభలో కేటాయించే సీట్ల సంఖ్యను ఆ రాష్ట్ర జనాభా సంఖ్య ప్రాతిపదికన పునర్ నిర్ధారిస్తూ వస్తున్నారు. అయితే ఎగువసభ సెనేట్‌లో ప్రతి రాష్ట్రానికి సమాన ప్రాతినిధ్యం (ఇద్దరు సభ్యుల చొప్పున) కల్పిస్తున్నారు. అమెరికా వలే భారత్ కూడా ప్రజాస్వామ్య వ్యవస్థ, సమాఖ్య రాజ్యం. 1971లోని జనాభా నిష్పత్తి ప్రకారం ప్రాతినిధ్యం కల్పించడం వల్ల ఊహించని ప్రమాదాలు ఎదురవుతాయనే వాస్తవాన్ని గుర్తించాము. అయితే ఒక పరిష్కారాన్ని కనుగొన డానికి బదులు దాన్ని 2026 దాకా వాయిదా వేశాము. చివరి జనాభా గణన 2011లో జరిగింది. తదుపరి జనాభా గణన 2021లో జరగవలసి ఉండగా కోవిడ్ విలయం వల్ల వాయిదా వేశారు. 2021 నుంచి ఏదో ఒక సాకుతో జనాభా గణన జరగనే లేదు. 2026లో జనాభా గణన అనంతరం విధిగా లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన జరగవలసి ఉన్నది. ప్రతి రాష్ట్రానికి కేటాయించే సీట్ల సంఖ్యను కూడా నిర్ణయిస్తారు. జనాభా పెరుగుదల అదుపులేకుండా జరిగినందుకు కొన్ని రాష్ట్రాలకు ప్రయోజనాలు కల్పిస్తారు. సంపూర్ణ ప్రజనన రేటు 2 శాతం, అంతకంటే తక్కువగా ఉండాలన్న నిర్దేశిత లక్ష్యాన్ని సాధించిన రాష్ట్రాలను సీట్ల కుదింపుతో శిక్షించనున్నారు.

పునర్విభజన, సీట్ల పునర్ నిర్ధారణతో దక్షిణాది రాష్ట్రాలు అమితంగా నష్టపోతాయి. వాటి మొత్తం సీట్ల సంఖ్య 129 నుంచి 103కు తగ్గిపోనున్నది. జనాభా నిష్పత్తి సూత్రానికి అనుగుణంగా రాష్ట్రాలకు సీట్ల సంఖ్యను పునర్ నిర్ధారించడమంటే జననాల రేటును తగ్గించి జనాభా పెరుగుదలను నియంత్రించిన రాష్ట్రాలను 'శిక్షించడమే' అవుతుంది. జనాభా నియంత్రణ అనేది గత అర్ధ శతాబ్దిగా, ఇప్పటికీ కూడా, మన జాతీయ లక్ష్యంగా ఉందన్న విషయాన్ని విస్మరించకూడదు. ఇప్పుడు లోక్‌సభలో 129 స్థానాలున్నా దక్షిణాది రాష్ట్రాల వాణి పెద్దగా విన్పించడం లేదు. మరి ఆ సీట్ల సంఖ్య మరింతగా తగ్గితే దక్షిణాది ప్రతినిధుల మాటను కేంద్రం శ్రద్ధగా పట్టించుకుంటుందా? దక్షిణాది రాష్ట్రాల సీట్ల సంఖ్య తగ్గించబోమనే హామీ నిరర్థకమైనది. జనాభా అత్యధికంగా ఉన్న యూపీ, బిహార్, రాజస్థాన్, మధ్యప్రదేశ్‌ల సీట్ల సంఖ్యను పెంచబోమని కేంద్రం హామీ ఇవ్వకపోవడం గమనార్హం. సీట్ల సంఖ్య పునర్ నిర్ధారణకు జనాభా నిష్పత్తి సూత్రాన్ని అనుసరించిన పక్షంలో దక్షిణాది రాష్ట్రాల బలం మరింతగా తగ్గిపోతుంది. పర్యవసానంగా వాటి సమస్యల పరిష్కారం పట్ల ఉపేక్ష మరింతగా పెరుగుతుంది. సీట్ల సంఖ్య పునర్ నిర్ధారణలో కొన్ని రాష్ట్రాలకు సీట్ల సంఖ్యను కుదించకపోవడమూ, కొన్ని రాష్ట్రాల సీట్ల సంఖ్యను పెంచడమూ జరగాలంటే లోక్‌సభకు ఎన్నికయ్యే ప్రతినిధుల సంఖ్యను విధిగా పెంచవలసి ఉంటుంది. బహుశా దీన్ని దృష్టిలో ఉంచుకునే కాబోలు లోక్‌సభ కొత్త భవనాన్ని 888 మంది సభ్యులకు సరిపోయే విధంగా రూపకల్పన చేసి నిర్మించారు. ఇది ఒక విధంగా 'ఒక పౌరుడు, ఒక ఓటు' సూత్రానికి కట్టుబడి ఉన్నందుకు చెల్లిస్తున్న భారీ మూల్యం. అలాగే జననాల రేటును తగ్గించి, జనాభా పెరుగుదలను నియంత్రించిన రాష్ట్రాలకు లోక్‌సభలో సీట్ల సంఖ్యను తగ్గించడం కూడా ఎంతమాత్రం అంగీకారయోగ్యం కాదు.

జననాల రేట్లు తక్కువగా ఉన్న రాష్ట్రాలు లోక్‌సభలో ప్రభావశీలత పరంగా నష్టపోతాయి; జననాల రేట్లు ఎక్కువగా ఉన్న రాష్ట్రాలు లబ్ధి పొందుతాయి. ఒకవైపు అధికరణలు 81, 82 ప్రకారం నియోజకవర్గాల పునర్విభజన, ఆయా రాష్ట్రాల సీట్ల సంఖ్య పునర్ నిర్ధారణకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉండడమూ, మరోవైపు జనాభా ప్రాతిపదికన పునర్విభజన, పునర్ నిర్ధారణకు దక్షిణాది రాష్ట్రాలు ససేమిరా అనడం కొనసాగిన పక్షంలో కేంద్రం, దక్షిణాది రాష్ట్రాల మధ్య విభేదాలు తీవ్రమవుతాయి. వాటి పర్యవసానాలు మన సమాఖ్య వ్యవస్థకు చాలా ప్రమాదకరంగా పరిణమిస్తాయి. ఈ సమస్యను సామరస్యపూర్వకంగా పరిష్కరించుకోగల విజ్ఞతా వివేకాలు మనకు ఉన్నాయా?



• పి. చిదంబరం
కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు

రంజాన్ వేళలు

ఇఫ్తార్: 6:30 (ఆదివారం సాయంత్రం)

సహర్: 5:06 (సోమవారం ఉదయం)





బెలూన్లు ఎగరేసి రన్‌ను ప్రారంభిస్తున్న మంత్రి సీతక్క, సీపీ సీవీ ఆనంద్

డ్రగ్స్ నిర్మూలనకు కృషి చేయండి

5కే, 2కే రన్‌లో మహిళలతో ప్రతిజ్ఞ చేయించిన మంత్రి సీతక్క

హైదరాబాద్ సిటీ/ఖైరతాబాద్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మహిళల భద్రతకు, భరోసా కల్పించడంలో పోలీసులు చేస్తున్న కృషి అభినందనీయమని మంత్రి సీతక్క అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా నెక్లెస్ రోడ్డు పీపుల్స్ ప్లాజా సమీపంలో ఐదువేల మంది మహిళలతో శనివారం నిర్వహించిన 5కే, 2కే రన్‌ను సీపీ సీవీ ఆనంద్‌తో కలిసి జెండా ఊపి మంత్రి ప్రారంభించారు. మాదకద్రవ్యాల నిర్మూలనకు పోలీసులతోపాటు మహిళలు తమవంతు కృషిచేయాలని పిలుపునిచ్చి వారితో ప్రతిజ్ఞ చేయించారు. మహిళా దినోత్సవం సందర్భంగా నలుగురు మహిళా ఇన్‌స్పెక్టర్‌లకు లా అండ్ ఆర్డర్ పోలీస్ స్టేషన్‌లలో ఎస్‌హెచ్‌వోలుగా అవకాశం కల్పించామని సీపీ తెలిపారు. రన్ విజేతలకు బహుమతులు అందజేశారు. పోలీసు అధికారులు పాల్గొన్నారు.

పరేడ్ గ్రౌండ్‌లో మహిళల సందడి

ఇందిరా మహిళా శక్తి సభకు వచ్చిన మహిళలతో సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్ సందడిగా మారింది. తెలంగాణ సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, ఏర్పాటు చేసిన స్టాళ్లు ఆకట్టుకున్నాయి. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు హరిహర కళాభవన్ ఈస్ట్ గేట్ నుంచి సభా ప్రాంగణంలోకి వచ్చి తిరిగి అదే మార్గంలో వెళ్లిపోయారు. ప్రాంగణంలో ఎల్‌ఈడీలు స్క్రీన్లు, మెడికల్ క్యాంప్‌లు, మంచినీటి కేంద్రాలు ఏర్పాటు చేశారు.



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఆయన చిత్రపటం అందజేస్తున్న మహిళలు

ఆకట్టుకున్న 'ఇందిరా మహిళా శక్తి' స్టాల్స్ 7



మెట్రో రైల్‌లో గుండెను తరలిస్తున్న వైద్యులు

'మెట్రో'లో గుండె తరలింపు

- రెండు రోజుల్లో రెండు ఆస్పత్రుల నుంచి
- ఇద్దరి ప్రాణాలు కాపాడిన వైద్యులు

హైదరాబాద్ సిటీ, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మెట్రో గ్రీన్‌చానల్ ద్వారా రెండు రోజుల్లో రెండు ఆస్పత్రుల నుంచి గుండెను తరలించి ఇద్దరి ప్రాణాలు కాపాడారు వైద్యులు. శుక్రవారం రాత్రి ఎల్‌బీనగర్‌లోని కామినేని ఆస్పత్రిలో ఓ దాత నుంచి సేకరించిన గుండెను మెట్రో రైలులో సికింద్రాబాద్ కిమ్స్ ఆస్పత్రికి తరలించి ఓ ప్రాణం కాపాడారు. శనివారం ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఓ రోగికి అత్యవసరంగా గుండె మార్పిడి చేయాల్సిన పరిస్థితుల్లో అపోలో ఆస్పత్రి, జీవన్‌దాన్‌తో కలిసి దాత నుంచి సేకరించిన గుండెను నాగోల్ నుంచి జూబ్లీహిల్స్ వరకు మెట్రోరైల్‌లో తరలించి మరో ప్రాణాన్ని కాపాడారు. గుండె తరలింపు కోసం మెట్రో రైలు గ్రీన్ చానల్ సౌకర్యాన్ని కల్పిస్తుందని ఎల్‌అండ్‌టీ మెట్రో అధికారులు ప్రకటించారు.

నిమ్స్‌లో

- బ్రెయిన్ డెడ్ అయిన యువకుడి అవయవ దానం
- సుమారు ఎనిమిది గంటలపాటు సర్జరీ

గుండె మార్పిడి

రెండు నెలల నుంచి మందులతో జీవనం



కోలుకుంటున్న అనిల్‌కుమార్

హైదరాబాద్ సిటీ, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): ఆ రోగి అరచేతిలో ప్రాణాలు పెట్టుకొని బతుకుతున్నాడు.. ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా మారింది. నిమ్స్ వైద్యులు రెండు నెలల నుంచి అతడి శరీరంలోకి ఔషధాలను పంపిస్తూ బతికించారు. అవయవాల పనితీరు మందగించడంతో గుండె మార్పిడి చేశారు. రంగారెడ్డి జిల్లా కాటేదాన్‌కి చెందిన పూజారి అనిల్‌కుమార్(19) కొన్నేళ్లుగా డైలేటెడ్ కార్డియోమయోపతి (డీసీఎంపీ)తో బాధపడుతున్నాడు. వైద్యుల సూచన మేరకు గుండె దాత కోసం జీవన్‌దాన్‌లో పేరు నమోదు చేసుకున్నాడు. రెండు రోజుల క్రితం ఓ యువకుడు రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. సికింద్రాబాద్‌లోని ఓ కార్పొరేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అతడి పరిస్థితి విషమించడంతో బ్రెయిన్‌డెడ్ అయినట్లు వైద్యులు ప్రకటించారు. జీవన్‌దాన్‌లో పేర్లు నమోదు చేసుకున్న వారిని పరిశీలించడంతో అనిల్‌కుమార్ రక్త నమూనాలు సరిపోయాయి. బ్రెయిన్ డెడ్ అయిన యువకుడి గుండెను అతడికి అమర్చేందుకు థొరాసిక్ హెచ్‌వోడీ అమరేశ్వరరావు, డాక్టర్లు గోపాల్, కళాధర్, అనస్తీషియా డాక్టర్ నర్మద, వైద్య బృందంతో గుండె మార్పిడి శస్త్ర చికిత్స విజయవంతంగా నిర్వహించారు. శుక్రవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు సర్జరీ చేశారు. సర్జరీలో 40 మందికిపైగా వైద్య బృందం పాల్గొంది. రోగి పూర్తిగా కోలుకోవడానికి వారం, పది రోజులు పడుతుందని, అన్ని పరీక్షలు చేసిన తర్వాత డిశ్చార్జి చేస్తామని డాక్టర్ అమరేశ్వర్ తెలిపారు. ఈ తరహా గుండె మార్పిడి చికిత్సకు కార్పొరేట్ ఆస్పత్రిలో దాదాపు రూ.40 లక్షలు ఖర్చవుతుందని, నిమ్స్‌లో రోగికి ఆరోగ్యశ్రీ, ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఉచితంగా నిర్వహించినట్లు ఆస్పత్రి డైరెక్టర్ నగరి బీరప్ప చెప్పారు. నిమ్స్‌లో ఇప్పటివరకు దాదాపు 15 గుండె మార్పిడి, ఇద్దరికి ఊపిరితిత్తుల మార్పిడి, కంబైన్డ్ హార్ట్ లంగ్ ట్రాన్స్‌ప్లాంటేషన్ చేసినట్లు డైరెక్టర్ చెప్పారు. గత ఏడాది నుంచి ఇప్పటి వరకు 87 అవయవ మార్పిడులు చేశామని తెలిపారు.

అవయవాల సేకరణ, మార్పిడికి కఠిన నిబంధనలు

- మంత్రి దామోదర రాజనర్సింహ

అవయవాల సేకరణ, మార్పిడికి కఠిన నిబంధనలు తీసుకొస్తున్నామని, గాంధీ ఆస్పత్రిలో త్వరలో అధునాతన ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంటేషన్ సెంటర్‌ను అందుబాటులోకి తీసుకొస్తున్నామని మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. మరొకరికి పునర్జన్మను ప్రసాదించే అవయవాలను మట్టిలో వృథాగా కలిసిపోనీయొద్దన్నారు. అవయవదానం ప్రాముఖ్యతను ప్రజలకు వివరించాలని, అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని జీవన్‌దాన్ ఇన్‌చార్జి డాక్టర్ భూషణ్‌రాజుకు మంత్రి సూచించారు. నిమ్స్‌లో విజయవంతంగా యువకుడికి గుండె మార్పిడి చేసిన వైద్యులను మంత్రి అభినందించారు. దాత కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. అవయవమార్పిడి శస్త్రచికిత్స తర్వాత కూడా రోగుల బాగోగులను పర్యవేక్షించాలని, వారికి అవసరమైన వైద్య సేవలను కొనసాగించాలని వైద్యులకు సూచించారు. నిమ్స్‌లో అవయవమార్పిడి సేవలను మరింత విస్తరించాలని, ఇందుకు అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.



విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

విద్యారంగానికి ప్రాధాన్యం

- విద్యార్థులు పోటీతత్వంతో చదవాలి
- మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్ సిటీ, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పోటీతత్వంతో చదివి జీవితంలో ఉన్నతస్థాయికి చేరుకోవాలని, ప్రభుత్వం విద్యారంగానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తుందని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఫలక్‌నుమా సోషల్ వెల్ఫేర్ ఎక్సలెన్స్ రెసిడెన్షియల్ స్కూల్‌ను శనివారం సందర్శించారు. ఎమ్మెల్యే మొహమ్మద్ ముబీన్, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, విద్యార్థినులతో కలిసి కేక్‌కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించేందుకు ప్రభుత్వం పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి సదుపాయాలు కల్పిస్తుందన్నారు. మహిళలు సృష్టికి మూలమని వారిని గౌరవించుకోవాలన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నతస్థాయికి చేరుకోవాలని సూచించారు. కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ.. విద్యను మించిన సంపద లేదన్నారు. విద్యార్థినులతో కలిసి మంత్రి, కలెక్టర్ భోజనం చేశారు. రాష్ట్ర ఫిషరీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్, ప్రిన్సిపాల్ జయంతి, కార్పొరేటర్ తారాబాయి మోతీలాల్, అధ్యాపకులు, మదర్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వినూత్న కారు

- పెళ్లి కూతురు ఆకారంలో తయారీ
- సుధా కార్స్ మ్యూజియంలో ప్రదర్శన

వధువు ఆకారంలో ఉన్న కారు



మదీన, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని బహదూర్‌పురాలోని సుధా కార్స్ మ్యూజియం నిర్వాహకులు వినూత్న కారును తయారు చేశారు. ముస్తాబైన పెళ్లి కూతురు ఆకారంతోపాటు జువెలరీ సెట్, గాజులు, ఉంగరాలు, వడ్డాణం, చెవి కమ్మలతో కూడిన కారును తయారు చేశారు. శనివారం మధ్యాహ్నం మ్యూజియం ఆవరణలో కారును ప్రదర్శించారు. సందర్శకులు ముఖ్యంగా మహిళలు కారును ఆసక్తిగా తిలకించారు. 150 సీసీ ఇంజన్ కెపాసిటీగల ఈ కారు గంటకు 40కి.మీ. వేగంతో నడుస్తుందని, తయారు చేయడానికి నెలరోజులు పట్టిందని వినూత్న కార్ల తయారీదారుడు సుధాకర్ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

తల్లిపై కొడుకు అత్యాచారం

- మహిళా దినోత్సవం రోజే దారుణం
- పోలీసుల అదుపులో నిందితుడు

సైదాబాద్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మానవ విలువలు మంట గలిసిపోతున్నాయి. నవ మాసాలు మోసి కని పెంచిన కన్నతల్లిపైనే అత్యాచారం చేశాడో కుమారుడు. మాదన్నపేటలోని ఓ బస్తీలో నివసిస్తున్న దంపతులు కూలి పనులు చేసుకొని జీవిస్తున్నారు. వీరికి ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు(30) గంజాయికి బానిసై జులాయిగా తిరుగుతున్నాడు. తండ్రికి కూడా బలవంతంగా మద్యం అలవాటు చేశాడు. గత నెల 16న మాదన్నపేటలో బొంద్రాయి పండుగ సందర్భంగా జరిగిన వేడుకలో మద్యం మత్తులో తల్లి(52)పై బలవంతంగా అత్యాచారం చేశాడు. ఈ విషయం ఎవరికైనా చెబితే చంపేస్తానని బెదిరించాడు. అప్పటి నుంచి తల్లిని నిత్యం వేధిస్తున్నాడు. పలుమార్లు దాడిచేసి గాయపర్చాడు. విషయం బయటకు చెబితే పరువుపోతుందని తల్లి ఎవరికీ చెప్పలేదు. శనివారం తెల్లవారు జామున తల్లి గదిలోకి వెళ్లి ఆమెపై అత్యాచారం చేయడానికి యత్నించాడు. ఆమె భయపడి బాత్‌రూమ్‌కు వెళ్లి వస్తానని బయటకు వచ్చి ఇంటి తలుపులు మూసేసింది. చిన్న కొడుకు(22)కు విషయం చెప్పి అతడితో కలిసి మాదన్నపేట పోలీసులకు ఫిర్యాదు చేసింది. నిందితుడిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో బీటెక్ విద్యార్థి మృతి



నాను (ఫైల్)

దుండిగల్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో బీటెక్ విద్యార్థి మృతి చెందాడు. బాచుపల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా, బొప్పన్‌పల్లి గ్రామానికి చెందిన కేతావత్ శంకర్ నాయక్, పార్వతి దంపతుల కుమారుడు కేతావత్ నాను(21) వీఎన్‌ఆర్ విజ్ఞానజ్యోతి కళాశాలలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతూ అదే కళాశాలలో వసతిగృహంలో ఉంటున్నాడు. శనివారం ఉదయం స్నేహితులు కార్తీక్, విశ్వంత్‌తో కలిసి స్కూటీపై బయటకు వెళ్తున్నారు. కార్తీక్, కేతావత్ వెనుక కూర్చోగా విశ్వంత్ స్కూటీ నడుపుతున్నాడు. వసతి గృహం గేటు దాటి బాచుపల్లి రహదారిపై కొంత దూరం వెళ్లగానే వెనుక నుంచి వేగంగా వచ్చిన గుర్తుతెలియని వాహనం స్కూటీని ఢీకొట్టింది. కిందపడిపోయిన నానుకు తీవ్రమైన గాయాలవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మిగతా ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. బాచుపల్లి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



రంగారెడ్డి జిల్లా కోర్టులో జరిగిన జాతీయ లోక్‌అదాలత్‌లో ప్రధాన న్యాయమూర్తి శశిధర్‌రెడ్డి తదితరులు

రాజీయే రాజమార్గం

- జిల్లా కోర్టుల్లో 1.80 లక్షలు, హయత్‌నగర్ కోర్టులో 3,946 కేసుల పరిష్కారం

రంగారెడ్డి జిల్లా కోర్టులు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): రాజీయే రాజ మార్గమని రంగారెడ్డి జిల్లా కోర్టుల ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ శశిధర్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని కోర్టుల ప్రాంగణాలలో శనివారం జాతీయ లోక్ అదాలత్‌లు నిర్వహించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శ్రీదేవి మాట్లాడుతూ రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా అన్ని కోర్టుల ప్రాంగణాలలో 30 లోక్ అదాలత్ బెంచీలు ఏర్పాటు చేశామన్నారు. సుమారు 1.80 లక్షల పై చిలుకు కేసులు పరిష్కారం అయ్యాయని, రూ. 11,30,53,561ల నష్టపరిహారాన్ని కక్షిదారులకు ఇప్పించామన్నారు. మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి పట్టాభిరామారావు, జిల్లా కోర్టు మేజిస్ట్రేట్ రామలింగం పాల్గొన్నారు.

హయత్‌నగర్: 14వ మెట్రోపాలిటన్ కోర్టులో 3,946 కేసుల్లో కక్షిదారులు రాజీ కుదుర్చుకున్నారు. చిన్నచిన్న తగాదాలకు కేసులు పెట్టుకుని సమయాన్ని వృథా చేయవద్దని హయత్‌నగర్ కోర్టు మేజిస్ట్రేట్ సల్మా ఫాతిమా సూచించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు భిక్షపతిగౌడ్, జనరల్ సెక్రటరీ సంతోష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

హామీ అమలేదీ?

- మెట్రో కోచ్‌లు పెంచుతామని రెండేళ్ల క్రితం ప్రకటన
- ఇప్పటి వరకూ అడుగు ముందుకు పడని పరిస్థితి
- ఎండల తీవ్రతతో రైళ్లలో పెరిగిన రద్దీ
- పీక్ అవర్స్‌లో ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు



హైదరాబాద్ సిటీ, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): నగర రవాణాలో అతికీలకమైన మెట్రో కోచ్‌ల పెంపుపై ప్రయాణికులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఎండలు మండుతుండడంతో అదనపు బోగీలను త్వరగా తీసుకురావాలని ఎల్‌అండ్‌టీ అధికారులను కోరుతున్నారు. పీక్ అవర్స్‌లో పెరుగుతున్న ప్రయాణికులతో ఊపిరాడని పరిస్థితి నెలకొంటుందని, ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు. వేసవికాలం నేపథ్యంలో మెట్రో రైళ్లు కిటకిటలాడుతున్నాయి. వారం రోజుల నుంచి ప్రయాణికుల సంఖ్య 4.90-5.10 లక్షలకు చేరినట్లు మెట్రోవర్గాలు వెల్లడిస్తున్నాయి. బోగీలు రద్దీగా కనిపిస్తున్నాయి. ఉదయం, సాయంత్రం వేళల్లో ఉద్యోగులు, విద్యార్థులతోపాటు సాధారణ ప్రజలు పెద్ద ఎత్తున ప్రయాణిస్తుండడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. పెరుగుతున్న రద్దీని దృష్టిలో ఉంచుకుని అదనపు బోగీలు పెంచుతామని రెండేళ్ల క్రితం హామీ ఇచ్చిన ఎల్‌అండ్‌టీ, మెట్రో అధికారులు ఇప్పటి వరకు ఆ విషయాన్ని పట్టించుకోకపోవడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు.

ప్రకటన చేసి నాలుగు నెలలైనా..

ప్రయాణికుల సంఖ్య రోజురోజుకు పెరుగుతుండడంతో 4 నుంచి 7 కొత్త రైళ్లను (మూడు కోచ్‌లతో) తీసుకొస్తామని గతేడాది నవంబరు 28న అమీర్‌పేట్ మెట్రో స్టేషన్‌లో జరిగిన వార్షికోత్సవంలో ఎల్‌అండ్‌టీ అధికారులు ప్రకటించారు. నాగ్‌పూర్, పుణె నుంచి బోగీలను తీసుకొచ్చేందుకు రెండేళ్లుగా ప్రయత్నిస్తున్నామని, అక్కడ రద్దీ ఉండడంతో లీజుకు ఇచ్చేందుకు ఆసక్తి చూపడం లేదన్నారు. బెంగళూరులోని భారత్ ఎర్త్ మూవర్స్ లిమిటెడ్ (బీఈఎంఎల్)తో సంప్రదింపులు చేస్తున్నామని, ఏడాదిలోపు కొత్త రైళ్లను తీసుకొచ్చి ప్రయాణికులకు అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

కోచ్‌ల్లో కాలుపెట్టలేని పరిస్థితి

ఎల్‌బీనగర్-మియాపూర్, జేబీఎస్-ఎంజీబీఎస్, నాగోలు-రాయదుర్గం కారిడార్ల పరిధుల్లోని 57 స్టేషన్ల మీదుగా రోజుకు 1028 సర్వీసులను నడిపిస్తున్నారు. రోజుకు దాదాపు 4.60 లక్షల నుంచి 4.80 లక్షల మందికిపైగా రాకపోకలు సాగిస్తున్నారు. శని, ఆదివారాలతోపాటు సెలవు రోజుల్లో మెట్రోలో ప్రయాణించే వారి సంఖ్య 5 లక్షలకు చేరుకుంటుంది. ఉదయం 8 నుంచి 11.30 గంటల వరకు, సాయంత్రం 5 నుంచి 9 గంటల వరకు కోచ్‌ల్లో కాలుపెట్టే అవకాశం ఉండడం లేదు. దీంతో ప్రస్తుతం నడుస్తున్న 57 రైళ్లలో ఉన్న 171 కోచ్‌లకు అదనంగా మరో 40 నుంచి 50 కోచ్‌లను తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటామని, నాగ్‌పూర్ నుంచి తీసుకొస్తామని మెట్రో, ఎల్‌అండ్‌టీ అధికారులు గతంలో ప్రకటించినా నేటికీ అమలుకు నోచుకోలేదు.

జంట హత్యల కేసు..

దర్యాప్తు ముమ్మరం

- పోలీసుల అదుపులో నిందితురాలు
- ఆమె ప్రియుడి కోసం ఉత్తరప్రదేశ్‌కు ప్రత్యేక బృందం



నిందితుడు అరవింద్

అడ్డగుట్ట/జవహర్‌నగర్/హైదరాబాద్ సిటీ, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): లాలాగూడ, జవహర్‌నగర్ పోలీస్ స్టేషన్ల పరిధుల్లో జంట హత్యల కేసులో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. నిందితురాలిని అదుపులోకి తీసుకున్నారు. లాలాగూడకు చెందిన సుశీల (65)కు ముగ్గురు కుమార్తెలు, కొడుకు. పెద్ద కుమార్తె జ్ఞానేశ్వరి(45)కి బుద్ధి మాంద్యం. నలుగురికీ వివాహం కాలేదు. సుశీల భర్త రైల్వేలో పనిచేస్తూ అనారోగ్యంతో మరణించాడు. కారుణ్య నియామకం కింద తండ్రి ఉద్యోగాన్ని రెండో కుమార్తె లక్ష్మికి ఇచ్చారు. కొడుకు ఉన్నత చదువులు చదివి అమెరికాలో ఉద్యోగం చేస్తున్నాడు. ఇటీవల జవహర్‌నగర్‌లో ఇల్లు కట్టుకున్న సుశీల మూడో కుమార్తె ఉమామహేశ్వరితో కలిసి అక్కడే ఉంటోంది. లక్ష్మి లాలాగూడలోని రైల్వే క్వార్టర్స్‌లో జ్ఞానేశ్వరితో కలిసి ఉంటోంది. లక్ష్మికి తాను పనిచేస్తున్న రైల్వే వర్క్‌షాపులో ఉత్తరప్రదేశ్‌కు చెందిన అరవింద్‌తో పరిచయం ఏర్పడడంతో అతడు తరచూ ఇంటికి రావడాన్ని గుర్తించిన జ్ఞానేశ్వరి విషయాన్ని తల్లి సుశీల, చెల్లెలు ఉమామహేశ్వరికి చెప్పింది. లక్ష్మిని పలుమార్లు హెచ్చరించింది. అయినా పద్ధతి మార్చుకోలేదు. ప్రియుడితో కలిసి ఉండటానికి అక్క జ్ఞానేశ్వరి అడ్డుగా ఉందని కక్ష పెంచుకున్న లక్ష్మి.. ఈ నెల 3న అరవింద్‌తో కలిసి అక్కను హత్య చేసి సంపులో పడేసింది. 6వ తేదీ సాయంత్రం జవహర్‌నగర్ వెళ్లిన అతడు సుశీలతో గొడవపడ్డాడు. ఆమెను హతమార్చి మెడలో ఉన్న మూడున్నర తులాల బంగారు నగలు తీసుకొని పారిపోయాడు. విషయం తెలుసుకున్న ఉమామహేశ్వరి పోలీసులకు సమాచారం ఇచ్చింది. సీసీటీవీ ఫుటేజీలు పరిశీలించి పారిపోయిన వ్యక్తిని అరవింద్‌గా గుర్తించారు. తల్లి మృతి చెందిన విషయం తెలిసినా లక్ష్మి స్పందించకపోవడంతో పోలీసులు లాలాగూడ వెళ్లి ఆమెను ప్రశ్నించగా.. అక్క జ్ఞానేశ్వరిని హతమార్చినట్లు చెప్పడంతో ఆమెను అదుపులోకి తీసుకున్నారు. అరవింద్ కోసం ప్రత్యేక బృందం ఉత్తరప్రదేశ్ వెళ్లింది.

మత్స్య సంపదలో రెండో స్థానం: కేంద్ర మత్స్యశాఖ మంత్రి

శంషాబాద్ రూరల్, మార్చి 8(ఆంధ్రజ్యోతి): మత్స్య సంపదలో దేశం


ఎన్ఎఫ్‌డీపీ మొబైల్ యాప్‌ను ప్రారంభిస్తున్న మంత్రి రాజీవ్ రంజన్‌సింగ్

రెండో స్థానంలో ఉందని కేంద్ర మత్స్యశాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ అన్నారు. శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలోని నోవాటెల్ హోటల్‌లో శనివారం వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన ప్రతినిధులతో ఫిషర్స్ కాంక్లేవ్ నిర్వహించారు. మరో కేంద్ర మంత్రి ఎస్పీ సింగ్ బగేల్‌తో కలిసి ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో రాజీవ్ రంజన్ సింగ్ మాట్లాడుతూ ప్రపంచంలోనే ఫిష్ మార్కెట్‌కు అత్యంత డిమాండ్ ఉందన్నారు. అందుకోసమే ప్రధాని మోదీ మత్స్య సంపద పెంపునకు విశేషంగా కృషి చేస్తున్నారన్నారు. మత్స్య సంపద పెరిగితే లక్షలాది మందికి ఉపాధి దొరకుతుందన్నారు. ప్రధాన మంత్రి కిసాన్ సంవృద్ధి సహ యోజన స్కీమ్ కింద మత్స్య కార్మికులను ఆర్థిక వనరులు సమకూర్చుతున్నట్లు తెలిపారు. చిన్న పరిశ్రమల ఏర్పాటుకు మత్స్యరైతులకు ప్రభుత్వం 40 శాతం సబ్సిడీ ఇస్తోందని చెప్పారు. నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోని మత్స్య సంపదను పెంచుకోవాలని సూచించారు.

హైడ్రా పేరుతో పేదలను భయభ్రాంతులకు గురిచేయడం తగదు

జీడిమెట్ల, మార్చి8 (ఆంధ్రజ్యోతి): హైడ్రా పేరుతో పేదలను భయభ్రాంతులకు గురిచేయడం తగదని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. వేల ఎకరాల ప్రభుత్వ భూములు కబ్జాచేస్తున్న వారిని వదిలేస్తున్న ప్రభుత్వం హిందూ ఆలయాలకు నోటీసులు జారీ చేయడం అన్యాయమన్నారు. అక్రమ నిర్మాణాల పేరుతో హిందూ జోలికి వెళితే సహించేది లేదని ఆయన అన్నారు. శనివారం జగద్గిరి గుట్టలోని వెంకటేశ్వరస్వామి ఆలయం సమీపంలోని వైశ్యభవన్‌లో నిర్వహించిన సమావేశానికి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్

ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఇష్టానుసారంగా వ్యవహరిస్తామంటే చూస్తు ఊరుకోబోమన్నారు. మూసీ ప్రక్షాళన పేరుతో పేదలను తరిమేసి మల్టీప్లెక్స్‌లు నిర్మించాలని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని ఆరోపించారు. జీడిమెట్ల పరిశ్రమల నుంచి వస్తున్న వ్యర్థ రసాయనాలను అరికట్టడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. పేదలకు అడ్డాగా జగద్గిరిగుట్టలో బీజేపీ పేదలకు అండగా ఉంటుందన్నారు. ఆలయ కాంపౌండ్‌లను కూల్చివేసే ఆలోచనను మానుకోవాలని అన్నారు. కార్యక్రమంలో వేణుగోపాల్‌రెడ్డి, గిరివర్ధన్‌రెడ్డి, శేఖర్ యాదవ్, పొన్నారెడ్డి, సురేష్‌రెడ్డి, ఆలయాల నిర్వాహకులు పాల్గొన్నారు.


నూతన ల్యాబ్ ప్రారంభ కార్యక్రమంలో డాక్టర్ వందన హెగ్డేతోపాటు వైద్యులు, సిబ్బంది

నూతన టెక్నాలజీ ల్యాబ్‌ను ప్రారంభించిన హెగ్డే ఫర్టిలిటీ

హైదరాబాద్ సిటీ, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): పిల్లల కోసం ఎదురు చూస్తున్న దంపతులకు పరిష్కారం చూపేందుకు హెగ్డే ఫర్టిలిటీ ఆస్పత్రి కొత్తగా రీజనరేటివ్ మెడిసిన్ అండ్ రీప్రొడక్టివ్ ఇమ్యునోలాజిక్స్ విభాగాన్ని ప్రారంభించింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా తమ ఆస్పత్రిలో ఫర్టిలిటీ రంగంలో కొత్త సాంకేతికను అందుబాటులోకి తీసుకువచ్చామని చీఫ్ ఐవీఎఫ్ కన్సల్ట్, హెగ్డే ఫర్టిలిటీ క్లినికల్ డైరెక్టర్ డ్వార్ వందన హెగ్డే తెలిపారు. కొత్తగా అందుబాటులోకి వచ్చిన సాంకేతికత ద్వారా తక్కువ స్పెర్మ్ కౌంట్, ఆజూస్మామియా, ఓవరీన్ ఫెయిల్యూర్, లో ఏఎంహెచ్ వంటి సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. కొత్త టెక్నాలజీని అందుబాటులోకి తీసుకొని రావడం ద్వారా ఫర్టిలిటీ రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చి, పిల్లలు లేని జంటల సమస్య తీర్చుతామని వందన హెగ్డే తెలిపారు.


ఎలక్ట్రిక్ ఈ- విటారా కారును ఆవిష్కరిస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీలతాశోభన్‌రెడ్డి, పక్కన మారుతి సుజికి షోరూం నిర్వాహకులు

మారుతీ సుజుకి షోరూమ్‌లో

ఎలక్ట్రిక్ ఈ-విటారా కారు ఆవిష్కరణ

హైదరాబాద్ సిటీ, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ సైనిక్‌పురిలోని మారుతి సుజుకి కారు డీలక్స్ షోరూమ్‌లో శనివారం మారుతి సుజుకి మొదటి ఎలక్ట్రిక్ ఈ-విటారా కారును జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతాశోభన్‌రెడ్డి ఆవిష్కరించారు. వరుణ్ గ్రూప్ ఏపీ, తెలంగాణ రీజినల్ మేనేజర్ అమిత్‌కుమార్‌సింగ్ మాట్లాడుతూ మారుతి సుజుకి ఈ-విటారా కారు రెండు బ్యాటరీ ప్యాక్ ఎంపికలతో అందుబాటులో ఉందని, 49 కిలోవాట్లు, 61 కిలోవాట్లు కలిగిన రెండు బ్యాటరీలు పనిచేస్తాయన్నారు. కార్యక్రమంలో వరుణ్‌గ్రూప్ డైరెక్టర్ డీకే రాజు, జనరల్ మేనేజర్ శ్రీధర్‌పాల్, ఏజీఎం (కార్పొరేట్) చంద్రశేఖర్, బ్రాంచి హెడ్ ఎల్‌టీగౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.


శ్రీవిద్యకు నాన్ అవైలబులిటీ సర్టిఫికెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్


శ్రీవిద్యకు నాన్ అవైలబులిటీ సర్టిఫికెట్

● చదువుకు అండగా ఉంటామన్న ఎమ్మెల్యే తలసాని

హైదరాబాద్ సిటీ, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): చిన్నారి శ్రీవిద్యకు జీహెచ్ఎంసీ అధికారులు శనివారం నాన్ అవైలబులిటీ సర్టిఫికెట్ అందజేశారు. 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి స్పందించిన ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ బాలికకు బర్త్ సర్టిఫికెట్ అందించే విషయంపై జీహెచ్ఎంసీ అధికారులతో మాట్లాడారు. ఈ మేరకు అధికారులు దాసారం బస్తీలోని శ్రీవిద్య ఇంటికి వెళ్లి వివరాలు సేకరించి నాన్ అవైలబులిటీ సర్టిఫికెట్‌ను వెస్ట్‌మారేడ్‌పల్లిలోని ఎమ్మెల్యే కార్యాలయంలో తలసాని చేతుల మీదుగా తల్లిదండ్రులకు అందజేశారు. బాలిక చదువుకు అండగా ఉంటామని హామీ ఇవ్వడంతో తల్లిదండ్రులు అశోక్, మమత తలసానికి కృతజ్ఞతలు తెలిపారు.

శంకరనారాయణ సేవలు ప్రశంసనీయం

హైదరాబాద్ సిటీ, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): హాస్య బ్రహ్మగా తెలుగు పాఠకుల ఆదరాభిమానాలు పొందిన డాక్టర్ శంకర నారాయణ 50 ఏళ్లుగా తెలుగు సాహిత్యంలో విశేష కృషి చేస్తున్నారని శ్రీరాగరమ్య సాంస్కృతిక సేవా సంస్థ నిర్వాహకురాలు రమ్యా నాయుడు కొనియాడారు. తమ సంస్థ నిర్వహణలో శనివారం శిల్పారామంలో శంకర్‌నారయణను ఘనంగా సత్కరించారు. కళా నీరాజనం పేరుతో నిర్వహించిన కూచిపూడి నృత్యాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. శంకర నారాయణ మాట్లాడుతూ ఆరేళ్లలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలతోపాటు అనేక పట్టణాల్లో 300 కార్యక్రమాలు చేసిన శ్రీ రాగరమ్య సంస్థ తనను సత్కరించడం సంతోషకారమన్నారు. రమ్యానాయుడు మాట్లాడుతూ తెలుగు సాహిత్య, పాత్రికేయ రంగంలో శంకరనారాయణ సేవలు ప్రశంసనీయమన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో సాహిత్య, సాంస్కృతిక రంగాల్లో రాణిస్తున్న మహిళలను సన్మానించారు.


శిల్పారామంలో శంకర్‌నారాయణను సత్కరిస్తున్న నిర్వాహకులు

ఉరేసుకుని నవ వధువు ఆత్మహత్య

బాలానగర్, మార్చి 8(ఆంధ్రజ్యోతి): మహిళా దినోత్సవం రోజున నవవధువు ఈ లోకంలో ఇక ఉండలేనంటూ ఉరి వేసుకుని తనువు చాలించింది. ఈ ఘటన బాలానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. ఏపీ పార్వతీపురం కాంపవల్లి గ్రామానికి చెందిన శ్రీరాములు కుమార్తె గంట విజయగౌరీ(23)కి విజయనగరం జిల్లా నందిగామకు చెందిన రాము కుమారుడు ఆర్నెపల్లి ఈశ్వర్ రావుతో ఫిబ్రవరి 6న వివాహం జరిగింది. ఫిబ్రవరి 16న ఈశ్వర్ భార్యతో కలిసి నగరానికి వచ్చి బాల్‌రెడ్డినగర్‌లో గదిని అద్దెకు తీసుకుని కాపురం పెట్టారు. బీటెక్ ఫైనలియర్ చదువుతున్న విజయగౌరీకి పెళ్లి ఇష్టం లేకపోవడంతో భర్తతో ఇంట్లో దూరంగా ఉంటోంది. శుక్రవారం భర్త డ్యూటీకి వెళ్లి సాయంత్రం ఇంటికి వచ్చాడు. ఎంతసేపటికీ తలుపు తీయలేదు. దాంతో అతడు కిటికీలో నుంచి చూడగా, ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించింది. వెంటనే విషయాన్ని అత్తమామకు ఫోన్ చేసి చెప్పాడు. పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు ఘటనా స్థలికి చేరుకుని తలుపులు పగులగొట్టి మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు. శనివారం మృతురాలి తండ్రి శ్రీరాములు బాలానగర్ పోలీసులకు పిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



విజయగౌరీ (ఫైల్)


అద్దె ఇల్లు చూడాలంటే

సెక్యూరిటీ డిపాజిట్ కట్టాలంటూ రూ.46వేలు స్వాహా

● జూబ్లీహిల్స్ పోలీసులకు బాధితురాలు ఫిర్యాదు


బంజారాహిల్స్, మార్చి 8(ఆంధ్రజ్యోతి): గేటెడ్ కమ్యూనిటీలో అద్దె ఇల్లు చూడాలంటే సెక్యూరిటీ డిపాజిట్ చెల్లించాలని మాయమాటలు చెప్పిన సైబర్ నేరగాళ్లు యువతి నుంచి రూ.46,876 కాజేశారు. మధ్యప్రదేశ్‌కు చెందిన అయోనిజ అహిల్యయాదవ్ కొండాపూర్‌లో నివాసముంటూ ప్రైవేటు ఉద్యోగం చేస్తోంది. అద్దె ఇంటి కోసం హౌసింగ్ డాట్ కామ్ అనే వెబ్‌సైట్‌లో అన్వేషించింది. అందులో రామ్‌కీ టావర్స్‌లో ఇళ్లు అద్దెకున్నట్టు ఓ వ్యక్తి పోస్టు చేశాడు. పరిశీలించగా అతడు నిజమైన ఇంటి యజమానే అని వెబ్‌సైట్‌లో ఉంది. దీంతో అహిల్య అతనికి ఫోన్‌చేసి సింగిల్ బెడ్‌రూం కావాలని అడిగింది. ముందుగా రూ.1,500 సెక్యూరిటీ డిపాజిట్ కావాలని అడిగాడు. అహిల్య పంపించింది. అనంతరం గేటెడ్ కమ్యూనిటీ కాబట్టి రూ.8,059 కడితే రూ.8000 తిరిగి వస్తాయని రూ.59 గేట్ పాస్ కింద కట్ అవుతాయని చెప్పాడు. ఇలా పలు మార్లు ఆమె రూ.46,876 పంపించింది ఆ తర్వాత అతని ఫోన్ స్విచాఫ్ వచ్చింది. మోసపోయినట్టు గ్రహించిన బాధితురాలు జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తులో ఉంది.

















కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేస్తాం..

- ఆ దిశగా ప్రభుత్వం కృషి
- రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్

చాంద్రాయణగుట్ట, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ తల్లి స్ఫూర్తిగా కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేసే దిశగా ప్రజా ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తోందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని బహదూర్‌పురా నియోజకవర్గంలోని ఫలక్‌నుమా ఫారూక్‌నగర్‌లోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్‌లో జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సావిత్రీబాయి పూలే చిత్రపటానికి నివాళులర్పించారు. విద్యార్థినిలతో కలిసి కేక్ కట్ చేశారు. అనంతరం పాఠశాలలో ఉన్న సమస్యలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పరీక్షలు దగ్గర పడుతుండడంతో సమయం వృథా చేయకుండా అందరూ బాగా చదువుకోవాలని ఆయన సూచించారు. పాఠశాలలో సాంస్కృతిక, క్రీడా కార్యక్రమాలు జరుపుకోవడానికి అనువుగా ఒక హాల్ నిర్మాణానికి కృషి చేయాలని పాఠశాల ప్రిన్సిపాల్ జయంతి మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన మంత్రి హాల్ నిర్మాణ పనులు పూర్తయ్యేలా చూడాలని హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిని ఆదేశించారు. అనంతరం మంత్రి పొన్నం, కలెక్టర్, బహదూర్‌పురా ఎమ్మెల్యే మహ్మద్ ముబీన్ విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో తెలంగాణ ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్, స్థానిక కార్పొరేటర్ మోతీలాల్ నాయక్, బహదూర్‌పురా నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పులిపాటి రాజేష్‌కుమార్, చాంద్రాయణగుట్ట ఇన్‌చార్జి బోయ నగేష్, నాయకులు కన్నయ్యలాల్, రాజుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థినులకు కేక్ తినిపిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

ఇమ్లిబన్ బస్టాండ్‌లో..

అఫ్జల్‌గంజ్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మహిళా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, తెలంగాణ ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్, రంగారెడ్డి రీజియన్ ఆర్ఎం ఇమ్లిబన్ బస్ స్టేషన్‌లో పర్యటించారు. అనంతరం బస్సు ఎక్కి కొద్దిదూరం ప్రయాణించారు. ఈ సందర్భంగా అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఆర్టీసీ ఉద్యోగులను సత్కరించారు. ప్రయాణికులతో ముచ్చటించారు. ఎంజీబీఎస్‌లో మహిళా ప్రయాణికులకు గులాబీ పూలు, స్వీట్లు ఇచ్చి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.


ఇమ్లిబన్ బస్టాండ్‌లో మహిళా సిబ్బందితో మంత్రి పొన్నం, అధికారులు


ఇందిరాప్రియదర్శిని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లను సత్కరిస్తున్న హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ వామన్‌రావు, గ్లోబల్ పీస్ ఫౌండేషన్ ప్రతినిధి అమీర్ ఆలీఖాన్, డాక్టర్ రాజ్‌నారాయణ ముదిరాజ్, ఉదయశ్రీ తదితరులు


ఉస్మాన్‌గంజ్‌లోని భాగ్యనగర్ అయ్యప్ప సేవా సమితి(బాస్) ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి బీజేపీ హైదరాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి మాధవీలత హాజరయ్యారు. మహిళలతో కలిసి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో బాస్ సంస్థ ప్రతినిధులు అనురాధ, సౌజన్య, సంధ్య, స్రవంతి, శ్రేయ, దేవకమ్మ, విజయలక్ష్మి, క్యాతం రాధాకృష్ణ, మెడిశెట్టి రాకేశ్, సీపీ అనిల్ పాల్గొన్నారు


మైలార్‌దేవుపల్లిలో మహిళలకు కేక్ తినిపిస్తున్న ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్

మహిళా సాధికారతతోనే సమాజ పురోభివృద్ధి


జేపీ ఆధ్వర్యంలో అత్తాపూర్ డివిజన్ మహిళా మోర్చా నాయకులను సన్మానిస్తున్న ఆ పార్టీ నాయకులు సులిగె వెంకటేశ్, ఎం.కొమురయ్య


కోఠి మహిళా యూనివర్సిటీలో కవాతు నిర్వహిస్తున్న ఎన్‌సీసీ విద్యార్థినులు


పెట్లబురుజు ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రజినిరెడ్డిని సన్మానించిన నర్సులు


మీర్‌చౌక్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో మహిళా సిబ్బందిని సన్మానించిన ఇన్‌స్పెక్టర్ నయీముద్దీన్, సిబ్బంది



సుశీలా నారాయణరెడ్డి ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో అధ్యక్షురాలు సి.గంగ, ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె.చెన్నయ్య, సినారె పెద్దకుతూరు గంగ, యమున, సరస్వతి, భాస్కర్‌రెడ్డి, సుందర్‌రెడ్డి


పీడీపీ సమీపంలోని ఫిష్ బిల్డింగ్ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.సదాలక్ష్మి, రమాదేవి, ఝాన్సీరెడ్డి తదితరులు


గోల్కొండ రిసార్ట్స్‌లో నిర్వహించిన వేడుకల్లో మహిళలు

మాతృదేవోభవ పురస్కారాల ప్రదానం

రవీంద్రభారతి, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మహిళలు అన్ని రంగాల్లో రాణించినప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందని వక్తలు అన్నారు. రవీంద్ర భారతి కాన్ఫరెన్స్ హాల్‌లో లేఖిని రచయిత్రుల వేదిక, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో మాతృదేవోభవ పురస్కారాల ప్రదానోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షురాలు కొండ్రు పుష్పలీల, పొత్తూరి విజయలక్ష్మి, ఆటూరి విజయలక్ష్మి, అమృతలత, విజయదుర్గ, గౌరీలక్ష్మి, అత్తలూరి విజయలక్ష్మి తదితరులు పాల్గొని మహిళామూర్తుల్ని సత్కరించి అభినందించారు.

చార్మినార్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): సమాజంలో సగభాగమైన మహిళలు అన్ని రంగాల్లో రాణించి ప్రతి చోటా పురుషులతో సమానంగా గౌరవాన్ని అందుకోగలిగినప్పుడే సమాజం నిర్మాణాత్మక పురోభివృద్ధిని సాధిస్తుందని తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, పొలిట్‌బ్యూరో సభ్యుడు బక్కని నర్సింహులు అన్నారు. శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలుగుదేశం పార్టీ హైదరాబాద్ పార్లమెంట్ కో-ఆర్డినేటర్ నాగు నగేష్ ఆధ్వర్యంలో మాదన్నపేట్ ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఆస్పత్రి సిబ్బందికి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ కన్వీనర్ పి.సాయిబాబా, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సామ భూపాల్‌రెడ్డి, నాయకులు కట్ట సుదర్శన్, బీవై శ్రీకాంత్, మహిళా నాయకులు లావణ్య, శ్యామ్‌సుందర్, బలరాజు గౌడ్, మాజీ కార్పొరేటర్ జోగిందర్‌సింగ్, సత్యకృష్ణ, అజయ్, మహిళా నాయకులు తయాబ్ తస్లీమా పాల్గొన్నారు.


మాదన్నపేట్ ఆస్పత్రిలో మహిళా ఉద్యోగులను సన్మానిస్తున్న తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి బక్కని నర్సింహులు తదితరులు


కోఠిలోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి సరేపల్లి నంద


జహనుమాలోని సెయింట్ మార్క్స్ బాయ్స్ టౌన్ హైస్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థినులు

అలరించిన పెయింట్ ఎగ్జిబిషన్

కార్వాన్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మాసాబ్‌ట్యాంక్ ప్రభుత్వ ఫైన్ ఆర్ట్స్ గ్యాలరీలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని పెయింట్ ఎగ్జిబిషన్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా కళాశాల ప్రిన్సిపాల్ ఆనంద్‌రావు, వర్సిటీ రిటైర్డ్ వీసీ ప్రొఫెసర్ పద్మావతి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు అన్నిరంగాల్లో రాణించడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. అనంతరం ప్రముఖ కళాకారుడు రమణారెడ్డి మాట్లాడుతూ ప్రదర్శనలో కొలువైన ప్రతీ చిత్రంలో జీవం ఉట్టిపడుతోందని కొనియాడారు. 108 మంది మహిళా విద్యార్థులు ఏర్పాటు చేసిన ప్రదర్శన అబ్బురపరిచిందని పేర్కొన్నారు.


పెయింట్ ఎగ్జిబిషన్‌లో ప్రముఖులు






మహిళా సంఘాల ఆధ్వర్యంలో మహిళలు తయారు చేసిన వస్తువులతో ఏర్పాటు చేసిన స్టాల్స్

ఇందిరా మహిళా శక్తి సభలో ఆకట్టుకున్న స్టాల్స్

గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో 10 స్టాల్స్

హైదరాబాద్ సిటీ/ మారేడ్‌పల్లి, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళా దినోత్సవం సందర్భంగా సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో శనివారం నిర్వహించిన ఇందిరా మహిళా శక్తి సభలో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) ఆధ్వర్యంలో మహిళలు ఏర్పాటు చేసిన స్టాల్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన మహిళా సంఘాల సభ్యులు తమ ఉత్పత్తులు ప్రదర్శించారు.


తరలివచ్చిన మహిళలు

ఇందిరా మహిళా శక్తి బస్సులు ప్రారంభం

పరేడ్ గ్రౌండ్‌లో మహిళా సంఘాల ఆధ్వర్యంలో టీజీఎస్ఆర్టీసీకి చెందిన 20 ఇందిరా మహిళా శక్తి బస్సులను సీఎం రేవంత్‌రెడ్డి మంత్రులతో కలిసి ప్రారంభించారు. సాయంత్రం 4 తర్వాత మహిళలు ఇందిరా మహిళా శక్తి కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

64 లక్షల మందికి ఉపాధి

రాష్ట్రంలో సెర్ప్-మెప్మాతో మహిళా సంఘాల ద్వారా 64 లక్షల మంది మహిళలు ఉపాధి పొందుతున్నారు. మహిళా సంఘాలు గ్రూపులుగా ఏర్పడి తయారు చేస్తున్న అన్ని రకాల ఉత్పత్తులకు మార్కెట్లో మంచి ఆదరణ లభిస్తోంది.

\- ఎంపీ కృష్ణ, సెర్ప్ డైరెక్టర్

32 జిల్లాల్లో 64 మెగావాట్ల సౌర విద్యుత్ ప్లాంట్లు

తెలంగాణ ప్రభుత్వం ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం ద్వారా మహిళా సంఘాలకు 1000 మెగావాట్ల సౌర విద్యుత్ ప్లాంట్ కేటాయించాలని నిర్ణయించింది. మహిళా దినోత్సవం సందర్భంగా శుక్రవారం 32 జిల్లాల్లో మహిళా సంఘాలకు 2 మెగావాట్ల చొప్పున 64 మెగావాట్ల సౌర విద్యుత్ ప్లాంట్లను సీఎం రేవంత్‌రెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. ఈ ప్రాజెక్టుతో మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదిగి ఆర్థికంగా బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యం.

\- వావిల్లా అనిలా, టీజీఎస్ రెడ్కో, ఎండీ

మరిన్ని మెహిదీపట్నం జోన్ వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/qumBBuhలో చదవండి.
Note: Andhrajyothi.com/editions/hyd/set-6 abids, mehadipatnam, charminarలో చూడగలరు.
నోట్: htpps://epaper.andhrajyothy .comలో లాగిన్ అయిన తరువాత క్యూఆర్‌కోడ్‌ని స్కాన్ చేయగలరు.


తీర్పు పత్రాలు అందజేస్తున్న న్యాయమూర్తి పద్మ

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

- సిటీ సివిల్ కోర్టు న్యాయమూర్తి పద్మ

చార్మినార్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): కక్షిదారులు లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకొని సమయం, డబ్బును ఆదా చేసుకోవాలని సిటీ సివిల్ కోర్టు, ప్రధాన న్యాయమూర్తి వై.పద్మ సూచించారు. శనివారం హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టులో లోక్ అదాలత్ నిర్వహించారు. 1401 కేసులను పరిష్కరించారు. కార్యక్రమంలో సిటీ సివిల్ కోర్టు న్యాయ మూర్తులు డీవీ నాగేశ్వర్‌రావు, డానీ రూత్, కిరణ్ కుమార్, రేవతి పాల్గొన్నారు.

శ్మశానవాటికలో బోరు ఏర్పాటు చేయాలి

నార్సింగ్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): కార్వాన్ నియోజకవర్గం కాకతీయనగర్ కాలనీవాసులు హిందూ శ్మశానవాటికలో బోరు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్‌ను కోరారు. శనివారం జీహెచ్ఎంసీ అధికారులతో ఎమ్మెల్యే ప్రత్యేక సమావేశం నిర్వహించారు. బోరును ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో జీహెచ్ఎంసీ డిప్యూటీ ఈఈ రామకృష్ణ, కార్పొరేటర్ మహ్మద్ నసీరొద్దీన్, మజ్లిస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

ఐటీ కారిడార్‌లో ఆర్టీసీ సర్వీసుల విస్తరణ

హైదరాబాద్ సిటీ, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఐటీ కారిడార్ కేంద్రంగా బస్సుల సర్వీసులను మరింత విస్తరించే దిశగా గ్రేటర్ ఆర్టీసీ చర్యలు తీసుకుంటోంది. బాచుపల్లి నుంచి వేవ్‌రాక్‌కు బస్సులను నడుపుతున్న ఆర్టీసీ నాలుగు రోజుల క్రితం 4 గ్రీన్ మెట్రో లగ్జరీ ఎలక్ట్రిక్ ఏసీ బస్సులను లింగంపల్లి నుంచి వయా నలగండ్ల, గోపన్‌పల్లి, విప్రో, ఖాజాగూడ ఎక్స్‌రోడ్, దర్గా, గెలాక్సీ, నానల్ నగర్ ప్రాంతాల నుంచి మెహిదీపట్నం రూట్ 216 డబ్ల్యూను మియాపూర్-2 డిపో ప్రారంభించింది. రెండు గ్రీన్ మెట్రో లగ్జరీ ఎలక్ట్రిక్ ఏసీ బస్సులను రూట్ నెంబర్ 216జీలో లింగంపల్లి నుంచి లక్ష్మీఘర్ వరకు వయా నలగండ్ల, గోపన్‌పల్లి, మైల్‌స్టోన్, విప్రో, ఘర్ రూట్లలో అందుబాటులోకి తీసుకొచ్చారు. ఎలక్ట్రిక్ ఏసీ బస్సులతో పాటు నాన్ ఏసీ బస్సులను ఐటీ కారిడార్‌లోని అన్ని రూట్లలో నడుపుతున్నట్లు అధికారులు తెలిపారు.

'కలం నా గళం' కవితా సంపుటి ఆవిష్కరణ

రవీంద్రభారతి, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): కలమే తన బలమంటూ కవయిత్రి గళాన్ని వినిపించేలా రచనలు చేయడం అభినందనీయమని ఎమ్మెల్సీ గోరటి వెంకన్న అన్నారు. శనివారం రవీంద్రభారతి కాన్ఫరెన్స్ హాల్‌లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన ప్రముఖ కవయిత్రి రేడియో వ్యాఖ్యాత తురుమెళ్ల కళ్యాణి రచించిన 'కలం నా గళం' పుస్తకావిష్కరణ సభ జరిగింది. ఈ సభకు ముఖ్య అతిథిగా హాజరైన గోరటి వెంకన్న పుస్తకాన్ని ఆవిష్కరించి రచయిత్రిని అభినందించారు. కార్యక్రమంలో బీరం సుందరరావు, భగీరథ, శైలజమిత్ర, మంజుల సూర్య, పెద్దూరి వెంకటదాసు తదితరులు పాల్గొన్నారు.


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

సీసీ రోడ్డు పనుల పరిశీలన

నార్సింగ్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఇందిరమ్మకాలనీలో సీసీ రోడ్డు పనులను మాజీ కార్పొరేటర్ గోకరి శ్రీలతసురేశ్‌గౌడ్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పనుల్లో నాణ్యత ఉండేలా అధికారులు, సిబ్బంది ప్రత్యేక దృష్టి చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిక

నార్సింగ్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 18వ వార్డుకు చెందిన కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్ పార్టీలో శనివారం చేరారు. వీరికి బీఆర్ఎస్ కండువాలు కప్పి ఆ పార్టీ రాజేంద్రనగర్ ఇన్‌చార్జి పి.కార్తీక్‌రెడ్డి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కార్తీక్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ప్రజలకు ఒరిగిందేమీలేదన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించడంలో కాంగ్రెస్ విఫలమైందని విమర్శించారు. పార్టీలో చేరిన వారిలో చంద్రశేఖర్, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేశ్, శ్రవణ్, రాంబాబు, నాగరాజు, సుభాని, బాలాజీ, నరేశ్, మహేశ్‌గౌడ్, రామ్‌కుమార్, రాజు ఉన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గంగని రవికుమార్, మహేశ్, శాంతకుమార్, రాజ్‌కుమార్, శాంతి భాయ్, హజీ పాల్గొన్నారు.


బీఆర్ఎస్‌లో చేరిన నాయకులతో కార్తీక్‌రెడ్డి తదితరులు

దారి దోపిడీలకు పాల్పడుతున్న ముగ్గురి అరెస్ట్

- రూ. 18 లక్షల నగదు, మహీంద్రా వాహనం స్వాధీనం

రాజేంద్రనగర్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): దారి దోపిడీలకు పాల్పడుతున్న ముగ్గురిని రాజేంద్రనగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ. 18 లక్షల నగదు, మహీంద్రా ఎక్స్‌యూవీ వాహనం, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. శనివారం రాజేంద్రనగర్‌లోని డీసీపీ కార్యాలయంలో డీసీపీ చింతమనేని శ్రీనివాస్ వివరాలను వెల్లడించారు. ఈనెల 4వ తేదీ మధ్యాహ్నం 2:30 గంటల ప్రాంతంలో జితేందర్ బజాజ్ అనే వ్యక్తి ద్విచక్రవాహనంపై రూ. 20 లక్షలు తీసుకుని కాటేదాన్‌లోని ఎస్ఆర్ఎం ప్రొడక్ట్ ప్లాస్టిక్ కంపెనీకి వెళ్తున్నాడు. కాలనీలోని బాహర్ రతీ ఇంటి వద్దకు రాగానే వెనకాల నుంచి మహీంద్రా కారులో వచ్చిన వ్యక్తులు ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టారు. జితేందర్ బజాజ్ కింద పడిపోగానే కారులో నుంచి దిగిన వ్యక్తులు అతడి వద్ద ఉన్న రూ. 20 లక్షలను తీసుకుని పారిపోయారు. అదే రోజు బాధితుడు మైలార్‌దేవుపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రంగంలోకి దిగిన ఏసీపీ తుల శ్రీనివాస్, మైలార్‌దేవుపల్లి ఇన్‌స్పెక్టర్ నరేందర్, క్రైమ్ డీసీపీలు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. నిందితులు కారులో ఆదిలాబాద్ వైపు నుంచి మహారాష్ట్ర వెళ్తున్నట్లు గుర్తించారు. వెంటనే నిర్మల్ పోలీసులుకు సమాచారం ఇచ్చారు. నిర్మల్ పోలీసులు కారును ఆపడానికి ప్రయత్నించగా, దొంగలు జాతీయ రహదారి కాకుండా ఇతర మార్గం ద్వారా రాజస్థాన్ ఫతేపూర్‌కు వెళ్లిపోయారు. మైలార్‌దేవుపల్లి పోలీసులతో పాటు సీసీఎస్, క్రైమ్ పోలీసులు రాజస్థాన్‌కు వెళ్లి సచిన్‌స్వామి, సీతారంస్వామిని అరెస్ట్ చేశారు. హేమంత్‌శర్మను కాటేదాన్‌లో అరెస్ట్ చేశారు. మరోవ్యక్తి ప్రశాంత్ పరారీలో ఉన్నాడని డీసీపీ శ్రీనివాస్ తెలిపారు. నిందితులందరూ గతంలో ఎస్ఆర్ఎం ప్రొడక్ట్ ప్లాస్టిక్ కంపెనీలో పనిచేశారని చెప్పారు. నిందితులను పట్టుకున్న డీఐ మక్సూద్ అలీ, ఎస్ఐ ప్రవీణ్, కానిస్టేబుళ్లు శ్రీకాంత్, రాజారావును అభినందించి నగదు రివార్డు అందజేశారు. సమావేశంలో రాజేంద్రనగర్ ఏసీపీ తుల శ్రీనివాస్, మైలార్‌దేవుపల్లి ఇన్‌స్పెక్టర్ నరేందర్, డీఐ మక్సూద్‌అలీ, ఎస్ఓటీ ఇన్‌స్పెక్టర్ రమణారెడ్డి, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ ప్రశాంత్ పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
ఆంధ్రజ్యోతి ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి
గోవిందరావు : 9703618721, రాజ్ కుమార్: 9985921389
కె. అనిల్ కుమార్: 99854 03628

రేపు అమరజ్యోతి స్తూపం నుంచి గన్‌పార్క్ వరకు ర్యాలీ

పంజాగుట్ట, మార్చి 8(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో మిలియన్ మార్చ్ చరిత్రాత్మక ఘట్టం అని, ప్రతి సంవత్సరం మార్చి 10న తెలంగాణ మిలియన్ మార్చ్ డేను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ డిమాండ్ చేసింది. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో జేఏసీ చైర్మన్ సుల్తాన్ యాదగిరి, సెక్రటరీ జనరల్ తుమ్మల ప్రఫుల్ రాంరెడ్డి మాట్లాడారు. ట్యాంక్‌బండ్‌పై 2011 మార్చి 10న సీమాంధ్ర దోపిడీ పాలనపై తెలంగాణ ప్రజలు తిరుగుబాటు జెండా ఎత్తిన రోజని, ప్రజలు తెగించి పోరాడారని గుర్తు చేశారు. ఈనెల 10న మిలియన్ మార్చ్ స్ఫూర్తి దినం సందర్భంగా అమరజ్యోతి స్తూపం నుంచి గన్‌పార్క్ అమరవీరుల స్తూపం వరకు కళారూపాలతో ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్ని పార్టీలు, సంఘాలకు చెందిన వారు, ఉద్యమకారులు పాల్గొని విజయవంతం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ ప్రధాన కార్యదర్శి బత్తుల సోమయ్య, మహిళా ఉద్యమకారుల వేదిక అధ్యక్షురాలు మాధవిరెడ్డి, విద్యార్థి ఉద్యమకారుల వేదిక అధ్యక్షులు భద్రి, తెలంగాణ జర్నలిస్ట్ ఫ్రంట్ అధ్యక్షులు మోహన్ బైరాగి, లక్ష్మీకాంతం తదితరులు పాల్గొన్నారు.

VEHICLE FOR SALE

MAHINDRA_AND_MAHINDRA CB_BOLERO PICK UP Tanker AP39UK7305 - YOM - 2022

Under hypothecation with **M/s.KOTAK MAHINDRA BANK LTD,** is under sale in its "As is Where is Condition and All charges including RTA related should be paid by the Buyer" Interested parties can give their Quotations within 3 days at

KOTAK MAHINDRA BANK LIMITED
Ground Floor, 40-1-48/1, M.G.Road, Labbipet, Vijayawada – 520010
Contact Person : Mr.Raja Garikapathi
Contact No: 98852 68046
Email: raja.garikapathi@kotak.com

यूनियन बैंक ऑफ इंडिया | యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా భారత ప్రభుత్వరంగ సంస్థ

అసెట్ రికవరీ శాఖ
#249/3RT, 1వ అంతస్తు, S.R.నగర్ మెయిన్ రోడ్, హైదరాబాద్-500038

ఇ-వేలం అమ్మకం ప్రకటన

(సెక్యూరిటీ ఎన్‌ఫోర్స్‌మెంట్ రూల్స్, 2002లోని రూల్ 8(6) నిబంధనలు చూడగలరు)

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8(6) నిబంధనతో చదువబడు సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన. సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తనఖాపెట్టబడిన/ చార్జ్‌చేయబడినట్టి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (సెక్యూర్డ్ క్రెడిటార్) అధీకృత అధికారి ద్వారా లాంఛనప్రాయ/ వాస్తవిక స్వాధీనం చేసుకొనబడినట్టి దిగువ వివరించిన స్థిరాస్తులు దిగువ తెలిపిన రుణగ్రహీత(లు) & హామీదారు(ల) నుండి యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు రావలసిన దిగువ తెలిపిన బకాయిలు రాబట్టుకొనుటకు, దిగువ తెలిపిన తేదీన "ఎక్కడ ఎలా ఉన్నవి అక్కడ అలా", "అక్కడ ఏమి ఉంటే అదే" మరియు "ఏది అక్కడ ఉందో అదే" ప్రాతిపదికన విక్రయించబడతాయని ముఖ్యంగా రుణగ్రహీత(ల)కు మరియు హామీదారు(ల)కు మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమైనది.

రిజర్వు ధర మరియు బయానా కూడా దిగువ తెలియజేయబడినవి:

1 రుణగ్రహీత(ల) పేరు మరియు చిరునామా: 1. శ్రీ అక్కినపల్లి మాధవ్ తండ్రి అక్కినపల్లి శీనయ్య, ఇ.నం. 11-12-34/404, రోడ్ నం. 1, నవ్య ఆర్కేడ్ ఇన్‌కం ట్యాక్స్ కాలనీ, ప్రత్యుంగమాయ్ టెంపుల్ సమీపాన, ఎస్.ఆర్.కె.పురం, సరూర్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ - 500035 & శ్రీ అక్కినపల్లి మాధవ్ తండ్రి అక్కినపల్లి శీనయ్య, ఫ్లాట్ నం. 404, 4వ అంతస్తు, రోడ్ నం. 1, నవ్య ఆర్కేడ్ ఇన్‌కం ట్యాక్స్ కాలనీ, ఎస్.ఆర్.కె.పురం, సరూర్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ - 500035 & శ్రీ అక్కినపల్లి మాధవ్ తండ్రి అక్కినపల్లి శీనయ్య, ఫ్లాట్ నం. 12లో ఇంటి మొదటి అంతస్తు, సర్వే నం. 27, సాయినగర్ కాలనీ, జీహెచ్ఎంసి వార్డ్ నం. 4 క్రింద, బ్లాక్ నం. 3, అన్మగల్ గ్రామం, హయత్‌నగర్ మండలం, రంగారెడ్డి, హైదరాబాద్ - 501505.
సహ-బాధ్యతాదారు(లు): 2. శ్రీమతి అక్కినపల్లి రాధిక, భర్త అక్కినపల్లి మాధవ్, ఇ.నం. 11-12-34/404, రోడ్ నం. 1, నవ్య ఆర్కేడ్ ఇన్‌కం ట్యాక్స్ కాలనీ, ప్రత్యుంగమాయ్ టెంపుల్ సమీపాన, ఎస్.ఆర్.కె.పురం, సరూర్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ - 500035 & శ్రీమతి అక్కినపల్లి రాధిక, భర్త అక్కినపల్లి మాధవ్, ఎస్ఆర్ఎస్ మినరల్స్ & అగ్రిగేట్స్, ఫ్లాట్ నం. 404, 4వ అంతస్తు, రోడ్ నం. 1, నవ్య ఆర్కేడ్ ఇన్‌కం ట్యాక్స్ కాలనీ, ఎస్.ఆర్.కె.పురం, సరూర్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ - 500035 & శ్రీమతి అక్కినపల్లి రాధిక, భర్త అక్కినపల్లి మాధవ్, ఫ్లాట్ నం. 12లో ఇంటి మొదటి అంతస్తు, సర్వే నం. 27, సాయినగర్ కాలనీ, జీహెచ్ఎంసి వార్డ్ నం. 4 క్రింద, బ్లాక్ నం. 3, అన్మగల్ గ్రామం, హయత్‌నగర్ మండలం, రంగారెడ్డి, హైదరాబాద్ - 501505.
బకాయి మొత్తం: 31.12.2024 నాటికి రూ.59,35,195.62తో పాటు తదుపరి వడ్డీ, వ్యయాలు & ఖర్చులు.
విక్రయించబడు సెక్యూర్డ్ స్థిరాస్తుల వివరణ
శ్రీ ఎ. మాధవ్, తండ్రి ఎ.శీనయ్య మరియు శ్రీమతి ఎ. రాధిక, భర్త ఎ. మాధవ్ (అస్తి యజమానులు)కు చెందిన హైదరాబాద్ తూర్పు సబ్ జిల్లా రిజిస్ట్రేషన్ సర్కిల్-3, ఎల్.బి.నగర్, బ్లాక్ నం. 3, వార్డు నం. 4 క్రింద జీహెచ్ఎంసి క్రింద, రంగారెడ్డి జిల్లా, హయత్‌నగర్ రెవెన్యూ మండలం, అన్మగల్ హయత్‌నగర్ గ్రామం వద్ద గల సాయినగర్ కాలనీలోని సర్వే నం. 27లో 40 చ.గ.లు లేదా 33.44 చ.మీ.లు విస్తీర్ణ భూమి అవిభాజ్య వాటాతో మొదటి అంతస్తుపై 1430 చ.అ.ల బిల్టప్ ఏరియాతో ఫ్లాట్ నం. 12 పై నిర్మాణం కొత్త ఇంటి నిర్మాణం (నంబరు కేటాయించబడని) యొక్క పోర్షన్‌లోని భాగం ఆస్తి యావత్తు. సరిహద్దులు: ఉత్తరం: ఖాళీ, దక్షిణం: ఖాళీ, తూర్పు: కారిడార్, పశ్చిమం: ఖాళీ.
ఎస్ఆర్‌వో హయత్‌నగర్ వద్ద నమోదైన సేల్ డీడ్ నం. 3662/2015, తేది: 08.06.2015 గూగుల్ కోఆర్డినేటర్: 17.319485,78.609373
రిజర్వు ధర: రూ. 22,68,000/- బయానా: రూ. 2,26,800/- బిడ్ పెరుగుదల: రూ. 22,680/-
తేది: 05.03.2025 ఇతర వివరాలకు సంప్ర: 7044147702

2 రుణగ్రహీత(ల) పేరు మరియు చిరునామా: 1. శ్రీ కళ్యాణ్ రావ్ షణ్ముఖీస్, తండ్రి నరసింహా రావ్ షణ్ముఖీస్, ఇ.నం. 11-11-156/1, 1వ అంతస్తు, రోడ్ నం. 5, సౌభాగ్యపురం, ఎస్ఆర్‌కె పురం, కొత్తపేట, సరూర్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ - 500035 & శ్రీ కళ్యాణ్ రావ్ షణ్ముఖీస్, తండ్రి నరసింహా రావ్ షణ్ముఖీస్, ఫ్లాట్ నం. 207, సాయి నిలయం, సాయి నగర్ కాలనీ (దక్షిణం), చాణిక్యపురి, నాగోల్, సరూర్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ - 500035 & శ్రీ కళ్యాణ్ రావ్ షణ్ముఖీస్, తండ్రి నరసింహా రావ్ షణ్ముఖీస్, ఫ్లాట్ నం. 140ఎ, రోడ్ నం. 5, సౌభాగ్యపురం, కొత్తపేట, హైదరాబాద్ - 500035 & శ్రీ కళ్యాణ్ రావ్ షణ్ముఖీస్, తండ్రి నరసింహా రావ్ షణ్ముఖీస్, మీడియా వన్ ఎంటర్‌టైన్‌మెంట్, ఇ.నం. 11-11-156/1, రోడ్ నం. 5, సౌభాగ్యపురం, ఎస్ఆర్‌కె పురం, కొత్తపేట, సరూర్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ - 500035 & శ్రీ కళ్యాణ్ రావ్ షణ్ముఖీస్, తండ్రి నరసింహా రావ్ షణ్ముఖీస్, ఫ్లాట్ నం. 12లో ఇంటి గ్రౌండ్ ఫ్లోర్, సర్వే నం. 27, సాయినగర్ కాలనీ, జీహెచ్ఎంసి వార్డు నం.4 క్రింద, బ్లాక్ నం. 3, అన్మగల్ గ్రామం, హయత్‌నగర్ [illegible]
రిజర్వు ధర: రూ. 24,75,000/- బయానా: రూ. 2,47,500/- బిడ్ పెరుగుదల: రూ. 24,750/-
తేది: 05.03.2025 ఇతర వివరాలకు సంప్ర: 7044147702

3 [illegible]
రిజర్వు ధర: రూ. 22,68,000/- బయానా: రూ. 2,26,800/- బిడ్ పెరుగుదల: రూ. 22,680/-
తేది: 05.03.2025 ఇతర వివరాలకు సంప్ర: 7044147702

4 [illegible]
రిజర్వు ధర: రూ. 29,25,000/- బయానా: రూ. 2,92,500/- బిడ్ పెరుగుదల: రూ. 29,250/-
తేది: 05.03.2025 ఇతర వివరాలకు సంప్ర: 7044147702

5 [illegible]
విక్రయించబడు సెక్యూర్డ్ స్థిరాస్తుల వివరణ
తెలంగాణ, మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా, కుత్బుల్లాపూర్ గ్రామం & మండలం, చింతల్, బాలిరెడ్డి నగర్ వద్ద గల సర్వే నం. 106 లోని ఫ్లాట్ నం. 52/భాగం & 53/భాగంపై ఇ.నం. 49-362 నిర్మాణం. సేల్‌డీడ్ ప్రకారం ఆస్తి వివరణ: ఎస్ఆర్‌వో మేడ్చల్‌వద్ద నమోదైన సేల్‌డీడ్‌నం. 2065/1993, తేది: 20.03.1993 తెలంగాణ రాష్ట్రం, మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా, జీహెచ్ఎంసి సర్కిల్ క్రింద, కుత్బుల్లాపూర్ గ్రామం & మండలం వద్ద గల సర్వే నం. 106 లోని 50 చ.గ.లు లేదా 41.8 చ.మీటర్ల మొత్తం భూమి విస్తీర్ణం ఫ్లాట్ నం. 52/భాగం అస్తి యావత్తు. సరిహద్దులు: ఉత్తరం: 20 అడుగుల వెడల్పు రోడ్, దక్షిణం: ఫ్లాట్ నం. 58, తూర్పు: ఫ్లాట్ నం. 53, పశ్చిమం: ఫ్లాట్ నం. 52/భాగం.
ఎస్ఆర్‌వో మేడ్చల్ వద్ద నమోదైన సేల్ డీడ్ నం. 8452/1989, తేది: 09.11.1989
తెలంగాణ రాష్ట్రం, మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా, జీహెచ్ఎంసి సర్కిల్ క్రింద, కుత్బుల్లాపూర్ గ్రామం & మండలం వద్ద గల సర్వే నం. 106 లోని 62.0 చ.గ.లు లేదా 51.83 చ.మీటర్ల మొత్తం భూమి విస్తీర్ణం ఫ్లాట్ నం. 53/భాగం అస్తి యావత్తు. సరిహద్దులు: ఉత్తరం: 20 అడుగుల వెడల్పు రోడ్, దక్షిణం: 20 అడుగుల వెడల్పు రోడ్, తూర్పు: శ్రీ ఎం. కృష్ణమాచారికి అమ్మిన ఫ్లాట్ నం. 53 భాగం, పశ్చిమం: ఫ్లాట్ నం. 52.
ఎస్ఆర్‌వో మేడ్చల్ వద్ద నమోదైన సేల్ డీడ్ నం. 2065/1993, తేది: 20.03.1993 మరియు 8452/1989, తేది: 09.11.1989 గూగుల్ కోఆర్డినేటర్: 17.491564, 78.459933
రిజర్వు ధర: రూ. 61,39,000/- బయానా: రూ. 6,13,900/- బిడ్ పెరుగుదల: రూ. 68,210/-
తేది: 03.03.2025 ఇతర వివరాలకు సంప్ర: 8309722997

ఇ-వేలం తేది మరియు సమయం: 27.03.2025, మ.12:00 గం. నుండి సా.5:00 గం. మధ్య
(10 నిమిషాల అపరిమిత ఆటో విస్తరణలతో) ఇ-వేలం వెబ్‌సైట్ - https://baanknet.com

బయానా దాఖలుకు చివరి తేది: వేలం ముగింపు సమయం కంటే ముందుగా బయానాను డిపాజిట్ చేయవలెను మరియు అస్తి ఐడితో బయానా మొత్తాన్ని లింక్‌చేయవలెను/ మ్యాప్ చేయవలెను

మొబైల్ నంబర్ మరియు చెల్లుబాటు గల ఇమెయిల్ ఐడి ఉపయోగించి https://baanknet.com లో నమోదు చేసుకోండి. రిజిస్ట్రేషన్ మరియు లాగిన్ మరియు బిడ్డింగ్ రూల్స్ కొరకు https://baanknet.com లోని హోమ్‌పేజీలో ఏర్పాటు చేసిన బయ్యర్ మాన్యువల్ లింక్‌ను దర్శించండి. విచారణల కొరకు సంప్రదించు నంబర్: 8291220220, ఇమెయిల్ ఐడి: support.baanknet@psballiance.com. బిడ్డర్లు వారి బిడ్లను దాఖలు చేసేముందు మరియు ఇ-వేలం అమ్మకం ప్రొసీడింగ్స్‌లో పాల్గొనే ముందు వేలం అమ్మకం యొక్క సవివరమైన అందరు నియమనిబంధనల కొరకు వెబ్‌సైట్ https://www.unionbankofindia.co.in/auction-property/view-auction-property.aspx మరియు www.unionbankofindia.co.in చూడవలసిందిగా సూచించబడుచున్నారు. ఈ బిడ్డింగ్ ప్రాసెస్ ముగిసిన తరువాత సఫలీకృత బిడ్డర్‌కు ఇమెయిల్ ద్వారా తెలియజేయబడును. ఆసక్తిగల బిడ్డరు సంప్రదించగలరు: అధీకృత అధికారులు, 249/3ఆర్‌టి, 1వ అంతస్తు, మెయిన్‌రోడ్, ఎస్.ఆర్.నగర్, హైదరాబాద్ - 500038, మొబైల్ నం: 7702398606, 9987321173

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002లోని రూల్ 8(6)/రూల్ 9(1) క్రింద చట్టబద్ధమైన 15 రోజుల అమ్మకం ప్రకటన పైన తెలిపిన తేదీన ఇ-వేలం అమ్మకం నిర్వహణ గురించి సదరు రుణం యొక్క రుణగ్రహీతలు మరియు హామీదారులకు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8(6)/ రూల్ 9(1) క్రింద ప్రకటనగా కూడా దీనిని పరిగణించగలరు.

ప్రదేశం: హైదరాబాద్ అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అస్సెట్ రికవరీ బ్రాంచ్

'వికసిత్ భారత్'లో మహిళలు ప్రధాన భూమిక పోషించాలి

● కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



కార్యక్రమంలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి

బర్కత్‌పుర, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ కలలుగన్న వికసిత్ భారత్ నిర్మాణంలో మహిళలు ప్రధాన భూమిక పోషించాలని కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. మహిళా సాధికారతతోనే భారత్ సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. శనివారం బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు లంకల దీపక్‌రెడ్డి, మహిళామోర్చా సంయుక్త ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కిషన్‌రెడ్డి హాజరై వివిధ రంగాలలో రాణిస్తున్న పలువురు మహిళలను సన్మానించారు. ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ మాట్లాడుతూ హామీలను అమలుచేయని రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై మహిళలు తిరగబడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు కన్నె ఉమాదేవి, వై.అమృత, సుప్రియాగౌడ్, కీర్తనదీపిక, జి.రచనశ్రీ, సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షుడు భరత్‌గౌడ్, మహిళామోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ సమత, నగర అధ్యక్షురాలు అనంతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చంచల్‌గూడ మహిళా జైలులో..

సైదాబాద్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): చంచల్‌గూడ మహిళా జైలులో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవానికి ముఖ్యఅతిథులుగా హైకోర్టు జస్టిస్ రాధారాణి, జైళ్లశాఖ డీజీ డాక్టర్ సౌమ్యమిశ్రా హాజరయ్యారు. ఈ సందర్భంగా మహిళా ఖైదీలకు వివిధ అంశాలలో పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జైళ్ల శాఖ డీఐజీ డాక్టర్ డి.శ్రీనివాస్. మహిళా జైలు సూపరింటెండెంట్ వెంకటలక్ష్మి, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.



వనితా తరంగం గజల్ సీడీ ఆవిష్కరణ

అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో భాగంగా శనివారం తెలంగాణ భవన్‌లో జరిగిన వేడుకల్లో స్వరవల్లరి తెలుగు గజల్ అకాడమీ ఆధ్వర్యంలో ప్రముఖ గజల్ గాయని హిమజారామం గానం చేసిన వనితా తరంగం గజల్ సీడీని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆవిష్కరించారు.

- రవీంద్రభారతి, మార్చి 8 (ఆంధ్రజ్యోతి)

మహిళలను సన్మానించిన గవర్నర్ సతీమణి



సన్మాన గ్రహీతలతో గవర్నర్ సతీమణి సుధాదేవ్‌వర్మ

చందానగర్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): చందానగర్‌లోని గంగారంలో గల సుమన్ మహిళా దక్షత సమితి విద్యాసంస్థలో, చైర్మన్ సరోజ్ బజాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళా దినోత్సవంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ సతీమణి సుధాదేవ్ వర్మ ముఖ్యఅతిథిగా పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు మహిళలను సన్మానించారు. కార్యక్రమంలో ఉషాగోపాల రత్నం, లలిత కనోడియా, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ వర్సిటీలో..

మానసిక ఆరోగ్యంపై అవగాహన

మహిళాదినోత్సవాన్ని పురస్కరించుకొని కేంద్ర యువజన వ్యవహారాలు- క్రీడల మంత్రిత్వ శాఖ, యూజీసీ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న ఫిట్ ఇండియా - మహిళల క్రీడా వారోత్సవాల్లో భాగంగా శనివారం జూబ్లీహిల్స్‌లోని వర్సిటీలో మానసిక ఆరోగ్యం అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా అదనపు వైద్య, ఆరోగ్య మాజీ అధికారి డాక్టర్ నిర్మలా ప్రభావతి, విశ్వవిద్యాలయ అకాడమిక్ డైరెక్టర్ ప్రొ. జి.పుష్పా చక్రపాణి, డా. రజనీ, విశ్వవిద్యాలయ మహిళా విభాగా ఇన్‌చార్జి డైరెక్టర్ ప్రొ.మేరీ సునంద, డా.శ్రీదేవి, డా.రజనీ, డా.ప్రమీలా కేతావత్, విశ్వవిద్యాలయ ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.

376 బీటెక్ అడ్మిషన్లకు సర్కారు ఆమోదం

ఉత్తర్వులు జారీచేసిన విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా

హైదరాబాద్ సిటీ, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): గతేడాది అక్టోబరులో హైకోర్టు ఇచ్చిన తీర్పు మేరకు పలు ఇంజనీరింగ్ కాలేజీల్లో స్పాట్ ద్వారా చేరిన 376మంది విద్యార్థుల అడ్మిషన్లకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ మేరకు విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా తాజాగా ఉత్తర్వులు జారీచేశారు. రాష్ట్రంలోని దాదాపు అన్ని ఇంజనీరింగ్ కాలేజీలు తమ సంస్థల్లో సీట్ల పెంపునకు గతేడాది ఏఐసీటీఈ నుంచి అనుమతులు తెచ్చుకోగా, 14 కళాశాలల్లో సుమారు 4,500 ఇంజనీరింగ్ సీట్లకు మాత్రం రాష్ట్ర ప్రభుత్వం అనుమతించలేదు. దీంతో ఆయా కాలేజీల యాజమాన్యాలు న్యాయస్థానాలను ఆశ్రయించగా, ఏఐసీటీఈ అనుమతుల మేరకు కళాశాలల్లో సీట్లను భర్తీ చేసుకోవచ్చని హైకోర్టు తీర్పును వెలువరించింది. అప్పటికే ప్రభుత్వం నిర్వహించే కౌన్సెలింగ్ ప్రక్రియ పూర్తి కావడంతో.. సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్లు నిర్వహించుకోవాలని కాలేజీలకు సూచించింది. ఈ మేరకు నాడు స్పాట్ అడ్మిషన్ల ద్వారా 376మంది విద్యార్థులు ఆ కాలేజీల్లో చేరగా, వారి అడ్మిషన్లను రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ఆమోదించింది. ఒకవైపు స్పాట్ అడ్మిషన్ల ద్వారా చేరిన విద్యార్థులు మొదటి సెమిస్టర్ పరీక్షలు రాసి నెలరోజులు పూర్తయినా, ఫలితాల వెల్లడికి ఆటంకం ఏర్పడింది. ప్రభుత్వం తాజాగా జారీచేసిన ఉత్తర్వులతో విద్యార్థుల ఫలితాలను వెలువరించేందుకు మార్గం సుగమమైందని కాలేజీల ప్రిన్సిపాళ్లు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. సీఎంఆర్ ఇంజనీరింగ్ కాలేజీలో 47, సీఎంఆర్ సెట్‌లో 34, సీఎంఆర్ టెక్నికల్ క్యాంపస్‌లో 23, సీఎంఆర్ఐటీలో 20, మల్లారెడ్డి కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌లో 51, మల్లారెడ్డి మహిళా ఇంజనీరింగ్ కాలేజీలో 40, ఎంఆర్ఈసీలో 8, ఐఏఆర్ఈలో 52, ఎంఎల్ఆర్ఐటీలో 37, ఎంఎల్ఆర్ఐటీఎంలో 6, సెయింట్ మార్టిన్‌లో 13, అనురాగ్ ఇంజనీరింగ్ కాలేజీలో 11, విద్యాజ్యోతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో 34 అడ్మిషన్లకు ఆమోదం తెలిపినట్లు విద్యాశాఖ కార్యదర్శి యోగితా జారీచేసిన ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.



సదస్సులో డాక్టర్ తనయ నరేంద్ర, స్వాతి దేశాయ్, ప్రొఫెసర్ భగవాన్ చౌదరి

లైంగిక విద్యపై అవగాహన కల్పించాలి

● ఐ కనెక్ట్ సదస్సులో వక్తలు

హైదరాబాద్ సిటీ, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): లైంగిక విద్య పట్ల అవగాహన కల్పించడానికి విద్యాసంస్థల జోక్యం ఎక్కువగా ఉండాలని డాక్టర్ క్యుటెరస్ వ్యవస్థాపకురాలు డాక్టర్ తనయ నరేంద్ర, 2 మీడిటేట్ వ్యవస్థాపకురాలు స్వాతి దేశాయ్ అభిప్రాయపడ్డారు. లైంగికవిద్యపై తగిన విధివిధానాలు రూపొందిస్తే దాని పట్ల సమగ్ర అవగాహనను పొందే అవకాశాలున్నాయన్నారు. గచ్చిబౌలిలోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ)లో రెండు రోజులుగా జరుగుతున్న ఐ-కనెక్ట్ సదస్సు శనివారం ముగిసింది. ఈ సందర్భంగా 'ఉమెన్స్ సెక్సువల్ హెల్త్ ట్రాన్సెండ్స్-ప్యాడ్స్ పీరియడ్స్ అండ్ పాట్రియార్కీ' అనే అంశంపై ఫైర్ సైడ్ చాట్‌ను నిర్వహించారు. ఈ చాట్‌లో ఐఎస్‌బీలో ఐ-వెంచర్ ఫ్యాకల్టీ డైరెక్టర్ ప్రొఫెసర్ భగవాన్ చౌదరి మోడరేటర్‌గా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ తనయ నరేంద్ర, 2 మీడిటేట్ వ్యవస్థాపకురాలు స్వాతి దేశాయ్ ముఖ్యఅతిథులుగా పాల్గొని మాట్లాడారు. మహిళలను ఓ విలాసవస్తువులా బాలీవుడ్ చూపుతుందని అన్నారు. ఇటీవలి కాలంలో ఎంతోమంది సెక్సువల్ వెల్‌నెస్ రంగంలో అడుగుపెడుతున్నారని, వెల్‌నెస్ అంటే ఆరోగ్యం అనే భావిస్తున్నారని అన్నారు. వెల్‌నెస్, హెల్త్(ఆరోగ్యం) అనేవి రెండూ వేరు అని, వెల్‌నెస్ ఇండస్ట్రీలో అధిక శాతం తగినంతగా శాస్త్రీయ ఆధారాలు లేకుండానే తమ ఉత్పత్తులను విడుదల చేయడం కనిపిస్తుందని వారు వివరించారు.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా భారత ప్రభుత్వరంగ సంస్థ

అసెట్ రికవరీ శాఖ
#249/3RT, 1వ అంతస్తు, S.R.నగర్ మెయిన్ రోడ్, హైదరాబాద్, తెలంగాణ-500038

ఇ-వేలం అమ్మకం ప్రకటన

(సెక్యూరిటీ ఎన్‌ఫోర్స్‌మెంట్ రూల్స్, 2002లోని రూల్ 8(6) నిబంధనలు చూడగలరు)

[illegible]

1 [illegible]
రిజర్వు ధర: రూ. 39,00,000/- బయానా: రూ. 3,90,000/- బిడ్ పెరుగుదల: రూ. 39,000/-
తేది: 03.03.2025 వివరాల కొరకు సంప్రదించగలరు. 91214 99177

2 [illegible]
రిజర్వు ధర: రూ. 13,11,000/- బయానా: రూ. 1,31,100/- బిడ్ పెరుగుదల: రూ. 13,110/-
తేది: 03.03.2025 వివరాల కొరకు సంప్రదించగలరు. 91214 99177

3 [illegible] వెంకట రంగారావు, ఫ్లాట్ నం.జి1, గ్రౌండ్ ఫ్లోర్, నం.1-98/90/27/9/జి1, శ్రీ లక్ష్మి నివాస్, గుట్టల బేగంపేట గ్రామం, శేరిలింగంపల్లి-500081. శ్రీ సతీష్ కుమార్ మండవ (చిరునామా-3) తండ్రి స్వర్గీయ శ్రీ మండవ వెంకట రంగారావు, ఫ్లాట్‌నం.1, గ్రౌండ్ ఫ్లోర్, ఇ.నం.10-1-128/1, మాసబ్‌ట్యాంక్, హైదరాబాద్-500028. శ్రీ సతీష్ కుమార్ మండవ (చిరునామా-4) తండ్రి స్వర్గీయ శ్రీ మండవ వెంకట రంగారావు, 4-89, మొవ్వా (గ్రామం మరియు మండలం), కృష్ణా జిల్లా, ఆంధ్రప్రదేశ్ - 521135.
సెక్యూర్డ్ ఆస్తి విక్రయించి రాబట్టుకోవలసిన సెక్యూర్డ్ రుణం: రూ.23,30,086.38 (గమనిక: M/s MRC టెక్నాలజీస్ యొక్క UGECL రుణంలో రూ.3,80,950.08 బకాయి మొత్తం మినహాయించి)
విక్రయించబడే సెక్యూర్డ్ స్థిరాస్తుల వివరణ
SRO రంగారెడ్డి వద్ద నమోదైన సేల్ డీడ్ నం.7004/2003, తేది 06.06.2003 ప్రకారం స్వర్గీయ శ్రీ మండవ వెంకట రంగారావుకు చెందిన తెలంగాణ రాష్ట్రం, రంగారెడ్డి జిల్లా, శేరిలింగంపల్లి మండలం మరియు మున్సిపాలిటీ, గుట్టల బేగంపేట గ్రామం, శ్రీ లక్ష్మి నివాస్ వద్ద గల కామన్ ఏరియాలు మరియు కార్ పార్కింగ్ సహా మొత్తం భూమి 250 చ. గజాల భూమి విస్తీర్ణంలో 42.5 చ.గజాలు లేదా 35.53 చ.మీటర్లకు సమానమైన అవిభాజ్య వాటా భూమి మరియు 920 చ.అడుగుల ప్లింత్ ఏరియా కలిగిన గ్రౌండ్ ఫ్లోర్‌లోని (గ్రౌండ్ + రెండు అంతస్తులు) మున్సిపల్ నం.1-98/90/27/9/జి1 కలిగిన ఫ్లాట్ నం.జి1 యావత్తు మరియు సరిహద్దులు: ఉత్తరం: ఖాళీ, దక్షిణం: ఖాళీ, తూర్పు: మెట్లు మరియు ఫ్లాట్ నం.జి2, పశ్చిమం: ఖాళీ.
రిజర్వు ధర: రూ. 47,00,000/- బయానా: రూ.4,70,000/- బిడ్ పెరుగుదల: రూ.47,000/-
తేది: 04.03.2025 వివరాల కొరకు సంప్రదించగలరు. 91214 99177

ఇ-వేలం తేది మరియు సమయం: 11.04.2025, మ.12:00 గం. నుండి సా.5:00 గం. మధ్య
(10 నిమిషాల అపరిమిత ఆటో విస్తరణలతో) ఇ-వేలం వెబ్‌సైట్ - https://baanknet.com

బయానా దాఖలుకు చివరి తేది: వేలం ముగింపు సమయం కంటే ముందుగా బయానాను డిపాజిట్ చేయవలెను మరియు ఆస్తి ఐడితో బయానా మొత్తాన్ని లింక్‌చేయవలెను/ మ్యాప్ చేయవలెను

మొబైల్ నంబర్ మరియు చెల్లుబాటు గల ఇమెయిల్ ఐడి ఉపయోగించి https://baanknet.com లో నమోదు చేసుకోండి. రిజిస్ట్రేషన్ మరియు లాగిన్ మరియు బిడ్డింగ్ రూల్స్ కొరకు https://baanknet.com లోని హోమ్‌పేజీలో ఏర్పాటు చేసిన బయ్యర్ మాన్యువల్ లింక్‌ను దర్శించండి. విచారణల కొరకు సంప్రదించు నంబర్: 8291220220, ఇమెయిల్ ఐడి: support.baanknet@psballiance.com. బిడ్డర్లు వారి బిడ్లను దాఖలు చేసేముందు మరియు ఇ-వేలం అమ్మకం ప్రొసీడింగ్స్‌లో పాల్గొనే ముందు వేలం అమ్మకం యొక్క సవివరమైన అందరు నియమనిబంధనల కొరకు వెబ్‌సైట్ https://www.unionbankofindia.co.in/auction-property/view-auction-property.aspx మరియు www.unionbankofindia.co.in చూడవలసిందిగా సూచించబడుచున్నారు. ఈ బిడ్డింగ్ ప్రాసెస్ ముగిసిన తరువాత సఫలీకృత బిడ్డర్‌కు ఇమెయిల్ ద్వారా తెలియజేయబడును. ఆసక్తిగల బిడ్డరు సంప్రదించగలరు: అధీకృత అధికారులు, 249/3ఆర్‌టి, 1వ అంతస్తు, మెయిన్‌రోడ్, ఎస్.ఆర్.నగర్, హైదరాబాద్ - 500038, మొబైల్ నం: 9849128898

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002లోని రూల్ 8(6)/రూల్ 9(1) క్రింద చట్టబద్ధమైన 30 రోజుల అమ్మకం ప్రకటన పైన తెలిపిన తేదీన ఇ-వేలం అమ్మకం నిర్వహణ గురించి సదరు రుణం యొక్క రుణగ్రహీతలు మరియు హామీదారులకు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8(6)/ రూల్ 9(1) క్రింద ప్రకటనగా కూడా దీనిని పరిగణించగలరు.

ప్రదేశం: హైదరాబాద్, అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అసెట్ రికవరీ శాఖ

14 ఎక్స్‌ప్రెస్ రైళ్లకు రూటు మార్పు

హైదరాబాద్ సిటీ, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ స్టేషన్ పునరాభివృద్ధి పనులు ముమ్మరం కావడంతో స్టేషన్‌కు వచ్చే 14 ముఖ్యమైన రైళ్ల రూటు మార్చేందుకు దక్షిణమధ్య రైల్వే చేసిన ప్రయత్నం ఫలించింది. సికింద్రాబాద్ స్టేషన్‌లో రైళ్ల, ప్రయాణికుల రద్దీని నియంత్రించేందుకు ప్రత్యామ్నాయ మార్గాలను చూపుతూ అనుమతులు మంజూరు చేయాలని దక్షిణ మధ్య రైల్వే గత జనవరి 29న రైల్వేబోర్డుకు లేఖ రాసింది. ప్రత్యామ్నాయ చర్యలకు రైల్వే బోర్డు తాజాగా ఆమోదం తెలిపింది. చర్లపల్లి- అమ్ముగూడ- సనత్‌నగర్ మార్గంలో ఏడు రైళ్లకు, చర్లపల్లి- మౌలాలి- దయానంద్ నగర్ మార్గంలో ఆరు రైళ్లకు రూటు మార్పుతో పాటు సికింద్రాబాద్- కర్నూలు సిటీ మధ్య నడిచే తుంగభద్ర ఎక్స్‌ప్రెస్ రైలును ఇకపై కాచిగూడ టెర్మినల్ నుంచి నడిపేందుకు రైల్వే బోర్డు అనుమతించింది. ఈ మేరకు బోర్డు డైరెక్టర్ సంజయ్ నీలం దక్షిణమధ్య రైల్వే జీఎంకు శుక్రవారం లేఖ రాశారు. ఈ లేఖలో పేర్కొన్న మార్పులను అమలు చేసేందుకు ఆయా ఎక్స్‌ప్రెస్ రైళ్లు నడిచే మార్గాల్లోని అన్ని జోన్‌ల ఉన్నతాధికారులకు సంజయ్ సూచించారు.

మరో 4 హోలీ ప్రత్యేక రైళ్లు

నగరంలోని వివిధ టెర్మినల్స్ నుంచి రెండు మార్గాల్లో మరో 4 హోలీ ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్లు దక్షిణమధ్య రైల్వే ప్రకటించింది. చర్లపల్లి నుంచి గోరఖ్‌పూర్‌కు ఈనెల 10న మధ్యాహ్నం 2గంటలకు (07715) ప్రత్యేక రైలు, తిరుగు ప్రయాణంలో ఈనెల 12న ఉదయం 8గంటలకు (07716) ప్రత్యేక రైలు బయల్దేరనున్నాయి. కాచిగూడ నుంచి హిసార్‌కు ఈనెల 13న సాయంత్రం 5.30గంటలకు (07717) ప్రత్యేక రైలు, తిరుగు ప్రయాణంలో ఈనెల 16న (07718) ప్రత్యేక రైలు బయల్దేరుతాయని సీపీఆర్ఓ శ్రీధర్ తెలిపారు.ఆయా రైళ్లలో ఏసీ టూటైర్, త్రీటైర్, స్లీపర్, జనరల్ సెకండ్ క్లాస్ కోచ్‌లు ప్రయాణికులకు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు.

FOR SALE ఆంధ్రజ్యోతి Daily JOBS
CLASSIFIEDS

LEASE / RENT
H Commercial Space 1500 sqft, First Floor, Ranigunj, Pan Bazar, Opp. Jain Temple, Sec'bad. Ph: 9393067891 / 9100551194 AJH>1226

FLAT FOR SALE
H Isnapur EAST & WEST FACES HMDA 8flats > 2BHK 8000SFT Parking 3000SFT 24/7 Water. Rs: 4 Cr. & 150sqyds plots 9849049842 AJH>15479

PLOT FOR SALE
H అతి తక్కువ ధరలో ప్లాట్లు... యాదగిరి గుట్ట @ ఆలేరులో 121 చ.గజాలు రూ.2,40,000/-, చుట్టూ ఫెన్సింగ్ H గేటు H సెక్యూరిటీ... Cont.: 7702800110 AJH>15477
H మీ పిల్లల బంగారు భవిష్యత్తు కొరకు... 1 లక్షకే 121 చ.గజాల ప్లాటు నారాయణఖేడ్‌లో మామిడి, జామ, బత్తాయి మొక్కలతో EMI కలదు. Cont.: 8500664291 AJH>15476
H హయత్‌నగర్, పసుమాముల కుంట్లూరు, పెద్దఅంబర్‌పేట్, అబ్దుల్లాపూర్ మెట్, మునగనూర్, కోహెడ ప్రాంతాలలో ప్లాట్లు కొనబడును. (నో బ్రోకర్స్) 9391125860 AJH>002917

లేడీ కుక్ లభించును
H అనుభవం గల లేడీ కుక్ కలదు. 250-300 మంది గల స్టూడెంట్స్ హాస్టల్‌కు వంట వండే సామర్థ్యం ఉంది. జీతం 30 వేలు ఉండాలి. ఫోన్: 9989656344 AJH>15478

CHANGE OF NAME
H I, GUNDA RAJESHWAR, S/o. Rama Murthy, R/o. 11.No.1>1>392/306, F.No.306, 7th Block, [illegible] Prajay Nivas, Mohan Nagar, Kothapet, Saroornagar, R.R. Dist. has changed my son's Name from Gunda Vishveshwar to Gunda Karthikeya S/o Gunda Rajeshwar as Per Astrology. AJH>002920

RENTALS
H ERRAGADDA INDP. HOUSE 253 Sqyds. built up area: 1660sft., 3 BHK, Dining, Kitchen, Wash Area, Sitout, Car Parking Open Terrace. Cont: 9618522858/7995947174 AJH>003117

TOURS & TRAVELS
H 16/04/25, అయోధ్య, కాశీ, నేపాల్, ముక్తినాథ్ యాత్ర & 09/05/25, సరస్వతి పుష్కరాలు, చార్‌ధామ్ యాత్ర రై+బ+భో+వ. భాగ్యలక్ష్మీ టూర్స్. ఫోన్: 9397617094 AJH>1863

వంట మనిషి కావలెను
H మా నివాస గృహానికి అన్ని రకాల వంటకాలలో (వెజ్ మాత్రమే) నైపుణ్యం కలిగిన వంట మనిషి కావలెను. మీ నైపుణ్యానికి తగిన

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన/క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ADVT

క్లాసిఫైడ్స్ ప్రకటనల కొరకు ఈ క్రింది నంబర్లను సంప్రదించగలరు.
99859 21380, 99859 21386
97036 18806

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్
ప్రతి ఐటమ్‌కు నిజమైన ఫలితం
REAL ESTATE | SITUATION VACANT | TO LET | AUTOMOTIVE | COMPUTERS | HEALTH CARE | EDUCATION | ENTERTAINMENT
4 లైన్ల ప్రకటనకు కేవలం రూ. 700/- GST 6% Extra
ప్రతి అదనపు లైన్‌కు రూ. 150/-
సెల్: 9985921380 / 9985921386 9703618806 / 9985406505



ఈ వారమే విడుదల

ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌ల వివరాలు

ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
నెట్‌ఫ్లిక్స్		
అమెరికన్ మ్యాన్‌హంట్	డాక్యూ సిరీస్	మార్చి 10
అమెజాన్ ప్రైమ్		
వీల్ ఆఫ్ టైమ్ 3	వెబ్‌సిరీస్	మార్చి 13
బీ హ్యాపీ	హిందీ చిత్రం	మార్చి 14
జీ5		
ఇన్ గలియోంమే	హిందీ చిత్రం	మార్చి 14
ఆపిల్ టీవీ ప్లస్		
డోప్ థీఫ్	వెబ్‌సిరీస్	మార్చి 14
ఈటీవి విన్		
పరాక్రమం	తెలుగు చిత్రం	మార్చి 13
రామం రాఘవం	తెలుగు చిత్రం	మార్చి 14
సోనీ లివ్		
ఏజెంట్	తెలుగు చిత్రం	మార్చి 14

కూతురు కోసం తండ్రి తపన

దేశంలోని అతిపెద్ద డ్యాన్స్ రియాలిటీ షోలో ప్రదర్శన ఇవ్వాలన్న కూతురి కోరికను తీర్చేందుకు ఓ తండ్రి చేసిన ప్రయత్నాల నేపథ్యంలో సాగే హిందీ చిత్రం 'బీ హ్యాపీ'. అభిషేక్‌బచ్చన్ శివ అనే అంకిత భావం గల తండ్రి పాత్రను పోషించారు. ఇనాయత్ వర్మ ఆయన కూతురు ధార పాత్రలో కనిపించనుంది. డాన్స్ డ్రామా నేపథ్యంలో ఈ చిత్రం తెరకెక్కింది. తల్లి లేని లోటు తెలియకుండా అల్లారుముద్దుగా పెంచుకున్న కూతురి కోరికను తీర్చేందుకు తపించే తండ్రి పాత్రలో అభిషేక్ నటన ఈ సినిమాకు ప్రధానాకర్షణ అని ట్రైలర్‌ను బట్టి తెలుస్తోంది. తండ్రీ, కూతురు కలసి ముంబై వెళ్లడం, అక్కడ డ్యాన్స్ షోలో పాల్గొనేందుకు వారు చేసే ప్రయత్నాల్లోంచి పుట్టే వినోదం అలరిస్తుంది. ఈ చిత్రానికి రెమో డిసౌజా దర్శకత్వం వహించగా, సల్మాన్‌ఖాన్, ఇమ్రాన్ మజూర్ నిర్మించారు.



వేసవిలో పిల్లలకు ఇవి తినిపించాలి..!

వేసవికాలంలో పిల్లలకు బలవర్ధకమైన పోషకాహారం అత్యవసరం. పెరుగుతున్న ఎండవేడిని తట్టుకునేలా సమయానుసారం పిల్లలకు ఎలాంటి ఆహారం పెట్టాలో తెలుసుకుందాం.

- ఎండ వేడిమి వల్ల పిల్లల శరీరంలో నిర్జలీకరణ స్థితి ఏర్పడి వడదెబ్బ తగిలే అవకాశం ఉంటుంది. దీన్ని నివారించేందుకు తరచూ పిల్లల చేత చల్లని నీరు తాగిస్తూ ఉండాలి. ఫ్రిజ్ కంటే కుండలోని నీళ్లు ఆరోగ్యానికి మంచివి.
- మధ్యాహ్న సమయంలో పలుచని మజ్జిగ, కొబ్బరి నీళ్లు, పండ్ల రసాలు, నిమ్మరసం, రాగి జావ, బార్లీ నీళ్లు తాగించాలి. కూల్‌డ్రింక్స్, ఐస్‌క్రీమ్‌ల జోలికి వెళ్లనీయకూడదు.
- సబ్జా గింజలు లేదా చియా గింజలను నీళ్లలో నానబెట్టి వాటిని పండ్ల రసాలు లేదా చల్లని మజ్జిగలో కలిపి పిల్లలకు తాగించవచ్చు. సగ్గుబియ్యంతో తయారు చేసే జావ కూడా వేసవి తాపాన్ని హరిస్తుంది.
- పుచ్చకాయ, కర్బూజా, బొప్పాయి, నారింజ, స్ట్రాబెర్రీ, దానిమ్మ, మామిడి లాంటి తాజా పండ్లను పిల్లలకు తినిపించాలి. కీరా ముక్కలు, తాటి ముంజలు కూడా మేలు చేస్తాయి.
- పాలకూర, టమాటా, కేరట్, బీట్‌రూట్, సొరకాయ, బీరకాయ లాంటి కూరగాయలతో చేసిన వంటలను భోజనంలో చేర్చాలి.
- తాజా కూరగాయలు, పండ్లతో సలాడ్స్, స్మూతీలు తయారు చేసి ఇస్తే పిల్లలు ఇష్టంగా తింటారు.
- ఉదయం అల్పాహారంగా ఇడ్లీ, దోశ, పెసరట్టు, పోహ లాంటి తేలికగా జీర్ణమయ్యేవాటిని తినిపించాలి. మధ్యాహ్న భోజనంలో రకరకాల కూరగాయలతో తయారు చేసిన సాంబార్, మజ్జిగ ఉండేలా చూడాలి. వీటివల్ల పిల్లలకు జీర్ణశక్తి మెరుగుపడుతుంది. శరీరంలో నీటిశాతం నిలిచి ఉంటుంది. రాత్రి భోజనంలో ఆరోగ్యకరమైన సూప్‌ని చేర్చాలి. సాధ్యమైనంతవరకూ నూనె, మసాలా పదార్థాలను పిల్లలకు పెట్టకపోవడమే మంచిది.
- సాయంకాలం పిల్లలు ఆకలి అన్నప్పుడు కొన్ని డ్రై ఫ్రూట్స్, ఖర్జూరాలు, మొలకలు, తేనె కలిపిన పండ్ల ముక్కలు తినిపించవచ్చు.



'భంభం భోలే...' అంటూ ఖంగుమని మోగే కంచుకంఠం కైలాష్ ఖేర్‌ది! 'జేజమ్మ...', 'వచ్చాడయ్యా సామి...', 'కథానాయక...' లాంటి పాటలతో తెలుగువారికి దగ్గరయిన కైలేష్ ఖేర్ 19 భాషల్లో తన గానాన్ని వినిపిస్తున్నారు. ఆయన ఆత్మకథ 'తేరీ దివానీ' ఇటీవల విడుదలయింది. ఈ నేపథ్యంలో ఆయన 'నవ్య'కు ఇచ్చిన ఇంటర్వ్యూ...

సిద్ధి లేకుండా ప్రసిద్ధి చెందలేం



చాలా మంది జీవితంలో చివరి దశలోనే ఆత్మకథలు రాస్తారు... మీరు ఇప్పుడే రాయటానికి కారణాలేమిటి?

నా ఉద్దేశంలో ప్రతి వ్యక్తి జీవితం ఒక అందమైన కథ. దీనిలో అనేక పార్శ్వాలు ఉంటాయి. ఇవి కూడా మనల్ని అభిమానించేవారికి తెలియాలి. అయితే ఈ పార్శ్వాలను ఎంత జాగ్రత్తగా, ఎంత నిబద్ధతతో వారి దగ్గరకు తీసుకువెళ్తున్నామనేది ముఖ్యం. దీనికి మాధ్యమంగా నేను పుస్తకాన్ని ఎంచుకున్నాను. ఇక నా జీవితం సంగీతంతో ముడిపడి ఉంది. అందరికీ నేను ఒక గాయకుడిగా మాత్రమే తెలుసు. చాలాకాలంగా నా అభిమానులు నా దగ్గరకు వచ్చి "మీ పాటలు మా హృదయాన్ని తాకుతాయి. మీరు మనసు పెట్టి పాడతారు. అలా పాడటానికి వెనుక ఉన్న కారణాలేవిటి?" అని అడుగుతూ ఉంటారు. వారి కోసమే 'తేరీ దివానీ' అనే ఈ పుస్తకాన్ని తీసుకువచ్చాను. ఒక సామాన్యుడు అసామాన్య కళాకారుడిగా ఎలా రూపుదిద్దుకున్నాడన్నదే ఈ పుస్తక కథ. ఇక్కడ ఇంకో విషయం కూడా చెప్పాలి. ఈ పుస్తక ప్రచురణకర్తల్లో నేను కూడా ఒకడిని. ఎందుకంటే - మంచి పుస్తకాలు అందరి దగ్గరకు వెళ్లాలనేదే నా కోరిక. అందుకే కైలాస ఎడ్వర్‌టైజింగ్ అనే సంస్థను ఏర్పాటు చేసి 'పెంగ్విన్' సంస్థతో కలిపి ఈ పుస్తకాన్ని ప్రచురించాం.

పుస్తక రచన సమయంలో మీ అనుభవాలేమిటి?

మనం ప్రపంచాన్ని ఎలా చూస్తే అలా కనిపిస్తుంది. ఒక ఏనుగును నలుగురు అంధులు వేరు వేరుగా చూస్తారు. వారి వారి అనుభవాలు వారికి ఉంటాయి. మనం కూడా అంతే. మనకు తెలిసిందే ప్రపంచం అనుకుంటాం. కానీ ఈ పుస్తకం రాసేటప్పుడు నాకు అనేక అనుభవాలు కలిగాయి. ఆ సమయంలో కైలాష్ కేర్ పైకి కనిపిస్తాడు. కానీ వాడి చేత రాయించేవాడు ఈశుడే! ఈ విషయం నాకు పుస్తకం రాసే సమయంలో అర్థమయింది. ఆ సమయంలో నాకు ఒక మిత్రుడు సహకరిస్తున్నాడు. ఒక రోజు మేమిద్దరం కలుసుకోవాల్సి ఉంది. కానీ తను నాకు ఫోన్ చేసి- "నేను రాలేను" అని చెప్పాడు. ఎందుకో అప్పుడు నాకు - 'క్యా సజనా... బిన్ సజనా..' అనే రెండు మాటలు అప్రయత్నంగా వచ్చాయి. ఆ మాటల నుంచి అప్రయత్నంగా పాట పుట్టుకువచ్చింది. ఆ పాటను త్వరలోనే విడుదల చేయబోతున్నాం. ఇలాంటి అనుభవాలెన్నో.

మీ ఆలోచనలు సంగీతంలో ఉంటాయా? మాటల్లో ఉంటాయా?

నేను దేన్నీ ఆలోచించను. మనసులో వచ్చిన ఆలోచనలను ఎప్పటికప్పుడు మాటల రూపంలో పెడతానంతే! మాట్లాడినప్పుడు కూడా అంతే! అందుకే నా మాటల్లో స్పష్టత ఉంటుంది. మాటలు నది మాదిరిగా ప్రవహిస్తూ ఉంటాయి.

మన దేశంలో సినిమా సంగీతానికి ఉన్న ప్రాధాన్యత దేశీయ సంగీతానికి ఉందని మీరు అనుకుంటున్నారా?

మన దేశంలో సినిమా పాటలకు ఆదరణ ఎక్కువ. కానీ దేశీ సంగీతానికి కూడా స్థానికంగా చాలా ప్రాధాన్యం ఉంటుంది. మన దేశంలో ప్రతి ప్రాంతానికి ఒకో ప్రత్యేకత ఉంది. అక్కడ ఉన్న సంగీతం ఇతరులు కూడా విన్నప్పుడు దానిలో ఉన్న గొప్పదనం అర్థమవుతుంది. నేను గత పదేళ్లుగా 'భారత్‌కా అమృత్ కలశ్' అనే రియాలిటీ షో నిర్వహిస్తున్నాను. దీనిలో దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన వారి వారి వేష భాషల్లో వచ్చి పాటలు పాడతారు. ఛానల్స్‌లో కూడా ఇలాంటి షోలు రావాలి. లేకపోతే వాళ్ల రియాలిటీ షోలకు 'ఫిల్మీ రియాలిటీ షో' అని పేరు పెట్టుకోవాలి.

మీతో కలిసి ఆల్బమ్స్ చేయటానికి చాలామంది ఔత్సాహికులు వస్తూ ఉంటారు.. వారికి మీరు ఇచ్చే సలహా ఏమిటి?

సిద్ధి లేకుండా ప్రసిద్ధి చెందలేం. అంటే చాలా కష్టం తర్వాతే విజయం లభిస్తుంది. దానివల్ల ప్రసిద్ధులమవుతాం. కానీ ఈ మధ్యకాలంలో సులభంగా ప్రసిద్ధి చెందాలనే ఆలోచన చాలామందిలో కనిపిస్తోంది. మనల్ని ఇష్టపడే అభిమానుల సంఖ్య క్రమంగా పెరగాలి. అంతేతప్ప ఒకేసారి లక్షలమంది రావాలనుకోకూడదు. ఒక పాట హిట్ అయిన వెంటనే ప్రపంచాన్ని జయించామని అనుకోకూడదు.

కైలాష్ ఖేర్ ఎప్పుడూ సనాతన ధర్మాన్ని ప్రచారం చేస్తూ కనిపిస్తారు. శుద్ధమైన హిందీలో మాట్లాడతారు. అందుకు కారణమేదైనా ఉందా?

గత కొద్దికాలంగా నేను మాట్లాడే భాషలో కూడా మార్పు వచ్చింది. ఒకప్పుడు నేను మామూలుగా మాట్లాడేవాడిని. ఇప్పుడు శుద్ధంగా మాట్లాడటం నేను నేర్చుకున్నాను. నేను పాటలు పాడటం మొదలుపెట్టినప్పుడు నాకు ఏమీ తెలీదు. సినిమా పాటలు, 'చిత్రహార్' లాంటివి తెలీదు. టీవీలో షోలు కూడాఎప్పుడూ చూడలేదు. అలాంటి నేను ఇప్పుడు 19 భాషల్లో పాడుతున్నానంటే ఏదో ఒక కారణం ఉండాలి కదా! ఆ కారణం ఆధ్యాత్మికత. నా ఉద్దేశంలో ఆధ్యాత్మికత లేకపోతే భారత దేశం లేదు. ఇంగ్లీషు సంస్కృతి నాలుగైదు వందల సంవత్సరాల క్రితం వచ్చిందే. అంతకుముందు నుంచి 'బతుకు...బతకనివ్వు' అనేది మన సంస్కృతి. 'అందరూ బావుండాలి... అందులో మనం ఉండాలి' అనేది మన సంస్కృతి. ఇక్కడ ఇంకో విషయం కూడా చెప్పాలి. ప్రపంచంలో అందరూ యంత్రాలు తయారుచేస్తున్న సమయంలో మనం మంత్రాలు జపించేవాళ్లం. వాళ్లు యంత్రాలు తయారుచేసి పిచ్చివాళ్లు అయిపోయారు. ఇప్పుడు వారు మానసిక ప్రశాంతత కోసం మన దగ్గరకు వస్తారు. అంటే మన సంస్కృతి అంత గొప్పది. అలాంటి భావనను నేను ఎప్పుడూ వదలను. కైలాష్ కేర్ ఎప్పుడూ మారడు. ఆధ్యాత్మికతను వదలడు.

• సివిఎల్ఎన్ ప్రసాద్






కథానాయకుడు బాలకృష్ణ తనయుడు మోక్షజ్ఞ వెండితెర ఆరంగేట్రం కోసం నందమూరి అభిమానులు ఎప్పటినుంచో ఎదురుచూస్తున్నారు. 2024లో వారి ఎదురుచూపులు ఫలించాయి. 'హను-మాన్' చిత్రంతో పాన్ ఇండియా దర్శకుడిగా మారిన ప్రశాంత్ వర్మ దర్శకత్వం వహించే ఓ చిత్రం ద్వారా మోక్షజ్ఞ హీరోగా పరిచయమవ్వనున్నట్లు అధికారికంగా వెల్లడించారు.

వెండితెర ఎంట్రీ దక్కాలంటే ఆషామాషీ విషయం కాదు. అలాంటిది ఇండస్ట్రీనే ఎర్రతివాచీ వేసి ఆహ్వానిస్తే ఎలా ఉంటుంది. పరిశ్రమలో నటీనటుల వారసుల పరిచయానికి ఉండే క్రేజే వేరు. కొత్తగా వచ్చే వారసులకు తమ తల్లిదండ్రుల అభిమానుల ఆదరణ కూడా విశేషంగా ఉంటుంది. అలా వెండితెర ఎంట్రీ ఇస్తున్న కొత్త తరంపై ఓ లుక్కేద్దాం.

వారసులు వచ్చేస్తున్నారు...







ఎన్టీఆర్ నటవారసత్వాన్ని నందమూరి బాలకృష్ణ అందుకొన్న విషయం తెలిసిందే. ఇప్పటికే ఆ కుటుంబం నుంచి మూడు తరాల నటులు ఇండస్ట్రీకి పరిచయమయ్యారు. తాజాగా, ఆ కుటుంబం నుంచి నాలుగో తరానికి చెందిన ఇద్దరు నూతన కథానాయకులు చిత్రసీమను పలకరించనున్నారు. అందులో ఒకరు బాలకృష్ణ తనయుడు మోక్షజ్ఞ కాగా, మరోకరు హరికృష్ణ మనవడు, జానకిరామ్ తనయుడు తారకరామారావు. కథానాయకుడు బాలకృష్ణ తనయుడు మోక్షజ్ఞ వెండితెర ఆరంగేట్రం కోసం నందమూరి అభిమానులు ఎప్పటినుంచో ఎదురుచూస్తున్నారు. 2024లో వారి ఎదురుచూపులు ఫలించాయి. 'హను-మాన్' చిత్రంతో పాన్ ఇండియా దర్శకుడిగా మారిన ప్రశాంత్ వర్మ దర్శకత్వం వహించే ఓ చిత్రం ద్వారా మోక్షజ్ఞ హీరోగా పరిచయమవ్వనున్నట్లు అధికారికంగా వెల్లడించారు. ఇది ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్‌లో సూపర్ హీరో కథాంశంతో తెరకెక్కనుంది. త్వరలోనే చిత్రీకరణ ప్రారంభం కానుంది. దీని తర్వాత తన తండ్రి బాలకృష్ణ దర్శకత్వంలో 'ఆదిత్య 999 మ్యాక్స్' చిత్రంలో మోక్షజ్ఞ నటించనున్నారు. బాలకృష్ణ కథానాయకుడిగా సింగీతం శ్రీనివాసరావు తెరకెక్కించిన సూపర్ హిట్ చిత్రం 'ఆదిత్య 369'కు సీక్వెల్‌గా ఈ సినిమాను రూపొందిస్తున్నారు. అలాగే, "సార్, 'లక్కీ భాస్కర్' చిత్రాలతో సూపర్‌హిట్‌లు అందుకొన్న వెంకీ అట్లూరీ కూడా మోక్షజ్ఞ కోసం ఓ కథ తయారుచేశారట. నట వారసులను, కొత్తతరాన్ని ఇండస్ట్రీకి పరిచయం చేయడంలో ముందుంటారు దర్శకులు వైవీఎస్ చౌదరి. ఆయన దర్శకత్వంలో తెరకెక్కబోతున్న ఓ సినిమాలో జానకీరామ్ తనయుడు తారకరామారావు కథానాయకుడిగా ఎంట్రీ ఇస్తున్నారు. ఇటీవలె ఈ సినిమాను ప్రకటించడంతో పాటు తారకరామారావు లుక్‌ను విడుదల చేశారు. ఇందులో కథానాయికగా వీణారావు నటిస్తున్నారు. ఈ ఏడాదే సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకువచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

మరో మేనల్లుడు సిద్ధం

ఘట్టమనేని కుటుంబం నుంచి తెరంగేట్రం చేసేందుకు మరో వారసుడు సిద్ధమయ్యారు. మహేశ్‌బాబు అల్లుడిగా ఇప్పటికే అశోక్ గల్లా 'హీరో' సినిమాతో పరిచయమై ప్రేక్షకులను మెప్పించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు అశోక్ తమ్ముడు సిద్ధార్థ్ గల్లా కూడా సిల్వర్‌స్క్రీన్ వైపు అడుగులేస్తున్నారు. రచయిత గోపీ మోహన్ దర్శకత్వంలో ఇది తెరకెక్కనుంది. అలాగే, మహేశ్‌బాబు అన్న కుమారుడు రమేశ్‌బాబు తనయుడు కూడా వెండితెరపై అలరించేందుకు ముస్తాబవుతున్నారు.

బాలనటులుగా

మంచు కుటుంబం నుంచి మూడో తరం వారసులు వెండితెర ఎంట్రీకి రెడీ అయ్యారు. మంచు మోహన్‌బాబు, ఆయన తనయులు విష్ణు, మనోజ్ నటులుగా ఇప్పటికే ఇండస్ట్రీలో ఉన్నారు. మంచు విష్ణు కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'కన్నప్ప'. ఈ సినిమాతో ఆయన తనయుడు అవ్రామ్, కుమార్తెలు అరియాన, వివియాన బాలనటులుగా పరిచయం అవుతున్నారు. భారీ తారాగణంతో ముఖేశ్‌కుమార్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం ఏప్రిల్ 25న విడుదల కానుంది.

డియోల్ కుటుంబం నుంచి..



'యానిమల్' సినిమాతో ఫామ్‌లోకి వచ్చారు బాబీ డియోల్. ఆయన కుమారులు ఆర్యమన్ డియోల్, ధరమ్ డియోల్ కూడా ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇవ్వడానికి సుముఖంగా ఉన్నట్లు వెల్లడించారు. తెలుగులో ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య జంటగా 2023లో విడుదలై ఘనవిజయం సాధించిన 'బేబీ' సినిమాను ఆర్యమన్ డియోల్ హీరోగా తెరకెక్కించనున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమాలో దివంగత నటుడు ఇర్ఫాన్ ఖాన్ తనయుడు బాబిల్ ఖాన్ కూడా నటించను హీరోయిన్లుగా సారా అలీఖాన్, క్రితి శెట్టి పేర్లను పరిశీలిస్తున్నారు.

సైఫ్ నటవారసుడు



బాలీవుడ్ నటుడు సైఫ్ అలీ ఖాన్ వారసురాలిగా సారా అలీ ఖాన్ ఇప్పటికే సినిమాల్లో ఎంట్రీ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఇప్పుడు సైఫ్ తనయుడు ఇబ్రహీం అలీఖాన్ హీరోగా ప్రేక్షకుల ముందుకు వచ్చారు. షౌనా గౌతమ్ దర్శకత్వంలో తెరకెక్కిన 'నదానియాన్' చిత్రంలో నటించారు. ఇటీవలె ఈ సినిమా విడుదలైంది. ఆయన ప్రస్తుతం కునాల్ దేశ్‌ముఖ్ దర్శకత్వంలో 'దిలెర్' అనే చిత్రంలో నటిస్తున్నారు. ఇందులో శ్రీలీల కథానాయికగా నటిస్తోంది.

మెగాఫోన్‌తో...

స్టార్ హీరోల వారసులు ఎక్కువ మంది నటులుగా మారుతుంటే.. వారికి భిన్నమైన దారిలో ప్రయాణిస్తున్న వారూ ఉన్నారు. తమిళ కథానాయకుడు విజయ్ తనయుడు జేసన్ సంజయ్ దర్శకుడిగా మెగాఫోన్ పట్టనున్నారు. సందీప్ కిషన్ హీరోగా ఓ చిత్రాన్ని రూపొందిస్తున్నారు.



బాలీవుడ్ నటుడు షారుక్ ఖాన్ తనయుడు ఆర్యన్ ఖాన్ కూడా దర్శకత్వం వైపు అడుగులేస్తున్నారు. 'బా..డ్స్ ఆఫ్ బాలీవుడ్' పేరిట నెట్‌ఫ్లిక్స్ రూపొందిస్తున్న ఈ సెటైరికల్ వెబ్ సిరీస్‌కు ఆర్యన్ ఖాన్ దర్శకుడు. ఇందులో షారుక్ ఖాన్, ఆవిర్ ఖాన్, సల్మాన్ ఖాన్ తదితరులు అతిథి పాత్రల్లో మెరవనున్నారు.

యంగ్ పవన్‌గా..

పవన్‌కల్యాణ్ తనయుడు అకీరా నందన్ వెండితెరపైకి ఎంట్రీ ఇవ్వకున్నా.. మెగా అభిమానులకు బాగా సుపరిచితమే. అప్పుడప్పుడు సోషల్ మీడియాలో అకీరా చేసే వీడియో ఎడిట్స్‌ను మెచ్చుకుని మురిసిపోతుంటారు మెగాభిమానులు. ప్రస్తుతం పవన్ కథానాయకుడిగా 'సాహో' ఫేమ్ సుజీత్ దర్శకత్వంలో 'ఓజీ' తెరకెక్కుతోంది. ఇందులో పవన్ ఫ్లాష్‌బ్యాక్ ఎపిసోడ్‌లో అకీరా మెరవనున్నట్లు టాక్.

నటించే సామర్థ్యంతో పాటు కీబోర్డ్ ప్లేయర్‌గానూ అకీరాకు ప్రవేశముంది. దీంతో ఈ సినిమాలో తమ సంగీత బృందంలో అకీరాను చేర్చుకునే ఆలోచనలో ఉన్నట్లు తమన్ తెలిపారు.



అర్జున్ సన్నాఫ్ వైజయంతి



నందమూరి కల్యాణ్‌రామ్ హీరోగా ప్రదీప్ చిలుకూరి దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'ఎన్‌కేఆర్ 21'. అశోక్ వర్ధన్ ముప్పా, సునిల్ బలుసు నిర్మాతలు. ఈ చిత్రంలో ఐపీఎస్ అధికారిగా పవర్‌ఫుల్ పాత్రలో విజయశాంతి నటిస్తున్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా ఈ చిత్రం పేరును యూనిట్ ప్రకటించింది. 'అర్జున్ సన్నాఫ్ వైజయంతి' అనే టైటిల్‌ను నిర్ణయించి, ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని విడుదల చేసింది. పోస్టర్‌లో కల్యాణ్ రామ్, విజయశాంతి మండుతున్న జ్వాలల మధ్య ధృడ సంకల్పంతో నడుస్తున్నట్లు కనిపిస్తున్నారు. కాగా, ఈ చిత్రంలో సాయి మంజ్రేకర్ కథానాయికగా, సోహైల్ ఖాన్ విలన్‌గా నటిస్తున్నారు.

సరికొత్త ప్రేమకథను చూస్తారు



- దర్శకుడు విశ్వకరుణ్

కిరణ్ అబ్బవరం నటించిన తాజా చిత్రం 'దిల్‌రుబా' ఈ నెల 14న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో చిత్ర దర్శకుడు విశ్వకరుణ్ శనివారం సినిమా విశేషాలు మీడియాతో పంచుకున్నారు. 'వెస్ట్రన్ కల్చర్ నుంచి మనం సార్, థాంక్స్ అనే మాటల్ని త్వరగా అలవాటు చేసుకున్నాం. తెలుగులో క్షమించమని అడగలేం కానీ సారీ అని మాత్రం ఈజీగా చెప్పేస్తాం. తన తప్పు లేనప్పుడు సారీ ఎందుకు చెప్పాలంటాడు మా హీరో. ఈ సినిమాలో కిరణ్ అబ్బవరం పోషించిన సిద్ధు పాత్ర తన వ్యక్తిత్వం విషయంలో కాంప్రమైజ్ కాదు. దీని వల్ల అతను జీవితంలో ఎటువంటి ఇబ్బందులు ఎదుర్కొన్నాడు, వాటిని ఎలా అధిగమించాడు అన్నదే చిత్ర కథ' అని ఆయన చెప్పారు. ఇటీవల వచ్చిన 'డ్రాగన్' చిత్రానికీ, తమ సినిమాకు సంబంధం లేదని చెబుతూ 'మా మూవీ ట్రీట్‌మెంట్ వేరుగా ఉంటుంది. ప్రేమకథలన్నీ ఒకటే. వాటిని తెరపై చూపించే విధానమే కొత్తగా ఉంటుంది. అటువంటి కొత్త తరహా ప్రేమకథను దిల్ రుబాలో చూస్తారు' అని వివరించారు. 'కిరణ్ అబ్బవరం ఇచ్చిన సపోర్ట్‌ను మరచిపోలేను. నా వర్క్‌లో ఆయన ఎప్పుడూ ఇన్‌వాల్వ్ కాలేదు. కెరీర్‌లో ఎదురు దెబ్బలు తిన్న ఎవరికైనా మంచి సినిమా చేయాలనే భయం ఉంటుంది. అందుకే ఒకటికి రెండు సార్లు చెక్ చేసుకుంటాం. కిరణ్‌గారు చేసేది అదే. 'క' మూవీ సక్సెస్ తర్వాత మరింత గ్రాండ్‌గా 'దిల్‌రుబా'ను తీసుకురావాలని ఆయన అనుకున్నారు. ఆ క్రమంలో కొన్ని మార్పులు చేశాం కానీ మూల కథలో ఎలాంటి మార్పు చేయలేదు' అని వివరించారు.



చిత్రజ్యోతి SINCE 1965

తెలుగులోనూ అద్భుతమైన స్పందన

'ఒక చరిత్రను సినిమాగా తీయడం అంత తేలికైన విషయం కాదు. అందుకే 'ఛావా' చిత్రాన్ని రూపొందించిన దర్శకుడు లక్ష్మణ్‌కు ధన్యవాదాలు' అన్నారు నిర్మాత బన్నీవాసు. విక్కీ కౌశల్, రష్మిక నటించిన 'ఛావా' చిత్రాన్ని గీతా ఆర్ట్స్ డిస్ట్రిబ్యూటర్స్ తెలుగులో విడుదల చేసింది. మంచి ఆదరణ దక్కుతున్న సందర్భంగా యూనిట్ శనివారం థాంక్స్ మీట్‌ను నిర్వహించింది. బన్నీ వాసు మాట్లాడుతూ 'ఈ సినిమాను తెలుగులో విడుదల చేసినందుకు గర్వంగా ఉంది. మమ్మల్ని నమ్మి సినిమా ఇచ్చిన దినేశ్‌కు కృతజ్ఞతలు. తెలుగులోనూ 'ఛావా'కు అద్భుతమైన రెస్పాన్స్ వస్తోంది. ఇది పిల్లలకు చూపించాల్సిన సినిమా. ఇది కేవలం సినిమా కాదు.. ఒక ఎమోషన్. ఈ రోజు మనం ఇంత స్వేచ్ఛనీ, స్వాతంత్ర్యాన్ని అనుభవిస్తున్నామంటే కారణం ఆ రోజు శంభాజీ మహారాజ్ వంటి మహావీరుల త్యాగ ఫలితమే. మా టీమ్ చాలా బాగా పని చేసింది. రెహమాన్ గారు ఎంతో బిజీగా ఉన్నా నాలుగు రోజుల్లో పాటలు పూర్తి చేశారు' అని చెప్పారు. తెలుగు డబ్బింగ్ డైరెక్టర్ రాఘవ మాట్లాడుతూ 'ఒక సినిమాలా కాకుండా ఎంతో ఎమోషనల్‌గా ఫీలయి, అందరూ పని చేశారు. నాలుగే రోజుల్లో డే అండ్ నైట్ వర్క్ చేసి అద్భుతమైన క్వాలిటీతో డబ్బింగ్ పూర్తి చేశాం' అని చెప్పారు. సినిమాలో మంచి పాత్ర చేసే అవకాశం ఇచ్చిన దర్శక నిర్మాతలకు నటుడు వినీత్‌కుమార్ సింగ్, పాటలు రాసే ఛాన్స్ ఇచ్చిన బన్నీ వాసుకి గీత రచయిత శ్రీమణి కృతజ్ఞతలు తెలిపారు.

అట్టహాసంగా ఐఫా వేడుకలు



ఇంటర్నేషనల్ ఇండియన్ ఫిల్మ్ అకాడమీ (ఐఫా) సిల్వర్ జూబ్లీ వేడుకలు జైపూర్‌లో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ వేడుకల్లో పాల్గొనేందుకు షారుక్ ఖాన్, షాహిద్ కపూర్, మాధురీ దీక్షిత్, కరీనా కపూర్, కృతీ సనన్ తదితరులు జైపూర్ చేరుకున్నారు. నటుడు కార్తీక్ ఆర్యన్, దర్శక నిర్మాత కరణ్ జోహార్ ఈ కార్యక్రమానికి వ్యాఖ్యాతలుగా వ్యవహరిస్తున్నారు. 'జబ్ వియ్ మెట్' జంట షాహిద్ కపూర్, కరీనా కపూర్ ఈ వేడుకలో ప్రత్యేకాకర్షణగా నిలిచారు. ఈ మాజీ ప్రేమికులిద్దరూ వేదికపై ఆత్మీయంగా ఆలింగనం చేసుకున్నారు. నేడు ఐఫా అవార్డులను విజేతలకు ప్రదానం చేస్తారు. బాలీవుడ్ ఆల్‌టైమ్ క్లాసిక్ చిత్రం 'షోలే' విడుదలై 50 ఏళ్ల అయిన సందర్భంగా ప్రీమియర్ షో ప్రదర్శించి అమితాబ్ బచ్చన్, ధర్మేంద్రలతో పాటు చిత్రబృందాన్ని ఘనంగా సన్మానించనున్నారు.








ఆ 50 మీటర్లు చాలా డేంజర్...!

- అదే షీర్ జోన్.. ఏమైనా జరగొచ్చు
- ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో 13.850 కిమీల నుంచి 13.9 కిమీల మధ్య ప్రాంతంపై జీఎస్ఐ హెచ్చరిక
- ఈ నెల 11వ తేదీన సీఎం సమీక్ష

(ఎస్ఎల్‌బీసీ నుంచి ఆంధ్రజ్యోతి ప్రత్యేక ప్రతినిధి)

శ్రీశైలం లెఫ్ట్ బ్యాంకు కెనాల్(ఎస్ఎల్‌బీసీ) టన్నెల్‌లో 13.6 కిలోమీటర్ల తర్వాత ముందుకు వెళ్లడం ఏమాత్రం సురక్షితం కాదని జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా(జీఎస్ఐ) హెచ్చరించింది. ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో ఫిబ్రవరి 22న ప్రమాదం జరగ్గా లోపల ఎనిమిది మంది చిక్కుకుపోయిన సంగతి తెలిసిందే. వారి కోసం ఆర్మీ, నేవీ, ఎన్‌డీఆర్ఎఫ్, సింగరేణి సహా 12 వేర్వేరు సంస్థలకు చెందిన బృందాలు సహాయక చర్యల్లో పాల్గొంటున్నాయి. రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆయా బృందాలతో శనివారం సమీక్ష నిర్వహించారు. టన్నెల్ బోరింగ్ మిషన్(టీబీఎం) 13.6 కిమీల వద్ద ఉన్నప్పుడు టన్నెల్ పైకప్పు కూలింది. 13.9 కిమీల దాకా టన్నెల్ తవ్వకం పూర్తయినా.. 13.850 కిమీల నుంచి నుంచి 13.9 కిమీల మధ్య ఉన్న ప్రాంతం షీర్ జోన్‌లో ఉందని, అక్కడ ఏమైనా జరగవచ్చునని జీఎస్ఐ బృందం మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డికి తెలియజేసింది. తీవ్రమైన ఒత్తిడి, పీడనం వల్ల రాళ్ల కదిలిపోయి గుల్లగా మారిన ప్రాంతాన్ని షీర్ జోన్ అంటారు. టీబీఎం 13.6 కిమీల వద్ద ఉండగా.. దానిపైన పడిన సిమెంట్ రింగులు, బురద, మట్టి, రాళ్లను తొలగించి మరింత ముందుకు వెళ్లడం ఏమాత్రం శ్రేయస్కరం కాదని హెచ్చరించింది. ఈ సమస్యకు పరిష్కారం ఏంటి? అని మంత్రి ఉత్తమ్ ప్రశ్నించగా.. జాతీయ భూభౌతిక పరిశోధన సంస్థ(ఎన్‌జీఆర్ఐ) సలహా తీసుకోవాలని జీఎస్ఐ సూచించింది. ఇందుకు స్పందించిన ఎన్‌జీఆర్ఐ.. పరిశోధనల అనంతరం తగిన జాగ్రత్తలు తీసుకుంటూ సొరంగంలో ముందుకెళ్లవచ్చునని అభిప్రాయపడింది. సొరంగంలో కూలిపోయిన పైభాగం నుంచి బురదతో కూడిన సీపేజీ తీవ్రంగా వస్తుండటంతో మరింత అధ్యయనం అవసరమని అభిప్రాయపడింది. తగిన



ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో మంత్రి ఉత్తమ్

భూగర్భ పరిశోధనల అనంతరం జాగ్రత్తలు తీసుకుంటూ ముందుకు వెళ్లాలని తెలిపింది. ఇక, శ్రీశైలం టన్నెల్ అత్యంత సంక్లిష్టమైనదని, సింగరేణి భూగర్భ పనులకు ఇక్కడి పరిస్థితులకు చాలా తేడా ఉందని సింగరేణి బృందం మంత్రికి వివరించింది. టీబీఎం మొత్తం బురదలో కూరుకుపోయిందని, 250 మీటర్ల పొడవు ఉన్న టీబీఎంలోని ముందు భాగం(తవ్వే) సురక్షితంగా ఉందని, మధ్య భాగం పూర్తిగా దెబ్బ తిందని ఆయా బృందాలు తేల్చాయి.

టన్నెలింగ్‌కు డ్రిల్లింగ్ బ్లాస్టింగ్ విధానం

ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పనులను మున్ముందు డ్రిల్లింగ్, బ్లాస్టింగ్ విధానంలో పూర్తి చేస్తామని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రకటించారు. శ్రీశైలం టన్నెల్ సంక్లిష్టమైందని, ఇలాంటి ప్రమాదం ప్రపంచంలో ఎక్కడా జరుగలేదని అన్నారు. ప్రమాదం జరిగినంత మాత్రాన టన్నెల్ పనులను మధ్యలో వదిలేసే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. కొత్త పద్ధతిని అనుసరిస్తామని, డ్రిల్లింగ్ అండ్ బ్లాస్టింగ్ విధానంలో టన్నెల్ పనులు జరిగేలా చూస్తామన్నారు. డ్రిల్లింగ్, బ్లాస్టింగ్ విధానంలో పనులు నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వ అనుమతి తీసుకుంటామని, ఆ తర్వాత ఏడాదిన్నర లోపే టన్నెల్ పనులు పూర్తి చేస్తామని ఉత్తమ్‌స్పష్టం చేశారు.

సహాయక చర్యలకు రోబోలు

నాగర్‌కర్నూల్/దోమలపెంట: ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో చిక్కుకున్న కార్మికుల ఆచూకీ కనుగొనేందుకు రోబోలను రంగంలోకి దించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం రూ.4 కోట్లు కేటాయించింది. ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో సహాయక చర్యలు నిర్వహిస్తున్న బృందాలతో శనివారం నిర్వహించిన సమీక్షలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి రోబోటిక్ టెక్నాలజీ వినియోగం అంశాన్ని ప్రస్తావించారు. రోబోలతో సానుకూల ఫలితాలు వస్తాయని సహాయక బృందాలు అభిప్రాయపడ్డాయి. దీంతో స్పందించిన మంత్రి.. రోబోల వినియోగానికి సంబంధించిన కార్యాచరణ సిద్ధం చేయాలని సూచించారు. రోబోల కోసం ప్రభుత్వం రూ. 4 కోట్లు కేటాయిస్తుందని ప్రకటించారు. నాలుగు రోబోలను అందుబాటులోకి తీసుకువస్తే సహాయక చర్యలు వేగవంతం అవుతాయని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. సమీక్ష తర్వాత టన్నెల్ లోపలికి వెళ్లిన మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అక్కడి పరిస్థితులను స్వయంగా తెలుసుకున్నారు. సహాయక చర్యలపై సీఎం రేవంత్ రెడ్డి ఈ నెల 11న సమీక్ష నిర్వహిస్తారని మంత్రి ఉత్తమ్ వెల్లడించారు. కాగా, టన్నెల్‌లో వాస్తవ పరిస్థితులను తెలుసుకునేందుకు మీడియా ప్రతినిధులను శనివారం సాయంత్రం నుంచి అనుమతిస్తున్నారు.

రెస్క్యూ పూర్తికి మరో 15 రోజులు ?

ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో చిక్కుకుపోయిన వారిని బయటికి తేవడానికి మరో 15 రోజులు సమయం పట్టే సూచనలు కనిపిస్తున్నాయి. టన్నెల్ బోరింగ్ మిషన్(టీబీఎం) ఉన్న ప్రదేశానికి ముందు రెండు కిమీల దూరం నుంచే ఆ ప్రాంతమంతా బురద, మట్టితో నిండిపోయింది. 16 రోజులుగా వాటిని తోడుతున్నా సహాయక బృందాలు ఇప్పటికీ టీబీఎం దాకా చేరుకోలేదు. మరోపక్క, టన్నెల్ పైకప్పు నుంచి మట్టి, రాళ్లతోపాటు నీళ్ల భారీగా వచ్చి చేరుతున్నాయి. దీంతో రెస్క్యూ ఆపరేషన్ పూర్తవ్వడానికి మరో 15 రోజులైనా పడుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం 585 మంది మూడు షిఫ్టులుగా పనిచేస్తున్నారు. టన్నెల్‌లో ఆక్సిజన్ కొరత, భారీగా సీపేజీ, బురద సహాయక చర్యలకు ఇబ్బందిగా మారింది. ప్రతికూల పరిస్థితుల వల్ల కేరళ నుంచి వచ్చిన క్యాడవర్ శునకాలు కూడా మృతదేహాల ఆచూకీని గుర్తించలేకపోతున్నాయి.

కరెంట్ షాక్ పెట్టి చిత్రహింసలు

- కోడి దొంగతనం నెపంతో తీవ్రంగా దెబ్బలు
- నేరం ఒప్పుకోవాలని అదనపు ఎస్ఐ ఒత్తిడి
- అశ్వారావుపేట సీఐకి నిందితుడి ఫిర్యాదు
- ఠాణా ముందు దళిత సంఘాలతో ఆందోళన

అశ్వారావుపేట రూరల్, మార్చి 8(ఆంధ్రజ్యోతి): కోడి పుంజును దొంగిలించిన నేరాన్ని ఒప్పుకోవాలని ఎస్ఐ తనపై థర్డ్ డిగ్రీ ప్రయోగించి, చిత్రహింసలు పెట్టారని ఓ దళితుడు ఆరోపించాడు. అయనపై చర్యలు తీసుకోవాలని శనివారం సీఐకి ఫిర్యాదు చేశాడు. అనంతరం కుటుంబ సభ్యులు, దళిత సంఘాలతో కలిసి పోలీస్‌స్టేషన్ ఎదుట నిరసన తెలిపాడు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలంలోని నారంవారిగూడెం గ్రామానికి చెందిన అప్పారావు కోడిపుంజును అదే గ్రామానికి చెందిన కలపాల నాగరాజు దొంగిలించాడని గత నెల 22న అశ్వారావుపేట పోలీసులకు ఫిర్యాదు అందింది. దాంతో అదనపు ఎస్ఐ రామమూర్తి నాగరాజును స్టేషన్‌కు పిలిచి విచారణ చేశారు. అయితే ఆ రోజు, ఎస్ఐ తనకు కరెంట్ షాక్ పెట్టి, చిత్రహింసలకు గురిచేశారని నిందితుడు నాగరాజు ఆరోపించాడు. కోడిని దొంగిలించినట్లు ఒప్పుకోవాలని దారుణంగా కొట్టారని తెలిపాడు. ఎస్ఐ తీవ్రంగా కొట్టడంతో ఖమ్మం ఆస్పత్రిలో వారం రోజులు చికిత్స పొందానని వెల్లడించాడు. తన భర్త దెబ్బల తీవ్రతకు నిలబడలేని స్థితికి చేరుకున్నాడని నాగరాజు భార్య విమల వాపోయారు. నిందితుడిపై చోరీ కేసు నమోదైందని, ఘటనపై ఉన్నతాధికారులు విచారణ చేస్తున్నారని, దర్యాప్తు అనంతరం చర్యలు ఉంటాయని అశ్వారావుపేట సీఐ కరుణాకర్ వెల్లడించారు.

సాహిత్య అకాడమీ పురస్కారం అందుకున్న పెనుగొండ



న్యూఢిల్లీ, మార్చి 8(ఆంధ్రజ్యోతి): ప్రముఖ తెలుగు రచయిత పెనుగొండ లక్ష్మీనారాయణ కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం అందుకున్నారు. శనివారం ఢిల్లీలోని కమానీ ఆడిటోరియంలో లక్ష్మీనారాయణకు అకాడమీ అధ్యక్షుడు మాధవ్ కౌశిక్ పురస్కారాన్ని అందజేశారు. దేశవ్యాప్తంగా 21 భాషలకు గాను కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారాలు ప్రదానం చేశారు. పురస్కారంలో భాగంగా లక్ష రూపాయల నగదుతో పాటు రజత పతకం ఆయనకు లభించింది. దీపిక అభ్యుదయ వ్యాస సంపుటికి గాను ఆయన ఈ పురస్కారాన్ని దక్కించుకున్నారు. పెనుగొండ లక్ష్మీనారాయణ తెలుగు సాహిత్య రంగంలో విశేష కృషి జరిపారని, అనేక గ్రంథాలు రచించారని సాహిత్య అకాడమీ ప్రశంసా పత్రంలో పేర్కొన్నారు. పెనుగొండ 1954లో పల్నాడు జిల్లాలో జన్మించారు. న్యాయవాదిగా పనిచేస్తున్నారు. 1974 నుంచి అభ్యుదయ రచయితల సంఘం కార్యకర్తగా జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో పలు బాధ్యతలు నిర్వహించారు. ప్రస్తుతం అభ్యుదయ రచయితల సంఘం జాతీయ అధ్యక్షుడిగా పనిచేస్తున్నారు. సుమారు 200కి పైగా సాహిత్య వ్యాసాలు రాసిన పెనుగొండ పలు ఇతర పురస్కారాలనూ అందుకున్నారు.

'పునర్విభజన'లో సమన్యాయం ఉండాలి

- లేదంటే దక్షిణాదికి తీరని నష్టం
- రౌండ్ టేబుల్‌లో వక్తల డిమాండ్

హైదరాబాద్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): పార్లమెంటు నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియలో అన్ని రాష్ట్రాలకు సమన్యాయం జరిగేలా సీట్ల సంఖ్య ఉండాలని పలువురు ప్రముఖులు డిమాండ్ చేశారు. లేదంటే దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. అమెరికా సెనెట్ తరహాలో 'రాష్ట్రాల సభ'గా పిలిచే రాజ్యసభకు సమాన అధికారాలు కల్పించాలని సూచించారు. హైదరాబాద్‌లోని సీపీఐ రాష్ట్ర కార్యాలయం మగ్దూం భవన్‌లో శనివారం 'లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన-దక్షిణాది రాష్ట్రాలపై ప్రభావం' అన్న అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ప్రొఫెసర్ జి.హరగోపాల్, జస్టిస్ చంద్రకుమార్, సీనియర్ సంపాదకులు కె.శ్రీనివాస్, సీపీఐ జాతీయ కార్యదర్శులు కె.నారాయణ, సయ్యద్ అజీజ్, కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి తదితరులు మాట్లాడారు.

బీజేపీ స్వార్థ రాజకీయాలతో భయం

ప్రొఫెసర్ హరగోపాల్ ప్రసంగిస్తూ దక్షిణాది రాష్ట్రాలు కుటుంబ నియంత్రణ పాటించడంతో జనాభా పెరుగుదలకు అడ్డుకట్ట పడిందని, అదే ఇప్పుడు దక్షిణాదికి శాపంగా మారిందన్నారు. బీజేపీ స్వార్థ రాజకీయాలకు పాల్పడి పునర్విభజన పేరుతో దక్షిణాదికి అన్యాయం చేస్తుందనే భయం ఇక్కడి నేతల్లో నెలకొందని తెలిపారు. అమెరికా సెనెట్ తరహాలో రాజసభ స్థానాలను చిన్నాపెద్దా అనే తేడా లేకుండా అన్ని రాష్ట్రాలకు సమానంగా కేటాయించడంతో పాటు విశేష అధికారాలను కల్పించాల్సి ఉందని చెప్పారు. సీనియర్ సంపాదకులు కె.శ్రీనివాస్ మాట్లాడుతూ జనాభా ప్రతిపాదికన పునర్విభజన చేపడితే పార్లమెంట్‌లో దక్షిణాది, ఈశాన్య రాష్ట్రాల ప్రాధాన్యత తగ్గి ఉత్తరాదిలోని 4 రాష్ట్రాల ప్రాబల్యం పెరగనుందన్నారు. నియోజకవర్గాల పునర్విభజన దేశ సమాఖ్య స్ఫూర్తికి ఏమాత్రం విఘాతం కలగకుండా చేపట్టాలని కూనంనేని సాంబశివరావు సూచించారు. జనాభా పరంగా కాకుండా అన్ని అంశాలను దృష్టిలో పెట్టుకోవాలని, లేదంటే తిరుగుబాట్లు వచ్చే ప్రమాదం ఉందన్నారు. జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ సమాఖ్య వ్యవస్థ స్ఫూర్తికి భంగం కలగకుండా పునర్విభజన ప్రక్రియ ఉండాలని సూచించారు.

డీలిమిటేషన్ వివాదం..

ఆ రాష్ట్రాల్లో ఎన్నికలున్నాయనే!

అందులోకి ఏపీ చొరబడాల్సిన అవసరంలేదు

ఏ భాషనూ కేంద్రం రుద్దదు.. ఏపీకి చంద్రబాబే అడ్వాంటేజ్

'ఇండియా టుడే' కాంక్లేవ్‌లో మంత్రి లోకేశ్



న్యూఢిల్లీ, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): కొన్ని రాష్ట్రాల్లో ఎన్నికలు ఉన్నందునే నియోజకవర్గాల పునర్విభజన అంశాన్ని ప్రచారాస్త్రం చేశారని ఏపీ మంత్రి నారా లోకేశ్ అన్నారు. ఇందులోకి ఆంధ్రప్రదేశ్ చొరబడాల్సిన అవసరం లేదన్నారు. అయితే డీలిమిటేషన్‌తో దక్షిణాదికి అన్యాయం జరుగుతుందన్న ఆందోళనతో తాను ఏకీభవిస్తున్నట్లు తెలిపారు. జనాభాను నియంత్రించడం దక్షిణ రాష్ట్రాలకు ప్రతికూలం కాకూడదని, అయితే ప్రస్తుత నిష్పత్తులు కొనసాగుతాయని కేంద్రం తేల్చిచెప్పిందని గుర్తుచేశారు. శనివారం ఢిల్లీలో 'ఇండియా టుడే' నిర్వహించిన కాంక్లేవ్‌లో లోకేశ్ పాల్గొన్నారు. సీనియర్ జర్నలిస్టు రాజ్‌దీప్ సర్దేశాయ్ అడిగిన ప్రశ్నలకు సమాధానాలిచ్చారు. తమిళనాట భాషాయుద్ధం జరుగుతున్న నేపథ్యంలో.. కేంద్రం ఏ భాషనూ రాష్ట్రాలపై రుద్దదని స్పష్టం చేశారు. 'నేను కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను కలిసినప్పుడు.. తెలుగుకు ప్రాధాన్యమివ్వాలని నొక్కిచెప్పారు. రాష్ట్రాలు స్థానిక, మాతృభాషలను ప్రోత్సహించాలని కేంద్రం కూడా చెబుతోంది. మూడు భాషలే కాదు.. మన పిల్లలు జర్మన్, జపనీస్ కూడా నేర్చుకోవాలి. భవిష్యత్తులో మన వాళ్లకు అటువైపే ఉద్యోగాలు రానున్నాయి. భారత్ వ్యూహాత్మక పాత్ర పోషిస్తున్నందున.. బహుళ భాషలు నేర్వాలి' అని లోకేశ్ అన్నారు. పొరుగు రాష్ట్రాలకు వాటి రాజధానులు అడ్వాంటేజ్‌గా ఉంటే.. ఆంధ్రప్రదేశ్‌కు సీఎం చంద్రబాబునాయుడే అడ్వాంటేజ్ అని తెలిపారు. ఇక నైపుణ్య గణన కంటే కులగణన చాలా సులభమన్నారు. రాష్ట్రంలో నైపుణ్య గణనను సవాల్‌గా తీసుకుని పనిచేస్తున్నామని చెప్పారు. వై2కే విప్లవంలో హైదరాబాద్, దేశం లబ్ధి పొందితే.. ఇప్పుడు ఏపీ వంతు వచ్చిందన్నారు. నైపుణ్యం కలిగిన మానవ వనరులు ఉన్నాయని.. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానంతో ముందుకు వెళుతున్నామని తెలిపారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా కేజీ నుంచి పీజీ వరకు కరిక్యులమ్‌లో మార్పులు తీసుకొస్తున్నామని చెప్పారు.

నూకల ఎగుమతిపై నిషేధం ఎత్తివేత

విదేశాలకు నూకల ఎగుమతిపై ఉన్న నిషేధాన్ని ఎత్తివేస్తున్నట్టు విదేశీ వాణిజ్య డైరెక్టరేట్ జనరల్ ప్రకటించింది. ఈ నిర్ణయం తక్షణం అమల్లోకి వస్తుందని తెలిపింది. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం కారణంగా నౌకల రాకపోకలకు అంతరాయం కలగడంతో 2022 సెప్టెంబరు నెలలో నిషేధం విధించింది. ప్రస్తుతం గోదాముల్లో పుష్కలంగా బియ్యం నిల్వలు ఉండడంతో దాన్ని ఎత్తివేసింది. కనీస ఎగుమతి ధర టన్నుకు 490 డాలర్లు (సుమారు రూ.43వేలు) ఉండాలన్న నిబంధనను కూడా గత ఏడాది తొలగించింది.

ఆర్ఆర్ఆర్‌కు త్వరలో మోదీ భూమిపూజ

క్యాబినెట్ ఆమోదానికి రంగం సిద్ధం.. భూసేకరణకు నిధుల్లేవన్నా గడ్కరీని ఒప్పించాను

- వచ్చే ఏడాది రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఉత్పత్తి
- తెలంగాణ బాస్ బీజేపీ.. కాంగ్రెస్, బీఆర్ఎస్ ఉప పార్టీలు
- మహిళా దినోత్సవం రోజే అఖిలపక్ష సమావేశమా?: కిషన్‌రెడ్డి



హైదరాబాద్‌లోని బీజేపీ కార్యాలయంలో మహిళాదినోత్సవ వేడుకల్లో పాల్గొన్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

హైదరాబాద్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): రీజినల్ రింగు రోడ్డు (ఆర్ఆర్ఆర్) ఉత్తరభాగం పనులకు త్వరలో ప్రధాని మోదీ భూమిపూజ చేయనున్నారని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి తెలిపారు. ఈ రోడ్డును కేంద్రం సూత్రప్రాయంగా మంజూరు చేసిందని, క్యాబినెట్ ఆమోదానికి రంగం సిద్ధమవుతోందని చెప్పారు. పబ్లిక్ ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ అప్రైజల్ కమిటీ (పీపీపీఏసీ) ఏర్పాటు, క్యాబినెట్ ఆమోదం కోసం ప్రక్రియ ప్రారంభం, ఆర్థిక విభాగానికి సంబంధించి త్రైపాక్షిక ఒప్పందం అంశాలపై కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీని ఇటీవలే కోరామని తెలిపారు. ఆయన వెంటనే స్పందించి అప్పటికప్పుడు ఆదేశాలిచ్చారని పేర్కొన్నారు. ఆర్ఆర్ఆర్ ఉత్తరభాగం పనులకు రూ.18,750 కోట్లు అవసరమవుతాయని అంచనా వేసినట్లు వెల్లడించారు. ఆర్ఆర్ఆర్‌ను జాతీయ రహదారిగా గుర్తించాల్సిందిగా గడ్కరీని కోరినట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా రూ.6,200 కోట్లతో చేపట్టిన 10 జాతీయ రహదారుల నిర్మాణం పూర్తయిందని, వీటిని పార్లమెంటు సమావేశాల అనంతరం గడ్కరీ ప్రారంభిస్తారని చెప్పారు. ఆర్ఆర్ఆర్‌కు రాష్ట్ర ప్రభుత్వం రూ.2 వేల కోట్లు డిపాజిట్ చేయాల్సి ఉండగా.. కేవలం రూ.100 కోట్లు మాత్రమే ఇచ్చి కేంద్రాన్ని బ్లాక్‌మెయిల్ చేస్తోందని ఆరోపించారు. దీనిపై తాను ముఖ్యమంత్రికి లేఖ రాస్తే.. జవాబు రాలేదన్నారు. "తమ వద్ద అన్ని నిధుల్లేవని, ప్రస్తుతానికి వంద కోట్లు జమ చేస్తామని, భూ సేకరణ ప్రక్రియ ప్రారంభమైన తరువాత పరిస్థితిని బట్టి విడతల వారీగా నిధులు జమ చేస్తామని ఆర్అండ్‌బీ మంత్రి కోమటిరెడ్డి నాకు లేఖ రాశారు. సాధారణంగా అయితే వందశాతం నిధులు ఒక రాష్ట్ర ప్రభుత్వం డిపాజిట్ చేస్తేనే కేంద్రం ఆయా ప్రాజెక్టులను ప్రారంభిస్తుంది. కానీ, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేదని కేంద్ర మంత్రి గడ్కరీని తాను ఒప్పిస్తే ఆయన అంగీకరించారు. ఇదంతా జరిగింది రేవంత్ సీఎం అయిన కొత్తలో" అని కిషన్‌రెడ్డి వివరించారు.

ఒక్క సీటు కూడా తగ్గదు..

డీలిమిటేషన్‌తో దక్షిణాది రాష్ట్రాల్లో ఒక్క సీటు కూడా తగ్గదని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. తమిళనాడు, తెలంగాణ సీఎంలు చేస్తున్న ప్రచారమంతా బోగస్ అన్నారు. ఇక కాంగ్రెస్ చేపట్టాలనుకున్న ప్రాజెక్టులను తమను పూర్తిచేయమంటే ఎలా? అని ప్రశ్నించారు. "సీఎం రేవంత్ ఇచ్చిన హామీలకు అతీ గతీ లేదు. కానీ, అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్త ప్రాజెక్టులు ప్రతిపాదించి మమ్మల్ని పూర్తిచేయాలని డిమాండ్ చేయడం న్యాయమా?" అని కిషన్‌రెడ్డి అన్నారు. "రాష్ట్ర ప్రజలను మీరు మోసం చేస్తూ మాపై రాళ్లు వేస్తారా? మీ చేతగానితనం, తప్పుడు హామీలు, విఫల గ్యారంటీలను మాపై రుద్దితే ఎలా?" అని మండిపడ్డారు. కాజీపేట రైల్వేకోచ్ ఫ్యాక్టరీ వచ్చే ఏడాది ఏప్రిల్ నుంచి ఉత్పత్తి ప్రారంభిస్తుందని కేంద్రమంత్రి ప్రకటించారు. 2026 జనవరి 26న ఆధునికీకరించిన సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌ను జాతికి అంకితం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. కాగా, 'తెలంగాణ బాస్ బీజేపీ' అని కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండూ ఉప పార్టీలుగా మారిపోయాయన్నారు.

అఖిలపక్ష సమావేశానికి అందుకే వెళ్లలేదు

అంతర్జాతీయ మహిళా దినోత్సవం నాడే అఖిలపక్ష సమావేశం నిర్వహించడమేంటని కిషన్‌రెడ్డి ప్రశ్నించారు. ఈ ఉత్సవాలను పురస్కరించుకొని తమ పార్టీ ఎంపీలంతా వారి నియోజకవర్గాల్లో ముందస్తుగా నిర్ణయించిన కార్యక్రమాల్లో పాల్గొనాల్సి ఉందన్నారు. దాంతో పాటు ముందుగా నిర్ణయించిన అధికార, అనధికార కార్యక్రమాల వల్లే అఖిలపక్ష సమావేశానికి తాము హాజరుకాలేకపోతున్నామంటూ డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్కకు కిషన్‌రెడ్డి లేఖ రాశారు. ప్రాధాన్యం కలిగిన ఇలాంటి సమావేశాల్లో కీలకమైన అంశాలపై అర్థవంతమైన చర్చ జరిగేందుకు కనీస సమయం అవసరమని, కానీ.. తమ పార్టీ ఎంపీలందరికీ ఆలస్యంగా ఈ సమాచారం అందిందని తెలిపారు. భవిష్యత్తులో ఎప్పుడైనా ఇటువంటి సమావేశాలు నిర్వహించాలని భావిస్తే కాస్త ముందుగా తెలియజేయాలని లేఖలో కోరారు.

ఒకే దేశం.. ఒకే ఎన్నికపై విస్తృత ప్రచారం

- పార్టీ నేతలకు కిషన్‌రెడ్డి పిలుపు..

దేశం అభివృద్ధి చెందాలంటే ఒకే దేశం-ఒకే ఎన్నిక తప్పనిసరని కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. తరచూ ఏదో ఒక ఎన్నికలు జరుగుతుండడంతో అభివృద్ధి పనుల్లో జాప్యం జరుగుతోందన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు, స్థానిక సంస్థల ఎన్నికలకు కసరత్తు, ఒకే దేశం-ఒకే ఎన్నికపై పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జ్ సునీల్ బన్సల్‌తో కలిసి చర్చించారు. ఒకే దేశం-ఒకే ఎన్నిక విధానంతో కలిగే ప్రయోజనాల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని పార్టీ నేతలకు కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఇందుకోసం విస్తృతంగా సమావేశాలు, సదస్సులు నిర్వహించాల్సిన అవసరముందన్నారు. పార్టీ కంటే దేశమే ముఖ్యమన్నదే మన అజెండా అని చెప్పారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ శ్రేణులంతా కష్టపడి పనిచేశారని.. దానివల్లే 2 ఎమ్మెల్సీ స్థానాలను గెలుచుకున్నామని సునీల్ బన్సల్ అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా ఇదే స్ఫూర్తి కొనసాగించాలని చెప్పారు.



బండి సంజయ్‌ను కోహ్లీతో పోలుస్తూ.. ఫ్లెక్సీలు

బండి సంజయ్.. విరాట్ కోహ్లీ ఆఫ్ బీజేపీ

- కోహ్లీతో పోలుస్తూ కేంద్ర మంత్రి సంజయ్ ఫ్లెక్సీలు
- కరీంనగర్ జిల్లా కేంద్రంలో బీజేపీ నేతల అభిమానం

భగత్‌నగర్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): బీజేపీని ఇండియా క్రికెట్ టీంతో, కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్‌ను విరాట్ కోహ్లీతోనూ పోలుస్తూ ఫ్లెక్సీలు వెలిశాయి. శనివారం కరీంనగర్ జిల్లా కేంద్రంలో బీజేపీ నేతలు వీటిని ఏర్పాటు చేశారు. కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ పట్టభద్రులు, ఉపాధ్యాయ స్థానాలను బీజేపీ కైవసం చేసుకోవడంతో నగరంలో ఆ పార్టీ నాయకులు, అభిమానులు పెద్ద సంఖ్యలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. 'బండి సంజయ్ = విరాట్ కోహ్లీ ఆఫ్ బీజేపీ' అని, 'పాకిస్థాన్‌పై విరాట్ కోహ్లీ, కాంగ్రెస్‌పై బండి సంజయ్ బెస్ట్ పర్‌ఫార్మర్స్' అని ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లపై ముద్రించారు. కోహ్లీ, బండి సంజయ్ ఫ్లెక్సీలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో వాటిని మున్సిపల్ అధికారులు తొలగించారు.

ఆంధ్రజ్యోతి తలంబ్రాలు

వరుడు కావలెను



★ కుల పట్టింపు లేదు / 52y / Widow / ఆంధ్ర / సొంత స్కూల్ / పొలాలు / ఒక పాప సెటిల్డ్ బెంగళూర్ / అందమైన వధువుకు వరుడు కావలెను. కడప, తిరుపతి, నెల్లూరు ప్రాధాన్యత ఫోన్: 7075948409 AJH-003114

★ కుల పట్టింపు లేదు / 40y / Widow / ఆంధ్ర / పిల్లలు లేరు / సొంత ఇల్లు / పొలాలు / ఓన్ షోరూమ్ బిజినెస్ / చదువు ప్రసక్తిలేదు / అందమైన వధువుకు వరుడు కావలెను. డైరెక్ట్ మీటింగ్ పెట్టబడును. (Hyd Ok) ఫోన్: 9989350417 AJH-003114

★ కుల పట్టింపు లేదు / Widow / 40y / Vijayawada, Guntur, Thirupathi / Govt. Employee / Own House / Agriculture Lands పిల్లలు లేని అందమైన వధువుకు వరుడు కావలెను. ఫోన్: 8374476725 AJH-003114

★ కుల, ఆస్తి ప్రసక్తి లేదు / Widow / 50y ఆంధ్ర / Family Pensioner / Own Business / 1 Girl Settled / Own House / Lands / అందమైన వధువుకు వరుడు కావలెను. ఫోన్: 9581155315 AJH-003114

★ 62 / రెండవ పెళ్ళి / విడో / ఫెయిర్ / Govt Retd. / పిల్లలు లేరు / సొంత ఇల్లు / ప్రాపర్టీ రెంట్స్ / ఎలాంటి బాదరా బందీ లేని అందమైన ఏకైక వధువుకి వరుడు కావలెను. (కుల/ఆస్తి పట్టింపు లేదు) ఫోన్: 9030858258 AJH-003116

★ 56 / రెండవ పెళ్ళి / విడో / ఫెయిర్ / Govt VRS / పిల్లలు లేరు / సొంత ఇల్లు / ప్రాపర్టీ రెంట్స్ / ఎలాంటి బాదరా బందీ లేని ఏకైక వధువుకి వరుడు కావలెను. (కుల/ఆస్తి పట్టింపు లేదు) ఫోన్: 7995376608 AJH-003116

★ ఆర్యవైశ్య / 22y & 24y & 25y & 27y & 29y & 31y & 32y & 34y & 35y & 37y & 38y & 39y & 40y & 42y & 44y & 45y & 47 & 49y & 51y & 52y & 54y & 55y & 58y & 59y / శ్రీ. సుప్రజా గుప్తా "మాసేవ" (Since 1998): PH/WA: 9291503949 AJH-003116

★ కుల ఆస్తి పట్టింపు లేదు / కమ్మ / లేట్ మ్యారేజ్ / 43y/5'6" / డాక్టర్ కార్డియాలజిస్ట్ మంచి ఆస్తి గల వధువుకు 1వ, 2వ వరుడు కావలెను. వాట్సాప్: 7286832067 AJH-003059

★ గౌడ / B.Tech / SWE / మంచి జీతం / 5.4 ఎత్తు / 24 సం. ల అందమైన వధువుకి వరుడు కావలెను. ఫోన్: 9985551454 AJH-15486

★ బ్రాహ్మణ / 6000 నియోగి / 45 / 5'4" / గవర్నమెంట్ స్కూల్ హెడ్ మాస్టర్ / విడో / పిల్లలు లేని రిచ్ ఫ్యామిలీ వధువుకి వరుడు కావలెను ఫోన్: 9550412920 AJH-15486

★ కమ్మ / కుల ఆస్తి పట్టింపు లేదు / ఫెయిర్ / 37y /5'4" / M.Com / వెల్ సెటిల్ / ల్యాండ్ / ఓన్ బిల్డింగ్, టెక్స్‌టైల్ బిజినెస్ ఉన్న వధువుకి 1వ, 2వ వరుడు కావలెను. అర్జెంట్ మ్యారేజ్ వాట్సాప్: 9951641627 AJH-003115

★ బ్రాహ్మణ / 28 / 5'3" / డిగ్రీ / ప్రైవేట్ జాబ్ / అందమైన వధువుకి తగిన జాబ్ / బిజినెస్ / పురోహితం వరుడు కావలెను. ఫోన్: 9701743336 AJH-15486

★ రెడ్డి / 2nd / విడో / కుల, ఆస్తి ప్రసక్తిలేదు / డిగ్రీ, 32y / సొంత బిజినెస్ గల అందమయిన వధువుకి వరుడు కావలెను. 1st, 2nd అన్ని వయస్సుల వారికి సంబంధాలు కలవు. ఫోన్: 9515673252 AJH-15483

★ రెడ్డి / చాలా అందమైన / 2వ పెళ్ళి / పిల్లలు లేరు / 28 / 5'4" / MBA / కోట్ల ఆస్తి / వెల్ సెటిల్డ్ గుడ్ ఫ్యామిలీ గల వధువుకి వరుడు కావలెను. ఫోన్: 8367619529 AJH-15483

★ హిందూ మాదిగ / గుడ్ లుకింగ్ / 27Yrs / Degree / గుడ్ జాబ్ / వెల్ సెటిల్డ్ ఫ్యామిలీ గల వధువుకి వరుడు కావలెను. ఫోన్: 8367619529 AJH-15483

★ రెడ్డి 2nd మ్యారేజ్ (కుల/ఆస్తి) పట్టింపులేదు / 33y/ Q:B.Pharm / Own Business & Lands / వధువుకి వరుడు కావలెను.అన్ని వయస్సుల వారికి 1వ / 2వ సంబంధాలు కలవు ఫోన్: 9515579827 AJH-15483

★ కుల పట్టింపు లేదు / 2వ పెళ్ళి / పిల్లలు లేరు / 40y/ 5'3"/ B.Tech / గుడ్ జాబ్ / వెల్ సెటిల్డ్ ఫ్యామిలీ గల వధువుకి వరుడు కావలెను. ఫోన్: 8367619529 AJH-15483

★ వడ్డెర / B.Tech /Govt. AE / ఎలక్ట్రికల్ Dept / మంచి జీతము / 5'4" ఎత్తు / 27 సం.ల అందమైన వధువుకు అందమైన వరుడు కావలెను. ఫోన్: 9618579861 AJH-15484

★ యాదవ / ఏకైక కుమార్తె / B.Tech / C.Govt. ఆఫీసర్ / ONGC / మంచి జీతము / 5'6" ఎత్తు / 27 సం.ల అందమైన వధువుకు అందమైన వరుడు కావలెను. ఫోన్: 9618579861 AJH-15484

★ కమ్మ / కుల ప్రసక్తి లేదు / B.Com, CA / ఆడిటర్ ఆఫీసర్ / మంచి జీతము / 5'4" ఎత్తు / 40 సం.ల పిల్లలు లేని వధువుకు వరుడు కావలెను. ఫోన్: 9963757612 AJH-15484

★ రజక / B.Tech / C. Govt. Asst. మేనేజర్ / పోస్టల్ Dept / మంచి జీతము / 5'4" ఎత్తు / 26 సం.ల అందమైన వధువుకు వరుడు కావలెను. ఫోన్: 8897389698 AJH-15484

★ SC మాల / B.Sc / Govt. అగ్రికల్చర్ ఆఫీసర్ / మంచి జీతము / 5'3" ఎత్తు / 26 సం.ల అందమైన వధువుకు వరుడు కావలెను. ఫోన్: 9505667050 AJH-15484

★ 46y, 2వ పెళ్లి / Govt. టీచర్ / మంచి జీతము / వధువుకు సెటిల్డ్ వరుడు కావలెను. సంప్రదించండి. ఫోన్: 9848023736 AJH-15484

★ తండ్రి బ్రాహ్మణ, తల్లి రెడ్డి, 40 yrs లేట్ మ్యారేజ్ / Qua : MCA, Govt. Job / Good Salary / Own House / కుల పట్టింపు లేదు / పౌరోహిత్యం also OK. 2nd Match also OK. వరుడు కావలెను. ఫోన్: 8333086124 AJH-003115

★ బ్రాహ్మణ, 26 yrs 5'3" 1st మ్యారేజ్ / Qua : 10th Class, Pvt. Job / Father Late / Mother Pvt. Teacher / పౌరోహిత్యం also OK. 2nd మ్యారేజ్ also OK. వరుడు కావలెను. ఫోన్: 9347422789 AJH-003115

★ కుల పట్టింపు లేదు / విడో / 58 Y / Govt. Doctor / ఓన్ హాస్పిటల్ / రెంట్స్ / లాండ్స్ / మంచి ప్రాపర్టీ గల వధువుకి వరుడు కావలెను. సంప్ర. 99490 92259 AJB-918

వధువు కావలెను



★ లీగల్ డైవర్స్ బ్రాహ్మిణ్ / 55y / 5'7" / ఓన్ హౌస్ ప్రైవేట్ స్కూల్ టీచర్, నంద్యాల జిల్లా, వరునికి 35-40 సం. లోపు వధువు కావలెను. డైరెక్ట్ - 8309154811 AJH-003059

★ బ్రాహ్మిణ్ / పెన్షనర్ / సీనియర్ సిటిజన్ / చెడు అలవాట్లు లేవు / మంచి ఆరోగ్యం కలిగిన వరునికి తగిన వధువు కావలెను. నో బ్రోకర్స్. డైరెక్ట్ - 8179898506 AJH-003116

★ కాపు / 42y / 5'3" / USA/SWE/ రెండవ పెళ్ళి / వరుడికి USAలో ఉన్న 1st/2nd వధువు కావలెను. నో బ్రోకర్స్. డైరెక్ట్ - 9390297429 AJH-003116

★ నో క్యాస్ట్ / 40 నుండి 45 లోపు / విడో / డైవర్స్ / వధువు కావలెను. K.V.ప్రసాద్ / BA / ప్రైవేట్ జాబ్ / 22వ వార్డ్, మారీసుపేట, తెనాలి డైరెక్ట్ - 9494604396 AJH-003059

★ పద్మశాలి / 1st మ్యారేజ్ / 38 / 5'7" / మంచి జీతం గల వరునికి 10th to PG చదివిన వధువు కావలెను. SC/ST మినహా No Caste : 7286933623 AJH-15486

★ కాపు / 55 BSc విడోయర్ VRS వ్యాపారం ఇల్లు ఉన్న వరునికి ఉద్యోగము వసతి ఉన్న విడో / Rtd. కుల వయసుతో పని లేని వధువు కావలెను. ఫోన్: 6304443605 AJH-15483

★ కాపు / కుల పట్టింపులేదు /గుడ్ లుకింగ్ / 30 Yrs / B.Tech, MS / Job in Hyd / మంచి జీతం / కోట్ల ఆస్తి గల వరుడుకి వధువు కావలెను. ఫోన్: 8367619529 AJH-15483

★ 2వ పెళ్లి / పిల్లలు లేరు / గుడ్ లుకింగ్ / 43 Yrs / 5'10" / B.Tech, / సాఫ్ట్‌వేర్ / మంచి జీతం / కోట్ల ఆస్తి గల వరునికి వధువు కావలెను. పిల్లలు ఉన్నా ఓ.కె. ఫోన్: 8367619529 AJH-15483

★ గౌడ / M.Tech / Govt. Asst. ఇంజనీర్ / జెన్‌కో / 5'9 ఎత్తు / 30 సం.ల వరుడికి తగిన అందమైన వధువు కావలెను. ఫోన్: 8790689274 AJH-15484

★ SC మాదిగ / ఏకైక కుమారుడు / M.Tech / C.Govt. Sr. ఆడిటర్ / CAG / / మంచి జీతము / 5'9 ఎత్తు / 31 సం.ల అందమైన వరుడికి తగిన వధువు కావలెను. ఫోన్: 8897389698 AJH-15484

★ బలిజ, / 35yrs, డిగ్రీ, జాబ్ - కంప్యూటర్ ఆపరేటర్ @ మెడికల్ ఏజెన్సీ, కరీంనగర్లో స్వంత గృహం ఉన్న అబ్బాయికి తగిన వధువు కావలెను. డైరెక్ట్ కాంటాక్ట్ : 9440378427 AJH-003115

★ యాదవ్: 35 సంవత్సరాలు, ఎత్తు: 5.3 చమన చాయ, రెండవ సంబంధం గల వరుడికి సంప్రదాయం గల వధువు కావలెను. కులం పట్టింపుల లేదు. డైరెక్టు సంప్ర: 96522 84046 AJL_229669

★ డైరెక్ట్ కాంటాక్ట్ / బలిజ / డైవర్స్ / 47 Y / 5'6" / ఎరుపు రంగు / బిజినెస్ / వరునికి మంచి మనస్సున్న వధువు కావలెను. కులం పట్టింపులేదు. సంప్ర. 79897 86823 AJB-209315

కళ్యాణ వేదిక

★ India/Abroad decent matches for Kamma / Reddy / Kapu / Velma & Raju Top Class Matches available. AMARAVATHI MATRIMONY, Vijayawada. 9100324999 AJH-003064

★ Free Registration బ్రాహ్మణ మరియు అన్ని కులాల SWE/ Govt. / Doctors/ MNC/ Matches/ Late & 2nd Matchesకై సంప్ర: Ph: 9704656103/ 9533608887 (Whatsapp) AJH-003116

★ బ్రాహ్మణ వధూవరుల స్వయంవరం Free Register 13/April 2025 న/ Kamala Nagar, Welfare Office, ECIL, Hyd. Ph: 9704656103/ 9533608887 Whatsapp No. AJH-003116

★ సెకండ్ మ్యారేజ్‌లకు మాత్రమే. అన్ని కులాల వారికి వయస్సుతో నిమిత్తం లేకుండా ఫాస్ట్ సెటిల్‌మెంట్ చేయబడును. సంప్ర: 9885144375 AJH-003116

★ Brahmin పెళ్ళి సంబంధాలకై సంప్ర. Verified Profiles & నమ్మకమైన సంస్థ. ★ Madhavi Sharma Ph: 7032018246 / Blue Trend Matri Monial (P) Ltd. AJH-003060

★ Padmashali - పెళ్ళి సంబంధాలకై సంప్ర. Verified Profiles & నమ్మకమైన సంస్థ. ★ Shyam Ph: 8500688938 / Blue Trend Matri Monial (P) Ltd. AJH-003060

★ Kamma, Kapu, Reddy పెళ్ళి సంబంధాలకై సంప్ర. Verified Profiles & నమ్మకమైన సంస్థ. ★ Ph: 7093969457 / Blue Trend Matri Monial (P) Ltd. AJH-003060

★ Madiga - Mala పెళ్ళి సంబంధాలకై సంప్ర. Verified Profiles & నమ్మకమైన సంస్థ ★ Ph: 7093969457 / Blue Trend Matri Monial (P) Ltd. AJH-003060

★ గంగపుత్రుల (అగ్నికుల క్షత్రియ, బెస్త, గూండ్ల, వాడబలిజ, జాలరి, పడ్డీలు, నెయ్యాల, పల్లెకార్లు, పన్నెరెడ్డి) పెళ్లి సంబంధాలకై సంప్రదించండి. వాట్సాప్ నెంబర్: 9000541008 AJH-003059

★ లక్ష్మీ మ్యారేజ్ బ్యూరో / కేవలం చౌదరి కులస్తులకు మాత్రమే. పెళ్ళి సంబంధాలు చూడబడును. ప్రొ. జాస్తి సైదారావు. ఫోన్ : 9182731506 / 9705588313 AJH-002915

★ రమేష్ చౌదరి గారిచే విజయవాడలో కమ్మవారి వివాహ పరిచయ వేదిక, ఎంతో అనుభవగ్నులైన వారిచే నిర్వహించబడును. ది.13-04-2025 రిజిస్ట్రేషన్ కొరకు సంప్ర: 81429 97766 AJB- 209362

★ ఆర్య వైశ్య, కమ్మ, రెడ్డి, వెలమ అన్ని కులాల వారికి 1వ, 2వ సంబంధాలు వయస్సుతో నిమిత్తం లేకుండా ఎన్నో వివాహాలు చేసిన ఏకైక సంస్థ. ఫోన్ : 9246882324 AJH-00054

తలంబ్రాలు ప్రకటనల కొరకు ఈ క్రింది నంబర్లను సంప్రదించగలరు. 9985921380, 9985921386, 9703618806.

గమనిక

ఆంధ్రజ్యోతి తలంబ్రాలు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయంగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. మీరు జరిపే లావాదేవీలకు ఆంధ్రజ్యోతి పత్రిక బాధ్యత వహించదు. కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగినసంబంధాన్ని నిర్ణయించుకోండి.

నిశ్చయమ్ మ్యాట్రిమోని

PIONEERS IN ELITE PROFILES — కమ్మ ప్రత్యేకం హైదరాబాద్ 7583823456 / 7724029999 / 7724039999 / 7724089999

కమ్మ ప్రత్యేకం

వధువు కావలెను

★ KAMMA / BSC / 27 / BUSINESS / 6.0 / FAIR / 500 CR SEEKS / FAIR / 24 / 5.6 / 100 CR

★ KAMMA / MBA /BUSINESS /27 / 5.11 / FAIR / 500 CR / SEEKS / FAIR / DECENT FAMILY / 24 / 5.4 / 100CR

★ KAMMA / MS USA /JOB / 150 K / FAIR/ 28 / 5.7 / 30 CR/ SEEKS MS USA / JOB / 24/ 5.3 /10CR

★ KAMMA / MS USA / 29 / 511 // FAIR / 25 CR / SEEKS / FAI R / 25 / 5.4 / 25 CR+

★ KAMMA / MS /26 /5.10/ DR / FAIR /300 CR / SEEKS FAIR / S.W.E/ 23/ 5.4/ 100CR

★ KAMMA /G.S / 28 / 6.0/ DR/ FAIR / 200CR/ SEEKS// 25/ 5.5 / FAIR / DECENT FAMILY/100 CR

★ KAMMA / B.TECH / 28 / 5.11 / S.W.E 65 LAKHS / FAIR / 50CR / SEEKS/ B.TECH / FAIR / 25/ 5.4/ DECENT FAMILY/20CR

★ KAMMA / MSIND / 28 / 6.0/ JOB/ FAIR / 5 0 CR / SEEKS / JOB / FAIR / 25 / 5.6 / 15 CR

★ KAMMA / DIVORES / B.B.A / 31/ 6.1 / FAIR / 50 CR / SEEKS / 27/ FAIR / 24 / 5.5 / 25 CR

★ KAMMA / DIVORESE / DM DOCTOR / 35 / 5.11 / FAIR / 6 CR / SEEKS / PG DR OR S.W.E/ FAIR / 31/ 5.4 / 3 CR

వరుడు కావలెను

★ KAMMA / B.B.A/BUSINESS/ 24 / FAIR / 5.6 / 100 CR / SEEKS ONLY HYD / BUSINSS / 28 / 5.11 / 100 CR+

★ KAMMA / MS/ BUSINESS / 29 / FAIR / 5.7 / 100 CR / SEEKS JOB OR BUSINESS / HYD / 32 / 6.0 / 100 CR+

★ KAMMA / MS USA /JOB / FAIR / 28 / FAIR / 5.7 / 20 CR /SEEKS USA JOB / 31 / 5.11/ 30 CR+

★ KAMMA / MS USA JOB / 28 / 5.5/ FAIR /20 CR / SEEKS USA JOB / 30 / 5.10 / 30 CR+

★ KAMMA / MD RADIOLOGY 1ST YEAR / FAIR /26 / 5.7 / 50 CR / SEEKS PG DOCTOR / 29/ 5.11/ 100 CR

★ KAMMA / PG DOCTOR/ FAIR / 26/ 5.2/ 50 CR / SEEKS BUS OR PG DR / 29 / 5.8 / 70 CR

★ KAMMA / MS / 28/ FAIR/ 5.6/45 LAKHS / 25CR/SEEKS ONLY S.W OR BUSINESS /31/5.10/30 CR+

★ KAMMA /B.TECH /24 /5.4/ FAIR / S.W.E / 50 CR/SEEKS BUSINESS OR S.W.E/ HYD/ 27/5.9/100CR

★ KAMMA / DIVORCE / MD/ DOCOTOR / 29 / FAIR / 5.6/ 20 CR/ SEEKS ONLY HYD/ BUSINSS / 33/5.10/30 CR+

★ KAMMA / DIVORESE/ B.TECH/S.W.E./ 37/ 5.4/ FAIR/ 30/ SEEKS / 35/5.9/S.W.E OR BUSINESS/50 CR

V.I.P MATRIMONY

ONLY FOR KAMMA'S

కమ్మ వారి వివాహ సంబంధాలకై ప్రత్యేకముగా నడుపబడుచున్న సంస్థ 8143538383

వధువు కావలెను

★ కమ్మ (BUSINESS): 26 6' V.FAIR B.Sc (London) Own SW Company Hyd 500 Cr వరునకు Well Settled Business Family నుండి వధువు కావలెను. ★ 8143538383

★ కమ్మ (BUSINESS): 26 6' LAW (AUS) OWN Colleges in Abroad 600 Cr Business వరునకు Well Settled అందమైన వధువు కావలెను. ★ 8143538383

★ కమ్మ (US): 26 6'2" V.FAIR IIT, MS, Ph.D (CS) USA $200K 100Cr Seeks INDIA / USA వధువు కావలెను. ★ 8143538383

★ కమ్మ (US): 26 5'11" MS $180K H1B 100Cr. Educated Family. Seeks V.FAIR, INDIA / USA GIRL ★ 8143538383

★ కమ్మ (DOCTOR): 26 6' V.FAIR MD, DM (CARDIO) 100 Cr Seeks Well Settled Doctor Bride From Good Family ★ 8143538383

★ కమ్మ (INDIA) : 26 5'11" V.FAIR, IIT, IIM 60LPA HYD 35Cr Seeks Educated Girl From Good Family ★ 8143538383

★ కమ్మ (INDIA): 28 5'11" MBA(IIM) 40LPA HYD 25Cr. Seeks V.Fair Well Educated Bride ★ 8143538383

★ కమ్మ (DIVORCE): 27 6'2" MBA BUSINESS HYD 150 Cr. Seeks 1st / 2nd Bride from Decent Family. ★ 8143538383

★ కమ్మ (DIVORCE): Doctor: 37 5'9" MS(ENT) Fellowship 5 LPM 25 Cr Hyd. Seeks Doctor Bride ★ 8143538383

★ కమ్మ (DIVORCE): USA: 27 5'11" IIT, MBA (US) $220K 75Cr. Seeks 1st/2nd Bride, Good Looking ★ 8143538383

వరుడు కావలెను

★ కమ్మ (BUSINESS): 24 V.FAIR 5'8" MBA (UK) BUSINESS FAMILY IN HYD 1000 Cr. Seeks well settled Business Boy. ★ 8143538383

★ కమ్మ (BUSINESS): 23 Beautiful 5'5" MS(USA) Family Business Hyd 500 Cr Seeks Business Groom in Hyderabad.

★ కమ్మ (BUSINESS): 24 5'6" V.FAIR MBA Doing Business 50 Cr Seeks Well Settled Boy Job or Business ★ 8143538383

★ కమ్మ (USA): 24 5'6" V.FAIR MS, AMAZON $ 190k H1B 50 Cr Seeks Well Settled US Boy. ★ 8143538383

★ కమ్మ (USA): 25 5'8" V.FAIR IIT, MS / META, $ 200K H1B 80 Cr Seeks India / USA Groom ★ 8143538383

★ కమ్మ (INDIA): 23 5'7" V.FAIR IIT, 42 LPA HYD 50 Cr ★ 26 5'5" V.FAIR MBA (ISB) 30 LPA 25 Cr ★ 8143538383

★ కమ్మ (INDIA): 27 5'6" V.FAIR BE, MBA 12LPA HYD 100 Cr Only Daughter. Seeks Business (or) Job Groom Only Hyd.

★ కమ్మ (DOCTOR): 25 V.FIAR 5'5" MD (GM) 100 Cr Only Daughter, Seeks Doctor / Business Groom. ★ 8143538383

★ కమ్మ (DOCTOR): 26 5'4" Beautiful MD(GM) Top Family Hyd 40Cr Seeks Business / Job Groom. ★ 8143538383

★ కమ్మ (DIVORCE): 25 V.FIAR 5'6" MBA (ISB) 100 Cr early Divorce వధువుకు, మంచి చదువు అందమైన వరుడు కావలెను. ★ 8143538383

శారద వివాహ వేదిక

Mail: saradamatrimony1@gmail.com, website: www.saradaram.com

EXCLUSIVE CHOWDARY COMMUNITY Hyderabad. Phone: 9849413031

కమ్మ ప్రత్యేకం

వధువు కావలెను

★ కమ్మ ప్రత్యేకం : 100 Cr B.Tech MS UK return 26 / 100 Cr B.Tech / MBA / UK 30/ India వరులకు వధువు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం : 50 Cr B.Tech MS 31 / 20 Cr B.Tech MS 33 / 15 Cr B.Tech MS 37/70 Cr B.Tech MS Citizen 28 / USA వరులకు వధువు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం : 50 Cr B.Tech MS Sweeden / 10 Cr B.Tech UK / 9 Cr B.Tech Irland / 20 Cr Australia B.Tech MS వరులకు వధువు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం : 50 Cr / MBBS PG USA 30 / 100 Cr USA Citizen Doctor 29 / 27 USA Doctor వరులకు వధువు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం : 100 Cr MBBS MD GM 27 / 20 Cr MS Orthopaedics 34 / 20 Cr MBBS Pediatrics / 10 Cr MBBS Radiology వరులకు వధువు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం : 25 Cr B.Tech 28 LPA / 30 B.Tech 5Cr 18 LPA / 7 Cr B.Tech 13 LPA 30/10 Cr B.Tech 80 LPA / 33 వరులకు వధువు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం :Govt. Job 50 Cr B.Tech MS 29 / 10 Cr IRS 34 / వరులకు వధువు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం (రెండో పెళ్ళి) : 20 Cr BTech IIT Business 32/ 10 Cr MBA 12 LPA / 30 / 15 Cr B.Tech 80 LPA 40 / 50 Cr B.Com Business 42 వరులకు వధువు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం USA (రెండో పెళ్ళి) : 34 B.Tech MS 20 Cr / 37 B.Tech MS 15 Cr / 20 Cr B.Tech MS 39 / 10 Cr B.Tech MS USA Citizen 45 వరులకు వధువు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం : 1 to 500 Cr 25 to 45 B.Tech MS / Doctors / ఇంజనీర్స్ / Business / USA / UK / India / Australia / Irland / Sweeden వరులకు వధువు కావలెను. సంప్ర: శారద 9849413031

వరుడు కావలెను

★ కమ్మ ప్రత్యేకం : 35 Cr BDS MS UK 28 / 10 Cr B.Tech MS UK వధువులకు తగిన వరులు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం : 28 MBBS ENT / 50 Cr MBBS MD Pediatrics / 10 Cr MBBS MD Pediatrics 25 / 28 MDS Vijayawada / 27 MBBS Gynachology వధువులకు వరులు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం : USA Citizens 32 PG Doctor / 28 BA JD (LAW) / 23 B.Tech BCS / 28 BA Texas 70 Cr / USA Citizen వధువులకు తగిన వరులు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం(రెండో పెళ్ళి) : 300 Cr Bangalore 39 / 70 Cr MPharmacy Law 35 / 20 Cr B.Tech 34 / 100 Cr B.Tech 37 / 15 Cr B.Tech MS 38 వధువులకు తగిన వరులు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం : 50 Cr B.Arch 41 / 15 Cr BA LLB 30 / 25 Cr B.Tech MS 30 LPA Hyd / 70 Cr B.Arch 32 వధువులకు తగిన వరులు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం : 10 Cr M.Tech IIIT 31 / 10 Cr BE 28/26 B.Tech 25 LPA / 27 B.com CA Final / 28 MPharmacy / 25 B.Tech 30 / B.Tech వధువులకు తగిన వరులు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం : USA 10 Cr B.Tech MS 38 / 20 Cr B.Tech MS 35 / 20 Cr Doctor 32 / B.Tech MS 25 / B.Tech MS 30 వధువులకు తగిన వరులు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం(రెండవ పెళ్ళి) : 38 B.Tech MS India / 37 B.Tech MS USA / 38 B.Tech MS USA / 28 B.Tech MS UK 28 B.Tech MS Australia వధువులకు వరులు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం : 1 to 100 Cr India / USA / UK / Australia / Canada / 22 to 45 వధువులకు వరులు మరియు లేటు Matecheలకై సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం : 28 MDS Doctor / 29 MBBS PG Doctors / 32 LLB లాయర్స్ / 32 B.Tech IIT SWE వధువులకు వరులు కావలెను. సంప్ర: శారద 9849413031

ఆర్సీబీ ఇంటికి!

యూపీ రికార్డు స్కోరు ● పోరాడి ఓడిన బెంగళూరు



జార్జియా వోల్ (99 నాటౌట్)

- నాకౌట్‌కు గుజరాత్, ముంబై
- డబ్ల్యూపీఎల్

లఖ్‌నవూ: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)లో పరుగుల వరద పారింది. అటు యూపీ వారియర్స్, ఇటు బెంగళూరు (ఆర్సీబీ) బ్యాటర్లు పోటీపడి భారీషాట్లతో అలరించారు. దరిమిలా మ్యాచ్‌లో 400కుపైగా పరుగులు నమోదయ్యాయి. ఆఖరి ఓవర్ వరకూ మజా పంచిన ఈ పోరులో యూపీ వారియర్స్ మహిళలు 12 పరుగులతో నెగ్గారు. ఇప్పటికే ప్లేఆఫ్స్ రేసు నుంచి నిష్క్రమించిన యూపీ విజయంతో టోర్నీని ముగించింది. మరోవైపు చావోరేవో తేల్చుకోవాల్సిన ఈ మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంప్ బెంగళూరు అద్భుతంగా పోరాడినా నిరాశ తప్పలేదు. దాంతో 7 మ్యాచుల్లో రెండే గెలిచిన స్మృతీ మంధాన సేన (4 పాయింట్లు) కూడా నాకౌట్‌కు చేరకుండానే వెనుదిరిగింది. శనివారం జరిగిన ఈ మ్యాచ్‌లో తొలుత యూపీ 20 ఓవర్లలో 225/5తో డబ్ల్యూపీఎల్ చరిత్రలో భారీ స్కోరు చేసింది. టాపార్డర్ బ్యాటర్లు జార్జియా వోల్ (99 నాటౌట్), కిరణ్ నవ్‌గిరే (46), గ్రేస్ హ్యారిస్ (39) సత్తా చాటారు. రికార్డు ఛేదనలో బెంగళూరు 19.3 ఓవర్లో 213 రన్స్‌కు ఆలౌటైంది. రిచా ఘోష్ (33 బంతుల్లో 6 ఫోర్లు, 5 సిక్స్‌లతో 69), ఎలిస్ పెర్రీ (28), సబ్బినేని మేఘన (27), స్నేహ్ రాణా (26) ధనాధన్ ఇన్నింగ్స్‌తో అలరించారు. జార్జియా 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచింది. ఇక..టేబుల్ టాపర్ ఢిల్లీ ఇంతకుముందే ప్లేఆఫ్స్‌కు చేరగా..శనివారం నాటి మ్యాచ్ ఫలితంతో గుజరాత్, ముంబై ప్లేఆఫ్స్ బెర్తులు ఖరారయ్యాయి.

సంక్షిప్తస్కోర్లు
యూపీ: 20 ఓవర్లలో 225/5 (జార్జియా వోల్ 99 నాటౌట్, కిరణ్ 46, హ్యారిస్ 39, వేర్‌హమ్ 2/43).
బెంగళూరు: 19.3 ఓవర్లలో 213 ఆలౌట్ (రిచా 69, పెర్రీ 28, మేఘన 27, రాణా 26, ఎకిల్‌స్టోన్ 3/25, దీప్తి 3/50, హెన్రీ 2/39).

దాదాపు పాతికేళ్ల క్రితం నాటి సంగతి.. 2000, అక్టోబరు 15న కెన్యాలో చాంపియన్స్ ట్రోఫీ ఫైనల్. అప్పటిదాకా ఓటమన్నదే లేని భారత్‌ను నేలకు దించుతూ న్యూజిలాండ్ టైటిల్ ఎగరేసుకుపోయింది. మళ్లీ ఇన్నాళ్లకు అవే జట్లు అదే ట్రోఫీ కోసం సమర భేరి మోగిస్తున్నాయి. తాజా టోర్నీలోనూ టీమిండియాకు పరాజయమే లేదు. మరి.. అదే జోరును తుది పోరులోనూ చూపి ప్రత్యర్థిపై రోహిత్‌సేన ప్రతీకారం తీర్చుకుంటుందా? లేదంటే సరైన సమయంలో దెబ్బతీసే అలవాటున్న కివీస్ ఆధిపత్యం చాటుతుందా? విజేత ఎవరో నేడు తేలనుంది.



అదరాలి ఫైనల్ పంచ్

జోరు మీదున్న భారత్

మధ్యాహ్నం 2.30 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో

న్యూజిలాండ్‌తో టైటిల్ పోరు నేడే
స్పిన్నర్లు కీలకం ● చాంపియన్స్ ట్రోఫీ



కేన్, శాంట్నర్

సమ ఉజ్జీగా ..

కివీస్ జట్టులోనూ సమర్థులైన స్పిన్నర్లు కలిగి ఉన్నారు. సెమీస్‌లో దక్షిణాఫ్రికాను ఏడు వికెట్లతో వణికించారు. కెప్టెన్ శాంట్నర్ బంతుల్లో పరుగులు సాధించడం అంత సులువు కాదు. ఈ లెఫ్టామ్ స్పిన్నర్ ఖాతాలో 4.85 ఎకానమీ రేటుతో 7 వికెట్లున్నాయి. అతడికి తోడు బ్రేస్‌వెల్, రచిన్, ఫిలిప్స్ దుబాయ్ పిచ్‌పై రాణించేందుకు సిద్ధంగా ఉన్నారు. గతేడాది స్పిన్ బలంతోనే ఈ జట్టు భారత్‌పై టెస్టు సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసిన విషయం మర్చిపోరాదు. అయితే భారత్‌పై ఐదు వికెట్లతో రాణించిన పేసర్ హెన్రీ గాయం కారణంగా ఆడడం కష్టమే. సెమీస్‌లో దక్షిణాఫ్రికాపై 362 పరుగులు సాధించి బ్యాటర్లు సైతం ఊపు మీదున్నారు. రచిన్, విలియమ్సన్ శతకాలు.. మిచెల్, ఫిలిప్స్‌ల మెరుపు ఇన్నింగ్స్‌లతో సఫారీలు చిత్తుగా ఓడారు. ఇక వీరి ఫీల్డింగ్ ప్రత్యర్థి జట్లను వణికిస్తుంటుంది. అందుకే అన్ని విభాగాల్లో జోరు మీదున్న కివీస్‌ను భారత్ తమ స్థాయికి తగ్గ ఆటతీరుతో అడ్డుకోవాల్సి ఉంటుంది.

దుబాయ్: ఎనిమిదేళ్ల తర్వాత జరుగుతున్న ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ (సీటీ) ఆఖరి అంకానికి చేరింది. ఆదివారం జరిగే ఫైనల్లో న్యూజిలాండ్‌ను భారత్ ఎదుర్కొనబోతోంది. టీమిండియాకిది వరుసగా మూడో సీటీ ఫైనల్. కాగా, టోర్నీలో ఇప్పటిదాకా భారత్ రెండుసార్లు విజేతగా నిలిచింది. 2013లో భారత్ చివరిసారి గెలిచింది. ఇక తాజా టోర్నీలో బంగ్లాదేశ్, పాకిస్థాన్, న్యూజిలాండ్, ఆస్ట్రేలియాపై గెలిచి రోహిత్ సేన పూర్తి ఆత్మవిశ్వాసంతో ఉంది. అటు కివీస్ కూడా గ్రూప్ దశలో భారత్ చేతిలో మాత్రమే ఓడింది. దీనికితోడు 2000లో భారత్‌పైనే గెలిచి తమ ఏకైక టైటిల్ దక్కించుకోవడం కివీస్‌కు సానుకూలాంశం. అలాగే ఐసీసీ నాకౌట్ మ్యాచ్‌ల్లోనూ భారత్‌పై 3-1తో కివీస్ జట్టే ఆధిక్యంలో ఉంది. అందుకే భారత్ ఏమాత్రం అలసత్వం ప్రదర్శించినా కప్ చేజారుతుంది.

కొండంత అండగా స్పిన్నర్లు: స్టార్ పేసర్ బుమ్రా లేని లోటును ఏమాత్రం తెలియనీయకుండా భారత జట్టు చాంపియన్స్ ట్రోఫీలో అదరగొడుతోంది. దీనికి కారణం జట్టులోని నలుగురు స్పిన్నర్లే. కుడి-ఎడమ కాంబినేషన్‌లో వరుణ్ చక్రవర్తి, కుల్దీప్ యాదవ్ ప్రత్యర్థి బ్యాటర్లను తమ ఉచ్చులో బిగిస్తున్నారు. కివీస్‌తో గ్రూప్ మ్యాచ్‌లో వరుణ్ చేసిన మాయాజాలం చూశాం. అయితే గత రెండు మ్యాచ్‌ల్లో కుల్దీప్ పెద్దగా ఆకట్టుకోలేకపోయాడు. అతడి స్థానంలో పేసర్లు హర్షిత్ లేక అర్ష్‌దీప్‌లలో ఒకరికి చోటిస్తారా? అన్నది చూడాలి. అటు కుడిచేతి వాటం బ్యాటర్లపై జడేజా, అక్షర్ ప్రభావం చూపుతున్నారు. అలాగే మధ్య ఓవర్లలో కచ్చితమైన లెంగ్త్‌తో కట్టడి చేస్తున్నారు. కివీస్, ఆసీస్‌పైనా నలుగురు స్పిన్నర్లతో బరిలోకి దిగి ఫలితం రాబట్టారు. అందుకే ఈ ఫైనల్లోనూ ఈ వ్యూహంలో మార్పుండకపోవచ్చు. పేసర్లు షమి, హార్దిక్ పవర్‌ప్లేలో పరుగులను నియంత్రించాలనుకుంటున్నారు. అయితే షమి నుంచి పూర్తి స్థాయి బౌలింగ్ ప్రదర్శన రావాల్సి ఉంది.

పిచ్: భారత్ ఇప్పటిదాకా నాలుగు పిచ్‌లపై ఆడింది. అయితే ఫైనల్‌కు మాత్రం పాక్‌తో ఆడిన పిచ్‌ను సిద్ధం చేయనున్నారు. ఆ మ్యాచ్ జరిగి రెండు వారాలైంది కాబట్టి తాజాగా ఉంటుందని క్యూరేటర్ చెబుతున్నాడు. ఇక్కడ తొలి ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్ సులువైనా ఆ తర్వాత ఛేదన కష్టంగా మారింది. స్పిన్నర్లకే కాకుండా ఈ వికెట్ పేసర్లకు కూడా అనుకూలించనుంది.

తుది జట్లు (అంచనా)

భారత్: రోహిత్ (కెప్టెన్), గిల్, విరాట్, శ్రేయాస్, అక్షర్, రాహుల్, హార్దిక్, జడేజా, కుల్దీప్, షమి, వరుణ్ చక్రవర్తి.
న్యూజిలాండ్: యంగ్, రచిన్, విలియమ్సన్, లాథమ్, మిచెల్, ఫిలిప్స్, బ్రేస్‌వెల్, శాంట్నర్ (కెప్టెన్), జేమిసన్, ఓరౌర్కీ, హెన్రీ/స్మిత్.



చాంపియన్స్ ట్రోఫీలో అత్యధిక పరుగులు సాధించిన క్రిస్ గేల్ (791) రికార్డును అధిగమించేందుకు విరాట్ కోహ్లీ 46 పరుగుల దూరంలో ఉన్నాడు.

'ఆఖరాట'లో మురిపిస్తారా?

వెటరన్ స్టార్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీలకు ఇదే చివరి ఐసీసీ టోర్నీగా క్రికెట్ పండితులు విశ్లేషిస్తున్నారు. దీంతో ఫైనల్లో ఆ ఇద్దరిపై అందరి దృష్టి నెలకొంది. గతేడాది టీ20 వరల్డ్‌కప్ అందించినట్టుగానే ఈసారి మరో ఐసీసీ ట్రోఫీతో మురిపించాలని రోహిత్, కోహ్లీ పట్టుదలగా ఉన్నారు. విరాట్ టోర్నీలో తన ఫామ్‌ను చాటుకుంటూ అభిమానులను ఖుషీ చేస్తున్నాడు. అయితే, పిచ్‌లు విభిన్నంగా ఉండడంతో ఈ టోర్నీలో అతడి ఆటలో మునుపటి వేగం కనిపించడం లేదు. దీంతో ఫైనల్లో ఆ లోటును తీరుస్తూ కివీస్‌పై కోహ్లీ విరుచుకుపడాలని ఫ్యాన్స్ కోరుకుంటున్నారు. ఇక రోహిత్ ఉన్న కాసేపు ఎడాపెడా షాట్లు బాదేస్తున్నా, నిలకడ లోపిస్తోంది. టోర్నీలో అతడి అత్యధిక స్కోరు 41 మాత్రమే. రోహిత్ 20 ఓవర్ల వరకు కుదురుకోగలిగినా భారత్‌కు భారీస్కోరు ఖాయం. మరోవైపు ఓపెనర్ గిల్, శ్రేయాస్, అక్షర్, రాహుల్, హార్దిక్ ఊపు మీదున్నారు. మరోసారి కలిసికట్టుగా ఆడితే ట్రోఫీ భారత్‌దే.

రూ. 5 వేల కోట్ల బెట్టింగ్‌లు..!

న్యూఢిల్లీ: భారత్-కివీస్ ఫైనల్ మ్యాచ్‌పై భారీగా బెట్టింగులు కడుతున్నారు. దుబాయ్ వేదికగా జరుగుతున్న ఈ మ్యాచ్‌పై సుమారు రూ. 5 వేల కోట్ల బెట్టింగ్‌లు పెట్టినట్టు సమాచారం. ఇందుకోసం ప్రపంచ వ్యాప్తంగా ఉన్న బుకీలు దుబాయ్‌లో వాలిపోయినట్టు తెలుస్తోంది. ఈ బిగ్ బెట్టింగ్ రాకెట్ వెనుక డి-కంపెనీ ఉన్నట్టు సమాచారం. కాగా, ఎక్కువ మంది బుకీలు భారత్‌ను ఫేవరెట్‌గా భావిస్తున్నారట. ఈ మేరకు రోహిత్ సేనపైనే ఎక్కువగా పందాలు కాస్తున్నారట.

విరాట్‌కు గాయం..?

ప్రాక్టీస్ సెషన్‌లో విరాట్ కోహ్లీ మోకాలికి గాయం కావడం ఆందోళన కలిగిస్తోంది. బ్యాటింగ్ సమయంలో పేసర్ బంతి బలంగా తాకింది. దీంతో బాధతో విలవిల్లాడిన విరాట్‌కు ఫిజియో చికిత్స అందించాడు. మోకాలికి స్ప్రే చేయడంతో పాటు బ్యాండేజి కట్టారు. ఆ తర్వాత కోహ్లీ ప్రాక్టీస్‌కు దూరంగా ఉన్నాడు. అయితే గాయంపై ఆందోళన అనవసరమని, విరాట్ ఫైనల్ ఆడతాడని జట్టు వర్గాలు తెలిపాయి.

'టాప్స్'లో 13 మంది తెలుగు అథ్లెట్లకు చోటు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): టార్గెట్ ఒలింపిక్స్ పోడియం పథకం (టాప్స్)లో తెలుగు రాష్ట్రాల నుంచి 13 మంది క్రీడాకారులకు చోటు దక్కింది. కేంద్ర క్రీడాశాఖ ఆధ్వర్యంలో జరిగే టాప్స్‌లో కోర్ బృందంలో 42 మంది, పారా కోర్ గ్రూప్‌లో 52 మంది, డెవలప్‌మెంట్ గ్రూప్‌లో 112 మందికి మొత్తంగా 206 మంది ప్లేయర్లకు చోటు లభించింది. కోర్ గ్రూప్‌లోని క్రీడాకారులకు నెలకు రూ.50 వేలు, డెవలప్‌మెంట్ గ్రూప్ అథ్లెట్లకు నెలకు రూ.25 వేలు చొప్పున ఉపకార వేతనంగా అందనుంది. కోర్ గ్రూప్‌లో ఆంధ్రప్రదేశ్ నుంచి షట్లర్లు సింధు, సాత్విక్ సాయిరాజ్, పుల్లెల గాయత్రి, ఆర్చర్ ధీరజ్, బాక్సర్ నిఖత్ జరీన్, షూటర్ ఇషా సింగ్, టీటీ ప్లేయర్ శ్రీజ ఉన్నారు. డెవలప్‌మెంట్ గ్రూప్‌లో ఏపీ నుంచి ఆర్చర్ జ్యోతి సురేఖ, స్ప్రింటర్ యర్రాజీ జ్యోతి, పారా అథ్లెట్ రొంగలి రవి, తెలంగాణ తరఫున అథ్లెట్ నందిని, పారా అథ్లెట్ జీవాంజి దీప్తి, షూటర్ కెనాన్ చినాయ్‌లకు చోటు దక్కింది.

శౌర్యకు డబుల్స్ టైటిల్



హైదరాబాద్: అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) జే30 టోర్నీలో హైదరాబాద్ కుర్రాడు శౌర్య సామల డబుల్స్ విజేతగా నిలిచాడు. తమిళనాడులోని మధురైలో జరిగిన పురుషుల డబుల్స్ ఫైనల్లో శౌర్య/హృతిక్ కటకం జోడీ 6-3, 7-6 (8-6)తో ఆరవ్ చావ్లా/ప్రకాశ్ శరణ్ జంటను ఓడించింది.

ఫిట్ ఇండియాలో భాగమవ్వండి



కేంద్ర క్రీడా మంత్రి మన్‌సుఖ్ మాండవ్య

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ప్రధాన మంత్రి మోదీ ప్రారంభించిన ఫిట్ ఇండియా కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగమవ్వాలని కేంద్ర క్రీడాశాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవ్య కోరారు. శనివారం అంతర్జాతీయ మహిళల దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ శివార్లలోని కన్హా ఆశ్రమంలో నిర్వహించిన సైకిల్ ర్యాలీలో మాండవీయ, జాతీయ బ్యాడ్మింటన్ చీఫ్ కోచ్ పుల్లెల గోపీచంద్, పారా ఒలింపియన్ జీవాంజి దీప్తి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాండవ్య మాట్లాడుతూ.. క్రీడల్లో మహిళల ప్రాతినిధ్యం పెరుగుతుండడం శుభ పరిణామన్నారు. సైక్లింగ్‌ను దినచర్యలో భాగం చేసుకుంటే ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపవచ్చునని చెప్పారు.

బిజినెస్ ప్లస్

అప్పు చేసి తిరిగి చెల్లించకపోతే క్రెడిట్ స్కోర్ దెబ్బతింటుందన్న విషయం తెలిసిందే. కానీ, ఇంతవరకు రుణం తీసుకోకపోయినా మీ క్రెడిట్ స్కోర్ చాలా తక్కువగా ఉందా..? అందుకు కారణాలేంటో తెలుసుకుందాం..



అప్పు చేయకపోయినా క్రెడిట్ స్కోర్ తక్కువగా ఉందా?

క్రెడిట్ హిస్టరీ లేకపోవడం

ఇప్పటివరకు మీరు రుణం తీసుకోలేదు, క్రెడిట్ కార్డు కూడా వాడటం లేదనుకోండి.. క్రెడిట్ బ్యూరోల వద్ద మీ డేటా ఉండకపోవడం వల్ల స్కోర్ తక్కువగా ఉండే అవకాశం ఉంది. సాధారణంగా యువతీ యువకులు, విద్యార్థులు, సదా నగదు లేదా డెబిట్ కార్డు ద్వారా చెల్లింపులు చేపట్టే వారి స్కోర్ తక్కువగా ఉంటుంది.

క్రియారహిత క్రెడిట్ కార్డు

మీరు క్రెడిట్ కార్డు తీసుకున్నారు. కానీ దాన్ని వినియోగించకపోతే మీ రుణ నిర్వహణ తీరుపై క్రెడిట్ బ్యూరోలకు సమాచారం ఉండదు. కాబట్టి, క్రియారహిత క్రెడిట్ కార్డు కారణంగా మీ స్కోర్ తగ్గకపోయినప్పటికీ పెరగడం మాత్రం జరగదు.

రుణ తిరస్కరణ

మీరు గతంలో క్రెడిట్ కార్డు లేదా వ్యక్తిగత రుణం కోసం దరఖాస్తు చేసుకున్నారు. కానీ, ఆ దరఖాస్తు తిరస్కరణకు గురైన పక్షంలోనూ క్రెడిట్ స్కోర్ తగ్గుతుంది. అయినప్పటికీ, అది తాత్కాలికమే.

తక్కువ క్రెడిట్ హిస్టరీ

క్రెడిట్ స్కోర్ ఆల్గోరిథమ్స్ సుదీర్ఘ క్రెడిట్ హిస్టరీ కలిగిన వారికి ప్రాధాన్యమిస్తాయి. మీరు ఈ మధ్య కాలంలోనే క్రెడిట్ కార్డు లేదా ఏదైనా రుణ సాధనాన్ని తీసుకున్నారనుకోండి.. తొలుత మీ స్కోర్ తక్కువగానే ఉంటుంది. ఆపై మీ రుణ నిర్వహణ తీరును బట్టి స్కోర్ పెరగడం లేదా తగ్గడం జరుగుతుంది.

క్రెడిట్ నివేదికలో తప్పులు

ఇతర వ్యక్తుల వ్యక్తిగత రుణం లేదా ఆలస్య చెల్లింపుల వివరాలు పొరపాటున మీ క్రెడిట్ రిపోర్టులో చేర్చిన పక్షంలోనూ స్కోర్ తగ్గే ప్రమాదం ఉంది.

క్రెడిట్ మిక్స్ లేకపోవడం

సాధారణంగా ఒకే రుణ సాధనం కలిగిన వారి స్కోర్ తక్కువగానే ఉంటుంది. క్రెడిట్ కార్డు, వ్యక్తిగత రుణం.. ఇలా భిన్న రుణ సాధనాలను ఉపయోగించుకోవడంతో పాటు వాటి నిర్వహణ తీరు బాగుంటే భవిష్యత్‌లో స్కోర్ పెరిగేందుకు అవకాశం ఉంటుంది.

క్రెడిట్ కార్డు పరిమితిలో 30 శాతానికి మించి వినియోగం

మీకు క్రెడిట్ కార్డు ఉంటే, తరచుగా దాని పరిమితిలో 30 శాతానికి మించి వినియోగించుకుంటున్నట్లయితే, సకాలంలోనే బిల్లు చెల్లించినప్పటికీ క్రెడిట్ స్కోర్ తగ్గుతుంది. ఎందుకంటే, మీరు జీవితంలో రుణాలపైనే అధికంగా ఆధారపడుతున్నారడానికి అది సంకేతం.

జాయింట్ అకౌంట్స్

ఇతర వ్యక్తి రుణానికి మీరు సహ-సంతకందారు లేదా హామీదారుగా ఉన్నట్లయితే, ఆ వ్యక్తి రుణం చెల్లింపులో విఫలమైతే తనతో పాటు మీ క్రెడిట్ స్కోర్ కూడా తగ్గుతుంది.

సామ్కో లార్జ్ క్యాప్ ఫండ్

సామ్కో అసెట్ మేనేజ్‌మెంట్.. లార్జ్ క్యాప్ ఫండ్‌ను ప్రారంభించింది. ఇది లార్జ్ క్యాప్ స్టాక్స్‌ల్లో పెట్టుబడులు పెట్టే ఓపెన్ ఎండెడ్ ఈక్విటీ పథకం. సామ్కో ప్రొప్రైటరీ వ్యూహమైన 'కేర్' రూపొందించిన 100 లార్జ్ క్యాప్ కంపెనీల్లో ఈ ఫండ్ ఇన్వెస్ట్ చేస్తుంది. మార్కెట్ ఆటుపోట్లను తట్టుకుంటూ ఎప్పటికప్పుడు పెట్టుబడుల వ్యూహాలను మార్చుకోవటం ఈ ఫండ్ ప్రత్యేకత. ఈ ఫండ్‌కు నిఫ్టీ 100 టోటల్ రిటర్న్ ఇండెక్స్ బెంచ్‌మార్క్‌గా ఉండనుంది. ఈ ఫండ్ కనీస పెట్టుబడి రూ.5,000. సిప్ రూపంలో అయితే కనీసం రూ.500. ముగింపు తేదీ ఈ నెల 19.

బంధన్ డెట్ ఇండెక్స్ ఫండ్

బంధన్ మ్యూచువల్ ఫండ్.. క్రిసిల్-ఐబీఎక్స్ ఫైనాన్షియల్ సర్వీసెస్ 3-6 నెలల డెట్ ఇండెక్స్ ఫండ్‌ను తీసుకువచ్చింది. స్వల్పకాలంలో ఫిక్స్‌డ్ ఆదాయం అందించే విధంగా ఈ ఫండ్‌ను రూపొందించింది. మూడు నుంచి ఆరు నెలల్లో మెచ్యూర్ అయ్యే ఏఏఏ- రేటెడ్ సర్టిఫికెట్స్ ఆఫ్ డిపాజిట్స్, కమర్షియల్ పేపర్స్, బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు, ఆర్థిక సంస్థలు జారీ చేసిన కార్పొరేట్ బాండ్స్‌ల్లో ఈ ఫండ్ పెట్టుబడులు పెడుతుంది. ఈ ఫండ్ ముగింపు తేదీ 11.

ప్రతి వ్యక్తి ఆర్థిక ప్రణాళికలో బీమా ఒక భాగం. అనుకోని సంఘటనలు ఏమైనా జరిగితే, పాలసీకి అనుగుణంగా ఆ ఖర్చులను బీమా కంపెనీ చెల్లిస్తుంది. దీనివల్ల మన పొదుపు మొత్తాలపై ప్రభావం పడదు. అయితే బీమా కంపెనీల ఏజెంట్లు చెప్పే పదజాలం అందరికీ అర్థం కాదు. చాలా మంది ఏజెంట్లు కూడా ఎంతసేపటికి ఏదోలా తమ పాలసీలు అంటగట్టేందుకు ప్రయత్నిస్తారే తప్ప ఆ పాలసీల పూర్తి వివరాలను పాలసీదారులకు అర్థమయ్యేలా చెప్పరు. ఈ పొరపాటు చివరికి పాలసీదారుల కొంప ముంచుతుంటాయి. అందుకే బీమా పాలసీలు తీసుకునేటప్పుడే అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాల్సి ఉంటుంది. పాలసీ తీసుకునే సమయంలో పొరపాట్లు చేయకుండా ఏయే జాగ్రత్తలు తీసుకుంటే మంచిదో తెలుసుకుందాం.



'బీమా'పై జర జాగ్రత్త

పొరపాట్లు చేస్తే తిప్పలే

అవసరం మేరకే పాలసీ

బీమా పాలసీ తీసుకునే ముందే మన అవసరాలు ఏమిటో స్పష్టంగా ఆలోచించుకోవాలి. ఆరోగ్య బీమా పాలసీల విషయంలో ఇది మరింత అవసరం. మెట్రో నగరాల్లో ఇవాళ ఏ చిన్న ఆస్పత్రికి వెళ్లినా ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయి. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రతి వ్యక్తి కనీసం రూ.25 లక్షల కవరేజీ ఉండేలా ఆరోగ్య బీమా పాలసీ తీసుకోవాలి. లేకపోతే భవిష్యత్ కోసం దాచుకున్న నాలుగు రాళ్లూ ఆస్పత్రి ఖర్చులకే హరించుకుపోతాయి. ఆరోగ్య బీమా పాలసీ తీసుకునేటప్పుడు అవసరాలతో పాటు మనం ఉంటున్న ప్రాంతం, కుటుంబ సభ్యుల సంఖ్యను కూడా గుర్తుంచుకోవాలి.

పోల్చి చూసుకోవడం

బీమా పాలసీలు తీసుకునేటప్పుడు పూర్తిగా కంపెనీల ఏజెంట్లు చెప్పే మాటలపైనే ఆధారపడకూడదు. వారు ఎంతసేపటికీ తమ కమీషన్ చూసుకుంటారే తప్ప మీ అవసరాలు పెద్దగా పట్టించుకోరు. పాలసీ తీసుకునే ముందే ఏదైనా తటస్థ చానల్ ద్వారా లేదంటే ఆన్‌లైన్ ద్వారా వివిధ బీమా కంపెనీల పాలసీలను పరిశీలించటంతో పాటు అవి అందించే ప్రయోజనాలను పోల్చి చూసుకోవాలి. మీ బడ్జెట్‌కు అనుగుణంగా ఏ కంపెనీ తక్కువ ప్రీమియంతో సమగ్ర పాలసీ అందిస్తోంది? ఆ కంపెనీ క్లెయిమ్స్ సెటిల్‌మెంట్ నిష్పత్తి ఎలా ఉంది? సరిచూసుకుని మరీ పాలసీని ఎంపిక చేసుకోవాలి.

ఎప్పటికప్పుడు సమీక్ష

మారే జీవితానికి అనుగుణంగా బీమా అవసరాలూ మారుతుంటాయి. హోమ్ ఇన్సూరెన్స్ ఇందుకు ఉదాహరణ. మారే అవసరాలకు అనుగుణంగా ఇంట్లో అదనపు గదులు, వంట గది ఏర్పాటు లేదా నవీకరించాల్సి ఉంటుంది దాంతో ఇంటి విలువా మారుతుంది. ఆ మారిన విలువకు అనుగుణంగా పాలసీ కవరేజీ పెంచుకోవాలి. అలాగే ఆ మార్పులను బీమా కంపెనీకి తెలియజేయాలి. లేకపోతే ఏదైనా ప్రమాదం జరిగి క్లెయిమ్ చేయాల్సి వచ్చినపుడు సమస్యలు ఎదురవుతాయి.

కవరేజీ ముఖ్యం

చాలా మంది ప్రీమియం భారం తగ్గించుకునేందుకు తక్కువ కవరేజీతో సరిపెడుతుంటారు. ఇది ఏ మాత్రం సరికాదు. ముఖ్యంగా ఆరోగ్య, టర్మ్ పాలసీలను మన ఆరోగ్య, ఆర్థిక అవసరాలకు అనుగుణంగా తీసుకోవాలి. తక్కువ ప్రీమియంతో పోతుంది కదాని పెద్దగా కవరేజీ లేని పాలసీలు తీసుకుంటే, జరగరాని అనర్థాలు జరిగినప్పుడు కుటుంబ ఆర్థిక భద్రత కూడా ప్రమాదంలో పడే అవకాశం ఉంది.

కీలక సమాచారం

మీరు ఇచ్చే వివరాల విశ్వసనీయత ఆధారంగానే బీమా కంపెనీలు మీకు పాలసీలు విక్రయిస్తాయి. కాబట్టి పాలసీ తీసుకునే ముందే ధూమపానం, అప్పటి వరకు మీకు ఉన్న అనారోగ్య సమస్యలు, పాత క్లెయిమ్స్ విషయాన్ని బీమా కంపెనీకి తెలియజేయండి. ప్రీమియం తగ్గుతుంది కదాని మీకున్న పొగ తాగే అలవాటు, ఇప్పటికే ఉన్న వ్యాధుల విషయం దాయవద్దు. అలా దాస్తే భవిష్యత్‌లో ముఖ్యంగా క్లెయిమ్స్ సెటిల్‌మెంట్ సమయంలో సమస్యలు వచ్చే ప్రమాదం ఉంది. ఈ విషయాలు తెలిస్తే బీమా కంపెనీలు పాలసీలను తిరస్కరించే ప్రమాదం కూడా ఉంటుంది.

స్పష్టమైన అవగాహన

మీరు తీసుకోబోయే పాలసీ గురించి మీకు స్పష్టమైన అవగాహన ఉండాలి. అందుకోసం మీరు తీసుకునే పాలసీ కింది ఏ నష్టాలు కవర్ అవుతాయి? ఏవి కావు? మినహాయింపులు, తగ్గింపులు, పాలసీ ప్రయోజనాల గురించి పూర్తిగా చదివి తెలుసుకోవాలి.

క్లెయిమ్ విధానంపై అశ్రద్ధ

బీమా పాలసీ తీసుకోగానే సరిపోదు. క్లెయిమ్ చేసుకోవాల్సిన అవసరం వచ్చినప్పుడు ఎలా క్లెయిమ్ చేసుకోవాలో కూడా తెలిసి ఉండాలి. ఈ క్లెయిమ్ విధానం ఎంత సులభంగా ఉంటే అంత మంచిది. లేకపోతే క్లెయిమ్ కోసం బీమా కంపెనీల చుట్టూ తిరగడానికి లేదా ఉత్తర ప్రత్యుత్తరాలకే పుణ్యకాలం కాస్తా సరిపోతుంది. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని క్లెయిమ్ విధానం వీలైనంత సింపుల్‌గా ఉండే కంపెనీల నుంచి పాలసీలు తీసుకోవడం మంచిది.

డెడ్‌లైన్స్ దగ్గర పడుతున్నాయ్..

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) ముగింపు దగ్గర పడుతోంది. దీంతో ఈ మార్చి నెలాఖరులోగానే ఈపీఎఫ్‌కు సంబంధించి యూనివర్సల్ అకౌంట్ నంబర్ (యూఏఎన్) యాక్టివేషన్, ఎంప్లాయి లింక్డ్ ఇన్సెంటివ్ (ఈఎల్ఐ) పథకం, ఎంప్లాయీస్ లింక్డ్ ఇన్సూరెన్స్ (ఈడీఎల్ఐ) పథకం, పన్ను ఆదా పెట్టుబడులు, ప్రత్యేక ఫిక్స్‌డ్ డిపాజిట్లకు సంబంధించి మీ బ్యాంకు ఖాతాలతో మీ ఆధార్ సీడింగ్ పూర్తి చేయాలి. ఆ వివరాలు మీకోసం

ఈపీఎఫ్ యూఏఎన్: ఈఎల్ఐ పథకం కోసం ఈపీఎఫ్ యూఏఎన్, బ్యాంకు ఖాతాలతో ఆధార్ సీడింగ్ యాక్టివేషన్ గడువును ఈపీఎఫ్ఓ ఈ నెల 15 వరకు పొడిగించింది. ఈ అప్‌డేషన్ పూర్తయితే తప్ప ఈపీఎఫ్ఓ అందించే ఈఎల్ఐ పథకం ప్రయోజనాలను ఈపీఎఫ్ చందాదారులు అందుకోలేరు.

బీమా ప్రయోజనాలు: ఈపీఎఫ్ సంస్థ అందించే కొన్ని బీమా ప్రయోజనాలు అందుకోవాలన్నా ఈ నెల 15లోగా ప్రతి ఈపీఎఫ్ సభ్యుడూ తన యూఏఎన్‌ను యాక్టివేట్ చేసుకోవాలి. ఈ పథకం కింద ప్రతి ఈపీఎఫ్ చందాదారుడికీ రూ.7 లక్షల వరకు కవరేజీ లభిస్తుంది.

ఐటీఆర్ ఫైలింగ్/అప్‌డేషన్: గత రెండేళ్లలో మీరు ఫైల్ చేసిన ఐటీ రిటర్న్‌ల్లో పొరపాట్లు దొర్లినా లేదా ఏదైనా ఆదాయాన్ని పేర్కొనక పోయినా ఈ నెలాఖరులోగా ఆ పొరపాట్లను సరిదిద్ది ఈ నెలాఖరులోగా కొత్త ఐటీ రిటర్న్ ఫైల్ చేయవచ్చు.

పన్ను ఆదా పెట్టుబడులు: ఒకవేళ మీరు పాత పన్ను విధానంలో ఉంటే ఈ నెలాఖరులోగా మీ పన్ను ఆదా పెట్టుబడులు పూర్తి చేయాలి. ఎన్‌పీఎస్, ఈపీఎఫ్, పీపీఎఫ్, ఐదేళ్ల కాల పరిమితి ఉండే ట్యాక్స్ సేవింగ్ ఫిక్స్‌డ్ డిపాజిట్లు, ఈఎల్ఎస్ఎస్ ఈ కోవలోకి వస్తాయి.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



9వ తేదీ			
హైదరాబాద్	410	విజయవాడ	420
వరంగల్	412	గోదావరి	415
చిత్తూరు	443	విశాఖపట్నం	415

డజను గుడ్లు రూ. 66

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	63	విజయవాడ	85
వరంగల్	63	గుంటూరు	80
కరీంనగర్	63	ఒంగోలు	80
మహబూబ్‌నగర్	63	చిత్తూరు	72
కర్నూలు	63	నెల్లూరు	77
విశాఖపట్నం	84	అనంతపురం	77
గోదావరి	85		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	87,710 ▲	80,400 ▲	1,08,100 ▲
విజయవాడ	88,800 ▲	83,300 ▼	98,000 ▼
విశాఖపట్నం	86,100 ▼	78,930 ▼	97,360 ▼
రాజమండ్రి	87,710 ▲	80,400 ▲	99,500 ▲
ప్రొద్దుటూరు	87,900 ▼	81,400 ▼	98,200 ▼
ముంబై	86,059 ▼	78,830 ▲	96,724 ▲

ఆకాశంలో "లేడీస్ స్పెషల్"



హైదరాబాద్ సిటీ, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం ఎయిర్ ఇండియా లేడీస్ స్పెషల్ విమానాలను నడిపింది. హైదరాబాద్ నుంచి లఖ్‌నవూ వెళ్లే విమానాన్ని పూర్తిగా మహిళలే నడిపారు. దీనితో పాటు దేశీయ, అంతర్జాతీయ విభాగాలలో మరో 14 ఎయిర్ ఇండియా విమానాల్లో అన్ని విభాగాలను పూర్తిగా అతివలే నిర్వర్తించారు.

మహిళలకు రూ.2,500 హామీ ఏమైంది?

- తులం బంగారం, స్కూటీ ఎటు పోయాయి
- కాంగ్రెస్‌కు కేంద్ర మంత్రి సంజయ్ సూటి ప్రశ్న

హైదరాబాద్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మహిళలకు ప్రతి నెలా రూ.2,500 ఇస్తామని ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ఏమైందని కేంద్ర మంత్రి బండి సంజయ్.. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీశారు. ఆడబిడ్డల పెళ్లికి రూ.లక్షతో పాటు తులం బంగారం ఇస్తామన్న వాగ్దానం ఎక్కడ పోయిందని, 18 ఏళ్ల నిండిన యువతులకు స్కూటీ ఇస్తామన్న హామీ ఎందుకు అమలు చేయడంలేదని ప్రశ్నించారు. "మహిళా శక్తి అంటే మహిళా దినోత్సవం నాడే రూ.కోట్లు ఖర్చు చేసి ప్రచారం చేసుకోవడం కాదు. ఆచరణలో చూపాలి. వారికి ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలి. అధికారంలోకి వస్తే బెల్టు షాపులు లేకుండా చేస్తామని ఇచ్చిన హామీని గాలికొదిలేశారు. మద్యం ఏరులై పారి మహిళల జీవితాలు ఛిద్రమవుతున్నా పట్టించుకోవడం లేదు. ఇచ్చిన మాట నిలబెట్టుకోకుండా, మహిళలు తమ కాళ్లపై తాము నిలబడేలా చేయకుండా మహిళా దినోత్సవం నాడు మాత్రమే 'మహిళలను శక్తి'గా మారుస్తామంటూ ఊకదంపుడు ఉపన్యాసాలు, పెద్ద పెద్ద ప్రకటనలు, సభలు, సమావేశాలు పెడితే నమ్మేదెవరు..?" అని సంజయ్ ఒక ప్రకటనలో నిలదీశారు.

రేవంత్ పాలనలో మహిళలకు వేదనే..

- కోటీశ్వరులను చేస్తామని చెప్పి లక్షాధికారులనూ చేయలేదు: హరీశ్

హైదరాబాద్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మహిళలను కోటీశ్వరులను చేస్తామని కోతలు కోసిన రేవంత్ రెడ్డి పాలనలో వారికి మిగిలింది వేదనే అని, కనీసం లక్షాధికారులుగా కూడా చేయని చేతగాని సర్కారు ఇదంటూ మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. ఏడాదిన్నర పాలనలో మహిళలకు ఏం చేశారని వేడుకలు నిర్వహిస్తున్నారంటూ సీఎంను శనివారం ఓ ప్రకటనలో నిలదీశారు. 'ఐదేళ్లలో రూ.లక్ష కోట్ల వడ్డీ లేని రుణాలిస్తామని ఎన్నికల సమయంలో ఊదరగొట్టారు. సుమారు రూ.5 వేల కోట్ల వడ్డీ లేని రుణాల బకాయిలే ఇప్పటిదాకా చెల్లించని కాంగ్రెస్ సర్కారు.. ఐదేళ్లలో రూ.లక్ష కోట్ల రుణాలు ఎలా ఇస్తుంది. మహిళలకు నెలకు రూ.2,500 ఇప్పటికీ ఇవ్వట్లేదు. 18 ఏళ్లు నిండిన యువతులకు ఎలక్ట్రిక్ స్కూటర్లు ఎందుకివ్వడం లేదు. ఆడబిడ్డ పెళ్లికి రూ.లక్ష ఆర్థిక సాయంతోపాటు, తులం బంగారం ఏమైంది? ఏడాది పాలనలో కాంగ్రెస్ చేసిన మోసాలకు రేవంత్ ప్రజలకు క్షమాపణలు చెప్పాలి' అని హరీశ్ రావు డిమాండ్ చేశారు.

మహిళలకు 2,500 ఇచ్చేదాకా వెంటాడతాం

- కేంద్రం మహిళా రిజర్వేషన్‌ను అమలు చేయాలి: కవిత

హైదరాబాద్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల వేళ మహిళలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చాలని, ఆడబిడ్డలకు రూ.2,500 ఇచ్చేవరకు సర్కారును వెంటాడుతూనే ఉంటామని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత హెచ్చరించారు. శనివారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మహిళా దినోత్సంలో ఆమె పాల్గొన్నారు. మహిళలను కోటీశ్వరులను చేస్తామన్న సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటనలను స్వాగతిస్తున్నామని, అయితే మహిళలను ఎలా కోటీశ్వరులను చేస్తారో నిర్దిష్టమైన ప్రణాళికను ప్రజల ముందు పెట్టాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం జనగణనకు ముడిపెట్టకుండా మహిళా రిజర్వేషన్ చట్టాన్ని అమలు చేయాలని కవిత డిమాండ్ చేశారు.

ఎస్సీ వర్గీకరణ జరిగేదాకా ఉద్యోగ పరీక్షల ఫలితాలు ఆపండి: మందకృష్ణ

హైదరాబాద్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించే వరకు అన్ని ఉద్యోగ పరీక్షల ఫలితాలను నిలిపివేయాలని సీఎం రేవంత్ రెడ్డికి.. మంద కృష్ణమాదిగ శనివారం లేఖ రాశారు. దేశంలో అందరికంటే ముందుగా తెలంగాణలో ఎస్సీ వర్గీకరణను అమలు చేస్తామని, అదే సమయంలో గతంలో ఇచ్చిన ఉద్యోగ నోటిఫికేషన్లలోనూ వర్గీకరణ ప్రకారం నియామకాలు చేపడతామని అసెంబ్లీలో సీఎం ప్రకటించిన విషయాన్ని గుర్తుచేశారు. వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పిస్తామని చెబుతూ.. మరోవైపు గ్రూప్-1,2, 3 పరీక్షల ఫలితాలను వెల్లడిస్తామని ప్రకటించడం ఎంత వరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు.

రక్తహీనతతో ఆదివాసీ బాలింత మృతి

- మహిళా దినోత్సవం రోజు ఆదిలాబాద్ జిల్లాలో విషాదం

ఉట్నూర్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మహిళా దినోత్సవం రోజున ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలంలోని లక్కారం గ్రామంలో విషాదం నెలకొంది. నెలరోజుల బాలింత అయిన కోలాం ఆదివాసీ యువతి శ్రీవిద్య(23) రక్తహీనతతో బాధపడుతూ శనివారం మృతి చెందింది. ఉట్నూర్ మండలంలోని రాముగూడకు చెందిన భగవంత్‌రావు, శ్రీవిద్య దంపతులు. వీరిద్దరూ కొంతకాలంగా లక్కారం గ్రామంలో నివాసం ఉంటూ.. కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. శ్రీవిద్య 15 రోజులుగా రక్తహీనతతో బాధపడుతూ శనివారం మృతి చెందింది.

వడదెబ్బతో రైతు మృతి

హసన్‌పర్తి, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): పొలంలో మందు పిచికారి చేస్తూ వడదెబ్బ తగిలి ఓ రైతు మృతి చెందాడు. ఈ ఘటన హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం సీతంపేటలో జరిగింది. గ్రామానికి చెందిన మూల కమలాకర్ (50) శనివారం పొలంలో మందు పిచికారి చేసేందుకు వెళ్లి ఎండ తీవ్రతకు సొమ్మసిల్లి స్పృహ కోల్పోయాడు. గమనించిన స్థానిక రైతులు ఆయనను అంబులెన్స్‌లో ఎంజీఎంకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తీసుకెళ్తుండగా మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

ఉదండాపూర్ నిర్వాసితులపై కేసులు

- పోలీస్‌స్టేషన్ వద్ద నిర్వాసితుల ఆందోళన

జడ్చర్ల, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): పెంచిన పరిహారంతో పాటు వన్ టైం సెటిల్‌మెంట్‌తో పరిహారం చెల్లించాలని రిలే దీక్షలు చేస్తూ ప్రాజెక్టు పనులను నిలిపివేసిన పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలోని ఉదండాపూర్ రిజర్వాయర్ నిర్వాసితులపై కేసులు నమోదయ్యాయి. తమపై కేసులు నమోదయ్యాయని తెలుసుకున్న నిర్వాసితులు శనివారం మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల పోలీస్‌స్టేషన్‌కు తరలివచ్చారు. శాంతియుతంగా నిరసన వ్యక్తం చేసిన తమపై కేసులు నమోదు చేస్తారా? అని ఆందోళన వ్యక్తం చేశారు. పరిహారం చెల్లించకుండా ప్రాజెక్టు పనులు చేపడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని, తమకు న్యాయం చేయాలని జడ్చర్ల సీఐ కమలాకర్‌కు నిర్వాసితులు ఫిర్యాదు చేశారు. అనంతరం జడ్చర్ల తహసీల్దార్‌కు సైతం ఫిర్యాదు చేసినట్లు నిర్వాసితులు తెలిపారు.

వివాదాల పరిష్కారంలో కమ్యూనిటీ మీడియేటర్ల పాత్ర కీలకం

- మధ్యప్రదేశ్, కేరళలో అద్భుత ఫలితాలు
- నిజామాబాద్, కామారెడ్డిలో పైలెట్ ప్రాజెక్టుగా ప్రారంభం
- హైకోర్టుతాత్కాలిక ప్రధానన్యాయమూర్తి జస్టిస్ సుజోయ్‌పాల్

వరంగల్ లీగల్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): సమాజంలో వ్యవస్థీకృతంగా ఉన్న పలు వివాదాలను పరిష్కరించడంలో కమ్యూనిటీ మీడియేటర్ల (మధ్యవర్తులు) పాత్ర కీలకమైనదని రాష్ట్ర హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్ పాల్ అన్నారు. శనివారం హనుమకొండ బాలసముద్రంలోని కాళోజీ కళాక్షేత్రంలో ఏర్పాటు చేసిన కమ్యూనిటీ మీడియేటర్స్ వలంటీర్ల అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ముఖ్యంగా కుటుంబ తగాదాలు, వివాహ సంబంధిత వివాదాలకు సమాజ మూలాల్లో సమాధానం దొరుకుతుందన్నారు. ఆయా సామాజిక వర్గాల ప్రతినిధులకు సమస్యలపై అవగాహన ఉండడం వల్ల పరిష్కారం సులభతరమవుతుందని పేర్కొన్నారు. మధ్యప్రదేశ్, కేరళలో కమ్యూనిటీ మీడియేటర్ల విధానాన్ని ప్రవేశపెట్టి అద్భుతమైన ఫలితాలు సాధిస్తున్నారని, ఆ రాష్ట్రాల ప్రేరణతో నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో పైలెట్ ప్రాజెక్టుగా ప్రారంభించామన్నారు. ఆరంభంలోనే ఆయా సామాజిక వర్గాల నుంచి అనూహ్య స్పందన లభించిందని పేర్కొన్నారు. కమ్యూనిటీ మీడియేటర్ల వల్ల సమయం, డబ్బు వృథాకాకుండా పోలీసుస్టేషన్లు, కోర్టుల చుట్టూ తిరగకుండా సులువుగా ఫలితాలను పొందవచ్చన్నారు. అలాగే ఎన్నో ఏళ్లుగా నలుగుతున్న సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని ఆయన పేర్కొన్నారు.



ములుగు జిల్లా గోవిందరావుపేట మండలంలోని లక్నవరం సరస్సును సందర్శించిన హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్‌పాల్

ఎంపీలంతా ఏకం కావాలి

రాష్ట్ర సమస్యలపై రాజకీయాలకతీతంగా పోరాడాలి.. అవసరమైతే పార్లమెంటులో వాయిదా తీర్మానం

- పరిష్కారానికి పదేళ్లలో బీఆర్ఎస్ ప్రయత్నించలేదు
- కాంగ్రెస్ ప్రయత్నిస్తున్నా ఫలితం ఉండడం లేదు
- అందుకే ఎంపీల భేటీ ఏర్పాటు చేశాం: భట్టి



ఎంపీల సమావేశంలో మాట్లాడుతున్న భట్టి. చిత్రంలో ఎంపీలు అనిల్‌కుమార్, ఒవైసీ, చామల

హైదరాబాద్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన వివిధ ప్రాజెక్టులు, అభివృద్ధి పనుల అనుమతులు, నిధులు, విభజన సమస్యల పరిష్కారం కోసం రాజకీయాలకతీతంగా ఎంపీలంతా ఏకం కావాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క పిలుపునిచ్చారు. రాష్ట్రానికి రావాల్సిన నిధులు, అనుమతులు గత దశాబ్ద కాలంలో పెండింగ్‌లో ఉండిపోయాయని తెలిపారు. వీటిని రాబట్టడానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల కాలంలో పెద్దగా ప్రయత్నాలు చేయలేదని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత గట్టిగా ప్రయత్నం చేసినా ఫలితం ఉండడం లేదన్నారు. వీటిని సాధించుకోవడానికి, రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా అన్ని పార్టీలు ఏకం కావాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. శనివారం డిప్యూటీ సీఎం అధ్యక్షతన ప్రజా భవన్‌లో ఎంపీల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి సీఎం రేవంత్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరు కావాల్సి ఉండగా.. ఆయన రాలేకపోయారు. కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ కూడా హాజరు కాలేదు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు చెందిన రాజ్యసభ, లోక్‌సభ సభ్యులు కూడా హాజరు కాలేదు. ఎంపీల సమావేశం నిర్వహిస్తున్నట్లుగా తమకు చాలా తక్కువ సమయంలో చెప్పారని, తాము ముందస్తుగా నిర్ణయించిన కార్యక్రమాలకు హాజరు కావాల్సి ఉన్నందున సమావేశానికి రాలేకపోతున్నామంటూ కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి లేఖ రాశారు. కాంగ్రెస్‌కు చెందిన లోక్‌సభ, రాజ్యసభ సభ్యులతోపాటు ఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ఈ భేటీకి హాజరయ్యారు. సమావేశం అనంతరం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ విలేకరులతో మాట్లాడారు.

రాజకీయ ప్రయోజనాల కోసం కాదు..

రాష్ట్ర సమస్యలు, ప్రాజెక్టుల గురించి పార్లమెంటులో అన్ని పార్టీల ఎంపీలూ ప్రస్తావించాలన్న ఉద్దేశంతో ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశామని భట్టివిక్రమార్క తెలిపారు. రాజకీయ ప్రయోజనాల కోసం దీనిని ఏర్పాటు చేయలేదన్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడి దశాబ్ద కాలమైనా.. కేంద్రం నుంచి, ఆంధ్రప్రదేశ్ నుంచి రావాల్సిన బకాయిలు రావడం లేదని చెప్పారు. రాష్ట్ర ఎంపీలంతా కలిస్తేనే వీటిని సాధించేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. రాష్ట్రం నుంచి ఏయే పథకాలకు నిధులడిగాం, ఏయే రాష్ట్రాలు ఎలాంటి ప్రయోజనాలు పొందుతున్నాయి, తెలంగాణ ఎందుకు పొందలేకపోతోందన్న వివరాలను ఎంపీలకు వివరించామని తెలిపారు. రెండు బుక్‌లెట్‌లలో మొత్తం 28 సమస్యలను పొందుపరిచి, ఎంపీలకు అందజేశామన్నారు. ప్రధానంగా రాష్ట్ర విభజన హామీలు, బయ్యారం స్టీల్ ఫ్యాక్టరీ, కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, రీజినల్ రింగ్ రోడ్డు, వరంగల్ మెగా టెక్స్‌టైల్ పార్కు, నవోదయ స్కూళ్ల వంటి పలు సమస్యలకు ఇప్పటివరకు పరిష్కారం లభించలేదన్నారు. పార్లమెంటులో చేపట్టే ప్రశ్నోత్తరాల సమయం, జీరో అవర్‌లో రాష్ట్ర అంశాలను మన ఎంపీలు ప్రస్తావించాలని కోరారు. రాష్ట్ర సమస్యలను కేంద్ర ప్రభుత్వం, పార్లమెంటు దృష్టికి తీసుకెళ్లడానికి అవసరమైతే వాయిదా తీర్మానం ప్రవేశపెట్టాలన్న ఆలోచన చేశామని తెలిపారు.

అందరినీ స్వయంగా ఆహ్వానించాను..

ఎంపీల సమావేశానికి రావాల్సిందిగా కాంగ్రెస్, ఎంఐఎం, బీఆర్ఎస్, బీజేపీ లోక్‌సభ, రాజ్యసభ సభ్యులను తాను స్వయంగా ఆహ్వానించానని భట్టివిక్రమార్క తెలిపారు. అయితే కొన్ని కారణాల వల్ల రావడానికి వీలు కాలేదంటూ కొంత మంది తెలిపారని వెల్లడించారు. తక్కువ సమయంలో సమాచారమిచ్చారంటూ కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి లేఖ ద్వారా తెలియజేశారని పేర్కొన్నారు. మరోసారి ప్రభుత్వం సమావేశం నిర్వహిస్తుందని, బీజేపీ, బీఆర్ఎస్ సభ్యులు ఆ సమావేశానికైనా కలిసి వస్తారని ఆశిస్తున్నామని అన్నారు. భవిష్యత్తులో పార్లమెంటు సమావేశాలకు ముందు సభ్యులందరికీ తగిన సమయమిచ్చి, ముందస్తుగా తెలియజేసి ఎంపీల సమావేశాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. రానున్న పార్లమెంటు సమావేశాల ప్రారంభానికి ఒకరోజు ముందుగానీ, సమావేశాల మధ్యలో గానీ ఢిల్లీలో సమావేశం నిర్వహిస్తామన్నారు. ఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ మాట్లాడుతూ.. రాష్ట్రం నుంచి ఎనిమిది మంది బీజేపీ ఎంపీలున్నా ప్రాజెక్టులను సాధించుకురావడంలో విఫలమవుతున్నారన్నారు. తెలంగాణపై కేంద్రం సవతి తల్లి ప్రేమ చూపుతోందని, కొన్ని రాష్ట్రాలకే ప్రాధాన్యమిస్తోందని ఆరోపించారు.

రూ.11 వేల కోట్లతో 55 సమీకృత గురుకులాలు

- ఒక్కో గురుకులానికి రూ.200 కోట్లు
- నిధులు మంజూరు చేసిన ప్రభుత్వం
- కొడంగల్, మధిర, హుజూర్‌నగర్‌లలో.. నిర్మాణానికి ఇప్పటికే టెండర్లు

హైదరాబాద్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 55 యంగ్ ఇండియా సమీకృత గురుకులాల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నియోజకవర్గానికి ఒకటి చొప్పున మొత్తం 119 గురుకులాలను నిర్మించాలనేది రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం కాగా.. తొలి విడతగా 55 నియోజకవర్గాల్లో గురుకులాల నిర్మాణానికి రూ.11 వేల కోట్లను మంజూరు చేస్తూ విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా శనివారం ఉత్తర్వులిచ్చారు. ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గం కొడంగల్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నియోజకవర్గం మధిర, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న హుజూర్‌నగర్‌లలో సమీకృత గురుకులాల నిర్మాణానికి ఫిబ్రవరి 1న టెండర్లను ఆహ్వానించారు. మిగతా 52 నియోజకవర్గాల్లో భూ లభ్యతను బట్టి టెండర్ల ప్రక్రియ చేపట్టనున్నారు. ఒక్కో గురుకులానికి రూ.200 కోట్ల చొప్పున ఖర్చు చేయనున్నారు. ఒక్కో సమీకృత గురుకుల భవన నిర్మాణానికి రూ.135 కోట్లు ఖర్చు కానుండగా.. ఫర్నిచర్, ఇంటీరియర్‌కు రూ.15కోట్లు అవుతుందని, మరో 45-50కోట్ల వరకు వివిధ రకాల ట్యాక్స్‌లు, జీఎస్టీకి ఖర్చు అవుతుందని అధికారులు అంచనా వేశారు. ఒక్కో గురుకులాన్ని 20-25 ఎకరాల్లో 4,55,772 చదరపు అడుగుల్లో నిర్మించనున్నారు. సాధ్యమైనంత త్వరితగతిన వీటి నిర్మాణాలను పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తోంది. సమీకృత గురుకులం బ్లాకుల వారీగా నిర్మాణం కానుంది. వీటిలో అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్, ఎకడమిక్ బ్లాక్, స్టాఫ్ క్వార్టర్స్, లేబరేటరీ, ఆట స్థలం, బాలురు, బాలికల హాస్టళ్ల బ్లాకులతో పాటు అక్కడ పని చేసే టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బందికి నివాస సముదాయాన్ని ఏర్పాటు చేయనున్నారు.



కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కలిసిన రాష్ట్ర మంత్రులు, ఎంపీల బృందం

కాజీపేట రైల్వే డివిజన్ ఏర్పాటు చేయండి

- కొత్త రైల్వే లైన్లను ఇవ్వండి
- కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కోరిన రాష్ట్ర మంత్రులు, ఎంపీలు

హైదరాబాద్, శంషాబాద్ రూరల్, వరంగల్, మార్చి8(ఆంధ్రజ్యోతి): కాజీపేటను రైల్వే డివిజన్‌గా ఏర్పాటు చేయడంతో పాటు, రాష్ట్రానికి కొత్త రైల్వే లైన్లను మంజూరు చేయాలని రాష్ట్ర మంత్రులు, ఎంపీలు రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కోరారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆధ్వర్యంలో మంత్రులు సీతక్క, కొండా సురేఖ, ఎంపీలు చామల కిరణ్ కుమార్, కడియం కావ్య.. కేంద్ర మంత్రిని శనివారం శంషాబాద్ విమానాశ్రయంలో కలిసి వినతిపత్రాలు అందించారు. అనంతరం మంత్రి కోమటిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రానికి కొత్త రైల్వే లైన్లను మంజూరు చేయడంతో పాటు, వాటిని పూర్తిగా రైల్వే నిధులతోనే నిర్మించేలా సహకరించాలని, ప్రస్తుతం కాజీపేటలో కొనసాగుతున్న రైల్వే తయారీ యూనిట్ పనులను వేగవంతం చేసి ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కేంద్రాన్ని కోరామన్నారు. వరంగల్ చుట్టూ నిర్మిస్తున్న రింగ్ రోడ్డు నిర్మాణంతో పాటు రింగ్ రైల్‌ను నిర్మించే అంశంపై కేంద్రమంత్రి సానుకూలత వ్యక్తం చేశారని తెలిపారు. కాగా, మార్కెట్ నిర్మాణం కోసం వరంగల్ మండలం గిర్మాజీపేట్‌లో సర్వే నెంబర్ 8లోని రైల్వేకు చెందిన స్థలంలో 1.10 ఎకరాలు కేటాయించేందుకు చర్యలు తీసుకోవాలని మంత్రి కొండా సురేఖ రైల్వే మంత్రికి సమర్పించిన వినతి పత్రంలో కోరారు. గిర్మాజీపేట్ గ్రామంలోని రైల్వే అండర్ బ్రిడ్జికి సమీపంలో నిరంతరం వీధివ్యాపార కార్యకలాపాలు కొనసాగడంతో ఈప్రాంతం నుంచి వచ్చి వెళ్లే పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు.

అశ్వినీ వైష్ణవ్‌కు మంత్రి తుమ్మల లేఖ

పాండురంగాపురం-మల్కాన్‌గిరి రైల్వేలైన్ మంజూరు చేసినందుకు అశ్విని వైష్ణవ్‌కు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ధన్యవాదాలు తెలిపారు. సత్తుపల్లి-కొవ్వూరు, పెనుబల్లి-కొండపల్లి(అమరావతి) వరకు కొత్త రైల్వే లైన్ మంజూరు చేయాలని ఇదే అంశంపై రాసిన లేఖను మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డితో కేంద్ర మంత్రికి అందజేశారు. కాగా, కరీంనగర్ నుంచి తిరుపతి, తిరుపతి నుంచి కరీంనగర్‌లకు ప్రతి రోజూ రైళ్లను నడిపేందుకు చర్యలు తీసుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్.. కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్‌కు విజ్ఞప్తి చేశారు.

దేశీయంగా ఈవీల తయారీకే ప్రాధాన్యం

బ్యాటరీ, సెల్ టెక్నాలజీపై నూతన పరిశోధనలు జరగాలన్న అశ్వినివైష్ణవ్

- దివిటిపల్లి ఐటీ కారిడార్‌లో అమర్‌రాజా నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన



పరిశ్రమలకు శంకుస్థాపన చేస్తున్న కేంద్ర మంత్రి అశ్వినివైష్ణవ్, చిత్రంలో రాష్ట్ర ఐటీ మంత్రి శ్రీధర్‌బాబు, ఎంపీ డీకే అరుణ, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, అమర్‌రాజా చైర్మన్ గల్లా జయదేవ్

మహబూబ్‌నగర్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): దేశీయంగా ఎలక్ట్రిక్ వాహనాల తయారీ, మౌలిక వసతుల కల్పనపై కేంద్రం ప్రత్యేక దృష్టి సారించిందని కేంద్ర రైల్వే, సమాచార, ఐటీ శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ చెప్పారు. దేశంలో స్టీల్, రసాయనాల మాదిరిగా బ్యాటరీ, సెల్ టెక్నాలజీపై నూతన పరిశోధనలు జరగాల్సిన అవసరముందన్నారు. శనివారం మహబూబ్‌నగర్‌లోని దివిటిపల్లి ఐటీ కారిడార్‌లో రూ.3225 కోట్ల పెట్టుబడులతో ఏర్పాటుకానున్న అమర్‌రాజా గిగా ఫ్యాక్టరీ వన్ నిర్మాణ పనులకు రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఎంపీ డీకే అరుణ, స్థానిక ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, అమర్‌రాజా పరిశ్రమల చైర్మన్ గల్లా జయదేవ్‌లతో కలిసి శంకుస్థాపనలు చేశారు. ఇందులో రూ.1900 కోట్లతో నిర్మించనున్న అమర్‌రాజా గిగా ఫ్యాక్టరీ వన్‌రూ.800 కోట్లతో అల్ట్‌మిన్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ, రూ.502 కోట్లతో లోహమ్ మెటీరియల్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ, 25 కోట్లతో చేపట్టే సెల్ ఎనర్జీ కంపెనీ నిర్మాణ పనులకు కేంద్రమంత్రి శంకుస్థాపనలు చేశారు.

గతంలో కన్నా 6 రెట్లు అధిక నిధులు

ప్రధాని నరేంద్రమోదీ తెలంగాణ అభివృద్ధికి కట్టుబడి ఉన్నారని, కేంద్రం ప్రవేశపెట్టిన రైల్వే బడ్జెట్‌లో తెలంగాణ రైల్వేకు రూ.5337 కోట్ల నిధులు కేటాయించారని అశ్విని వైష్ణవ్ గుర్తుచేశారు. పదేళ్ళకు ముందు ఉమ్మడి రాష్ట్రానికి కేవలం రూ.886 కోట్లు కేటాయిస్తే ఇప్పుడు అందులో ఒక్క తెలంగాణ రాష్ట్రానికే గతంలో కన్నా 6 రెట్లు అధిక నిధులు కేటాయించారన్నారు. అమర్‌రాజా పరిశ్రమలో మహిళా ఉద్యోగులు 400 మంది ఉండటం అభినందనీయమన్నారు. పుష్ప సినిమాలో హీరో తగ్గేదేలే (జూకేగా నహీ) అనే డైలాగ్‌ను గుర్తుచేస్తూ దివిటిపల్లి అభివృద్ధి ఆగదని (దివిటిపల్లి డెవలప్‌మెంట్ రుకేగా నహీ) నిరంతర అభివృద్ధి జరుగుతుందని అందరినీ నవ్వించారు.

ఆ పరిశ్రమలకు సహకరించండి..

రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ పారిశ్రామిక వేత్తలు, పెట్టుబడిదారులకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా అండగా ఉంటుందన్నారు. తెలంగాణలో సెమీ కండక్టర్స్ పరిశ్రమల అభివృద్ధికి కేంద్ర మంత్రి సహకరించాలని కోరారు. 16 గిగా వాట్‌లకు సంబంధించిన మ్యాన్‌ఫ్యాక్చరింగ్ ప్లాంట్‌తో పాటు 5 గిగావాట్‌లకు సంబంధించిన మ్యాన్‌ఫ్యాక్చరింగ్ కెపాసిటీతో రూ.9500 కోట్లతో పరిశ్రమను నిర్మిస్తూ 4500 మందికి నేరుగా, 10 వేల మందికి పరోక్షంగా ఉద్యోగాలు కల్పించడం అభినందనీయమన్నారు.

వేలాది మందికి ఉపాధి

అమర్‌రాజా గ్రూప్ ఆఫ్ కంపెనీస్ చైర్మన్ ఎండీ గల్లా జయదేవ్ మాట్లాడుతూ అమర్‌రాజా అడ్వాన్స్‌డ్ సెల్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ 262 ఎకరాల విస్తీర్ణంలో పదేళ్లలో రూ.9852 కోట్ల పెట్టుబడులు పెట్టనుందన్నారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా నేరుగా 4500 మందికి ఉపాధి లభిస్తుందన్నారు. ఇప్పటికే రెండు యూనిట్లు నిర్మాణంలో ఉండగా తాజాగా రూ.1900 కోట్లతో మూడో యూనిట్‌కు శంకుస్థాపన చేసుకోవడం ఆనందంగా ఉందన్నారు. 20 ఎకరాల విస్తీర్ణంలో రూ.800 కోట్లతో అల్ట్‌మిన్ పరిశ్రమ, 20 ఎకరాల్లో రూ.502 కోట్లతో లోహమ్ మెటీరియల్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఏర్పాటు కాబోతుందని వివరించారు.

'ఎల్‌ఆర్‌ఎస్ రాయితీ'పై సదస్సులు

- ప్రజల్లో అవగాహన పెంచాలి
- కలెక్టర్లు, కమిషనర్లు అంతా పాల్గొనాలి
- రియల్ ఎస్టేట్ నిర్వాహకులు, ఏజెంట్లు, దరఖాస్తుదారులు పాల్గొనేలా ప్రోత్సహించాలి.. ప్రభుత్వం ఆదేశాలు
- రేపు రాష్ట్రవ్యాప్తంగా సదస్సులు

హైదరాబాద్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): లేఅవుట్ క్రమబద్ధీకరణ పథకం(ఎల్‌ఆర్‌ఎస్) కింద దరఖాస్తుదారులకు రాయితీ ఇచ్చినా పెద్దగా స్పందన లేకపోవటంతో.. సోమవారం రాష్ట్రవ్యాప్తంగా సదస్సులు నిర్వహించి ఈ పథకం గురించి ప్రచారం చేయాలని సంబంధిత శాఖల అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లు, రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు చేపట్టాల్సిన కార్యక్రమాలపై దిశానిర్దేశం చేసినట్లు తెలిసింది. కాగా, శుక్రవారం పొద్దుపోయేవరకు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఇదే అంశంపై అధికారులు సుదీర్ఘంగా చర్చించారు. ఈ నెలాఖరు వరకూ ఎల్‌ఆర్‌ఎస్ రాయితీ పథకం అమల్లో ఉంటుంది. శనివారం నాటికి 8 రోజుల వ్యవధిలో దాదాపు 8 వేల దరఖాస్తులను ఆమోదించారు. రాష్ట్రవ్యాప్తంగా ఎల్‌ఆర్‌ఎస్ కోసం ఇప్పటికే 25.68 లక్షల దరఖాస్తులు రాగా, వాటిలో ఆటోమేటిక్ ఫీజు జనరేట్ అయినవి 19 లక్షల వరకు ఉన్నాయి.. ఇంత పెద్ద సంఖ్యలో దరఖాస్తులు కనిపిస్తున్నా.. 25 శాతం రాయితీని సద్వినియోగం చేసుకునేందుకు దరఖాస్తుదారులు ముందుకు రావట్లేదు. ఈ నేపథ్యంలోనే, దరఖాస్తుదారులు రాయితీ పథకాన్ని వినియోగించుకునేలా ప్రోత్సహించేందుకు సోమవారం రాష్ట్రవ్యాప్తంగా సదస్సులు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ సదస్సుల్లో కలెక్టర్లు, జిల్లా రిజిస్ట్రార్లు, మున్సిపల్ కమిషనర్లు, పట్టణ ప్రణాళిక అధికారులు పాల్గొనాలని.. రియల్ ఎస్టేట్ నిర్వాహకులు, ఏజెంట్లు, లేఅవుట్లు వేసిన యజమానులు.. దరఖాస్తుదారులను సదస్సులకు వచ్చేలా ప్రోత్సహించాలని ఆదేశించింది.

స్పందనలేమికి కారణాలేమిటి?

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుదారులు ముందుకు రాకపోవడంపై అధికారుల నుంచి పలు అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. రాష్ట్రంలో భూముల ధరలు ఆశాజనకంగా లేవని, మార్కెట్ కాస్త మందకొడిగా ఉందని చెబుతున్నారు. ఇటు భూసంబంధిత వివాదాల మీద నడుస్తున్న కోర్టు కేసులపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వకపోవటంతో.. ఎవరైనా కేసులు వేసి స్టే తీసుకొస్తే, పెట్టిన డబ్బులు వృథా అవుతాయని కొనుగోలుదారులు భావిస్తున్నారన్న వాదన కూడా వినిపిస్తోంది. ఎల్‌ఆర్‌ఎస్ కింద ఆటోమేటిక్ ఫీజు జనరేట్ అయిన దరఖాస్తుల్లో రూ.4 లక్షలు, అంతకన్నా ఎక్కువ ఫీజు కట్టాల్సిన వాళ్లు.. అంత మొత్తం కట్టలేక వెనకడుగు వేస్తున్నారా అనే కోణంలో కూడా అధికారులు చర్చించుకుంటున్నారు.

హంపిలో ఇద్దరు మహిళలపై గ్యాంగ్ రేప్

- ఇజ్రాయెల్ మహిళ, హోం స్టే నిర్వాహకురాలిపై ముగ్గురి అత్యాచారం.. అడ్డుకున్న ముగ్గురిని నదిలోకి తోసివేత
- నదిలో పడిన ఓ వ్యక్తి మృతి.. ఇద్దరు నిందితుల అరెస్టు

బళ్లారి, మార్చి 8(ఆంధ్రజ్యోతి): హంపి పర్యటనకు వచ్చిన విదేశీ మహిళ, స్థానికంగా హోం స్టే నిర్వహిస్తున్న మరో మహిళపై ముగ్గురు యువకులు అత్యాచారానికి ఒడిగట్టారు. బరితెగించిన ఆ ముగ్గురిలో ఇద్దరు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కొప్పళ జిల్లా ఎస్పీ రామ్ ఎల్ అరసిద్ధ తెలిపిన వివరాల మేరకు.. ఇజ్రాయెల్‌కు చెందిన మహిళ(27), హోం స్టే నిర్వాహకురాలు(29), అమెరికాకు చెందిన డేనియల్, మహారాష్ట్రకు చెందిన పంకజ్, ఒడిశాకు చెందిన బిబాష్.. హంపి సమీపంలోని సనాపుర వద్ద తుంగభద్ర నది ఒడ్డున గురువారం సేదదీరుతున్నారు. వీరి వద్దకు ముగ్గురు యువకులు బైక్‌పై వచ్చారు. పెట్రోల్‌కు డబ్బులు కావాలని అడిగారు. విదేశీ మహిళ వారికి రూ. 20 ఇవ్వగా, రూ. 100 కావాలని డిమాండ్ చేశారు. దీనికి నిరాకరించడంతో వాగ్వాదానికి దిగారు. రాళ్లతో దాడి చేశారు. ఇద్దరు మహిళలు వినహా.. మిగిలిన ముగ్గురినీ నీటిలోకి తోసేశారు. అనంతరం హోం స్టే నిర్వాహకురాలిపై ఇద్దరు, విదేశీ మహిళపై ఒకరు అత్యాచారం చేశారు. నీటిలో పడిన ముగ్గురిలో డేనియల్, పంకజ్ ఈదుకుంటూ ఒడ్డుకు చేరుకున్నారు. బిబాష్ మాత్రం నీటిలో మునిగి మృతిచెందాడు. మృతదేహం శుక్రవారం నీటిపైకి తేలింది. అత్యాచారానికి పాల్పడినవారిలో కొప్పళ జిల్లా గంగావతి తాలూకా సాయినగర్‌కు చెందిన మల్లేశ్ (22) అలియాస్ హండి మల్లా, చేతన్ సాయి(21)లను అరెస్టు చేశారు. మూడో వ్యక్తి కోసం ప్రత్యేక పోలీసు బలగాలు గాలిస్తున్నాయి. ఈ ఘటన గురువారం రాత్రి 11.30 ప్రాంతంలో జరిగినట్లు పోలీసులు తెలిపారు.

మణిపూర్‌లో మళ్లీ ఉద్రిక్తత.. ఒకరి మృతి

ఇంఫాల్/న్యూఢిల్లీ, మార్చి 8: మణిపూర్‌లో మళ్లీ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కుకీ తెగ నిరసనకారులు, భద్రతా బలగాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఆదేశాల మేరకు శనివారం నుంచి రాష్ట్రంలో స్వేచ్ఛగా తిరిగేందుకు అనుమతిచ్చారు. అయితే తమకు ప్రత్యేక పరిపాలన కల్పించే డిమాండ్ నెరవేరే వరకు స్వేచ్ఛగా తిరిగేందుకు అనుమతించవద్దంటున్న కుకీలు కాంగ్‌పోక్పి జిల్లాలో పెద్ద ఎత్తున నిరసనకు దిగారు. ఈ సందర్భంగా నిరసనకారులు, భద్రతా బలగాలకు మధ్య జరిగిన ఘర్షణలో ఒక వ్యక్తి మరణించగా.. 25 మందికి గాయాలపాలయ్యారు. ఈ నేపథ్యంలో శనివారం అర్ధరాత్రి నుంచి కుకి జో ప్రాంతంలో నిరవధిక బంద్‌కు కుకి జో మండలి పిలుపునిచ్చింది. కుకీల ప్రాబల్యం ఉన్న చాలా ప్రాంతాల్లో ఘర్షణలు చోటు చేసుకున్నాయి. నిరసనకారులు వాహనాలపై రాళ్లు రువ్వడమేకాకుండా రోడ్లను తవ్వారు. ఇదిలా ఉండగా.. రాష్ట్రంలో దాదాపు 114 ఆయుధాలు, ఐఈడీలు, గ్రెనేడ్లు, మందుగుండు సామగ్రిని భద్రతా బలగాలు సీజ్ చేశాయి.

గుజరాత్ కాంగ్రెస్‌లో బీజేపీ కోవర్టులు: రాహుల్

అహ్మదాబాద్, మార్చి 8: గుజరాత్ కాంగ్రెస్‌లోని కొందరు నేతలు బీజేపీ కోసం పనిచేస్తున్నారని కాంగ్రెస్ అగ్ర నేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ ఆరోపించారు. అవసరమైతే 30-40 మంది నాయకులపై వేటు వేసేందుకు కూడా వెనుకాడబోమని స్పష్టంచేశారు. కనీసం 5% ఓట్లు పెంచుకోగలిగితే రాష్ట్రంలో అధికారం మనదేనని చెప్పారు. తెలంగాణలో పార్టీ 22 శాతం ఓట్లు పెంచుకుందని.. అధికారంలోకి వచ్చిందని ప్రస్తావించారు. రెండ్రోజుల గుజరాత్ పర్యటనలో చివరిరోజైన శనివారం అహ్మదాబాద్‌లో ఆయన పార్టీ కార్యకర్తల సమావేశంలో ప్రసంగించారు. 'మనలో కొందరు నేతలు రహస్యంగా బీజేపీ కోసం పనిచేస్తున్నారు. వారెవరో మనం వడపోయాలి. లేకుంటే రాష్ట్ర ప్రజలు మనల్ని విశ్వసించరు' అని చెప్పారు.

గిగ్ వర్కర్లు 'ఈ-శ్రమ్'లో పేర్లు నమోదు చేసుకోండి

న్యూఢిల్లీ, మార్చి 8: తగిన గుర్తింపు, వివిధ ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు పొందడం కోసం ఈ-శ్రమ్ పోర్టల్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని శనివారం కేంద్ర కార్మిక, ఉపాధి శాఖ అందరు గిగ్/ప్లాట్‌ఫారం వర్కర్లను కోరింది. ఆర్థిక వ్యవస్థకు గిగ్ వర్కర్లు అందిస్తున్న సేవలను గుర్తించిన కేంద్రప్రభుత్వం 2025-26 బడ్జెట్‌లో పలు సంక్షేమ పథకాలను ప్రకటించింది. ఈ-శ్రమ్ పోర్టల్‌ను ఏర్పాటు చేసి, వారి పేర్లను నమోదు చేయనున్నట్టు, అందుకు అనుగుణంగా గుర్తింపు కార్డులు జారీ చేయనున్నట్టు ప్రకటించింది. ఆయుష్మాన్ భారత్-ప్రధాన మంత్రి జన్ ఆరోగ్య యోజన (ఏబీ-పీఎంజేఏవై) కింద ఆరోగ్య సేవలు అందించనున్నట్టు తెలిపింది. ఈ ఆరోగ్య పథకం కింద గిగ్ వర్కర్లు, వారి కుటుంబ సభ్యులు ఏటా రూ.5 లక్షల మేర ఆరోగ్య సేవలు పొందడానికి వీలు కలుగుతుంది.

జైళ్లలో దివ్యాంగ ఖైదీలకున్న సౌకర్యాలేంటి?

న్యూఢిల్లీ, మార్చి 8(ఆంధ్రజ్యోతి): జైళ్లలో వికలాంగ ఖైదీలకు ఉన్న సౌకర్యాలపై 4వారాల్లో నివేదిక సమర్పించాలని ఆదేశిస్తూ కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. జైలులో దివ్యాంగులకు సరైన వసతులు లేకపోవడం వల్లే ప్రొఫెసర్ సాయిబాబ, ఫాదర్ స్టాన్‌స్వామి మరణించారని ఆరోపిస్తూ సత్యన్ అనే వ్యక్తి సుప్రీంకోర్టులో పిల్ దాఖలు చేశారు. భీమా కోరేగావ్ హింస కేసులో విచారణ ఖైదీగా జైలులో ఉండగానే స్టాన్‌స్వామి 2021లో ప్రాణాలు విడిచారు. 2014లో మావోయిస్టులతో సంబంధాలు ఉన్నాయనే ఆరోపణలతో అరెస్టయిన సాయిబాబ నిర్దోషిగా విడుదలైన కొన్ని నెలల్లోనే మరణించారు. జైళ్లలో వికలాంగులకు తగు ఏర్పాట్లు లేని కారణంగానే ఇద్దరు మరణించారని పిటిషన్‌లో పేర్కొన్నారు.

సిరియాలో మళ్లీ హింస.. 600 మంది మృతి

బీరూట్, మార్చి 8: సిరియాలో మళ్లీ హింస చెలరేగింది. దాడులు, ప్రతీకార హత్యల కారణంగా శనివారం నాటికి రెండు రోజుల్లో 600 మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు. పదవీచ్యుత అధ్యక్షుడు బషార్ అస్సాద్ మద్దతుదార్లు, భద్రత బలగాల మధ్య గురువారం నుంచి పోరాటం జరుగుతోంది. దేశంలో గత 14 ఏళ్లుగా హింస జరుగుతుండగా, తాజా ఘర్షణలు ఒక కీలక ఘట్టమని పరిశీలకులు భావిస్తున్నారు.

మనం తగ్గొద్దు!

ట్రంప్ బెదిరింపులకు లొంగొద్దు.. అమెరికా 'ఆరోగ్యం' మన చేతుల్లోనే



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

- 30శాతం జెనరిక్ మందులు భారత్‌వే
- పట్టున్న రంగంలో గట్టిగా ఉండాలి
- ఫార్మాక్సిల్ మాజీ డీజీ ఉదయ్ భాస్కర్
- 'ఆంధ్రజ్యోతి'తో ముఖాముఖి

(సెంట్రల్ డెస్క్)

అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే ట్రంప్ వాణిజ్య యుద్ధానికి తెరలేపారు. 'ప్రతీకార సుంకాలు' అంటూ చెలరేగుతున్నారు. 'భారత్‌నూ వదిలేదు' అని హెచ్చరిస్తున్నారు. ఇది ఫార్మారంగంపై కీలక ప్రభావం చూపించే అవకాశం కనిపిస్తోంది. అయితే... ట్రంప్ బెదిరింపులకు లొంగిపోవాల్సిన అవసరం లేదని ఫార్మా రంగ నిపుణుడు రావి ఉదయ్ భాస్కర్ పేర్కొన్నారు. అమెరికా నుంచి దిగుమతి చేసుకునే ఫార్మా, వైద్య సంబంధిత ఉపకరణాలపై మనం సుంకాలు తగ్గించాల్సిన అవసరంలేదని అభిప్రాయపడ్డారు. నాలుగు దశాబ్దాలకుపైగా ఫార్మా రంగంతో అనుబంధం ఉన్న ఆయన... ఫార్మాసూటికల్స్ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఫార్మాక్సిల్) డైరెక్టర్ జనరల్‌గా పనిచేశారు. ప్రస్తుతం ఆల్ ఇండియా డ్రగ్స్ కంట్రోల్ ఆఫీసర్స్ కాన్ఫెడరేషన్ (ఏఐడీసీఓసీ) గౌరవ డైరెక్టర్ జనరల్‌గా, ఏఐడీసీఓసీ ట్రైనింగ్ అకాడమీ డైరెక్టర్ జనరల్‌గా సేవలు అందిస్తున్నారు. అమెరికా ప్రతీకార పన్నుల ప్రకటన నేపథ్యంలో మన వైఖరి ఎలా ఉండాలి? మన అడుగులు ఏ దిశగా పడాలి? అనే అంశాలపై 'ఆంధ్రజ్యోతి'తో ఉదయ్ భాస్కర్ తన అభిప్రాయాలు పంచుకున్నారు.

ప్రతీకార సుంకాలకు సంబంధించి మన దేశం ట్రంప్ బెదిరింపులకు లొంగుతోందా?

జవాబు: దురదృష్టవశాత్తు అవుననే చెప్పాలి. ఫార్మా ఎగుమతుల్లో 126 బిలియన్ డాలర్లతో జర్మనీ మొదటి స్థానంలో ఉంది. మనం 27 బిలియన్ డాలర్లతో 11వ స్థానంలో ఉన్నాం. అమెరికాను పక్కన పెడితే మొదటి ఐదు స్థానాల్లో ఉన్నవన్నీ ఐరోపా దేశాలే. అవేవీ ట్రంప్ బెదిరింపులకు తలొగ్గలేదు. మనమే ఒక అడుగు ముందుకేసి తలొగ్గుతున్నాం. మన ప్రభుత్వం అమెరికా దిగుమతులపై సుంకాలను పూర్తిగా ఎత్తివేసేలా అడుగులు వేస్తోంది.

ఫార్మాలో అమెరికాకు మన అవసరం ఏమిటి?

జవాబు: చాలా ఉంది. అమెరికాకు అవసరమైన జనరిక్ మందుల్లో 30 శాతం మందులను మనమే ఎగుమతి చేస్తున్నాం. మరే దేశమూ ఇవ్వలేనంత చౌకగా, నాణ్యతతో మనం అందిస్తున్నాం. ఇంత తక్కువకు అమెరికా స్వయంగా ఉత్పత్తి చేయలేదు. మన దేశ ఫార్మా ఎగుమతులపై అధిక సుంకాలు విధిస్తే... అమెరికా ఆరోగ్య రంగం మరింత ఖరీదవుతుంది. ట్రంప్ తన ప్రజలను బలిపెట్టి ప్రతీకారానికి దిగుతాడని నేను అనుకోవడం లేదు. ఆయన పక్కా వ్యాపారవేత్త. ఆయన బెదిరింపులను ఈ కోణంలోనే చూడాలి.

చైనా కూడా బెదిరింపులకు దిగితే పరిస్థితి ఏమిటి?

జవాబు: రసాయనాలు, యాక్టివ్ ఫార్మా ఇన్‌గ్రెడియెంట్స్ (ఏపీఐ)ల కోసం ప్రపంచమంతా చైనాపైనే ఆధారపడి ఉంది. 80వ దశకం వరకూ ఏపీఐ తయారీ రంగంలో మనం బలంగానే ఉన్నాం. ఆ తరువాత మనం లాభాలు ఎక్కువగా ఉన్న ఫార్ములేషన్ వైపు మళ్లాం. ఐరోపా కూడా అంతే. వాటిని చైనా అందిపుచ్చుకుంది. తనను కాదనుకుని ప్రపంచంలో ఏ దేశమూ చేయగలిగింది ఏమీ లేదన్న స్థాయికి చైనా ఎదిగింది. రసాయనాలు, యాక్టివ్ ఫార్మా ఇన్‌గ్రెడియెంట్స్ (ఏపీఐ)ను చైనా ఆపివేస్తే... ప్రపంచ ఫార్మారంగంపై తీవ్ర ప్రభావం పడుతుంది.

చైనా ప్రభావాన్ని తగ్గించుకోవడమెలా?

జవాబు: కెమికల్ పార్క్‌లను ఏర్పాటు చేయాలి. కాలుష్యం గురించి ఆందోళన అక్కర్లేదు. ఇప్పుడు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చింది. అలాగే ఏపీఐపైనా దృష్టి సారించాలి. ఇదంతా చేయడానికి మనకు 10 నుంచి 15 ఏళ్లు పట్టవచ్చు. అప్పటికైనా... ఓ మేరకు స్వయం సమృద్ధిని సాధించగలుగుతాం. వాటికితోడు మనం ఇప్పుడు రిసెర్చ్, ఇన్నోవేషన్‌పై పెట్టుబడులు పెట్టాలి. ఫార్మా రంగం తనకు వస్తున్న లాభాలను ఇతర రంగాలకు మళ్లిస్తోంది. అలాకాకుండా దీర్ఘకాలిక ప్రయోజనాల దృష్టి కోణంలో ఆలోచించాలి. ప్రభుత్వం నుంచి వివిధ రూపాల్లో ప్రోత్సాహకాలు అందాలి.

ట్రంప్ వచ్చాక 'యూఎస్ ఎయిడ్' నిలిపివేశారు. దీని ప్రభావం మన ఫార్మాపై ఏమేరకు ఉండొచ్చు?

జవాబు: నిజం చెప్పాలంటే... ప్రతీకార సుంకాల కంటే, యూఎస్ ఎయిడ్ నిలిపివేతవల్లే మన ఫార్మాపై ఎక్కువ ప్రభావం చూపిస్తుంది. ఆఫ్రికన్ దేశాలకు, తూర్పు ఆసియా, లాటిన్ అమెరికాలోని కొన్ని దేశాలకు ప్రపంచ ఆరోగ్య సంస్థ, వివిధ స్వచ్ఛంద సంస్థలు మందులను అందిస్తున్నాయి. వ్యాక్సిన్లు, ఎయిడ్స్ టీబీ మందులు వంటివి కీలకమైనవి. పేద ప్రజల ప్రాణ రక్షణకు అత్యంత చౌకగా నాణ్యమైన మందులను అందిస్తున్న ఏకైక దేశం భారతదేశం. అమెరికా సాయం ఆగిపోతున్న నేపథ్యంలో కచ్చితంగా ఆ ప్రభావం మన కంపెనీలపై ఉంటుంది. ఇది కేవలం ఆర్థిక, వాణిజ్యపరమైన సమస్య కాదు. ప్రపంచంలోని కోట్లాది మంది నిరుపేదల ప్రాణాలతో అమెరికా ఆడుకుంటోంది. లక్షల సంఖ్యలో ఉన్న ఎయిడ్స్ బాధితులు మందులు అందక మరణం అంచుకు చేరుకుంటారు.

ప్రపంచవ్యాప్తంగా విశాల వాణిజ్య దృక్పథాలకు వీడ్కోలు పలుకుతున్న ధోరణలు కనిపిస్తున్నాయా?

జవాబు: లోకలైజేషన్‌తో వస్తున్న ఇబ్బందులివి. ప్రతి దేశమూ తనదైన శైలిలో ఆయా రంగాల్లో రాణించాలని అనుకుంటోంది. ఆత్మనిర్భర్ నినాదం ఆకర్షణీయమైనది. అయితే నూరు శాతం సాధ్యం కాదన్న కఠిన వాస్తవాన్ని గుర్తుంచుకోవాలి. నేటి వాణిజ్య ప్రపంచంలో సంకుచిత ధోరణలతో సాధించగలిగేది ఏమీ లేదన్నది తెలియకేం కాదు.

తెలుగు రాష్ట్రాల్లో ఫార్మా ఎగుమతుల విలువ ఎంత?

జవాబు: పెద్ద, చిన్న కంపెనీలు అన్నీ కలుపుకొంటే సుమారు వెయ్యి వరకూ ఉన్నాయి. డీజీసీఐఎస్ లెక్కల ప్రకారం 2023-24 ఆర్థిక సంవత్సరంలో మొత్తం ఫార్మా ఎగుమతుల్లో మన రెండు రాష్ట్రాల వాటా 26.82 శాతం. తెలంగాణ 18.92 శాతం... 5,268.59 మిలియన్ డాలర్లతో రెండో స్థానంలో ఉండగా, ఆంధ్రప్రదేశ్ 7.90 శాతం... 2,199.26 మిలియన్ డాలర్లతో 4వ స్థానంలో ఉంది. మన దేశం నుంచి అవుతున్న మొత్తం ఎగుమతుల విలువ 27,846.38 మిలియన్ డాలర్లు. ఉద్యోగుల సంఖ్య సుమారుగా రెండు లక్షల వరకూ ఉండవచ్చని అంచనా!

ఆంక్షల ప్రభావం తెలుగు రాష్ట్రాలపై ఎంత?

జవాబు: మన రెండు రాష్ట్రాల నుంచి జరిగే ఎగుమతుల్లో 80 శాతం వాటా పెద్ద కంపెనీలదే. అమెరికాతోపాటు ప్రపంచంలోని వివిధ దేశాలకు ఈ ఔషధాలు వెళ్తున్నాయి. ఈ కంపెనీలపై అమెరికా ఆంక్షల ప్రభావం పెద్దగా ఉంటుందని నేను అనుకోవడం లేదు. మరెక్కడా లేని విధంగా దేశవ్యాప్తంగా 650కుపైగా యూఎస్ఎఫ్‌డీఏ అనుమతి పొందిన ఉత్పత్తి కేంద్రాలు మన దేశంలో ఉన్నాయి. అక్కడ తయారయ్యే మందులు ప్రపంచంలోని ఏ దేశానికైనా వెళ్లగలిగే నాణ్యతను కలిగి ఉన్నాయి.

మహిళల భద్రతకు పెద్దపీట

అతివలకు బీఎన్ఎస్ రక్షణ ఛత్రం.. పడతులపై నేరాలకు పాల్పడితే ఉరే

- ప్రపంచంలో నేనే అధిక సంపన్నుడిని
- కోట్ల మంది మహిళామణుల ఆశీస్సులు నా సొంతం.. అవే నా సంపద, బలం
- మహిళా దినోత్సవ సభలో ప్రధాని మోదీ



గుజరాత్ నవ్‌సారి జిల్లా వాంసి బోర్సి గ్రామంలో నిర్వహించిన మహిళా దినోత్సవంలో ప్రధాని మోదీ

నవ్‌సారి, మార్చి 8: మహిళల భద్రతకు తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ప్రధాని మోదీ ఉద్ఘాటించారు. వారిపై జరిగే నేరాల కట్టడికి కఠిన చట్టాలు రూపొందించడంతోపాటు నియమ, నిబంధనలను కూడా కఠినతరం చేశామని వెల్లడించారు. మహిళలపై అత్యాచారానికి పాల్పడడం సహా అమానుషాలకు ఒడిగట్టే వారికి ఉరిశిక్ష విధించేలా చట్టాలను రూపొందించినట్టు తెలిపారు. బ్రిటీష్ కాలం నాటి ఐపీసీ సెక్షన్ స్థానంలో తీసుకువచ్చిన భారతీయ న్యాయ సంహిత(బీఎన్ఎస్).. మహిళలకు రక్షణ కవచంగా మారిందన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని గుజరాత్‌లోని నవ్‌సారి జిల్లాలో ఉన్న వాంసి బోర్సి గ్రామంలో శనివారం నిర్వహించిన మహిళా దినోత్సవంలో ప్రధాని మోదీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళల నేతృత్వంలో దేశం వేగవంతమైన పురోభివృద్ధి దిశగా దూసుకుపోతోందన్నారు. "మహిళలపై అత్యాచారాలు, అమానుషాలకు పాల్పడేవారికి ఉరిశిక్ష విధించేలా మా ప్రభుత్వం చట్టాలు తీసుకువచ్చింది. బాధిత మహిళలకు సత్వర న్యాయం జరిగేలా ఫాస్ట్ ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేశాం. దేశవ్యాప్తంగా మరో 800 కోర్టులను ఏర్పాటు చేయనున్నాం. బీఎన్ఎస్‌లో మహిళలు, చిన్నారుల భద్రత కోసం ఒక ప్రత్యేక అధ్యాయాన్ని జోడించాం" అని ప్రధాని వివరించారు. బాధితులకు సత్వర న్యాయం అందని ద్రాక్ష అనే మాట గతంలో వినిపించేదని, కానీ, నూతన చట్టాల ద్వారా దారుణమైన కేసుల్లో విచారణను 60 రోజుల్లోనే పూర్తి చేయాలని, 45 రోజుల్లోనే తీర్పులు వెలువరించాలని స్పష్టంగా పేర్కొన్నట్టు తెలిపారు. కొత్త చట్టాల ద్వారా దేశంలో ఎక్కడైనా 'ఈ-ఎఫ్ఐఆర్' నమోదు చేసే సౌలభ్యం అందుబాటులోకి వచ్చిందని, లైంగిక వేధింపులు ఎదుర్కొనే మహిళలు.. జీరో ఎఫ్ఐఆర్‌లను ఎక్కడైనా నమోదు చేయొచ్చని తెలిపారు. అత్యాచార బాధితుల వాంగ్మూలాలను ఆడియో, వీడియో మాధ్యమాల్లో కూడా నమోదు చేయొచ్చని చెప్పారు.

ప్రపంచంలోనే అధిక సంపన్నుడిని!

ప్రపంచంలోనే తాను అధిక సంపన్నుడినని ప్రధాని మోదీ చమత్కరించారు. "ఔను! ప్రపంచంలోనే నేను అధిక సంపన్నుడిని. అయితే.. ధనం రూపంలో సంపన్నుడిని కాదు. కోట్లాది మంది తల్లులు, సోదరీమణులు, కుమార్తెల ఆశీస్సుల కారణంగా నేను అధిక సంపన్నుడిని. వారి ఆశీర్వాదాలే నాకు ఎనలేని శక్తి. అదే మూలధనం, అదే రక్షణ కవచం" అని ప్రధాని వ్యాఖ్యానించారు. ముస్లిం మహిళల జీవితాలను రక్షించేందుకు ట్రిపుల్ తలాక్‌కు వ్యతిరేకంగా కఠిన చట్టం తీసుకువచ్చామన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంత మహిళలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు పలు కార్యక్రమాలు అమలు చేస్తున్నామని, 90 లక్షల స్వయం సహాయక బృందాల్లో 10 కోట్ల మందికిపైగా మహిళలు ఉన్నారని, వారంతా ఆర్థికంగా సాధికారత పొందారని మోదీ తెలిపారు. 'లఖ్‌పతి దీదీ' కార్యక్రమం ద్వారా మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు.

మహిళలకు మోదీ సోషల్ మీడియా!

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రధాని మోదీ తన సోషల్ మీడియా నిర్వహణను పలు రంగాల్లో ప్రముఖులైన మహిళలకు అప్పగించారు. వీరిలో చెస్, సైన్స్, గ్రామీణ పారిశ్రామిక వేత్తలు, ఆర్థికరంగంలో కీలకంగా వ్యవహరిస్తున్నవారు ఉన్నారు. వీరంతా తమ తమ రంగాల్లో ఏవిధంగా ఉన్నతస్థాయికి చేరిందీ పేర్కొన్నారు. దేశంలో 'నారీ శక్తి' తోడ్పాటును వివరించారు.

ప్రధానికి మహిళా భద్రత

నవ్‌సారిలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రధాని మోదీకి భద్రతగా మహిళా పోలీసులను నియమించారు. సుమారు 2500 మంది మహిళా పోలీసులు ఆయనకు భద్రత కల్పించారు. ఈ కార్యక్రమంలో లక్షన్నర మహిళలు పాల్గొన్నప్పటికీ ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా మహిళా పోలీసులు కట్టుదిట్టంగా వ్యవహరించారు. మోదీ పర్యటనలో ఆయన భద్రతను పూర్తిగా మహిళా అధికారులకే అప్పగించడం ఇదే తొలిసారని ఉన్నతాధికారులు తెలిపారు.

పాక్, చైనాల కుమ్మక్కు నూరు శాతం నిజం

- సైన్యాధిపతి జనరల్ ఉపేంద్ర ద్వివేది



న్యూఢిల్లీ, మార్చి 8: పాకిస్థాన్, చైనాలు నూరు శాతం కుమ్మక్కయ్యాయని, ఈ వాస్తవాన్ని భారత్ గుర్తించకతప్పదని సైన్యాధిపతి జనరల్ ఉపేంద్ర ద్వివేది అభిప్రాయపడ్డారు. ఈ కారణంగా పశ్చిమం, ఉత్తరం..రెండు దిక్కులా దాడిని ఎదుర్కొవాల్సిన ముప్పు ఏర్పడిందని తెలిపారు. ఇక్కడ ఒక ఆంగ్ల న్యూస్ ఛానల్ నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. పాక్ వద్ద ఉన్న ఆయుధాలన్నీ చైనాలో తయారైనవేనని అన్నారు. సీమాంతర ఉగ్రవాదం గురించి మాట్లాడుతూ పొరుగు దేశం నుంచి ఉగ్రవాదుల రాక ఏమీ తగ్గలేదని చెప్పారు. వారి రాక పెరగనుందని, పరిస్థితులను ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలని హెచ్చరించారు. "గత ఏడాది పట్టుబడిన ఉగ్రవాదుల్లో 60% మంది పాకిస్థాన్ మూలాలు ఉన్నవారే. అందువల్ల పొరుగు దేశం నుంచి ఇంకా ముప్పు తొలగిపోలేదు" అని ఆయన వివరించారు. దేశంలో ప్రస్తుతం 'యుద్ధమూ లేదు... శాంతీ లేదు' అన్నట్లుగా పరిస్థితి ఉందని అన్నారు.

కులభూషణ్ కిడ్నాప్ సూత్రధారి ముఫ్తీ షా మిర్ దారుణ హత్య

న్యూఢిల్లీ, మార్చి 8: భారత నేవీ మాజీ అధికారి, వ్యాపారవేత్త కులభూషణ్ జాదవ్‌ను ఇరాన్ నుంచి పాకిస్థాన్ ఐఎస్ఐ కిడ్నాప్ చేయడంలో కీలకంగా సహకరించిన ముస్లిం 'స్కాలర్' ముఫ్తీ షా మిర్ దారుణహత్యకు గురయ్యాడు. బలూచిస్థాన్‌లోని టర్బాట్‌లో గుర్తుతెలియని దుండగులు ఆయనపై కాల్పులు జరిపారు. మసీదులో ప్రార్థనల అనంతరం బయటకు వస్తున్న సమయంలో మోటార్ సైకిళ్లపై వచ్చిన దుండగులు దాడి చేశారని పోలీసులు వెల్లడించారు. తీవ్ర గాయాలైన ముఫ్తీ షా మిర్‌ను స్థానిక ఆస్పత్రిలో చేర్చగా.. అక్కడ చికిత్స పొందుతూ మరణించాడు. ముఫ్తీ షా గతంలో రెండు హత్యాయత్నాల నుంచి బయటపడ్డాడు. బలూచిస్థాన్‌లోని టర్బాట్ నివాసి అయిన మిర్.. ఐఎస్ఐ ఆదేశాల మేరకు పనిచేస్తుంటాడు.





Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Medchal-Malkajgiri District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: **N. Rahul Kumar**. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. **Managing Director: Vemuri Radha Krishna,** Founder: K.L.N.Prasad.